శనివారం 12-4-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 20


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'


విదేశీ విద్యార్థులపై ఎందుకీ కత్తి ?
-6లో


పసిడి ఆల్‌టైమ్ హై..
₹ 96,450
-14లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విపక్షాలది పరివార్ కా వికాస్

సొంత కుటుంబాల బాగు కోసమే ప్రతిపక్ష పార్టీలు ఆరాటపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు.

వివరాలు 6లో ▸



చైనా.. తగ్గేదేలే!

అమెరికా, చైనా టారిఫ్ పోరు మరింత ముదిరింది. అమెరికాపై సుంకాలను చైనా 84 నుంచి 125 శాతానికి పెంచింది.

వివరాలు 6లో ▸



భారత్‌కు వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. భార్య ఉషా చిలుకూరితో కలిసి ఏప్రిల్ 21 నుంచి 3 రోజులు భారత్‌లో పర్యటిస్తారని సమాచారం

వివరాలు 6లో ▸



ఎన్డీయేలోకి అన్నాడీఎంకే

వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్నాడీఎంకేను మళ్లీ ఎన్డీయేలోకి ఆహ్వానించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి నియామకం



రాష్ట్ర లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితులయ్యారు. ఉప లోకాయుక్తగా రిటైర్డ్ జిల్లా సెషన్స్ జడ్జి జగ్జీవన్‌కుమార్‌ను నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 3లో▶

25 లేదా 27న ఇంటర్ ఫలితాలు



ఇంటర్మీడియట్ ఫలితాలు ఈ నెల 25 లేదా 27న విడుదల కానున్నాయి. ప్రథమ,ద్వితీయ సంవత్సరం ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరిగిన విషయం తెలిసిందే.

- వివరాలు 3లో▶

జూన్ 15 నుంచి టెట్



తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్) నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 27న ఫలితాలను విడుదల చేస్తారు.

- వివరాలు 5లో▶

'తెలుగు' పంచాయితీ తేలేదెన్నడు?

8లో

స్కూళ్లలో తెలుగు పాఠ్యపుస్తకంపై వివాదం

ఖజానాకు భూమ్



రాష్ట్ర ఖజానాకు పన్నేతర ఆదాయాన్ని సమకూర్చడంలో కీలకంగా టీజీఐఐసీ భూములు

- నిధులు అవసరమైనప్పుడల్లా టీజీఐఐసీ భూముల వైపే ప్రభుత్వాల చూపు
- వేలం, కేటాయింపుల ద్వారా రూ.వేల కోట్లు సమకూర్చుకుంటున్న వైనం
- 2014–23 మధ్యకాలంలో 811 ఎకరాల వేలం ద్వారా రూ.21 వేల కోట్ల ఆదాయం
- 2023లో కోకాపేట, ఖానామెట్ భూముల ద్వారా దాదాపు రూ.3 వేల కోట్ల రాబడి
- కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల తాకట్టు ద్వారా రూ.10 వేల కోట్ల రుణ సమీకరణ!
- ఇవే భూముల వేలం ద్వారా రూ.30 వేల కోట్ల వరకు నిధుల సమీకరణకు ప్రతిపాదన
- రాష్ట్రంలో వివాదాస్పదం అవుతున్న భూముల వేలం, కేటాయింపులు

నంబర్ 1
లక్షన్నర ఎకరాల పారిశ్రామిక ల్యాండ్ బ్యాంకుతో టాప్‌లో తెలంగాణ

తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు

సాక్షి, హైదరాబాద్


దేశంలోనే అత్యధికంగా పారిశ్రామిక ల్యాండ్ బ్యాంక్‌ను కలిగిన తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ).. రాష్ట్ర ఖజానాకు బంగారు బాతులా మారింది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధుల సేకరణలో సర్కారుకు కల్పతరువులా ఉపయోగపడుతోంది. ఎఫ్‌ఆర్‌బీఎం వంటి రిజర్వు బ్యాంకు నిబంధనల పరిధిలోకి రాకుండా రాష్ట్ర ఖజానాకు పన్నేతర ఆదాయాన్ని సమకూర్చడంలో టీజీఐఐసీ భూములు అత్యంత కీలకంగా మారుతున్నాయి. నిధులు అవసరమైనప్పుడల్లా పారిశ్రామిక అభివృద్ధి పేరిట టీజీఐఐసీ భూముల వేలం వైపు ప్రభుత్వాలు మొగ్గు చూపుతున్నాయి. ఇటీవల రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి తాకట్టుతో టీజీఐఐసీ ప్రభుత్వానికి రూ.10 వేల కోట్ల రుణం సమకూర్చినట్లు అధికార వర్గాల సమాచారం. అంతకుముందు కూడా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇటీవలి కాలం వరకు టీజీఐఐసీ భూముల ద్వారా రూ. వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వాలు సమకూర్చుకోవడం గమనార్హం.

సొంతగా, హెచ్‌ఎండీఏతో కలిసి..: తెలంగాణ ఆవిర్భావం మొదలుకుని 2023 వరకు టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి

మిగతా 8వ పేజీలో ▶

సరిగ్గానే దిద్దుతున్నారా?

తెలుగు రాష్ట్రాల్లో పోటీ పరీక్షల మూల్యాంకనంపై అభ్యంతరాలు



- గ్రూప్–1 సహా అన్ని పరీక్షలపై అనుమానాలు
- లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- పేపర్ రూప కల్పన నుంచి మూల్యాంకనం వరకు సమస్యలు
- అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ కొరతతో ఇబ్బందులు
- తెలుగు రాష్ట్రాల్లో 75 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ

సాక్షి, ఎడ్యుకేషన్

రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది విద్యార్థులు పోటీపడే ఉద్యోగ నియామక పరీక్షల్లో జవాబు పత్రాల మూల్యాంకనం మెరుగ్గానే ఉందా? వాటిని సరిగానే దిద్దుతున్నారా? అంటే.. లేదనే సమాధానమే వస్తోంది. పలు పోటీ పరీక్షల మూల్యాంకనంపై సవాలక్ష సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా ఏళ్ల తరబడి చదివి పరీక్ష రాస్తే, ఆ జవాబు పత్రాలు దిద్దే నిపుణుల అర్హత, అనుభవంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలను బలపర్చేలా ఇటీవల గ్రూప్–1 పరీక్షలో వచ్చిన ఫలితాలు

మిగతా 15వ పేజీలో ▶

యూపీఎస్సీ తరహాలో చేయాలి

గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనం కూడా యూపీఎస్సీ సివిల్స్ మూల్యాంకనం మాదిరిగా ఒక నిర్దిష్ట విధానంలో చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూపీఎస్సీలో పోస్టుల సంఖ్యకు అనుగుణంగా మెయిన్స్‌కు 1:13 (ఒక్కో పోస్టుకు 13 మంది చొప్పున) ఎంపిక చేస్తారు. మూల్యాంకనానికి దేశవ్యాప్తంగా నిష్ణాతులైన ప్రొఫెసర్లను ఎంపికచేస్తారు. వేర్వేరు సబ్జెక్టులు ఉండే పేపర్ల మూల్యాంకనానికి సెక్షన్ వారీగా వేర్వేరు నిపుణులను నియమిస్తారు. యూపీఎస్సీ మూల్యాంకనంలో కీ పాయింట్లను కేటాయించినప్పటికీ.. సమాధానంలో అదనపు సమాచారం ఉంటే.. వాటికీ మార్కులు ఇస్తారు. రాష్ట్రాల స్థాయిలో ఈ విధానం లేదు.

ఫ్యూచర్ సిటీ మెట్రోకు డీపీఆర్

వెంటనే సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



- అనుమతులను వేగవంతం చేయాలని సూచన
- వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్టు
- రహదారులకు భూ సేకరణపై దృష్టి పెట్టండి
- ఆర్‌ఆర్‌ఆర్, రహదారులు, మెట్రోపై సమీక్షలో రేవంత్‌రెడ్డి

2లో

14 నుంచి భూ భారతి

- అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రారంభం
- రవీంద్రభారతిలో సీఎం, డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

5లో

హెచ్‌సీయూ భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం



- సీఎం రేవంత్‌రెడ్డి సూత్రధారి.. పాత్రధారి
- భూమిపై హక్కు లేకున్నా ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రుణం
- ఈ వ్యవహారంలో ఓ బీజేపీ ఎంపీ హస్తం ఉంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

ఆ రూ.5,200 కోట్లు కేటీఆర్ పద్దు

టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



- హెచ్‌సీయూ భూముల్ని కాజేయజూసిన బిల్లీ రావుతో ఒప్పందంలో ఆయనకు ముట్టాల్సిన కమీషన్ అది
- కానీ కేటీఆర్ దురదృష్టం కొద్దీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య

2లో

మాకే నకిలీ కాపీలు సమర్పిస్తారా...?



- ప్రైవేట్ వ్యక్తి తాహెర్ ఖాన్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం
- దీనిపై సిట్ ఏర్పాటు చేయాలని సర్కార్‌కు స్పష్టీకరణ
- 100 ఎకరాల భూ వివాదంలో ధర్మాసనం చర్యలు

7లో



కన్నబిడ్డనే నరబలి ఇచ్చిన తల్లికి ఉరిశిక్ష

సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కోర్టు సంచలన తీర్పు

సర్పదోష నివారణ పేరుతో 7 నెలల పసికందు నాలుక, గొంతు కోసిన తల్లి భారతి


- ఈ కేసు అత్యంత అరుదైన వాటిలోకెల్లా అరుదైన కోవకు చెందుతుందన్న న్యాయమూర్తి ఎం. శ్యామ్‌శ్రీ
- ఉరిశిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా కూడా..
- భర్తపై హత్యాయత్నం కేసులో రెండ్రోజుల క్రితమే ఆమెకు ఏడాది జైలుశిక్ష

7లో

క్లుప్తంగా...

ఈనెల 17లోగా నిర్ణయం తీసుకోండి

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహణకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈనెల 17లోగా నిర్ణయాన్ని వెలువరించాలని వరంగల్ సీపీ, కాజీపేట్ ఏసీపీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది. బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అనుమతి కోరుతూ మార్చి 28న, ఏప్రిల్ 4న వినతిపత్రాలు అందజేసింది. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున జీపీ మహేశ్ రాజే వాదనలు వినిపిస్తూ.. సభకు సంబంధించిన సమాచారం కోసం ఈనెల 10న వినయ్ భాస్కర్‌కు ఏసీపీ నోటీసులు జారీ చేశారని, అదే రోజు రాత్రి 10.30 గంటలకి ఆయన సమాచారం అందించారని చెప్పారు. దీన్ని ఉన్నతాధికారులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.

పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు పొడుస్తోంది

కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు పొడుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'మహాత్ముల జయంతి, వర్ధంతులకు నివాళి అర్పిస్తే చాలదు. వారి ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చడమే వారికి అసలైన నివాళి' అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. శుక్రవారం జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంజయ్ నివాళులర్పించారు. 'తెలంగాణలో పూలే ఆశయాలకు విరుద్ధంగా పాలన సాగుతోంది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉంటే నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ పాలనా పుణ్యమా అని రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచారు' అని మండిపడ్డారు.


హెచ్‌సీయూ సాధికార కమిటీని కలిసిన కాంగ్రెస్ ఎంపీలు

ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఎంపీలు చామల, రఘురామిరెడ్డి వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీని కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రామ సహాయం రఘురామిరెడ్డి కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కమిటీ సభ్యుడు వినెయ్ లిమాయిని కలిసి వినతిపత్రం అందజేయడంతో పాటు ఆ భూముల గురించిన అభిప్రాయాలను వివరించారు. ఈ భూములు 1975లోనే సెంట్రల్ యూనివర్సిటీ స్వాధీనమైనప్పటికీ వర్సిటీ యాజమాన్యానికి అనుకూలంగా బదిలీ కాలేదని తెలిపారు. అలాగే అటు రెవెన్యూ రికార్డులు, ఇటు అటవీ హక్కుల చట్టం, రికార్డుల ప్రకారం కూడా ఆ భూమిని ఎక్కడా అటవీ భూమిగా వర్గీకరించలేదని తెలిపారు. అయితే ప్రతిపక్ష పార్టీలు ఈ భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం గురించి దుష్ప్రచారం చేస్తున్నాయని కమిటీకి ఎంపీలు వివరించారు.

బీజేపీలో చిలక జ్యోతిష్కులు ఎక్కువ

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో రాజకీయం చేసే వారికంటే.. చిలక జ్యోతిష్కులు ఎక్కువవుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆ పార్టీలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా.. ఏఐసీసీ గోడలకు చెవులు పెట్టి వింటున్నట్టున్నారని, అందుకే సీఎంను మారుస్తున్నారంటున్నారని ఎద్దేవా చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవడం కూడా చేతకాని బీజేపీ నేతలు.. సీఎం మార్పు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సంచలనం కోసమే ఎంపీ ధర్మపురి అర్వింద్ ఈ వ్యాఖ్యలు చేశారని చెప్పారు. సొంత పార్టీలో లుకలుకల గురించి అర్వింద్ ఆలోచన చేస్తే మంచిదని హితవు పలికారు.

నయీం అక్రమాస్తుల అటాచ్‌కు ఈడీ చర్యలు

సాక్షి, హైదరాబాద్: ఎన్‌కౌంటర్‌లో హతమైన గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. నయీంకు సంబంధించిన రూ. 11.7 కోట్ల విలువైన 35 ఆస్తులు అటాచ్ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ కేసులో నయీం కుటుంబ సభ్యుల పేర్లను కూడా చేర్చిన ఈడీ.. కోర్టులో ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అక్రమంగా పొందిన 35 ఆస్తులను నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈడీ గుర్తించి 2022 మార్చిలో ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది.

ఫ్యూచర్ సిటీ మెట్రోకు డీపీఆర్

వెంటనే సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర మెట్రోరైలు ప్రాజెక్టును విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతోందని, నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్‌ఖాన్‌పేట వరకు పొడిగించాలని సూచించారు. అందు కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్), జాతీయ రహదారులకు భూ సేకరణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం సీఎం సమీక్ష నిర్వహించారు. హెచ్‌ఎండీఏతో పాటు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌ఎస్డీఏ)ని మెట్రో విస్తరణలో భాగస్వాములను చేయాలని సూచించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు సీఎంకు అధికారులు వివరించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం–కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్–హయత్‌నగర్ (7.1 కి.మీ.)ల విస్తరణకు రూ.24269 కోట్ల అంచనాలతో చేపట్టే పనులకు కేంద్రంనుంచి వేగంగా అనుమతులు వచ్చేలా చూడాలని సీఎం పేర్కొన్నారు.

వందేళ్ల అవసరాలు తీర్చేలా డ్రైపోర్టు

వందేళ్ల వరకు అవసరాలను తీర్చేలా డ్రైపోర్టును నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగురోడ్డు సమీపంలో అందుకు అనువైన ప్రాంతాన్ని గుర్తించాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగానికి సంబంధించి డీపీఆర్‌ను త్వరగా సమర్పించాలని ఆదేశించారు. హైదరాబాద్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి డీపీఆర్ రూపొందించాలని కేంద్ర హోంశాఖ ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌ను ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారిని ప్రతిపాదించాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరా తీశారు. పలుచోట్ల పంటలు ఉన్నాయని, వాటికి నష్టపరిహారం చెల్లించేందుకు జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. దీంతో పంటకాలం దాదాపు పూర్తికావచ్చినందున రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భూ సేకరణ సమస్యలపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్ల నిర్మాణం, ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం పేర్కొన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, చీఫ్ ఇంజనీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ ఐమాక్స్ సమీపంలో జ్యోతిబా పూలే విగ్రహం

స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి,

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి విక్రమార్క, మహేశ్‌గౌడ్, జాజుల, అంజన్

సాక్షి, హైదరాబాద్/కాచిగూడ: నెక్లెస్ రోడ్డులో ఉన్న ప్రసాద్ ఐమాక్స్ సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంపై సర్వే చేయాలని, పూర్తిస్థాయి ప్రణాళికతో నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు తరువాత ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని డిజైన్ చేయాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేసినట్లు సమాచారం. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా శుక్రవారం అంబర్‌పేటలోని ఆ మహనీయుడి విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా నివాళులు అర్పించారు.. ఇదిలా ఉండగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా పూలేకు నివాళులు అర్పించారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేసి, అణగారిన వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం భట్టి యూసుఫ్‌గూడలోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్)లో జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

కేంద్రాన్ని పోషిస్తోంది రాష్ట్రాలే

- రూ.వంద రాష్ట్రాలు ఇస్తే.. మీరు రూ.30 ఇస్తున్నారు
- సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల



అపెరల్ పార్క్‌లో టెక్స్‌పోర్ట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల: 'కేంద్రాన్ని పోషిస్తోంది రాష్ట్రాలే.. కేంద్రంలోని అన్ని పథకాలకు రాష్ట్రాల మంత్రుల ఫొటోలు పెడతారా ? రాష్ట్రాల ప్రజలు పన్నుల రూపంలో కేంద్రానికి రూ.వంద ఇస్తే.. తిరిగి రాష్ట్రాలకు రూ.30 ఇస్తుంది'అని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అపెరల్ పార్క్‌లో టెక్స్‌పోర్టు రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నేతన్న, రైతన్నల సంక్షేమమే ప్రాధాన్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. నేతన్నల రూ.లక్షలోపు రుణాలను రూ.34 కోట్లు మాఫీ చేశామన్నారు. చేనేత, జౌళిశాఖలకు బకాయిలుగా ఉన్న రూ.914 కోట్లు చెల్లించామని, నేతన్నల బీమా, భద్రత, పొదుపు పథకాలకు రూ.290 కోట్లు ఇచ్చామని తుమ్మల తెలిపారు. సిరిసిల్లలో వర్కర్లను ఓనర్లుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాల ఆర్డర్లన్నీ నేతన్నలకే ఇస్తున్నట్లు వెల్లడించారు.

- మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నల గుర్తింపును కాపాడుతామన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై ఎవరెన్ని అబద్ధాలు ప్రచారం చేసినా.. అది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు.
- మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీఎంగా ఉండగా.. హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లో సమావేశం పెట్టి సిరిసిల్ల మహిళలకు ఆర్థిక చేకూర్పు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంటింటికీ అంత్యోదయ కార్డులు ఇచ్చామన్నారు. కేంద్ర మంత్రులకు చేతనైతే వస్త్రాలపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని కోరారు.

హెచ్‌సీయూ భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూత్రధారి.. పాత్రధారి: కేటీఆర్



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సూత్రధారి, పాత్రధారిగా హెచ్‌సీయూ భూముల్లో రూ.10 వేల కోట్ల భారీ ఆర్థిక, భూ కుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతూ రాత్రికిరాత్రి వందల ఎకరాల్లో పర్యావరణ విధ్వంసం వెనుక రేవంత్ రూ.వేల కోట్ల కుంభకోణం దాగి ఉందన్నారు. ఎలాంటి యాజమాన్య హక్కులు లేకున్నా హెచ్‌సీయూ భూమిని ఐసీఐసీఐ బ్యాంకుకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) తాకట్టు పెట్టడాన్ని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఓ బీజేపీ ఎంపీ హస్తం ఉందని, ఆయనకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆయాచిత లబ్ధి చేకూరబోతుందని వ్యాఖ్యానించారు. టీజీఐఐసీకి ఐసీఐసీఐ బ్యాంకు ద్వారా రుణం ఇప్పించడంలో సహకరించిన బీజేపీ ఎంపీ పేరును సరైన సమయంలో బయట పెడతామన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాస్ గౌడ్, నోముల భగత్, చంద్రావతి, పార్టీనేతలు పొన్నాల లక్ష్మయ్య, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

యాజమాన్య హక్కులు లేకుండానే...

'సుప్రీంకోర్టు కంచ గచ్చిబౌలి భూములను అటవీ భూములేనని తేల్చి చెప్పింది. అటవీ భూములను తాకట్టు పెట్టడం లేదా విక్రయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేకున్నా, రేవంత్ ప్రభుత్వం భారీ ఆర్థిక నేరానికి పాల్పడింది. ఓ బీజేపీ ఎంపీ 'ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రైవేట్ లిమిటెడ్'అనే బ్రోకర్ కంపెనీని తెరమీదకు తెచ్చి 'బీకన్ ట్రస్టీషిప్'అనే కంపెనీని ముందు పెట్టి ఐసీఐసీఐ బ్యాంకు ద్వారా రూ.10 వేల కోట్ల రుణం ఇప్పించాడు. రుణం ఇప్పించిన ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.169 కోట్లు లంచం చెల్లించింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను టీజీఐఐసీకి బదలాయిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం కేవలం జీఓ మాత్రమే జారీ చేసింది. సేల్ డీడ్, మ్యుటేషన్ జరగకుండానే ఎలాంటి యాజమాన్య హక్కులు లేని టీజీఐఐసీ 400 ఎకరాలను తాకట్టు పెట్టింది. యాజమాన్య హక్కులను పరిశీలించకుండా, ఎలాంటి తనిఖీలు చేయకుండానే ఆ బ్యాంకు రుణం ఇచ్చింది. ఈ మోసానికి పాల్పడిన టీజీఐఐసీ అధికారులతోపాటు పరిశ్రమల శాఖ కార్యదర్శిని కూడా జైల్లో వేయొచ్చు. ఈ వ్యవహారంలో విశ్వసనీయతను కోల్పోయిన ఐసీఐసీఐ బ్యాంకు త్వరలో కుప్పకూలడం ఖాయం' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

రిజర్వు బ్యాంకును మోసగించారు :'స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం కంచ గచ్చిబౌలి ఏరియాలో 400 ఎకరాల విలువ రూ.5,239.84 కోట్లు కాగా రెవెన్యూ శాఖ ఈ భూమి విలువను రూ.30 వేల కోట్లుగా ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో రియలబుల్ వాల్యూ అసెస్‌మెంట్ పేరిట ఎకరా భూమి విలువను రూ.41.6 కోట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా రూ.400 ఎకరాల భూమి విలువను రూ.30 వేల కోట్ల నుంచి రూ.16,640 కోట్లకు కుదించింది. గతంలో ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రుణం ఇప్పించిన బ్రోకర్‌ను అడ్డు పెట్టుకొని తిరిగే అవే భూములను తమ వారికి అడ్డికి పావుశేరు చొప్పున అప్పగించేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడు. హెచ్‌ఎండీఏ భూముల విక్రయం ద్వారా మరో రూ.60 వేల కోట్లను ఇదే బ్రోకర్ ద్వారా సేకరించే ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఈ అంశంపై ఆర్‌బీఐ గవర్నర్, మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ పరిధిలోని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, సెబి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ దర్యాప్తు కోరుతూ ఆధారాలతో సహా లేఖలు రాస్తున్నాం. ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, బీకన్ ట్రస్టీషిప్ కంపెనీలపై నిషేధం విధించాలి. ప్రధాని, ఆర్థికమంత్రిని కలిసి ఫిర్యాదు చేయడంతోపాటు పార్లమెంటులోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతాం'అని కేటీఆర్ ప్రకటించారు.

ఆ రూ. 5,200 కోట్లు కేటీఆర్ పద్దు

- హెచ్‌సీయూ భూముల్ని కాజేయజూసిన బిల్లీ రావుతో ఒప్పందంలో ఆయనకు ముట్టాల్సిన కమీషన్ అది
- విలేకరుల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపణ



మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో దయాకర్

సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూకి చెందిన భూముల విలువ రూ. 5,200 కోట్లని మాజీ మంత్రి కేటీఆర్ చెబుతున్నారని.. కానీ అది భూముల విలువ కాదని.. కేటీఆర్ ముడుపుల పద్దు అని టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ఐఎంజీ భారత్ సంస్థ ముసుగులో హెచ్‌సీయూ భూముల్ని కాజేయజూసిన బిల్లీరావుతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ రూ. 5,200 కోట్లని దుయ్యబట్టారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఆమేర్‌అలీ ఖాన్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, టీజీఎంఆర్‌ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీలతో కలిసి మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. బిల్లీరావుతో ఒప్పందం ప్రకారం హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను ఐఎంజీ భారత్‌కు అప్పగిస్తే ఆ భూమి విలువలో 30 శాతం కమీషన్ కేటీఆర్‌కు ముట్టేదన్నారు. అయితే కేటీఆర్ దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. టీడీపీ హయాంలో బిల్లీ రావుకు ఇచ్చిన ఆ భూముల్ని నాటి ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్సార్ కాపాడితే సుప్రీంకోర్టులో పోరాడి ఆ భూముల్ని రేవంత్‌రెడ్డి వెనక్కి తెచ్చారని చెప్పారు. 'రూ. 5,200 కోట్లు నీ ఫిగర్. మాకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నావు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి లేకుంటే ఆ భూములు బిల్లీరావుకు ఎప్పుడో వెళ్లిపోయేవి. ఇప్పుడు ఆ భూములు అభివృద్ధి చేస్తే 5 లక్షల ఉద్యోగాలు వచ్చేవి. ఇంత కడుపు మంట ఎందుకు? ఉద్యోగాలు రాకూడదా? రుణమాఫీ చేయకూడదా?'అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ భూములు అమ్మినప్పుడు కోకాపేటలో ఎకరం రూ. 100 కోట్లు పలికితే.. ఐఎస్‌బీ, ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, విప్రో, గూగుల్, యాక్సెంచర్ లాంటి సంస్థల సమీపంలో అమెరికన్ కాన్సులేట్‌కు ఆనుకొని ఉన్న భూమి రూ. 75 కోట్లు పలకదా? అని ప్రశ్నించారు.

ఆ భూమిపై రూ.10 వేల కోట్ల రుణ సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం ఆ 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి ఇచ్చి రూ. 10 వేల కోట్లను బాండ్ల రూపంలో ఐసీఐసీఐ నుంచి రుణం తీసుకుందని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఆ మొత్తాన్ని రైతు రుణమాఫీ, సన్న ధాన్యానికి బోనస్ కోసం ఉపయోగించిందన్నారు. కేటీఆర్ ఆరోపించిన రూ. 175 కోట్ల విలువైన టెండర్లు పిలిచి కన్సల్టెన్సీకి ఇచ్చామని.. అందులో కుంభకోణం ఎక్కడిదన్నారు. ఆనవాయితీగా టెండర్లు పిలిచి అధికారికంగా వైట్‌మనీ ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీకి ఇచ్చామని చెప్పారు.

సీబీఐ విచారణ జరపాల్సింది కేటీఆర్‌పైనే

సీబీఐ విచారణ జరపాల్సింది నిజంగా కేటీఆర్ మీదేనని, దేశ చరిత్రలో అత్యంత తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ప్రజాధనాన్ని దోపిడీ చేసింది కేసీఆర్ కుటుంబమేనని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

సన్నబియ్యం సంబురాల్లో అందరూ పాల్గొనండి

గాంధీభవన్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షులకు మంత్రి ఉత్తమ్ పిలుపు



జూమ్ మీటింగ్‌లో మంత్రి ఉత్తమ్. చిత్రంలో మహేష్ గౌడ్, అద్దంకి దయాకర్, అనిల్‌కుమార్, శ్రీగణేశ్

సాక్షి, హైదరాబాద్: రేషన్‌షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, చరిత్రలో నిలిచిపోయే ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అమలు చేస్తున్న సందర్భంగా ఊరూరా సంబురాలు నిర్వహించాలని, సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి పార్టీ నేతలు భోజనం చేయాలని, ఈ కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని కోరారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంపై శుక్రవారం గాంధీభవన్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లతో కలిసి రాష్ట్రంలోని బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులతో ఉత్తమ్ జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. గతంలో దొడ్డుబియ్యం ఇస్తే వాటిని పేదలు తినేవారు కాదని, అవన్నీ పక్కదారి పట్టి బీఆర్‌ఎస్ నేతల జేబులు నింపేవని చెప్పారు. అలా జరగకుండా ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి జరగాలనే ఆలోచనతో చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని విజయవంతం చేసే బాధ్యత పార్టీ నాయకత్వం తీసుకోవాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సన్నబియ్యం కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. జూమ్ సమావేశానంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీకి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ఎవరో ఒకరు విమర్శలు చేయడం ద్వారా ఈ కార్యక్రమ చిత్తశుద్ధిని దెబ్బతీయలేరని చెప్పారు. ఎప్పుడైనా బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలకు ఇలాంటి ఆలోచన వచ్చిందా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో అసమర్థ, అవినీతి పాలన

నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసమర్థ, అవినీతి ప్రభుత్వం నడుస్తోందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి మండిపడ్డారు. పరిపాలన శూన్యంగా మారడంతో, సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే హెచ్‌సీయూ, హైడ్రా వివాదాలు తెరపైకి తెచ్చారన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి 'కనెక్ట్ కలెక్ట్ పేయాజ్' కోర్సు చేశారని, అందువల్ల ఆ కోర్సులోనివి మాత్రమే ఆయనకు తెలుసునని ఎద్దేవా చేశారు. 'ప్రగతి భవన్‌లో రేవంత్ లంకె బిందెలు ఉన్నాయనుకున్నడు. కేసీఆర్‌కు తెలియదా? లంకె బిందెలు ఎక్కడ దాచుకోవాలో..? కేసీఆర్, రేవంత్‌ల కథ గజదొంగ గంగన్న, ఆయన కొడుకు రంగన్న కథలా ఉందని'.. వ్యాఖ్యానించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనే కేసీఆర్ ఓడిపోవలసి ఉందని.. కానీ నాడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి అమ్మేసు కున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హై కమాండ్ రేవంత్‌ను మార్చాలని చూస్తోందని.. అర్హుడైన శ్రీధర్‌బాబుకు వసూల్ చేయడం రాదని.. అందుకే కాంగ్రెస్ హై కమాండ్ వెనక్కి తగ్గుతోందని వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూ భూముల అంశంలో బీజేపీ ఎంపీ ఉన్నారని కేటీఆర్ ఆరోపిస్తున్నారని.. ఆయన పేరు ఎందుకు బయటపెట్టడం లేదన్నారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ కవిత డిమాండ్



సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసిన ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి (హైదరాబాద్): అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయా లని అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇటీవలే ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు న్యాయవాదులు, వైద్యులు, మేధావులు మద్దతిచ్చారని తెలిపారు. పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని జిల్లాలవారీగా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతును కూడగడుతున్నామని చెప్పారు. అందులో భాగంగా ఇప్పటివరకు 27 సమావేశాలు చేపట్టామన్నారు. కాగా, అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటుకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని జాన్‌వెస్లీ ప్రకటించారు. కార్యక్రమంలో కవితతో పాటు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

చెన్నైలో డీకే- కేటీఆర్‌ల మధ్య ఒప్పందం కుదిరింది

ఆ ఒప్పందం మేరకే బీజేపీని బద్నాం చేస్తున్నారు: బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇటీవల చెన్నైలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ భేటీ సందర్భంగా వారి మధ్య మద్రాసు ఒప్పందం కుదిరిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అందువల్లే రేవంత్‌రెడ్డి ఐదేళ్ల సీఎంగా ఉండాలని కేసీఆర్ కోరుకుంటున్నారని అన్నారు. శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లా డుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మేరకే బీజేపీని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో బీఆర్‌ఎస్ నేతలను జైల్లో వేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, మరి ఇప్పుడు పద్నాలుగు నెలలు దాటుతున్నా చర్యలెందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి.. కేటీఆర్ బాడీ గార్డుగా మారారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్, ఈ – కార్ రేసింగ్, ధరణి మీద కేసులు ముందుకు వెళ్లకపోవడానికి మద్రాసు ఒప్పందమే కారణమన్నారు. కేసుల నుంచి మాఫీ, అరెస్టుల నిలుపుదల కోసం మద్రాసు ఒప్పందం మేరకు కేటీఆర్ సుపారీ తీసుకొని బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. 'హెచ్‌సీయూ భూములపై రుణం తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ భూముల అమ్మకానికి ప్రయత్నం చేసింది ఆ ప్రభుత్వమే. అయినా బీజేపీని విమర్శిస్తున్నారు. 'భూముల వ్యవహారంలో బీజేపీ ఎంపీ హస్తం ఉందని కేటీఆర్ మాట్లాడుతున్నారు. 48 గంటల్లో ఆ ఎంపీ పేరు చెప్తా అని హడావుడి చేశారు. ఏమైంది? బీజేపీ ఎంపీ పేరు చెప్పకుండా కేటీఆర్‌ను అడ్డుకున్నది ఎవరు'అని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

గురుకుల పాఠశాల విద్యార్థినులకు అస్వస్థత

ఐదుగురికి చికిత్స చేసి పంపిన వైద్యులు.. ఐసీయూలో ఇద్దరు

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హోతి(కె) గ్రామ శివారులోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. 6వ తరగతి చదువుతున్న వీరు దగ్గుతూ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో హాస్టల్ సిబ్బంది వెంటనే జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు వెంటనే వారికి చికిత్స చేసి ఐదుగురు విద్యార్థినులను తిరిగి హాస్టల్‌కు పంపించారు. నాగరాణి, హర్షితలనుఐసీయూకు తరలించి వైద్యం అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని ఉదయం మరోసారి వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ శేషారావు మీడియాకు తెలిపారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 'సమ్మర్ క్యాంప్'

ఈ నెల 28 నుంచి మే 7వరకు క్యాంప్

సాక్షి, హైదరాబాద్: ట్రైబల్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ అంశంపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తోంది. ఈనెల 28 నుంచి మే 7వ తేదీ వరకు మాసాబ్‌ట్యాంక్‌లోని డీఎస్‌ఎస్ భవన్‌లో ఉన్న నెహ్రూ సెంటినరీ ట్రైబల్ మ్యూజియంలో ఈ క్యాంపు జరగనుంది. మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థులు ఈ క్యాంప్‌లో పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.1,350 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రెండు బ్యాచ్‌లలో ఈ క్యాంపు నిర్వహిస్తామంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు జరుగుతాయని వెల్లడించింది. కోయ పెయింటింగ్, బంజారా క్రాఫ్ట్, నగల తయారీ, నాయక్‌పోడ్ మాస్కులు, కోలాం వెదురు చేతి పనులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపింది. విద్యార్థులు 23వ తేదీ లోపు 9490957078 ఫోన్ నంబర్‌లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపింది.

లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి నియామకం

ఉపలోకాయుక్తగా బి.ఎస్. జగ్జీవన్‌కుమార్

- హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా నియమితులైన షమీమ్ అక్తర్
- జ్యుడీషియల్ సభ్యురాలిగా శివాడి ప్రవీణ... నాన్ జ్యుడీషియల్ సభ్యుడిగా బి.కిశోర్
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ. రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను ఐదేళ్లపాటు ఆ పదవిలో నియమించడంతోపాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉపలోకాయుక్తగా రిటైర్డ్ జిల్లా సెషన్స్ జడ్జి బి.ఎస్. జగ్జీవన్‌కుమార్‌ను నియమిస్తూ మరో ఉత్తర్వు విడుదల చేశారు. ఆయన ఐదేళ్లపాటు హైకోర్టు న్యాయమూర్తి హోదాలో ఆ పదవిలో కొనసాగుతారు. రాష్ట్ర మానవహక్కు ల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్లపాటు లేదా 70 ఏళ్ల వయసు వచ్చే వరకు ఆ హోదాలో కొనసాగుతారని పేర్కొంటూ సీఎస్ శాంతికుమారి ఇంకో ఉత్తర్వు జారీ చేశారు. హక్కుల కమిషన్ సభ్యులుగా ఇద్దరిని నియమించారు. వారిలో జ్యుడీషియల్ సభ్యురాలిగా విశ్రాంత సెలక్షన్ గ్రేడ్ జిల్లా న్యాయమూర్తి శివాడి ప్రవీణ, నాన్ జ్యుడీషియల్ సభ్యునిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్. బి.కిషోర్‌లను నియమిస్తూ వేర్వేరు ఉత్తర్వులు విడుదల చేశారు. వారు కూడా మూడేళ్లపాటు ఆ హోదాలో కొనసాగనున్నారు.

25 లేదా 27న ఇంటర్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు ఈ నెల 25వ తేదీ లేదంటే 27న విడుదల కానున్నాయి. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఇంటర్ బోర్డ్ అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను ఒకేసారి విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు 1,532 కేంద్రాల్లో జరిగాయి. ఈ పరీక్షలకు 9,96,971 మంది దరఖాస్తు చేశారు. సమాధాన పత్రాల మూల్యాంకనం 19 కేంద్రాల్లో గత నెల 18 నుంచి చేపట్టారు. మొత్తం 60 లక్షల పేపర్లు మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో మార్కులు ఫీడ్ చేశారు. వీటిని రెండు సార్లు పరిశీలించిన తర్వాత తుది ఫలితాలు వెల్లడిస్తారు. ఈ ప్రక్రియ ఈ నెల 20తో పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

మిస్‌వరల్డ్ కోసం లోపాలు లేని ఏర్పాట్లుండాలి: స్మితాసబర్వాల్

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెలలో నిర్వహించనున్న ప్రపంచ సుందరి పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్ అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ పోటీలకు వేదికవుతున్న తెలంగాణ, హైదరాబాద్‌పై ప్రపంచ దృష్టి ఉండనున్నందున, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో పలు శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. మే 14న పోటీదారులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు వరంగల్‌లో పర్యటిస్తారని తెలిపారు.

మద్దతు ధర రాలేదని ధాన్యం రాశికి నిప్పు

భానుపురి (సూర్యాపేట): మద్దతు ధర రాలేదన్న ఆవేదనతో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ రైతు ధాన్యం రాశికి నిప్పంటించాడు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన రైతు బత్తుల లింగరాజు శుక్రవారం సూర్యాపేట మార్కెట్ యార్డుకు 40 బస్తాల జైశ్రీరాం రకం ధాన్యాన్ని తీసుకొచ్చాడు. ఈ ధాన్యానికి వ్యాపారులు క్వింటాలుకు రూ.1,606 ధర నిర్ణయించారు. అయితే ప్రభుత్వ మద్దతు ధర రూ.2,350 ఉండగా.. తన ధాన్యానికి వ్యాపారులు తక్కువ ధర నిర్ణయించడంతో లింగరాజు ఆవేదన చెందాడు. దీంతో తన ధాన్యం రాశిలో కొంత భాగానికి నిప్పంటించి నిరసన తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ సిబ్బంది, వెంటనే వచ్చి నిప్పును ఆర్పారు. ఈ ఘటనపై మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. రైతు లింగరాజు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఈ నామ్‌లో వ్యాపారులు క్వింటాలుకు రూ.1,606 ధరకు కొనుగోలు చేశారని, ధాన్యం నాణ్యత సరిగా లేదని వ్యాపారులు చెప్పడంతో పరిశీలించామని తెలిపారు. అందులో కొంత తాలు, తేమ 22 శాతం ఉండటంతో ధర ఆశించినట్లుగా రాలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. శనివారం మరోసారి అవకాశం ఇస్తామని, ధర అధికంగా వస్తే రైతు అమ్ముకోవచ్చని వివరించారు.



ధాన్యం కాలిపోయిన దృశ్యం

'పాలమూరు' సవరణ అంచనాలకు ఆమోదం

- పరిపాలనాపరమైన అనుమతులు జారీ
- గంధమల్ల, రోళ్లవాగుకు కూడా

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ–3 కింద నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ దాకా నీటిని తరలించే ఓపెన్ కెనాల్ పనుల సవరణ అంచనాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. అంచనావ్యయం రూ.416.10 కోట్లు కాగా, పెరిగిన ధరలకు అనుగుణంగా సవరిస్తేనే పనులు చేస్తానని కాంట్రాక్టర్ రెండున్నరేళ్లుగా పనులు నిలిపివేశారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో సవరణ అంచనాలకు ఆమోదం లభించింది. అంచనాలను రూ.416.10 కోట్ల నుంచి రూ.780.63 కోట్లకు సవరిస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పరిపాలనాపరమైన అనుమతినిచ్చారు. తాజా నిర్ణయంతో 8.325 కిలోమీటర్ల మేర కాల్వ పనులకు అడ్డంకులు తొలిగాయి. ఈ కాలువ పూర్తయితేనే నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించడానికి వీలుంటుంది. ఇప్పటికే నార్లాపూర్, ఏదుల, పట్టెం రిజర్వాయర్ల పంప్‌హౌస్‌ల వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం ట్రాన్స్‌కోకు నిధులు కూడా విడుదల చేసింది.

- ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన గంధమల్ల రిజర్వాయర్ సామర్థ్యాన్ని కుదించి, దీని నిర్మాణ వ్యయం అంచనాల పెంపుపై నిర్ణయం తీసుకుంది. తొలుత 9.86 టీఎంసీల సామర్థ్యంతో రూ.860 కోట్ల అంచనాలతో చేపట్టాలని నిర్ణయించగా, ఆ తర్వాత 4.28 టీఎంసీలకు కుదించారు. తాజాగా దీని సామర్థ్యాన్ని 1.41 టీఎంసీలకు, అంచనా వ్యయాన్ని రూ.574.56 కోట్లకు సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.
- జగిత్యాల జిల్లా బీర్పూర్‌లోని కాకతీయ కెనాల్ కింద రోళ్లవాగు చెరువు అంచనా వ్యయం రూ.136.61 కోట్ల నుంచి రూ.153 కోట్లకు సవరిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు ఇచ్చింది.

ఎపుడైతే మోహగుణమును, కల్మషములను దాటగలవో,
అపుడే నీవు విన్న, వినవలసిన విషయాల్లో వైరాగ్యాన్ని పొందగలవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 12 ఏప్రిల్ 2025

రాణా గుప్పిట కీలక రహస్యాలు!

పదిహేడేళ్ల క్రితం ముంబై మహానగరంలో 10 మంది ఉగ్రవాదులు 78 గంటలపాటు విచక్షణా రహితంగా దాడులకు తెగబడి 166 మంది ప్రాణాలు బలితీసుకున్న ఘోర ఉదంతంలో కీలక కుట్రదారైన తహవ్వుర్ రాణా ఎట్టకేలకు మన దేశంలో అడుగుపెట్టాడు. రానున్న 18 రోజుల్లో మన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో అతగాడు ఆ ఘోర ఉదంతానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇస్తాడన్నది చూడాలి. ఆ ఉగ్రవాదులు బాంబులూ, ఇతర మారణాయుధాలతో పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి సముద్ర మార్గంలో ముంబై చేరుకుని ఆ నగరంలో అనేకచోట్ల తుపాకులతో, గ్రెనేడ్లతో చెలరేగిపోయారు. ఆ దాడుల్లో సాధారణ పౌరులూ, కర్కరే వంటి పోలీస్ ఉన్నతాధికారులూ ప్రాణాలు కోల్పోయారు. తొమ్మిదిమంది ఉగ్రవాదులను భద్రతాదళాలు హత మార్చగా, ఉగ్రవాది కసబ్ పట్టుబడ్డాడు. విచారణానంతరం 2012లో అతన్ని ఉరితీశారు. రాణా వెల్లడించే అంశాలు మన నిఘా వర్గాల దగ్గరున్న సమాచారంతో ధ్రువీకరించుకోవటానికీ, మరో ఉగ్రవాది, ప్రస్తుతం అమెరికా జైల్లో ఉన్న డేవిడ్ హెడ్లీపై మరిన్ని వివరాలు రాబట్టడానికీ తోడ్పడుతాయి.

రాణా అప్పగింత అతి పెద్ద దౌత్యవిజయమని మన ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అటు అమెరికా కూడా ఉగ్రదాడుల్లో హతమైనవారికీ, ఇతర బాధితులకూ న్యాయం చేకూర్చటంలో ఇది కీలకమైన ముందడుగని ప్రకటించింది. కావచ్చు. అయితే కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి జీకే పిళ్లై చెబుతున్నట్టు 'అతగాడి దగ్గర చెప్పడానికేం లేదు గనుకనే...' అప్పగించారా? రాణా పాత్ర కూడా తక్కువేం కాదు. దాడులకు పక్షం రోజుల ముందు భార్యతో కలిసి ముంబైలో చాలా ప్రాంతాలు వెళ్లి చూశాడు. అతను ఎంపిక చేసిన ప్రాంతాలను హెడ్లీ భార్యాసమేతంగా వచ్చి తనిఖీ కూడా చేశాడు. ఇంచుమించు ఆ ప్రాంతాల్లోనే ఉగ్రవాదుల దాడులు జరిగాయి. రాణా ముంబైతోపాటు ఢిల్లీ, కొచ్చి వంటి నగరాలకు కూడా పోయాడు. 1971 నాటి యుద్ధవీరులకై నిర్మించిన ముంబైలోని జల వాయు విహార్ హౌసింగ్ కాంప్లెక్స్‌లో భార్యతో కలిసి బస చేశాడు. ఆ కాంప్లెక్స్ పేల్చివేతకు అవకాశం ఉందా లేదా చూసుకుని, అసాధ్యమని నిర్ణయించుకున్నాక భారత్ నుంచి వెళ్లిపోయాడని అంటారు.

పిళ్లై వాదన పూర్తిగా కొట్టిపారేయదగింది కాదు. ఎందుకంటే ఈ మొత్తం వ్యవహారంలో రాణాతో పోలిస్తే అసలు సిసలు కుట్రదారు డేవిడ్ కోల్మన్ హెడ్లీ. ప్రస్తుతం రాణా అప్పగింత కీలకమైన ముందడుగుగా చెబుతున్న అమెరికా హెడ్లీ విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నది? ఎందుకంటే అతగాడు అమెరికా మాదకద్రవ్య నియంత్రణ విభాగం (డీఈఏ) ఏజెంట్‌గా పని చేశాడు. అదే సమయంలో ఐఎస్ఐకీ, లష్కరే తొయిబా (ఎల్ఈటీ)కీ కూడా ఏజెంట్‌గా ఉన్నాడు. ఇవన్నీ అమెరికా నిఘా సంస్థలకూ తెలుసు. అంతేకాదు... ముంబై మారణకాండ పథక రచన మొదలుకొని అన్ని విషయాలపైనా అమెరికా దగ్గర ముందస్తు సమాచారం వుంది. ఆ సంగతలా వుంచి భారత్‌లో సేకరించిన సమస్త సమాచారాన్నీ, ముంబైకి సంబంధించిన జీపీఎస్ లోకేషన్‌లనూ హెడ్లీకి రాణా అందించాడు. దాని ఆధారంగానే కొలాబా తీరప్రాంతంలోని బధ్వర్ పార్క్ దగ్గర ఉగ్రవాదులు బోట్లు దిగారు. రాణా ఇచ్చిన సమాచారాన్ని హెడ్లీ పాకిస్తాన్ పోయి అక్కడ ఐఎస్ఐ తరఫున తనతో సంప్రదిస్తున్న మేజర్ ఇక్బాల్ అనే వ్యక్తికి అందజేశాడని ఇప్పటికే మన నిఘా సంస్థలకు రూఢి అయింది. ఉగ్రవాదులకు ఐఎస్ఐ ఇచ్చిన శిక్షణేమిటో హెడ్లీకి తెలుసు. వీటిపై అమెరికా భద్రతా సంస్థలకు క్షుణ్ణంగా తెలిసినా మన దేశాన్ని ముందే ఎందుకు అప్రమత్తం చేయలేదన్న సంశయాలున్నాయి. ఇది బయటపడుతుందన్న ఉద్దేశంతోనే అమెరికా ఏవో సాకులు చెబుతోందన్నది వాస్తవం.

సందేహం లేదు... రాణా కన్నా హెడ్లీ అత్యంత కీలకమైనవాడు. అతను ఎల్ఈటీలో చేరడమే కాక, ముంబై దాడులకు పన్నాగం పన్నిన ఉగ్రవాదులు హఫీజ్ సయీద్, లఖ్వీల దగ్గర శిక్షణ తీసుకున్నాడు. ముంబై దాడుల సమయంలో దగ్గరుండి చూస్తున్నట్టుగా ఉగ్రవాదులకు ఎప్పటికప్పుడు ఫోన్‌లో లఖ్వీ ఆదేశాలివ్వటం వెనక హెడ్లీ ప్రమేయం వుంది. తమకు ఏజెంటుగా పని చేసినవాడిని అప్పగించరాదని అమెరికా భావించటం మూర్ఖత్వం. అదే పని భారత్ చేస్తే అంగీకరించగలదా? హెడ్లీని అప్పగిస్తే తమ గూఢచార సంస్థల నిర్వాకం బయటపడుతుందని అది సంకోచిస్తున్నట్టు కనబడుతోంది. రాణా అప్పగింత ప్రక్రియ తమ హయాంలోనే మొదలైందని గర్వంగా చెబుతున్న కేంద్ర మాజీ మంత్రి చిదంబరం హెడ్లీ విషయంలో ఎందుకు విఫలమయ్యారో చెప్పాలి. వికీలీక్స్ పత్రాలు ఈ సంగతిని చాన్నాళ్ల క్రితమే వెల్లడించాయి. హెడ్లీ అప్పగింతకు పట్టుబట్టవద్దని అప్పటి మన జాతీయ భద్రతాసలహాదారు ఎంకే నారాయణన్‌ను నాటి అమెరికా రాయబారి తిమోతీ రోమెర్ కోరినట్టు అందులో ఉంది. అలా అడిగినట్టు కనబడకపోతే తమకు ఇబ్బందులొస్తాయని నారాయణన్ బదులిచ్చినట్టు కూడా ఆ పత్రాల్లో ఉంది. హెడ్లీ ఎలాంటివాడో అతని కేసులో 2009లో తీర్పునిచ్చిన అమెరికా న్యాయమూర్తే చెప్పారు. 'హెడ్లీ ఉగ్రవాది. అతని నుంచి ప్రజలను రక్షించటం నా విధి. మరణశిక్షకు అన్నివిధాలా అర్హుడు. కానీ ప్రభుత్వ వినతి మేరకు 35 ఏళ్ల శిక్షతో సరిపెడుతున్నాను' అన్నారాయన. ఎటూ పాకిస్తాన్ తన రక్షణలో సేద తీరుతున్న లఖ్వీ, సయీద్‌లను అప్పగించదు. ఆ దేశంతో మనకు నేరస్థుల అప్పగింత ఒప్పందం కూడా లేదు. కానీ అమెరికాతో ఆ మాదిరి ఒప్పందం ఉంది గనుక హెడ్లీ కోసం మన దేశం గట్టిగా పట్టుబట్టాలి. అది సాధిస్తేనే నిజమైన విజయం దక్కినట్టవుతుంది.

కాలంతో కాలు కదిపితేనే...

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

కాలం చెల్లిన అంశాలను వల్లెవేయడం కాకుండా కాలంతో కాలు కదిపితేనే కాంగ్రెస్‌కు మళ్లీ పాత రోజులు వస్తాయని పార్టీ నాయకులు, కార్యకర్తలు బలంగా నమ్ముతున్నారు. ఆ దిశలో నాయకత్వమే చొరవ చూపటం లేదు. జాతిపిత గాంధీజీ ఆశ్రమం నెలకొల్పిన సబర్మతి నదీ తీరంలో జరిగిన రెండు రోజుల కాంగ్రెస్ జాతీయ సదస్సు 'మరో భేటీ' లాగ, సాదాసీదాగానే ముగిసింది. కాంగ్రెస్ మహామహుల పుట్టిల్లయి ఉండీ, మూడు దశాబ్దాలుగా అధికారానికి పార్టీ దూరమైన గుజరాత్ నేల నుంచి గట్టి సందేశం ఇచ్చి ఉండాల్సిందనే భావన కాంగ్రెస్ శ్రేణుల్లో ఉంది. సదస్సు చప్పగా సాగిందని పార్టీ ముఖ్యనేతలే అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు.

కాంగ్రెస్ లేని భారత్ (కాంగ్రెస్ ముక్త్ భారత్) నెలకొల్పాలని భారతీయ జనతా పార్టీ నాయకత్వం ముమ్మరంగా ప్రచారం చేస్తూ, పార్టీ ప్రభుత్వాలను కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితం చేసిన తరుణంలో... ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ మిశ్రమ ఫలితాలు సాధించిన 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పార్టీ నాయకత్వాన్ని కుంగదీసింది. ముఖ్యంగా హరియాణా, మహారాష్ట్రల్లో గెలిచే పరిస్థితులుండీ బీజేపీ నేతృత్వపు ఎన్డీయే కూటమి చేతిలో ఓటమి తప్పలేదు. జమ్మూ-కశ్మీర్, జార్ఖండ్ రాష్ట్రాల్లో విపక్ష 'ఇండియా కూటమి' నెగ్గినా అక్కడ కాంగ్రెస్ ప్రభావ రహితమైన మైనర్ పార్ట్‌నర్‌గానే ఉంది. కొన్ని చోట్ల జాతీయ పార్టీని, కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ శక్తుల్ని, మరికొన్ని చోట్ల జతకట్టిన మతతత్వ శక్తుల్నీ.... ఇలా ఆ యా రాష్ట్రాల్లో భిన్నమైన ప్రత్యర్థుల్ని ఎదుర్కొనే పరిస్థితి కాంగ్రెస్‌కుంది. అందుకే, ప్రస్తుత భేటీ కాంగ్రెస్‌కు ముఖ్యమైనదిగా పార్టీ శ్రేణులు పరిగణించాయి.

యువతరాన్ని ఆకట్టుకోవాల్సిందే!

ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్‌ను ఎవరు సొంతం చేసుకుంటున్నారు అన్నది ఇవాళ్టి యువతకు పట్టే అంశం కానేకాదు. పటేల్, నెహ్రూల మధ్య, లేని అంతరాల్ని ఎగదోస్తూ ప్రత్యర్థులు రాజేసే రాజకీయ కుంపటి చుట్టూ కాంగ్రెస్ తిరగాల్సిన అవసరమే లేదన్నది సగటు కాంగ్రెస్ కార్యకర్త మనోభావన! భారత రాజ్యాంగంపై బీజేపీ దాడి చేస్తోందనే కాంగ్రెస్ ఘాటైన విమర్శకు 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే 'పొలిటికల్ డివిడెండ్స్' లభించాయి. 'ఇండియా కూటమి'కి 150 స్థానాలు మించి రావని దేశంలోని 16 ప్రముఖ సర్వే సంస్థలు వేసిన అంచనాల్ని తలకిందులు చేస్తూ, 235 స్థానాలు గెలుచుకోవడం ఈ ప్రచార ప్రభావమే! 400 స్థానాలు ఆశించిన బీజేపీ సొంతంగా 240, కూటమికి 293 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మళ్లీ అదే నినాదాన్ని ఎంత బిగ్గరగా వినిపించినా.... తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేయలేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, అభివృద్ధి లేమి వంటి సమస్యలు ప్రజల నిత్య ఆలోచనల్లో ఉన్నాయి. ఆ యా అంశాల్లో ప్రభుత్వం ఎంతగా విఫలమైందో ఎండగట్టే విపక్ష ఎత్తుగడలు యువతను ఆకట్టుకోవడానికి పనికొస్తాయి.



- కాంగ్రెస్ పునర్వైభవం, కాంగ్రెస్ కన్నా దేశానికి ఎక్కువ అవసరమనే ప్రజల ఆకాంక్షని పార్టీ నాయకత్వం గ్రహించినట్టుంది. కానీ, అదెలా జరగాలనే విషయంలో దానికొక స్పష్టత లేదని ఏఐసీసీ 86వ జాతీయ సమావేశాన్ని చూస్తే అర్థమవుతుంది.
- పాత విషయాల వల్లెవేతే తప్ప... జాతికి నూతన ఆశలు కల్పించే, మిత్రపక్షాలకు కొత్త నమ్మిక ఏర్పరిచే, పార్టీ శ్రేణులకు తాజా ప్రేరణనిచ్చే అంశా లేవీ తీర్మానాల్లోకి రాలేదు.

'కులగణన' ఒక స్థాయి వరకు సానుకూల ఫలితాలిచ్చినా, తదుపరి ప్రతికూలించే ప్రమాదముందనే అభిప్రాయాన్ని పార్టీలోని ఒక వర్గం వ్యక్తం చేస్తోంది. దేశంలో బలమైన ప్రతిపక్షం ఉండాలనే ప్రజాభిప్రాయం స్వాగతించదగిందనీ, లేకుంటే ప్రాంతీయ శక్తుల ప్రాబల్యం పెరుగుతుందనే భావనను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యక్తం చేసిన విషయం తెలిసిందే! పార్టీ అత్యున్నత విధాన నిర్ణాయక వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) భేటీ కూడా జరిగిన జాతీయ సదస్సు ఈ విషయంలో ప్రజల దృష్టిని ఆకర్షించలేకపోయిందనే భావన శ్రేణుల్లో ఉంది.

ఆశ, ఆకాంక్ష అయితేనే...

పార్టీ కీలక తీర్మానానికి మద్దతు పలుకుతూ, సదస్సులో ఎంపీ శశి థరూర్ ఒక మాటన్నారు: 'కాంగ్రెస్ అంటే పగ, ప్రతీకారం కాకుండా ప్రజలకు ఒక ఆశ, ఆకాంక్ష అవ్వాలి. కాంగ్రెస్ అంటే కేవలం గత వైభవమే కాకుండా, సానుకూల దృక్పథం కలిగిన ఒక ఆశావహ భవిష్యత్ కావాలి. వ్యతిరేకిస్తూ చేసే విమర్శ మాత్రమే కాకుండా సద్యోచన, నిర్మాణాత్మక సహకారం అందించే బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉండాలి.'

సదస్సు రెండో రోజు సాంఘిక శాస్త్ర పాఠంలా సాగిన రాహుల్ గాంధీ ప్రసంగంలో ప్రధానంగా కాంగ్రెస్ కృషిని, త్యాగాలను ప్రశంసించడంతో పాటు బీజేపీ, ఆరెస్సెస్‌ది విపరీత భావజాలమంటూ విమర్శలు గుప్పించారు. 'రాహుల్ ఇలా మాట్లాడాలి. కానీ, మాట్లాడరు' అంటూ సంపాదకుడు హరీశ్ ఖరే ఒక రోజు ముందుగా 'ద వైర్' వేదికగా వెలువరించిన ప్రసంగ(వ్యాస)ంలోని ముఖ్యాంశాలను రాహుల్ నిజంగానే ప్రస్తావించలేదు. '... మతఛాందసం, వేర్పాటువాదం, నియంతృత్వాలకు వ్యతిరేకంగా నా శక్తి మొత్తాన్ని వెచ్చించి కడదాకా పోరాడుతానని విస్పష్టంగా ప్రకటిస్తున్నాను...' అనే మాటలతో మొదలై, '... గాంధీ, నెహ్రూ కుటుంబానికి చెందిన వాడినైనందున, మా తండ్రి, నాయనమ్మ దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసినందున... సహజంగానే నేను ప్రధానమంత్రి పదవికి అర్హుడనైతానని మీలో కొందరు భావిస్తుండవచ్చు. కానీ, నాకా ఆలోచన లేదు. నేను గానీ, మా కుటుంబంలో మరెవరైనా గానీ, ఆ పదవిని ఆశించడం లేదు' అనే మాటలతో హరీశ్ వ్యాసం సాగుతుంది. ఆయన రాసినట్టుగానే ఇవేవీ రాహుల్ మాట్లాడలేదు.

ఈ పద్ధతి సరికాదు!

పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేస్తామంటూనే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పార్టీ బలహీనపడే పరిస్థితులను అధినాయకత్వం ఉపేక్షించడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోవడం లేదు. కొన్నిసార్లు పరోక్షంగా అధిష్ఠానమే ప్రోత్సహిస్తోంది. ఇందుకు తెలంగాణ, కర్ణాటకలో ప్రత్యక్ష ఉదంతాలున్నాయి. తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న పార్టీ ప్రధాన కార్యదర్శి మీనాక్షీ నటరాజన్ నేరుగా సచివాలయానికి వెళ్లి, మంత్రివర్గ ఉపసంఘంతో, అధికారులతో భేటీ అయి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూవివాదాంశాన్ని సమీక్షించడం పలువురిని విస్మయానికి గురిచేసింది. పార్టీ కార్యాలయమైన గాంధీభవన్‌లో కాకుండా నేరుగా యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థి ప్రతినిధులు, పౌర సంఘాల వారితో ఆమె ముచ్చటించారు. మళ్లీ వచ్చి, ఆ అంశాలను మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించారు. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ, ఆ యా ప్రతినిధులు, వర్గాల వారితో అది చర్చిస్తుందన్న ముఖ్యమంత్రి మాటలు అమలు కాక ముందే, ఆమె ఈ 'హడావిడి' చర్యలకు పూనుకున్నారు. ఆమె ఏ హోదాతో సచివాలయంలో ఉపసంఘంతో, అధికారులతో భేటీ అయ్యారనే ప్రశ్న సహజంగానే తలెత్తింది. ఇది సదరు మంత్రి వర్గాన్ని, ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టిన పరిస్థితి. ప్రత్యర్థి పార్టీల విమర్శలకూ, సొంత పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికీ కారణమైంది. అంతకు ముందు ఇన్‌చార్జ్‌గా ఉన్న దీపాదాస్ మున్షీపై ఒక రకం ఆరోపణలుంటే, గాంధేయవాది, ప్రజాస్వామ్య ప్రేమికురాలు, నిరాడంబరనేత అని పేరున్న మీనాక్షి చొరవను, ఒక అతి చేష్టగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఢిల్లీలో బీసీ ధర్నా రోజు, అప్పటివరకు స్పందించకుండా ఉండి, ముఖ్యమంత్రి హైదరాబాద్ వచ్చిన తర్వాత రాహుల్, సోనియాలు బీసీ నాయకుల్ని కలవటం కూడా తప్పుడు సంకేతాలనిచ్చిందనే భావన పార్టీలో వ్యక్తమవుతోంది. ఇది పార్టీకి అంత మంచిది కాదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, పీపుల్స్ పల్స్

సోషల్ మీడియా

సరైన విధానం



అమెరికా సుంకాల మీద ఎలాంటి ప్రకటన చేయకుండా, ప్రతీకార సుంకాలను విధించకుండా, ఒప్పందం కుదుర్చుకోవడం కోసం ఇండియా ఓపిగ్గా ప్రయత్నిస్తుండటం మంచి విధానం. ధైర్యం కనరబరచాలని కొంత మంది పిలుపునిస్తున్నప్పటికీ, ఈ వ్యవహారంలో ఆ అవసరం లేదు. ట్రంప్‌కు సంబంధించిన ఒక లక్షణం అనిశ్చితి! ఆచితూచి పోవడమే మేలు!

– యూసుఫ్ టి. ఉంర్ఘూవాలా, సంపాదకుడు

వేతనాలు పెరగాలి!



8వ తరగతి పిల్లల్లో 75 శాతం మందికి గణితంలో ప్రావీణ్యం లేదు. సగటు యూఎస్ విద్యార్థి కంటే చైనా పిల్లలు నాలుగేళ్లు ముందున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వోపాధ్యాయుల వేతనం ఏడాదికి 45,000 డాలర్ల కంటే తక్కువగా ఉంది. పిల్లల్ని తీర్చిదిద్దే ఉత్తమ ఉపాధ్యాయులకు తగిన ప్రతిఫలం ఉండాలి.

– వివేక్ రామస్వామి, అమెరికా నాయకుడు

స్కీమ్స్ చాట్‌బాట్



ప్రభుత్వ పథకాలు, సబ్సిడీల మీద ఎవరైనా ఏఐ చాట్‌బాట్‌ను రూపొందించాలి. వెయ్యికి పైగా పథకాలున్నాయి. పౌరులు, ఆంత్రప్రెన్యూర్లకు ప్రభుత్వం ప్రకటించిన అన్నింటి గురించి మనం వాట్సాప్‌లో చాట్ చేస్తూ తెలుసుకుంటే ఎలా ఉంటుందో ఊహించండి.

– దిలీప్ కుమార్, ఆంత్రప్రెన్యూర్

కెనడా సమస్య



తహవ్వుర్ రాణా కెనడా పౌరుడు. ఆయన ఒకవేళ కెనడా జైల్లో ఉండివుంటే ఈ అప్పగింత జరిగేదే కాదు. అందుకే కెనడా ఇబ్బందులను ఎదుర్కొనుంది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడటం కెనడా మర్చిపోయింది.

– సునందా వశిష్ఠ్, పొలిటికల్ కామెంటేటర్

పనే ఆనందం



నువ్వు నిజంగా నీ కోసం పని చేసుకోవడం మొదలుపెడితే నీకు హాబీలు ఉండవు, వారాంతాలు ఉండవు, విహారాలు ఉండవు. అదే సమయంలో నీకు పని కూడా ఉండదు.

– నావల్ రవికాంత్, ఇన్వెస్టర్

ఇన్ బాక్స్

సిక్కోలు విప్లవోద్యమ ధ్రువతార

ఎర్రెర్రని విప్లవాగ్నులు ఎచటివని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమన్నారు. శ్రీకాకుళ పోరాటం భారత దేశ విముక్తికి దారితీస్తోందన్న చైనా అధికారిక మాధ్యమం పెకింగ్ రేడియో ప్రకటనే ఆ ఉద్యమ తీవ్రతకు తార్కాణం. ఉద్ధానం అనే ఉద్యమాల వనంలో ఉదయించిందొక తారక. ఆ వేగుచుక్క పేరే – పైలా వాసుదేవరావు.

ప్రపంచాన్ని కుదిపేసిన నక్సల్బరీ నిప్పురవ్వలు రగులుతోన్న సమయంలోనే యావత్ భారత దేశాన్ని సిక్కోలు వైపు కదం తొక్కేలా చేసింది శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం. పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ గణపతి, చినబాబు, గొరకల రాంబాబు లాంటి విప్లవ వీరులను కన్నగడ్డ శ్రీకాకుళం జిల్లా పైలా వాసుదేవరావుకి జన్మనిచ్చింది. విద్యార్థి దశ నుంచే రాజకీయాల పట్ల ఆకర్షితులైన పైలా 1953లో తన 21వ ఏట కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.



పైలా వాసుదేవరావు

ఉద్యమ అవసరాల రీత్యా సర్వేయర్ ఉద్యోగంలో నుంచి ఉపాధ్యాయ వృత్తిలోకి మారారు. పగలు పాఠాలు నేర్పారు. రాత్రుళ్ళు యువకులను, రైతులను కూడగట్టి విప్లవ పాఠాలు నేర్పారు. ఆ తరువాత ఉపాధ్యాయ వృత్తికి కూడా రాజీనామా చేసి ఉద్యమంలో మమేకమయ్యారు.

1968 నవంబర్ 25న శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం ప్రారంభమైంది. పోరాటం ప్రారంభంలో అజ్ఞాతవాసంలోకి వెళ్ళిన కామ్రేడ్ పైలా 42 సంవత్సరాలు వెనుదిరిగి చూడకుండా సాయుధ పోరాట రాజకీయాల్ని ఎత్తిపట్టారు. పైలా నేతృత్వంలో నడిచిన తెగింపు దళాల్లో సభ్యురాలిగా మొదలై సాయుధ దళాల్లో ఆరితేరిన ఉక్కు మహిళ చంద్రమ్మను 1970లో వివాహమాడారు. దళాలకు నష్టం వాటిల్లుతుందని భావించి కన్నబిడ్డను సైతం అమరుడు అత్తలూరి మల్లికార్జునరావు కుటుంబానికి ఇచ్చేసి, పేగు బంధం కన్నా విప్లవోద్యమమే గొప్పదని రుజువు చేశారు. వందల దాడుల్లో త్రుటిలో తప్పుకున్నారు.

అత్యంత నిర్బంధ కాలంలోనూ కామ్రేడ్ పైలా 1971 నాటికి మిగిలి ఉన్న కామ్రేడ్స్ అందర్నీ కూడదీశారు. శ్రీకాకుళం రీజినల్ కమిటీని పునర్నిర్మాణం చేశారు. కేజీ సత్యమూర్తిని కలిశారు. చారు మజుందార్‌తో విభేదించి బయటకు వచ్చి 1973లో చంద్ర పుల్లారెడ్డితో చర్చలు కొనసాగించారు. నీలం రామచంద్రయ్య అమరులైన తర్వాత 1976లో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1989 వరకు రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారు. మచ్చలేని మహానాయకుడు పైలా మాస్టారు. ఎత్తిన ఎర్రజెండాను అమరుడయ్యేంతవరకు దించలేదు. ఆయన జీవితం భవిష్యత్ తరాల విప్లవకారులకు ఆదర్శనీయం.

– వంకల మాధవరావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏపీ కమిటీ సభ్యులు

(ఏప్రిల్ 13న కామ్రేడ్ పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ శ్రీకాకుళం జిల్లా పలాసలో జరుగుతున్న సందర్భంగా.)

గవర్నర్లకు సరైన మార్గనిర్దేశం

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

సుప్రీం కోర్టు తమిళనాడు గవర్నర్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు గాడి తప్పిన గవర్నర్లకు పెద్ద గుణపాఠం. రాజ్యాంగ నిపుణులైన న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తమిళనాడు ప్రభుత్వం తమ గవర్నర్ బాధ్యతారాహిత్యంపై దాఖలు చేసిన పిటిషన్‌పై చిరకాలం నిలిచిపోయే తీర్పు ఇచ్చింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఏ నిర్ణయమూ తీసుకోకుండా తన దగ్గరే ఉంచుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు తలుపు తట్టింది. బిల్లులను తొక్కిపట్టడం రాజ్యాంగ నేరం అని దూషించకపోయినా, అది రాజ్యాంగ పరమైన నైతిక చర్య కాదని పెద్ద పదాలు వాడుతూ తమిళనాడు గవర్నర్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేసింది కోర్టు.

ఒక్క తమిళనాడు గవర్నర్ మాత్రమే కాదు. కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒక్కటేమిటి... చాలా రాష్ట్రాల గవర్నర్లు రాజ్యాంగాన్ని అనేకసార్లు అతిక్రమించారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నా, బీజేపీ ఉన్నా గవర్నర్ల రాజ్యాంగ అతిక్రమణ మాత్రం కొనసాగుతూనే ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200... 'వీలైనంత తొందరగా' (యాజ్ సూన్ యాజ్ పాజిబుల్) తన దగ్గరకు వచ్చిన శాసనసభ ఆమోదించిన బిల్లులపై సంతకం పెట్టాలని పేర్కొంటోంది. కానీ తమిళ నాడు గవర్నర్ రవి తన దగ్గరకు వచ్చిన బిల్లులపై నెలల తరబడి అసలు ఏ నిర్ణయమూ తీసుకోకుండా తొక్కిపట్టారు. ప్రతిదానికీ కాలపరిమితనేది ఒకటి ఉంటుంది. రాజ్యాంగంలో అక్షరబద్ధం కాలేదనే వంకతో ఇష్టమొచ్చినంత కాలం బిల్లులకు ఆమోదం తెలపకపోతే పాలన ఎలా జరుగుతుంది?

ఆర్టికల్ 200 ప్రకారం పనిచేయాల్సిన బాధ్యత గవర్నర్లపై ఉంది. ఒక బిల్లుపై సమ్మతిని ఆపాలన్నా, లేదా అభ్యంతరాలు ఉండి రాష్ట్రపతికి నివేదించాలన్నా నెల రోజుల్లోగా గవర్నర్లు ఏదో ఒక నిర్ణయం తీసుకోవలసి ఉంటుందనే కనీస విజ్ఞత ఉండదా? పది బిల్లులను ఏ నిర్ణయం తీసుకోకుండా ఎలా ఆపుతారు? అందుకే ఈ తీర్పులో 'బిల్లుపై తమ అభ్యంతరాలను తెలియ చేస్తూ గవర్నర్లు 3 నెలల్లోగా అసెంబ్లీకి వాపసు చేయాల్సి ఉంటుంది. బిల్లుపై తన అభ్యంతరాలను రాష్ట్రపతికి తెలియచేయాలనుకుంటే గరిష్ఠంగా మూడు నెలల్లో ఆ పని చేయాల్సి



ఉంటుంది. అసెంబ్లీలో రెండోసారి ఆమోదం పొంది వచ్చిన బిల్లుకు నెల రోజుల్లోగా గవర్నర్లు తమ సమ్మతిని తెలియచేయాల్సి ఉంటుంది. గవర్నర్లు సత్వరంగా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగం ఆశిస్తున్నది. నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేయడం ప్రజాస్వామ్య పాలన స్ఫూర్తిని ఉల్లంఘించడమే' అని స్పష్టంగా చెప్పవలసి వచ్చింది. రాజ్యాంగ పరంగా అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి చర్యల కారణంగా ఏర్పడిన సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు ఈ మార్గదర్శకాలు అవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు మిగతా గవర్నర్లకూ మార్గదర్శకాలు అవుతాయి. బిల్లులపై సమ్మతి తెలియజేయకుండా శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచే అధికారం గవర్నర్లకు లేదని ఉన్నత న్యాయస్థానం మరీ మరీ చెప్పింది. గవర్నర్లకు మూడు అవకాశాలు మాత్రమే ఉంటాయని, ఒకటి బిల్లుకు సమ్మతి తెలియచేయడం, రెండు అభ్యంతరాలతో అసెంబ్లీకి బిల్లును తిప్పి పంపడం, మూడు రాష్ట్రపతికి నివేదించడమని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా వివరించింది.

వాటిలో ముఖ్యమైన మార్గదర్శకం ఇది: 'ఏదైనా బిల్లును పునఃపరిశీలనకు పంపాక అసెంబ్లీ మళ్లీ దాన్ని ఆమోదించి రెండవసారి గవర్నర్‌కు పంపించిన పక్షంలో అటువంటి బిల్లును గవర్నర్ రాష్ట్రపతికి నివేదించడానికి వీల్లేదు. అలా చేయడం చట్టవిరుద్ధం. ఒకవేళ రాష్ట్రపతికి నివేదించదలిస్తే నెలరోజుల్లోగా దానిపై గవర్నర్ నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రపతికి నివేదించాల్సిన అవసరం లేదని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవాలి'.

జవహర్‌లాల్ నెహ్రూ కాలంలోనే కాదు, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రధానుల కాలంలోనూ దారుణంగా గవర్నర్లు ప్రజాస్వామ్యంతో ఆటలాడుకున్నారు. గతంలో కర్ణాటక, బిహార్, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో గవర్నర్లు హద్దులు మీరారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గవర్నర్ రామ్‌లాల్ ఆయన ప్రభుత్వాన్ని చట్టవిరుద్ధంగా రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇదే దారిలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలున్న కాలంలోనూ గవర్నర్లు వ్యవహరించారు, వ్యవహరిస్తున్నారు. ఆ మధ్య కాలంలో పశ్చిమబెంగాల్ గవర్నర్ వ్యవహార శైలి కూడా వార్తలకెక్కిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు గవర్నర్ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చాలా సరైన తీర్పు ఇచ్చిందనే భావించాలి.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా' ప్రొఫెసర్

కర్మఫలం

భూమిపై ఎవరైనా సరే కర్మఫలం అనుభవించక తప్పదు. అది మంచైనా చెడైనా తగిన ప్రతిఫలం అనుభవించవలసిందే అని కృష్ణపరమాత్మ మాట. యుద్ధంలో తమ కుమారులు మరణించిన దుఃఖంలో ఉన్న ధృతరాష్ట్ర దంపతులను ఓదార్చడానికి కృష్ణుడు రాజభవనానికి మర్యాదపూర్వకంగా వెళ్ళాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు 'నేను అంధుడిగా ఎందుకు పుట్టానో, యుద్ధంలో నా వంద మంది కొడుకులను ఎందుకు కోల్పోయానో, ఈ వయసులో మాకీ పుత్రశోకం ఎందుకు వచ్చిందో చెప్పు కృష్ణా' అన్నాడు.

జ్యోతిర్మయం

అప్పుడు కృష్ణుడు ఇలా అన్నాడు – 'ఈ ప్రపంచం అంతా కర్మతో ముడిపడింది. ఈ ప్రపంచంలో మానవుడు చేసే ప్రతి చర్యా... అది మంచిదైనా చెడ్డదైనా అతని ప్రస్తుత జీవితంపై మాత్రమే కాకుండా అతని భవిష్యత్తు జీవితంపై కూడా ప్రభావం చూపుతుంది. మానవ జీవితంలోని ప్రతి మంచి, చెడు వెనుక, ఒక కర్మ కారణమై ఉంటుంది. కాబట్టి, మీరిప్పుడు ఆ వంద జీవితాల వెనుక మరొక జీవితానికి వెళ్లి మీరు ఏమి చేశారో చూస్తే, ఈ జీవితంలో మీ అన్ని బాధల వెనుక ఉన్న కారణాన్ని మీరు స్పష్టంగా అర్థం చేసుకుంటారు. ఈ జీవితానికి ముందు నువ్వు క్రూరమైన రాజువి. ఒకరోజు నువ్వు వేటకు వెళ్లి చెరువులో ఆడుకుంటున్న తల్లి హంస – పిల్ల హంసలను చూశావు. దేవుడు నీకు ఇచ్చిన కళ్ళతో వాటి ఆటను ఆస్వాదించడానికి బదులుగా నువ్వు తల్లి హంస కళ్ళను నిర్దాక్షిణ్యంగా లాక్కుని పిల్లలను క్రూరంగా చంపావు. తల్లి హంస దుర్భరమైన మరణాన్ని చవిచూసింది. ఇంతటి అన్యాయమైన, క్రూరమైన కర్మను చేసినందుకు ఒక జీవితాంతం బాధపడాలి. అయితే, తరువాతి వంద జన్మలలో అనేక మంచి కర్మలను చేశావు. ఆ వంద జన్మలలో నువ్వు చేసిన మంచి కర్మలన్నిటినీ కూడబెట్టుకుని, ఈ జన్మలో రాజుగా జన్మించావు; కానీ ఆ జన్మలో నువ్వు చేసిన క్రూరమైన చెడు కర్మలు కూడా అదే స్థాయిలో పరిపక్వం చెందడంతో నువ్వు అంధత్వంతో బాధ పడుతున్నావు. ఆ దుష్ట కర్మ గత వంద జన్మలుగా నిన్ను వెంటాడుతూనే ఉంది. చివరికి ఈ జన్మలో నువ్వు అంధుడిగా పుట్టి, నీ క్రూరత్వం వల్ల తల్లి హంస తన వంద మంది పిల్లలను కోల్పోయినట్లే, నీ వంద మంది కుమారులనూ కోల్పోయావు.' ఎన్ని జన్మలెత్తినా, ఎంతటి వారైనా కర్మఫలం తప్పించుకోలేరని గ్రహించాలి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** పౌర్ణమి తె.4.22 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** హస్త సా.5.11 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.2.01 నుండి 3.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.47 నుండి 7.26 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.34 నుండి 12.22 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.10.

14 నుంచి భూ భారతి

- అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రారంభం
- శిల్పకళావేదికలో సీఎం, డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



ముకేందర్ కుటుంబీకులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ బలరామ్‌నాయక్

సాక్షి, హైదరాబాద్/ బూర్గంపాడు: నూతనంగా రూపొందించిన భూభారతి చట్టాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. వివిధ మండలాల్లో రూ.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలుచేసిన ధరణిని బంగాళాఖాతంలో కలిపి రైతులకు మేలుచేసేలా భూభారతి చట్టాన్ని తీసుకొస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భూభారతి చట్టాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ చట్టం రాష్ట్ర చరిత్రలో ఓ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. 14న భూ భారతి పోర్టల్‌ను సీఎం ప్రారంభిస్తారని రెవెన్యూశాఖ వర్గాలు కూడా తెలిపాయి.

నెలాఖరులోగా ఇల్లు మంజూరు చేస్తా..

మణుగూరు టౌన్: 'కమ్మటి భోజనం పెట్టావు అక్కయ్యా.. నీ కష్టం నేను చూడలేకపోతున్నా... ఈ నెలాఖరులోగా నీకు ఇల్లు మంజూరు చేస్తా.. మూడు నెలల్లో ఇల్లు కట్టుకోండి.. మళ్లీ వస్తాను' అంటూ వంకా ముకేందర్ కుటుంబ సభ్యులకు మంత్రి పొంగులేటి భరోసా కల్పించారు. మణుగూరు పర్యటన సందర్భంగా కూనవరంలో సన్నబియ్యం లబ్ధిదారుడు ముకేందర్ నివాసంలో సన్నబియ్యంతో శుక్రవారం భోజనం చేశారు. ముకేందర్ కుటుంబ సభ్యులకు మంత్రి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా 'మీకు ఏం సాయం కావాలి' అని పొంగులేటి ప్రశ్నించగా.. ఇల్లు, పిల్లలకు ఉద్యోగాలు లేవని, తమ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని కుటుంబ పెద్ద శివలక్ష్మి కన్నీటి పర్యంతమైంది. అందుకు మంత్రి స్పందిస్తూ ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆమె పెద్దకుమారుడికి రాజీవ్ యువ వికాసం ద్వారా కిరాణా షాపు పెట్టించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను ఆదేశించారు.

జూన్ 15 నుంచి టెట్

ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ● నోటిఫికేషన్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్)ను జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి విడుదల చేశారు. టెట్ పరీక్ష కోసం ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్ష ఫలితాలను జూలై 27న విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచార బులెటిన్‌ను ఈ నెల 15న విడుదల చేస్తామని విద్యాశాఖ తెలిపింది.

ఈసారి ఎక్కువ దరఖాస్తులు!

గతంలో 2024 మే 20 నుంచి జూన్ 2 వరకు టెట్ నిర్వహించారు. ఈ పరీక్షకు రెండు పేపర్లకు కలిపి 2,36,487 మంది హాజరయ్యారు. కాగా త్వరలో డీఎస్సీ చేపడతామని ప్రభుత్వం వెల్లడించడంతో ఈసారి టెట్‌కు ఎక్కువ దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పరీక్ష ఫీజును ఒక పేపర్‌కు రూ.750, రెండు పేపర్లకు రూ.1,000గా నిర్ణయించారు. బీఈడీ చేసిన అభ్యర్థులు రెండు పేపర్లు రాసే అవకాశం ఉంటుంది. దరఖాస్తుతో పాటే ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లాంగ్వేజ్ పండిట్లు కూడా సంబంధిత అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు పేపర్లకు అర్హతలు ఇలా..


టెట్‌ను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన వారు పేపర్-1 రాసేందుకు అర్హులు. వీరు టెట్ అర్హత ఆధారంగా 1-5 తరగతులు బోధించవచ్చు. డీఎస్సీలో ఎస్‌జీటీ పోస్టులకు పోటీ పడవచ్చు. బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) చేసిన వారు ఉన్నత తరగతులకు బోధించే అర్హతకు సంబంధించిన పేపర్-2 రాయాల్సి ఉంటుంది. వీరు డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు సంబంధిత పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నా దరఖాస్తు చేసుకోవచ్చు.

150 మార్కులకు పరీక్ష

పేపర్-1, పేపర్-2 ప్రశ్నపత్రాలు 150 మార్కులకు ఉంటాయి. ప్రశ్నలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, టీజీటెట్ కమిటీ చైర్ పర్సన్ ఎంపిక చేస్తారు. పరీక్షలో జనరల్ కేటగిరీ అభ్యర్థులు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం మార్కులు సాధిస్తే అర్హులుగా పరిగణిస్తారు. టెట్ అర్హత సర్టిఫికెట్ జీవిత కాలం చెల్లుబాటులో ఉంటుంది. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. అభ్యర్థులు పూర్తి వివరాలకు, దరఖాస్తు చేసుకోవడానికి 'స్కూల్‌ఎడ్యు.తెలంగాణ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వొచ్చు.

టెట్ షెడ్యూల్

తేదీ	విషయం
15.4.25	సమాచార బులెటిన్ విడుదల
15.4.25-30.4.25	ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, ఫీజు చెల్లింపు
9.6.25	హాల్ టికెట్లు డౌన్‌లోడ్
15.6.25-30.6.25	టెట్ పరీక్ష (ఆన్‌లైన్ విధానంలో) ఉదయం 9-11.30, మధ్యాహ్నం 2-4.30 గంటల మధ్య


తహవ్వుర్ రాణా

18 రోజుల ఎన్ఐఏ కస్టడీకి తహవ్వుర్ రాణా

ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలింపు
- విచారణ ప్రారంభించిన ఎన్ఐఏ అధికారులు
- ముంబై ఉగ్రదాడులపై భిన్న కోణాల్లో ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రవాద దాడుల వెనుక ఉన్న అసలు కుట్రను ఛేదించడానికి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నడుం బిగించింది. అమెరికా నుంచి తీసుకొచ్చిన ఉగ్రవాది తహవ్వుర్ హుస్సేన్ రాణాను విచారించింది. పలు కోణాల్లో ప్రశ్నించింది. ఈ దాడుల వెనుక ఉన్న అసలు వ్యక్తులెవరు? వారి లక్ష్యం ఏమిటి అనేదానిపై సమాచారం రాబట్టేందుకు ప్రయత్నించింది. రాణాను అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం ఢిల్లీకి తరలించిన సంగతి తెలిసిందే. రాత్రి ఢిల్లీ పటియాలా కోర్టుల ప్రాంగణంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. 26/11 దాడుల కేసులో విచారణ నిమిత్తం రాణాను 20 రోజులపాటు తమ కస్టడీకి అప్పగించాలని ఎన్ఐఏ కోరగా, 18 రోజుల కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం అతడిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అత్యంత పటిష్ట భద్రత కలిగిన సెల్‌లోకి చేర్చి విచారణ ప్రారంభించారు. ఎన్ఐఏ డీఐజీ జయ రాయ్ నేతృత్వంలోని బృందం రాణాపై ప్రశ్నల వర్షం కురిపించింది. ముంబై దాడుల్లో ప్రధానంగా పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా పాత్ర గురించి మరిన్ని వివరాలు రాబట్టడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలపై కూడా ఆరా తీసినట్లు సమాచారం. 2008 నవంబర్ 26న ఉగ్రవాద దాడులు జరగ్గా, అంతకు కొన్ని రోజుల ముందు రాణా తన భార్యతో కలిసి ఇండియాలో పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించాడు. దీనిపై కూడా ఎన్ఐఏ అధికారులు ప్రశ్నలు సంధించారు. ఎక్కడెక్కడ తిరిగారు, ఎవరెవరిని కలిశారు, ఎందుకు కలిశారు అని అడిగినట్లు తెలుస్తోంది. తాజ్‌మహల్ సహా దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అందుకే రాణా అక్కడికి వెళ్లాడా? అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. మరో 17 రోజులపాటు రాణాపై విచారణ కొనసాగనుంది. అవసరమైతే మరికొన్ని రోజులు రాణా కస్టడీని పొడిగించేలా న్యాయస్థానం నుంచి అనుమతి పొందాలని భావిస్తున్నారు. రాణాకు ప్రతి 24 గంటలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెండు రోజులకోసారి లాయర్ అతడిని కలిసేందుకు అనుమతించాలని పేర్కొంది. ఎన్ఐఏ ప్రధాన కార్యాలయం చుట్టుపక్కల పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఆర్‌పీఎఫ్, ఢిల్లీ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. రాణా ఉన్న సెల్ చుట్టూ నిత్యం 24 గంటలూ నిఘా కొనసాగనుంది.

న్యాయం జరిగే రోజు వచ్చింది: మార్కో రూబియో

26/11 ఉగ్రవాద దాడుల ఘటనలో బాధితులకు న్యాయం చేకూర్చే రోజు వచ్చిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. ఈ దాడులకు సూత్రధారి అయిన తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించామని శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అప్పటి దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 166 మందికి న్యాయం జరగాలని భారత్, అమెరికా ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్నాయని వెల్లడించారు. ఆ రోజు ఇప్పుడు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

చైనా.. తగ్గేదేలే!

అమెరికాపై సుంకాలు 125 శాతానికి పెంపు

- 145 శాతం సుంకాలకు ప్రతీకారంగా నిర్ణయం
- ఇంకా పెంచారంటే కామెడీగా ఉంటుంది
- మేమైతే పెంచబోం, మీతో చర్చలకు సిద్ధం
- అమెరికాకు హితవు పలికిన చైనా


జిన్‌పింగ్


ట్రంప్

బీజింగ్: అమెరికా, చైనా టారిఫ్ పోరు మరింత ముదిరింది. చైనాపై మొత్తం సుంకాలు 145 శాతానికి చేరినట్టు అమెరికా గురువారం ప్రకటించడం తెలిసిందే. ఆ మర్నాడే ఆ దేశంపై సుంకాలను 84 నుంచి 125 శాతానికి పెంచుతూ చైనా నిర్ణయం తీసుకుంది. చైనా కస్టమ్స్ టారిఫ్ కమిషన్ శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఈ నిర్ణయం శనివారం నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అమెరికా దుందుడుకు చర్యలను దీటుగా ఎదుర్కొంటామే తప్ప వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించింది. అయితే, ''మాపై అమెరికా ఇప్పటికే సుంకాలను అవాస్తవిక రీతిలో పెంచేసింది. ఇంకా పెంచితే ఇక అర్థముండదు. ప్రపంచ ఆర్థిక చరిత్రలోనే ఓ నవ్వులాట ఉదంతంగా నిలిచిపోతుంది. అమెరికా ప్రస్తుత టారిఫ్‌లను భరిస్తూ ఆ దేశ దిగుమతులను చైనా మార్కెట్లోకి అనుమతించడం ఇప్పటికే అసాధ్యంగా మారిపోయింది. కనుక మాపై అమెరికా టారిఫ్‌లను ఇంకా పెంచేసినా మేం మాత్రం ఆ దేశంపై అదనపు సుంకాలు విధించబోం'' అని స్పష్టం చేసింది. ఈ మతిలేని దూకుడు ఎవరికీ మేలు చేయదని చైనా వాణిజ్య శాఖ పేర్కొంది. వాణిజ్య యుద్ధాల్లో విజేతలంటూ ఎవరూ ఉండరని అభిప్రాయపడింది. ''అందుకే టారిఫ్‌ల విషయంలో అమెరికాతో చర్చలకు ఇప్పటికీ చైనా సిద్ధంగానే ఉంది. మావైపు నుంచి తలుపులు తెరిచే ఉన్నాయి. చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకుంటామనే ఆశిస్తున్నాం' అని స్పష్టం చేసింది. అయితే ఏ చర్చలైనా సమానత్వం, పరస్పర విశ్వాసాల ప్రాతిపదికన జరగాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పష్టం చేశారు. ట్రంప్ టారిఫ్‌లను అమెరికా ప్రజలే విమర్శిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. భారత్ సహా ఇతర దేశాలపై ప్రకటించిన ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు ట్రంప్ తాత్కాలికంగా పక్కన పెట్టడం తెలిసిందే. చైనాపై మాత్రం సుంకాలను ఏకంగా 125 శాతానికి పెంచుతూ ఆయన నిర్ణయం తీసుకున్నారు. 20 శాతం ఫెంటానిల్ సుంకంతో కలిపి అది 145 శాతానికి చేరినట్టు వైట్‌హౌస్ గురువారం స్పష్టతనిచ్చింది.

ఏకాకిగా మిగులుతారు

అమెరికాపై జిన్‌పింగ్ ధ్వజం
- కలసికట్టుగా ఎదుర్కొందాం
- ఈయూ దేశాలకు పిలుపు

అమెరికా టారిఫ్‌లపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తొలిసారిగా స్పందించారు. అవి ఫక్తు ఏకపక్ష పోకడలంటూ మండిపడ్డారు. ''టారిఫ్‌ల యుద్ధంలో ఎవరూ గెలిచేదుండదు. ఇలా ప్రపంచం మొత్తానికీ వ్యతిరేకంగా వెళ్తే ఏకాకులు కావడం మినహా ఒరిగేదేమీ ఉండదు'' అంటూ హితవు పలికారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్‌తో శుక్రవారం బీజింగ్‌లో జిన్‌పింగ్ భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడును అడ్డుకోవడంలో తమతో కలిసి రావాల్సిందిగా యూరోపియన్ యూనియన్‌కు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ''ఇది మన అంతర్జాతీయ బాధ్యత కూడా. మన సంయుక్త స్పందన ఇరుపక్షాలకు మాత్రమే గాక మొత్తం అంతర్జాతీయ సమాజానికీ మేలు చేస్తుంది. స్వేచ్ఛాయుత వాణిజ్య వాతావరణాన్ని కాపాడుతుంది'' అని అభిప్రాయపడ్డారు. ''చైనా ఏనాడూ ఇతరుల దయపై ఆధారపడలేదు. 70 ఏళ్లుగా స్వయంసమృద్ధినే, కష్టాన్నే నమ్ముకుంది'' అని జిన్‌పింగ్ స్పష్టం చేశారు.

విదేశీ విద్యార్థులపై... ఎందుకీ కత్తి?

అమెరికా విద్యా సంస్థల ప్రశ్న
- విద్యార్థి వీసాల రద్దుపై అభ్యంతరాలు
- కారణాలేమిటో బయటపెట్టండి
- డీహెచ్ఎస్‌కు 15 విద్యా సంస్థల లేఖ

విదేశీ విద్యార్థుల వీసాలను ట్రంప్ సర్కారు ఎడాపెడా రద్దు చేస్తుండటాన్ని అమెరికన్లు కూడా హర్షించడం లేదు. ఈ ధోరణి అంతిమంగా అమెరికాకే తీవ్ర నష్టం చేకూరుస్తుందన్న ఆందోళన నానాటికీ తీవ్రతరమవుతున్నాయి. ఈ విషయమై అక్కడి విద్యా సంస్థలే గళమెత్తుతున్నాయి. అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ (ఏసీఈ)తో పాటు మరో 15 సంస్థలు బాధిత విదేశీ విద్యార్థుల తరఫున రంగంలోకి దిగాయి. ఏ కారణాలూ చూపకుండా వారి వీసాలను రద్దు చేయడం, సంబంధిత యూనివర్సిటీలకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండానే వారి స్టూడెంట్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (సెవిస్) రికార్డులను గల్లంతు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. దీనిపై తక్షణం వివరణ ఇవ్వాలంటూ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) విభాగానికి సంయుక్తంగా ఓ లేఖ రాశాయి. డీహెచ్ఎస్ మంత్రి క్రిస్టీ నోయెమ్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు కూడా లేఖ ప్రతిని పంపాయి. విద్యార్థి వీసాల రద్దుకు సంబంధించి పూర్తి వివరాలు బయటపెట్టాల్సిందేనని ఏసీఈ అధ్యక్షుడు టెడ్ మిషెల్ డిమాండ్ చేశారు. ''స్వీయ డిపోర్టేషన్ ద్వారా దేశం వీడండంటూ విద్యార్థులకు వస్తున్న ఈ మెయిళ్లు, మెసేజీల ద్వారా మాత్రమే విషయం తెలుస్తోంది. అందుకు కారణాలైనా చెప్పకపోవడం మరీ దారుణం. ఇది చాలా ఆందోళనకరమైన విషయం. అభ్యంతరకర సోషల్ మీడియా కార్యకలాపాలకు, డాక్యుమెంటేషన్ తప్పిదాలకు, చివరికి ట్రాఫిక్ ఉల్లంఘనలకు కూడా వీసాలు రద్దు చేస్తున్న ఉదంతాలు పెరిగిపోతున్నాయి. చిన్న చిన్న తప్పిదాలకు కూడా ఇంతటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం దారుణం''అంటూ ఆయన ఆక్షేపించారు. ''మీ తీరుతో అమెరికావ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఇది మన దేశానికి కూడా మంచిది కాదు''అని ఆవేదన వెలిబుచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జాతీయ భద్రత పేరిట విదేశీ విద్యార్థుల విషయంలో అమెరికా అత్యంత కఠినంగా వ్యవహరిస్తుండటం తెలిసిందే. ఇప్పటిదాకా కనీసం 300 మందికి పైగా పాలస్తీనా సానుభూతిపరులైన విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్టు రూబియో ఇటీవల వెల్లడించారు. గతంలో ఏ కారణంతోనైనా విద్యార్థి వీసాలను రద్దు చేసినా విద్యాభ్యాసం పూర్తయ్యేదాకా అమెరికాలో ఉండేందుకు వీలుండేది. ఇప్పుడు మాత్రం వీసా రద్దుతో పాటు సెవిస్ రికార్డులను కూడా శాశ్వతంగా తుడిచిపెడుతుండటంతో బాధిత విద్యార్థులు తక్షణం అమెరికాను వీడటం తప్ప మరో మార్గం లేకుండా పోతోంది.

వర్సిటీల్లోనూ ఆందోళన

విద్యార్థి వీసాల రద్దు అమెరికా యూనివర్సిటీలను కూడా ఆందోళనకు గురి చేస్తోంది. చాలాసార్లు ఈ ఉదంతాలు తమ దృష్టికి కూడా రావడం లేదని ప్రఖ్యాత హార్వర్డ్ వర్సిటీ పేర్కొంది. ''మేం స్వయంగా పూనుకుని మా విద్యార్థుల రికార్డులను పరిశీలించాల్సి వస్తోంది. మా వర్సిటీకి చెందిన ముగ్గురు విద్యార్థులతో పాటు ఇటీవలే విద్యాభ్యాసం ముగించుకున్న మరో ఇద్దరి వీసాలను రద్దు చేసినట్టు తెలియగానే వారికి న్యాయ సాయాన్ని సిఫార్సు చేశాం'' అని వెల్లడించింది. అరిజోనా స్టేట్ వర్సిటీలో 50 మంది విదేశీ విద్యార్థులకు ఇదే పరిస్థితి ఎదురైంది. వారి వీసాల రద్దుకు కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. నార్త్ ఈస్టర్న్ వర్సిటీలోనూ 40, కాలిఫోర్నియా వర్సిటీలో 35 మంది విద్యార్థుల వీసాలు కూడా రద్దయ్యాయి. ఇలాంటి పరిస్థితులను గతంలో ఎన్నడూ చూడలేదని మసాచుసెట్స్ వర్సిటీ చాన్స్‌లర్ వాపోయారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

విదేశీ విద్యార్థులే కీలకం

అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో విదేశీ విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024లో వారినుంచి అమెరికాకు ఏకంగా 4,380 కోట్ల డాలర్ల మేరకు ఆదాయం సమకూరినట్టు 'ఓపెన్ డోర్స్'నివేదిక పేర్కొంది. అమెరికా వర్సిటీల్లో ఉన్నతవిద్య పూర్తి చేసుకుంటున్న విదేశీ విద్యార్థులను, ముఖ్యంగా భారతీయులను అమెరికా ఐటీ సంస్థలు కళ్లు చెదిరే వేతనాలిచ్చి మరీ తీసుకుంటున్నాయి. కొన్నేళ్లలోనే ఆ సంస్థలకు వాళ్లు వెలకట్టలేని ఆస్తిగా మారుతున్నారు. 'అమెరికా ఫస్ట్'పేరిట విదేశీ విద్యార్థులపై వేధింపులు ఇలాగే కొనసాగితే ప్రపంచ దేశాల నుంచి అగ్ర రాజ్యానికి దశాబ్దాలుగా కొనసాగుతున్న మేధో వలసకు అడ్డుకట్ట పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది అంతిమంగా అమెరికాకే తీవ్ర నష్టమని అక్కడి విద్యా సంస్థలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.


శుక్రవారం చెన్నై సమావేశంలో పళనిస్వామి, అమిత్ షా

ఎన్డీయేలోకి అన్నాడీఎంకే

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం
- పళనిస్వామి నేతృత్వంలో ఎన్నికల్లో పోటీ: అమిత్ షా

సాక్షి, చెన్నై: వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించాలన్న లక్ష్యంతో ప్రతిపక్ష ఏఐఏడీఎంకే(అన్నాడీఎంకే)ను మళ్లీ ఎన్డీయేలోకి ఆహ్వానించారు. తమిళనాడులో ఎన్డీయేకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి నాయకత్వం వహిస్తారని అమిత్ షా ప్రకటించారు. శుక్రవారం చెన్నైలో అమిత్ షా, పళనిస్వామి సమావేశమయ్యారు. దాదాపు గంటన్నరపాటు చర్చలు జరిపారు. తమిళనాడులో డీఎంకేను గద్దె దింపడమే తమ కర్తవ్యం అని అమిత్ షా స్పష్టం చేశారు. బీజేపీ, అన్నాడీఎంకే కలసి పనిచేస్తాయని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని తెలిపారు. పళనిస్వామి నేతృత్వంలో ఎన్నికల్లో పోరాడుతామని అన్నారు. తమిళనాడులో ఎన్డీయే సర్కారు అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. తమ ముఖ్యమంత్రి అభ్యర్థి పళనిస్వామి అని తేల్చిచెప్పారు.

తమిళనాడు బీజేపీ తదుపరి చీఫ్‌గా నాగేంద్రన్

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా నయనార్ నాగేంద్రన్(64) బాధ్యతల స్వీకారానికి రంగం సిద్ధమైంది. ప్రస్తుత అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీలో జాతీయ స్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. తమిళనాడు పార్టీ అధ్యక్ష పదవికి తిరునల్వేలి ఎమ్మెల్యేగా ఉన్న నాగేంద్రన్ నామినేషన్ మాత్రమే అందిందని శుక్రవారం బీజేపీ అగ్రనేత, హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ప్రస్తుతం తమిళనాడులో పర్యటిస్తున్న ఆయన శుక్రవారం జరిగిన పార్టీ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నామలై కృషిని కొనియాడారు. ఆయనకు జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగిస్తామని అమిత్ షా ప్రకటించారు. త్వరలోనే నాగేంద్రన్ తమిళనాడు బీజేపీ అధ్యక్ష బాధ్యతలు చేపడతారన్నారు.

మాది సబ్ కా వికాస్ వారిది పరివార్ కా వికాస్

ప్రతిపక్షాలపై మోదీ మండిపాటు
- బీజేపీకి అధికార కాంక్ష అసలే లేదని స్పష్టీకరణ
- వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

వారణాసి/అశోక్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై మరోసారి విరుచుకుపడ్డారు. ఆ పార్టీలు కేవలం సొంత కుటుంబాల బాగు కోసమే అధికారం దక్కించుకోవడానికి ఆరాటపడుతున్నాయని విమర్శించారు. బీజేపీ విధానం 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్'అయితే విపక్షాల విధానం 'పరివార్ కా సాత్, పరివార్ కా వికాస్' అని ధ్వజమెత్తారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమంతోపాటు దేశ సమగ్రాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం పని చేస్తోందని ఉద్ఘాటించారు. బీజేపీకి అధికార కాంక్ష లేదని స్పష్టంచేశారు. విపక్ష నాయకులు స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా అధికారం కోసం పాకులాడుతూ రాత్రి పగలు రాజకీయ క్రీడల్లో మునిగితేలుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ శుక్రవారం తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇందులో 130 తాగునీటి పథకాలు, 100 అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, ఒక పాలిటెక్నిక్ కాలేజీ, డిగ్రీ కాలేజీ తదితరాలు ఉన్నాయి. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటిదాకా మోదీ వారణాసికి రావడం ఇది 50వ సారి. నగరంలో బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. తొలుత మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు నివాళులర్పించారు. వారు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పూర్వాంచల్ ఆరోగ్య రాజధాని కాశీ

ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ప్రాంతం గతంలో పూర్తిగా వెనుకబడి ఉండేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్లలో ఎంతగానో అభివృద్ధి సాధించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాశీ నగరం ఇప్పుడు ఈ ప్రాంతానికి ఆరోగ్య రాజధానిగా మారిందన్నారు. ఇక్కడ అత్యుత్తమ వైద్య చికిత్స లభిస్తోందని హర్షం వ్యక్తంచేశారు. 70 ఏళ్లు దాటినవారికి ఉచితంగా చికిత్స అందించడానికి ఆయుష్మాన్ వయ్ వందన కార్డులు పంపిణీ చేస్తున్నామని, అత్యధికంగా వారణాసిలో 50 వేల మందికి ఈ కార్డులు ఇచ్చామని తెలిపారు. కాశీ కేవలం ప్రాచీన నగరమే కాదు, ప్రస్తుతం ప్రగతిశీల నగరంగా మారిందని పేర్కొన్నారు. కాశీ-తమిళ సంగమం గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2036లో వారణాసిలో ఒలింపిక్ క్రీడలు నిర్వహించాలన్న ఆలోచన ఉందని తెలిపారు. అందుకోసం కార్యాచరణ మొదలైందన్నారు. ఈ క్రీడల్లో పతకాలు సాధించడానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని వారణాసి యువతకు పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రధాని మోదీ శుక్రవారం ఉదయం వారణాసికి చేరుకున్న తర్వాత.. ఇటీవల యువతిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. వారణాసిలో 19 ఏళ్ల యువతిపై 23 మంది వ్యక్తులు ఆరు రోజులపాటు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

ఆనంద్‌పూర్ ధామ్‌లో మోదీ పూజలు

ప్రధాని మోదీ శుక్రవారం మధ్యప్రదేశ్ రాష్ట్రం అశోక్‌నగర్ జిల్లాలోని ఆనంద్‌పూర్ ధామ్‌ను దర్శించుకున్నారు. ఇక్కడి గురూజీ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఆనంద్‌పూర్ ట్రస్టు స్థాపించిన ఆనంద్‌పూర్ ధామ్ 315 ఎకరాల్లో విస్తరించి ఉంది. గోశాల నిర్వహణతోపాటు ఆనంద్‌పూర్ ధామ్ చేపడుతున్న ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను ప్రధానమంత్రి ప్రశంసించారు.


పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మోదీ, యోగి


ఉష, జేడీ వాన్స్

భారత్‌కు వాన్స్

- ఏప్రిల్ 21–24 మధ్య పర్యటన
- సతీసమేతంగా రానున్న ఉపాధ్యక్షుడు
- 'సెకండ్‌లేడీ'గా తొలిసారి స్వదేశానికి ఉష

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీసమేతంగా భారత్‌కు వస్తున్నారు. భార్య ఉషా చిలుకూరి వాన్స్‌తో కలిసి ఏప్రిల్ 21 నుంచి మూడు రోజుల పాటు ఆయన భారత్‌లో పర్యటిస్తారని సమాచారం. ఉషవి తెలుగు మూలాలున్న విషయం తెలిసిందే. అమెరికా సెకండ్ లేడీ హోదాలో ఆమె భారత్ రానుండటం ఇదే తొలిసారి. ఆమె తల్లిదండ్రులు అమెరికాలో స్థిరపడటం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు తదితరులతో వాన్స్ భేటీ కానున్నారు. వాణిజ్య తదితర రంగాలకు సంబంధించి ఈ సందర్భంగా వారి మధ్య చర్చలు జరగనున్నాయి. అమెరికా, భారత్ మధ్య కీలక ఒప్పందాలు కూడా కుదిరే అవకాశముంది. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ కూడా ఏప్రిల్ 21–24 తేదీల్లోనే భారత్‌లో పర్యటించనున్నారు. వాన్స్ ఉన్నతస్థాయి చర్చల్లో ఆయన కూడా భాగస్వామి కానున్నారు.

తాజ్‌మహల్ సందర్శన

భారత పర్యటన సందర్భంగా వాన్స్ దంపతులు తాజ్‌మహల్‌ను కూడా వీక్షించనున్నారు. ఆగ్రాతో పాటు జైపూర్‌ను కూడా వాళ్లు సందర్శిస్తారని తెలుస్తోంది.

మెల్‌బోర్న్‌లోని భారత కాన్సులేట్‌పై దాడి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో మెల్‌బోర్న్‌లో ఉన్న భారత కాన్సులేట్ కార్యాలయంపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. గతంలోనూ పలుమార్లు కార్యాలయం గోడల నిండా అభ్యంతర చిత్రాలు, వ్యాఖ్యలు ప్రత్యక్షమయ్యాయి. తాజా ఘటనపై కాన్‌బెర్రాలోని భారత హై కమిషన్ కార్యాలయం అధికారులకు సమాచారం అందించింది. దేశంలోని భారత దౌత్య, కాన్సులేట్ కార్యాలయాలకు, అధికారులకు రక్షణ కల్పిస్తామని ఆస్ట్రేలియా ప్రభుత్వం హామీ ఇచ్చిందని హై కమిషన్ వెల్లడించింది. కార్యాలయం గేటు వద్ద గోడపై అర్ధరాత్రి దాటాక అభ్యంతరకర చిత్రాలు గీసినట్లు తెలుస్తోందని, దీనిపై దర్యాప్తు చేపట్టామని విక్టోరియా పోలీసులు శుక్రవారం తెలిపారు.

గ్రీన్‌హౌస్ ఉద్గారాలపై గ్లోబల్ ట్యాక్స్

షిప్పింగ్ లక్ష్యంగా ఐఎంవో అంగీకారం

లండన్: గ్లోబల్ వార్మింగ్ కట్టడి దిశగా కీలక ముందడుగు పడింది. ఈ దిశగా ప్రపంచ దేశాలు ఒక్కతాటిపైకి వచ్చాయి. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలపై గ్లోబల్ ట్యాక్స్ విధించేందుకు మొట్టమొదటిసారిగా రంగం సిద్ధమైంది. షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు ఇందుకు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం.. నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డయాక్సైడ్‌పై ఇకపై కనీసం 100 డాలర్ల చొప్పున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్ష్యాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం లండన్‌లో 60కిపైగా దేశాలు ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంవో) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐరాస గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతో పాటు వాటి పరిమాణం పెరుగుతుండటం, అందుకు అనుగుణంగా ఇంధన వాడకం విపరీతంగా పెరిగి పోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంవో భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, షిప్పింగ్ ఆధునీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు.


ఆగ్నేయాసియాపై చైనా దృష్టి

మూడు దేశాల్లో జిన్‌పింగ్ పర్యటన

బీజింగ్: అమెరికా టారిఫ్‌ల పోరు నేపథ్యంలో ప్రాంతీయ బంధాలను బలోపేతం చేసుకోవడంపై చైనా దృష్టి పెట్టింది. అధ్యక్షుడు జిన్ పింగ్ వచ్చే వారం మూడు ఆగ్నేయాసియా దేశాల్లో పర్యటించనున్నారు. ఏప్రిల్ 14 నుంచి 15 వరకు వియత్నాంలో, 18 వరకు మలేసియా, కంబోడియాల్లో ఆయన పర్యటిస్తారని చైనా విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. సుంకాల బాదుడు నుంచి ఇతర దేశాలన్నింటికీ 90 రోజుల ఉపశమనం కల్పించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై మాత్రం టారిఫ్‌లు ఎడాపెడా పెంచేసిన నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా వాణిజ్య యుద్ధాన్ని ఎదుర్కోవడంలో కలిసి రావాల్సిందిగా భారత్‌కు కూడా చైనా విజ్ఞప్తి చేసింది.

ప్రజల హక్కుల గురించీ ఆలోచించాలి

ఈడీనుద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రజలకుండే ప్రాథమిక హక్కుల గురించి కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆలోచించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. నాగరిక్ అపూర్తి నిగమ్(ఎన్ఏఎన్) కుంభకోణం కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలంటూ ఈడీ వేసిన ఫిర్యాదుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్ ఎలా వేస్తారంటూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఈడీ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ప్రశ్నించింది. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు భంగం వాటిల్లితే వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించి రక్షణ కోరేందుకు ఆర్టికల్ 32 వీలు కల్పిస్తుంది. ఇదే విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు..ఈడీకి కూడా ప్రాథమిక హక్కులుంటాయంటూ బదులిచ్చారు. అలాగైతే, వ్యక్తులకు కూడా ప్రాథమిక హక్కులుంటాయనే విషయం ఈడీ ఆలోచించాలి కదా..అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషన్ ఉపసంహరించుకునే అనుమతి కోరడంతో ధర్మాసనం సమ్మతించింది. ఈడీ తన హక్కుల కోసం మరో కోర్టుకు వెళ్లొచ్చని సూచించింది. కుంభకోణం ఆరోపణలున్న మాజీ ఐఏఎస్ అనిల్ టుటేజా ముందస్తు బెయిల్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఈడీ గతంలో ఆరోపణలు చేసింది. అంతేకాదు, ఈ కేసులో ఆరోపణలున్న ఉన్నత స్థాయి వ్యక్తులు కొందరు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులోని ఒక జడ్జీతో టచ్‌లో ఉంటూ న్యాయపరమైన వెసులుబాట్లు పొందారని కూడా పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేసును ఢిల్లీకి బదిలీ చేయాలని, ముందస్తు బెయిల్‌ను కూడా రద్దు చేయాలని కోరింది.

క్లుప్తంగా...

సాగర్ నీటి విడుదల ఆపాలి

- కృష్ణాబోర్డుకు తెలంగాణ లేఖ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీటి అవసరాలకు ఇకపై నీటిని విడుదల చేయరాదని కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)ను తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు బోర్డు చైర్మన్‌కు తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) జి.అనిల్‌కుమార్ లేఖ రాశారు. సాగునీటి అవసరాలు తీరినందున.. మిగిలిన నిల్వలను తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని కోరింది. రానున్న జూన్ 30వ తేదీ దాకా తాగునీటి అవసరాల కోసం మాత్రమే ప్రస్తుత నిల్వలను కాపాడుకోవాలని గుర్తు చేసింది. ఇక తాగునీటి అవసరాల కోసం నీటి విడుదలపై తుది నిర్ణయం కృష్ణా బోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ చర్చించాకే నిర్ణయం తీసుకోనుంది. సాగర్‌లో ప్రస్తుతం 140 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

శ్రీ చైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా గుకేశ్



సాక్షి, హైదరాబాద్: శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ గ్రూపు.. భారతీయ చెస్ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చెస్ చాంపియన్ గుకేశ్ దొమ్మరాజును తన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. దేశవ్యాప్తంగా జేఈఈ, నీట్ చాంపియన్లను అందించేందుకే శ్రీచైతన్య, ఇన్ఫినిటీ లెర్న్ సంస్థలు ఈ నిర్ణయం తీసు కున్నాయి. జేఈఈ, నీట్ అభ్యర్థులకు మెంటార్‌గా.. వారు విజ యం సాధించేందుకు కావలసిన వ్యూహాలు, ఒత్తిడి నివారణ పద్ధతులపై మార్గదర్శకునిగా దొమ్మరాజు వ్యవహరిస్తారని ఇన్ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకురాలు, శ్రీ చైతన్య గ్రూపు సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన తెలిపారు. ఆయన భాగస్వామ్యంతో.. విద్యార్థులకు సమగ్ర విద్య అందించడంలో శ్రీ చైతన్య మరింత నిబద్ధతతో వ్యవహరిస్తుందన్నారు.

డామిట్ కథ అడ్డం తిరిగింది

- దొంగతనం చేసిన ఇంటి యజమానినే పట్టించిన సీసీ కెమెరా

సిరిసిల్ల క్రైం: డామిట్ కథ అడ్డం తిరిగింది.. అవును రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిజంగా కథ అడ్డం తిరిగింది. ఇంటి రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా యజమాని దొంగతనం చేయగా పట్టించింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో రాజవ్వ అనే వృద్ధురాలు గురువారం రాత్రి తన కూతురుతో ఇంట్లో నిద్రిస్తోంది. అదే గ్రామానికి చెందిన శేఖర్ వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. మేల్కొన్న వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి దొంగ కోసం గాలించారు. ఇంతలోనే దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి జనంతో కలిసిపోయి వెతికినట్లు నటించి బంగారు గొలుసు దొరికిందని అందరినీ నమ్మించాడు. అసలు దొంగను పట్టుకోవాలని బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు శేఖర్ ఇంటికి ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి అవాక్కయ్యారు. దొంగతనానికి పాల్పడ్డవ్యక్తి గొలుసు దొరికినట్లుగా నాటకమాడాడని గుర్తించారు.

తల్లిపైనే అత్యాచార యత్నం.. కడతేర్చిన తల్లి

ముత్తారం(మంథని): మద్యం మత్తులో తనపై అత్యాచారానికి యత్నించిన కొడుకును ఓ మాతృమూర్తి రోకలిబండతో బాది హతమార్చింది. పెద్దపల్లి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంథని సీఐ రాజు కథనం ప్రకారం.. ముత్తారం మండల కేంద్రానికి చెందిన దంపతుల కుమారుడు మహేశ్ నరేశ్ (33) మద్యానికి బానిసయ్యా డు. దీంతో భార్య అతన్ని వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి నరేశ్.. నిత్యం మద్యం తాగివస్తూ తల్లిదండ్రులను అసభ్య పద జాలంతో తిట్టేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చిన నరేశ్.. గదిలో నిద్రిస్తున్న తల్లిపై అత్యాచారానికి యత్నించాడు. ప్రతిఘటించిన తల్లి పక్కనే ఉన్న రోకలిబండతో తలపై బాదింది. దీంతో నరేశ్ తీవ్ర గాయాలతో కిందపడిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించా రు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మాకే నకిలీ కాపీలు సమర్పిస్తారా?

- ప్రైవేట్ వ్యక్తి తాహెర్ ఖాన్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం
- ఈ అంశంపై సిట్‌ను ఏర్పాటు చేయాలని సర్కారుకు స్పష్టీకరణ
- 100 ఎకరాల భూ వివాదంలో ధర్మాసనం చర్యలు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని దాదాపు 100 ఎకరాల భూమికి సంబంధించి అనుకూల ఉత్తర్వులు పొందడం కోసం న్యాయస్థానం ఇచ్చిందంటూ నకిలీ ఆదేశాల కాపీలను తమకు సమర్పించడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ప్రైవేట్ పార్టీపై చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్–1)కు స్పష్టం చేసింది. మొత్తం ఈ అంశంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేయాలని, వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ భూములకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోకుండా సంబంధిత అధికారులందరికీ ఆదేశాలు ఇచ్చేలాగా విషయాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని రిజిస్ట్రార్‌కు సూచించింది. సాధారణ ప్రజలు ఆ భూములను కొనకుండా హైకోర్టు వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలని తెలిపింది. సదరు భూమిపై యథాతథ స్థితి ఉత్తర్వులు అమల్లో ఉంటాయని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



జస్టిస్ వినోద్‌కుమార్ పరిశీలనతో...

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని సర్వే నంబర్లు 661, 662, 663, 664, 720, 721, 724, 725, 726, 727, 728, 729, 730, 731, 732, 775లోని భూ వివాదంపై సివిల్ కోర్టులో సూట్ దాఖలైంది. ఈ కేసులో హైదరాబాద్‌లోని జహానుమాకు చెందిన మహమ్మద్ తాహెర్ ఖాన్‌కు అనుకూలంగా సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హెచ్ఎండీఏ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఈ కేసు గత విచారణ సందర్భంగా ప్రైవేట్ పార్టీ దాఖలు చేసిన కోర్టు ఆదేశాల కాపీ కల్పితమని ధర్మాసనం గుర్తించింది. జస్టిస్ ఎన్‌డీ పట్నాయక్ నేతృత్వంలోని బెంచ్ 1988 ఏప్రిల్ 29న ఆ ఉత్తర్వులు జారీ చేసినట్లు కాపీలో ఉండటాన్ని జస్టిస్ వినోద్‌కుమార్ గమనించి దాన్ని తప్పుడు కాపీగా తేల్చారు. 1988లో తాను న్యాయవాదిగా చేరానని.. అదే సంవత్సరం డిసెంబర్ 28న ఎన్‌డీ పట్నాయక్ న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారని చెప్పారు. ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేసే పరిస్థితే లేదన్నారు. అలాగే ప్రైవేట్ పార్టీలు సమర్పించిన ఇతర డాక్యుమెంట్లు, కాపీలు కూడా నకిలీవేనని న్యాయమూర్తి గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక సమర్పించేందుకు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్–1)ను నియమించారు. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి ఇచ్చినట్లు సమర్పించిన మరో ఉత్తర్వుల కాపీ కూడా కల్పితమేనని రిజిస్ట్రార్ తేలుస్తూ గత నెల సీల్డ్ కవర్‌లో నివేదిక అందజేశారు. ఈ నివేదికను పరిశీలించిన జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్, జస్టిస్ పి. శ్రీసుధ ధర్మాసనం శుక్రవారం అప్పీల్‌పై మరోసారి విచారణ చేపట్టింది. హెచ్ఎండీఏ తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. కల్పిత ఉత్తర్వుల కాపీలను సమర్పించడాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ప్రైవేట్ పార్టీపై క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తూ భూములపై స్టేటస్‌కో ఆదేశాలు జారీ చేసింది.

నల్లమలలో సలేశ్వరం జాతర షురూ

- మొదటి రోజు లింగమయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు



శుక్రవారం నల్లమలలోని సలేశ్వర లింగమయ్య దర్శనానికి వచ్చిన భక్తులు

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమలలోని సలేశ్వరం జాతర శుక్రవారం ప్రారంభమైంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్న సలేశ్వరం లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఈ నెల 13 వరకు భక్తులకు అవకాశం కల్పించగా, గురువారం రాత్రి నుంచే ఫర్హాబాద్ చెక్‌పోస్టు వద్ద వాహనాలతో భక్తులు బారులు తీరారు. మొదటి రోజున లింగమయ్యను సుమారు 70 వేలమంది భక్తులు దర్శించుకున్నారు.

- లింగమయ్య దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్ ఛాతీనొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అచ్చంపేటలోని ఆస్పత్రికి తరలించారు.

రాజీవ్ యువ వికాసం సర్వర్ డౌన్

- వివరాల నమోదుకు తప్పని ఇబ్బందులు
- 14తో ముగియనున్న దరఖాస్తు గడువు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసే క్రమంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచూ సర్వర్‌డౌన్ అవుతోంది. దీంతో దరఖాస్తుదారులు సతమతం అవుతున్నారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిన మూడు వారాల వ్యవధిలో ఏకంగా 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే నాలుగైదు రోజులుగా ఈ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలతో దరఖాస్తు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. వెబ్‌సైట్ తెరిచి వివరాలు నమోదు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా వెబ్‌పేజీ నిలిచిపోతోంది. ఎంతసేపటికీ పేజీ ముందుకు సాగకుండా స్తంభించిపోతోంది. దీంతో తిరిగి వెబ్‌సైట్‌ను తెరిచి దరఖాస్తు ప్రక్రియ మొదట్నుంచి ప్రారంభించాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తు ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. యువ వికాసం పథకం దరఖాస్తు ప్రక్రియ ఈనెల 14వ తేదీతో ముగియనుంది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దరఖాస్తుదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, గడువు పొడిగింపు లేదని, ఇప్పటికే ఒకసారి గడువు పొడిగించి అవకాశం కల్పించినట్టు చెప్పుకొస్తున్నారు.


వరుస సెలవులు : గడువు ముగిసేలోగా 20 లక్షల దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేసినా, సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల జోరుకు బ్రేక్ పడింది. మరోవైపు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రభుత్వ సెలవులు ఎక్కువగా వచ్చాయి. ఉగాది, రంజాన్, జగ్జీవన్ రామ్ జయంతి, రెండో శనివారం, అంబేడ్కర్ జయంతి ఇలా ఏడు రోజులకు పైబడి సెలవులు వచ్చాయి. దీంతో రెవెన్యూ సేవల్లో జాప్యం నెలకొంది.

ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తుల సంఖ్య ఇలా...

కేటగిరీ	దరఖాస్తులు
రూ.50 వేల వరకు	23,724
రూ.50 వేల నుంచి రూ లక్ష వరకు	57,166
రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు	1,73,401
రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు	8,73,230

‘మా బడికి సహకరించండి’

- పోస్టుబాక్సుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉత్తరాలు



తల్లిదండ్రులకు రాసిన ఉత్తరం

కురవి: ‘మా ప్రభుత్వ బడికి సహకరించండి’ అంటూ విద్యార్థులు తల్లిదండ్రులకు ఉత్తరాలు రాసి పోస్టు చేసిన సంఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల గ్రామంలో జరిగింది. స్థానిక ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం కోసం నూతన విద్యార్థుల నమోదు కోసం తల్లిదండ్రులకు ఉత్తరాలు రాశారు. ‘మా ప్రభుత్వ బడిలో అన్ని సౌకర్యాలున్నాయి. చదువుతోపాటు ఆటలు, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో మేం ముందుంటున్నాం. కాబట్టి మీరు పాఠశాల గురించి మన ఇరుగుపొరుగు వారికి తెలియచేసి వారి పిల్లల్ని మా పాఠశాలలో చేర్పించేలా ప్రోత్సహించండి’ అంటూ ఉత్తరాల ద్వారా తెలియజేస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. పాఠ్యాంశానికి అనుగుణంగా, కనుమరుగైన ఉత్తరాలు, వాటిని రాసే విధానాన్ని, పోస్టాఫీస్ విధులు, వాటి వినియోగం గురించి తెలియజేస్తూ పాఠశాల 4, 5వ తరగతుల విద్యార్థులతో ఉత్తరాలు రాయించి ప్రచారం చేయించామని హెచ్ఎం తేలుకుంట్ల సునీత తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.మమత, వి.జ్యోతి, టి.రామారావు పాల్గొన్నారు.

కన్నబిడ్డనే నరబలి ఇచ్చిన తల్లికి ఉరిశిక్ష

సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కోర్టు సంచలన తీర్పు

చివ్వెంల (సూర్యాపేట): మూఢ నమ్మకం కోసం పేగు బంధాన్ని మరిచి ఏడు నెలల పసిబిడ్డను నరబలి ఇచ్చిన ఓ కిరాతక తల్లికి సూర్యాపేట జిల్లా కోర్టు ఉరిశిక్ష విధిస్తూ శుక్రవారం సంచలన తీర్పు చెప్పింది. సర్పదోష నివారణ పేరుతో కుమార్తెను గొంతు, నాలుక కోసి హతమార్చిన ఆమెకు మరణదండన విధించడమే సరైనదని పేర్కొంది. ఆమె నేరం అత్యంత అరుదైన వాటిలోకెల్లా అరుదైన కోవకు చెందుతుందని తెలిపింది. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తి ఎం.శ్యామ్‌శ్రీ తీర్పు వెలువరించారు. దోషికి ఉరిశిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే అదనంగా 3 నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. కన్నబిడ్డను చంపిన ఆమె భర్తను సైతం హతమార్చేందుకు ప్రయత్నించిన కేసులో సీనియర్ సివిల్ కోర్టు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధించిన రెండు రోజుల వ్యవధిలోనే ఈ తీర్పు వెలువడటం గమనార్హం.

ఏం జరిగిందంటే..: సూర్యాపేట జిల్లా మోతె మండలం బుర్కచర్ల గ్రామంలోని మేకలపాటి తండాకు చెందిన కృష్ణ, భారతి ప్రేమించుకున్నారు. అయితే వారి పెళ్లికి పెద్దలు నిరాకరించి భారతికి 2008లో వేరే వ్యక్తితో పెళ్లి చేశారు. ఆ పెళ్లి ఇష్టంలేని భారతి భర్త నుంచి విడిపోయి 2019 జూన్‌లో కృష్ణను వివాహం చేసుకుంది. వారికి ఒక కుమార్తె జన్మించింది. ఆ చిన్నారికి పేరు పెట్టక పోవడంతో పొట్టి (7 నెలలు)గా పిలుస్తున్నారు. అయితే పెళ్లికి ముందు ఆమెకు సర్పదోషం ఉందని ఒక జ్యోతిషుడు చెప్పడంతో అప్పటి నుంచి భారతి రకరకాల పూజలు చేస్తూ వస్తోంది. భార్య ఇంటి పనుల్ని సైతం పట్టించుకోకుండా పూజల్లో మునిగిపోతుండటంతో భర్త కృష్ణ తన కుమార్తెను తల్లికి అప్పగించి వ్యవసాయ పనులకు వెళ్లేవాడు. చివరకు భారతి ప్రవర్తనపట్ల విసుగు చెంది భర్త, అత్తమామలు ఆమెను ఖమ్మంలోని ఓ మానసిక వైద్యుడికి చూపించారు. అయినా ఆ మందులు వాడని భారతి.. మంత్ర శక్తులతో తన ఆరోగ్యాన్ని బాగుచేసుకుంటానని చెప్తూ పూజలు చేసేది.

ఇంట్లో భర్తలేని సమయం చూసి..

ఈ క్రమంలో 2021 ఏప్రిల్ 15న కృష్ణ ఆత్మకూర్ (ఎస్) ఏపూరు గ్రామానికి చెందిన తన అక్కకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆమె వద్దకు వెళ్లగా అత్త పొలం పనులకు వెళ్లింది. వృద్ధుడైన మామ ఇంట్లో పడుకొని ఉండటంతో తన సర్పదోష నివారణకు ఇదే సరైన సమయమని భావించిన భారతి.. తన కుమార్తెను కిరాతకంగా నాలుక, గొంతు కోసి హత్య చేసి పుట్టింటికి పరారైంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా భారతి అన్న రవి వెంటనే కృష్ణకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. కృష్ణ హుటాహుటిన ఇంటికి వెళ్లి చూడగా చిన్నారి రక్తపు మడుగులో పడి ఉంది. వెంటనే సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కృష్ణ ఫిర్యాదుతో పోలీసులు భారతిని అరెస్టు చేసి జైలుకు పంపారు. కీలక ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి పక్కాగా చార్జిషీట్ నమోదు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్ వాదనలతో ఏకీభవిస్తూ భారతికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. భారతి తన భర్త కృష్ణపై 2023లో హత్యాయత్నం చేయగా కేసు నమోదైంది. ఆ కేసులో నిందితురాలు భారతికి సీనియర్ సివిల్ కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ రెండు రోజుల క్రితమే తీర్పు చెప్పడం గమనార్హం.

భర్తను చంపేందుకూ ప్రయత్నం..

కన్నబిడ్డను చంపిన కేసులో జైలుపాలై బెయిల్‌పై విడుదలైన భారతి 2023లో తన భర్త కృష్ణను సైతం హతమార్చేందుకు ప్రయత్నించింది. వ్యవసాయ పనులు చేసుకొని ఇంట్లో నిద్రిస్తున్న భర్తపై బండరాయితో దాడి చేసింది. అతను కేకలు వేయడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు వచ్చి ఆమెకు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రెండ్రోజుల క్రితమే భారతికి ఏడాది జైలుశిక్ష పడింది.

తండ్రి మందలించాడని..

- కర్రతో దాడి చేసి చంపిన తనయుడు



కనకయ్య

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతుండటంతోపాటు తమ కుటుంబంతో సత్సంబంధాలు లేని వ్యక్తులతో మాట్లాడటం నచ్చని తండ్రి మందలించగా.. కోపోద్రిక్తుడైన కొడుకు కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో తండ్రి ప్రాణాలు కోల్పోగా.. కొడుకు పరారీలో ఉన్నాడు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఒడ్డెరకాలనీకి చెందిన కుంచెపు కనకయ్య (50)కు కుమారుడు కుంచెపు పర్శరాములు ఉన్నాడు. వీరి ఇంటి సమీపంలోనే ఓ శుభకార్యం జరిగింది. ఆ శుభకార్యం జరిగిన కుటుంబంతో కనకయ్య కుటుంబానికి మాటలు లేకపోయినా.. పర్శరాములు వెళ్లాడు. దీంతో వారికి మనకు మాటల్లేవని, ఎందుకు వెళ్లావని తండ్రి కోపోద్రిక్తుడయ్యాడు. పనిపాటా లేకుండా తిరుగుతున్నావని మందలించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కొడుకు కర్రతో తండ్రి కనకయ్యపై దాడి చేశాడు. బలమైన దెబ్బ తగలడంతో మెడ నరాలు చిట్లిపోయి, అక్కడే కుప్పకూలిన కనకయ్యను కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కాగా, నిందితుడు పర్శరాములు గతంలో కరెంట్‌షాక్‌లు పెడుతూ చేపలు పడుతూ దొరకడంతో పోలీసులు రెండుసార్లు కేసులు నమోదు చేశారు. కొంతకాలం జైలులో ఉండి బయటకొచ్చాడు. పర్శరాములుపై హత్య కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎకరాకు రూ.10 వేలు పరిహారం

- పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి తుమ్మల భరోసా
- మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబులతో కలిసి ఇబ్రహీంనగర్, వెంకటాపూర్‌లో పంటల పరిశీలన



ఇబ్రహీంనగర్‌లో దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం

చిన్నకోడూరు(సిద్దిపేట): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిబంధనల ప్రకారం ఎకరానికి రూ.6 వేలు ఇవ్వాలని, అయితే రూ.10 వేల వరకు ఇస్తామని చెప్పారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్, నంగనూరు మండలం వెంకటాపూర్ గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, మిరప పంటలను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆందోళన అవసరం లేదని రైతులకు భరోసా ఇచ్చారు. మీ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు నష్టపోయిన పంటలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో లేని వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. నర్మెట్టలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పరిశీలించిన తుమ్మల..దేశంలో పామాయిల్ కొరతతో కోట్లాది రూపాయలను విదేశాలకు చెల్లిస్తున్నామని చెప్పారు. దేశంలోనే ఆత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఇది అని పేర్కొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ క్షీర విప్లవం తెచ్చిన కురియన్ ఎలాగో ఆయిల్‌పామ్‌లో తుమ్మల అట్లా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కలెక్టర్ మనుచౌదరిలు పాల్గొన్నారు.

22 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్

ములుగు: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 22 మంది సభ్యులు శుక్రవారం లొంగిపోయినట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వీరిలో ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం యాకన్నగూడేనికి చెందిన మడవి మాస.. 2021 ఏప్రిల్‌లో టేకులగుర్కా గ్రామంలో పోలీసులపై దాడిచేసిన ఘటనతోపాటు పలు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మల్లంపేటకు చెందిన ముచ్చకి జోగారామ్, 2017 ఏప్రిల్‌లో బుర్కపాల్ గ్రామం వద్ద 25 మంది జవాన్లు మృతి చెందిన సంఘటనలో బాధ్యుడిగా ఉన్నట్లు వివరించారు. బీజాపూర్ జిల్లా తుమ్మిరిగూడ గ్రామానికి చెందిన తాటి జోగా, 2021లో టేకులగూడెం వద్ద దాడిలో 22 మంది జవాన్లు మృతి చెందిన సంఘటనలో పాల్గొన్నట్లు చెప్పారు.

బనకచర్లను అడ్డుకోండి

గోదావరి బోర్డు, పోలవరం అథారిటీ, సీడబ్ల్యూసీకి తెలంగాణ సర్కారు లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు నిర్మాణం ముందుకెళ్లకుండా ఆపాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) అనిల్‌కుమార్ శుక్రవారం గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)కు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి, కేంద్ర జల వనరుల సంఘానికి (సీడబ్ల్యూసీ) లేఖ రాశారు.

డీపీఆర్‌ను గోదావరి బోర్డు పరిశీలించాలి

‘పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి 200 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా రూ.80,112 కోట్లతో గోదావరి– బనకచర్ల అనుసంధానం చేపట్టారు. దీనికోసం ఈ నెల 3వ తేదీన ‘జలహారతి కార్పొరేషన్’ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి వీలుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గోదావరిలో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నా సంబంధిత డీపీఆర్‌ను విధిగా గోదావరి బోర్డు పరిశీలించాల్సి ఉంటుంది.

అనుమతుల్లేకుండా నిర్మాణానికి వీల్లేదు: కేంద్ర జల వనరుల కమిషన్, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి వీల్లేదు. బచావత్ ట్రిబ్యునల్ (గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్) తీర్పు ప్రకారం పోలవరం కుడి, ఎడమ కాలువల నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించడానికే అనుమతి ఉంది. పోలవరం కుడికాలువ సామర్థ్యం 10 వేల క్యూసెక్కులు మాత్రమే ఉండాల్సి ఉండగా.. కుడి కాలువ కింద రెండు సొరంగాల ద్వారా ఒక్కో సొరంగం నుంచి 20 వేల క్యూసెక్కులు కలిపి మొత్తం 40 వేల క్యూసెక్కులు తరలించడానికి వీలుగా పనులు చేపడుతున్నారు. సీడబ్ల్యూసీ నేతృత్వంలోని సాంకేతిక సలహా మండలి (టీఏసీ) అనుమతుల ప్రకారం పోలవరం ప్రాజెక్టు ద్వారా 449.78 టీఎంసీలకు మించి తరలించడానికి వీల్లేదు. కానీ అంతకు మించి నీటిని తరలించడానికి వీలుగా కొత్తగా నిర్మాణ పనులు చేపడుతున్నారు.

‘పల్నాడు ప్రాజెక్టు’ చేపట్టారు..: ఇక గోదావరి –బనకచర్ల లింక్‌లో భాగంగానే పల్నాడు డ్రైట్ మిటిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దీని కోసం ఇప్పటికే రూ.1,019.41 కోట్లు వెచ్చించారు. పోలవరం నుంచి 200 టీఎంసీల నీటిని తరలించి..బొల్లాపల్లిలో నిర్మించే భారీ రిజర్వాయర్‌లో నిల్వ చేసి, అక్కడి నుంచి సొరంగాల ద్వారా శ్రీశైలం కుడి ప్రధాన కాలువకు చెందిన బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కి తరలించాలనేది ఏపీ లక్ష్యం. దీన్ని తక్షణమే అడ్డుకోవాలి..’ తెలంగాణ తన లేఖలో విజ్ఞప్తి చేసింది.

ఎమ్మెల్యే భక్తి గానలహరి



పాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గాయకుడిగా అలరించారు. పూర్వాశ్రమంలో ఉపాధ్యాయుడైన ఆయన.. దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో శుక్రవారం పర్యటించారు. అదే సమయంలో రామాలయంలో ప్రత్యేక పూజలకు హాజరైన అయ్యప్ప భక్తులు భజన నిర్వహిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆదినారాయణ కూడా వారితో చేరి.. ‘పార్వతి తనయా.. గణపతి దేవా’అంటూ వివిధ భక్తిపాటలు పాడి ఆకట్టుకున్నారు.

పాఠశాలకు వెళ్లమన్నందుకు బాలిక ఆత్మహత్య

సారంగాపూర్: పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించినందుకు పదేళ్ల బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కందెనకుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కందెనకుంటకు చెందిన గడ్డం వెంకటేశ్–రజిత గ్రామంలో గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కూతురు వైష్ణవి (10) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. రెండ్రోజులుగా స్కూల్‌కు వెళ్లడం లేదు. దీంతో స్కూల్‌కు ఎందుకు వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారు. అనంతరం గేదెలను మేపడానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వైష్ణవి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుంది. తల్లిదండ్రులు వచ్చి చూడగా.. చనిపోయి ఉంది. తన కూతురు మృతిలో ఎలాంటి అనుమానం లేదని వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు పంచాయితీ తేలేదెన్నడు?



స్కూళ్లలో తెలుగు పాఠ్యపుస్తకంపై తేలని పంచాయితీ.. 9వ తరగతి నుంచి తెలుగును తప్పనిసరి చేసిన రాష్ట్రప్రభుత్వం

సింగిడి పుస్తకం సిఫార్సు చేసిన ఎన్‌సీఈఆర్‌టీ.. వెన్నెల పుస్తకం అనుసరించాలంటున్న ఎస్‌సీఈఆర్‌టీ

ఇంతవరకూ భేటీ అవ్వని కమిటీలు.. పుస్తకాల ప్రచురణలో మరింత జాప్యం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విద్యా సంస్థల మధ్య తెలుగు పంచాయితీ ఎటూ తేలటంలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో 9వ తరగతి నుంచి తెలుగు సబ్జెక్టును రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సిలబస్ తీసుకున్న విద్యార్థులు కూడా తెలుగును చదవాల్సి ఉంటుంది. అయితే, అందుకోసం ఏ పాఠ్యపుస్తకాన్ని అనుసరించాలనే అంశంపై ఇంతవరకూ స్పష్టత ఇవ్వలేదు. దీంతో పాఠ్య పుస్తకాల ముద్రణ ప్రక్రియ కూడా మొదలవ్వ లేదు. మరోవైపు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయడాన్ని సీబీఎస్‌ఈ విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం ఇందిరా పార్కు వద్ద ధర్నా కూడా చేశారు.

అసలు సమస్య ఏమిటి..?

విద్య రాజ్యాంగంలోని ఉమ్మడి జాబి తాలో ఉండటంతో వివిధ స్థాయిల్లో సిలబస్‌ను జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ), రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) కలిసి రూపొందిస్తుంటాయి. ఎన్‌సీఈఆర్‌టీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్‌సీఈఆర్ టీ రాష్ట్ర పరిధిలో పాఠ్యాంశాలను స్థానికతకు అనుగుణంగా తయారు చేస్తుంది. సీబీఎస్‌ఈ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలను ఎన్‌సీఈఆర్‌టీ రూపొందిస్తుంది. ఇప్పుడు తెలుగును తప్పనిసరి చేయడంతో కేంద్ర, రాష్ట్ర సంస్థలు కలిసి పాఠ్యాంశాలను రూపొందించాల్సి ఉంది. ఈ క్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ 089 కోడ్ ఉన్న పాఠ్య పుస్తకాన్ని సిఫార్సు చేసింది. దీని ప్రకారం 'సింగిడి'పుస్తకాన్ని అనుసరించాలని సూచి ంచింది. రాష్ట్రంలో విద్యార్థులకు మాత్రం ఎస్‌సీఈఆర్‌టీ 'వెన్నెల' పాఠ్యపుస్తకాన్ని సిఫార్సు చేస్తోంది. దీంతో దేన్ని ఎంపిక చేస్తారనే అయోమయం నెలకొంది.

ఏ పుస్తకంలో ఏముంది?

రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే వెన్నెల తెలుగు పాఠ్య పుస్తకం తెలుగు విద్యార్థులకు సులభంగా ఉంటుంది. స్థానిక భాష, సామెతలు, వాడుక భాష పదాలు, తేలికగా అర్థమయ్యే వ్యాకరణం ఇందులో ఉంటాయి. ఇది స్థానిక పరిస్థితుల నుంచి రూపొందించింది. గ్రామీణ తెలుగు విద్యార్థి తేలికగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. ఎన్‌సీఈఆర్‌టీ సూచించే సింగిడి పాఠ్య పుస్తకంలో ప్రతీ పాఠం విశ్లేషాత్మకంగా, ఇంటర్ ఆపై స్థాయి విద్యార్థులకు బోధించేలా ఉంటుంది. జాతీయ స్థాయిలో మాట్లాడే వివిధ భాషల పదాలను సింగిడి ద్వారా తెలుగులోకి తీసుకొచ్చినట్టు చెబుతున్నారు. దీన్ని తెలుగు గ్రామీణ విద్యార్థులు తేలికగా అర్థం చేసుకోవడం కష్టమంటున్నారు. దీన్ని ప్రవేశ పెడితే తెలుగు భాషలోనే చాలామంది విద్యార్థులు కనీస మార్కులు పొందడం కష్టమనే ఆందోళన వ్యక్తమవుతుంది. సీబీఎస్‌ఈ విద్యార్థుల నుంచి వెన్నెల పుస్తకంపై ఇదే స్థాయి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇతర రాష్ట్రాలవారు కూడా వారి పిల్లలను తెలంగాణలో చదివిస్తున్నారు. వాళ్లకు స్థానిక భాషతో తెలుగు చదవడం కష్టమని అంటున్నారు.

కుదరని ఏకాభిప్రాయం

పాఠ్య పుస్తకం ఎంపికపై ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు ముందుగా కమిటీలు ఏర్పాటు చేయాలి. సిలబస్, పాఠ్యాంశాలు, అందులో చేర్పులు, మార్పులపై చర్చించి ఓ నిర్ణయానికి రావాలి. ఆ తర్వాత పాఠ్యపుస్తకాలను ఖరారు చేస్తారు. అయితే, రెండు సంస్థలు మొండి పట్టు దలకు పోవటంతో ఇంతవరకూ సమా వేశం జరగలేదు. రాష్ట్రంలో 450 సీబీఎస్‌ఈ పాఠశాలలున్నాయి. వీటిల్లో 50 వేలకు పైగా విద్యా ర్థులు చదువుతు న్నారు. రెండు సంస్థల పంచాయితీ కారణంగా విద్యా ర్థుల్లో ఆందోళన పెరుగుతోంది. పాఠ్యపుస్త కాలపై స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండో భాషను ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలి..

గుజరాత్ నుంచి ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చాం. మా పిల్లలకు తెలుగు రాదు. అయినా తెలుగు భాషను తప్పనిసరి చేస్తామంటున్నారు. ఇది ఇబ్బంది కాదా? ద్వితీయ భాషను ఎంచుకునే స్వేచ్ఛ ఇవ్వాలి.

– పల్లవ్ ఉజ్వల్, సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థి తల్లి.

సింగిడి పుస్తకం తెలుగు విద్యార్థులకు కష్టం..

సింగిడి పాఠ్యపుస్తకం జాతీయ ప్రామాణికతను దృష్టిలో పెట్టుకుని రూపొందించింది. దీన్ని మన రాష్ట్ర విద్యార్థులపై రుద్దితే నష్టపోతారు. ఇంటర్ ఆపైస్థాయిలో ఉండే వ్యాకరణం ఇందులో ఉంటుంది. గ్రామీణ విద్యార్థులు అంత తేలికగా అర్థం చేసుకునేలా లేదు. మనవాళ్లకు వెన్నెల సులభం. సీబీఎస్‌ఈ విద్యార్థులు కాస్త కష్టపడితే వెన్నెల పుస్తకాన్ని అనుసరించడం కష్టమేమీ కాదు.

– వసంత్‌కుమార్, తెలుగు టీచర్, హైదరాబాద్.

ఖజానాకు భూమ్..

▶ మొదటి పేజీ తరువాయి

రూ.21 వేల కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలుస్తోంది. టీజీఐఐసీ కొన్నిసార్లు సొంతగా, మరికొన్ని సందర్భాల్లో హెచ్‌ఎండీఏతో కలిసి భూములు వేలం వేయడంతో పాటు పరిశ్రమలకు భూముల కేటాయింపులు జరిపింది. 2014–2023 మధ్యకాలంలో హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ ద్వారా వివిధ సందర్భాల్లో 811 ఎకరాలను వేలం వేయడం లేదా కేటాయింపుల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. తద్వారా రూ.21వేల కోట్ల ఆదాయం సమకూర్చుకున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

వాణిజ్యం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి పేరిట.. హైదరాబాద్ పరిసరాల్లోని కోకాపేట, ఖానా మెట్ భూములు వేలం వేయడం ద్వారా రూ.10 వేలు కోట్లు సమీకరణ లక్ష్యంగా 2019లో సన్నాహాలు ప్రారంభించారు. ఈ మేర కు 2023లోనే జరిగిన భూముల వేలం ద్వారా రూ.2,729 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్రంలో వాణిజ్యం, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధి కోసం ఈ భూములను వేలం వేస్తున్నట్లు అప్పట్లో ప్రకటించారు. వేలం ద్వారా సమకూరిన నిధులను రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి, హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు కోసం వెచ్చించినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

400 ఎకరాల తనఖాతో..: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంచ గచ్చిబౌలి సర్వే నంబరు 25(పి)లోని 400 ఎకరాలను ఐసీఐసీఐ బ్యాంకుకు తనఖా పెట్టి రూ.10 వేల కోట్ల రుణ సమీకరణ చేసినట్లు అధికార వర్గాల సమాచారం. రైతు భరోసా ఇచ్చేందుకు ఈ నిధులు వెచ్చిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత తాకట్టులో ఉన్న ఇవే భూములను అభివృద్ధి చేసి వేలం వేయడం ద్వారా రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల మేర నిధులు సమీకరించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలే తాజాగా పెద్దయెత్తున వివాదానికి కారణమయ్యాయి. అయితే 400 ఎకరాలు తాకట్టు పెట్టుకుని తాము ఎలాంటి రుణం ఇవ్వలేదని ఐసీఐసీఐ తాజాగా పేర్కొనడం గమనార్హం.

టాప్‌లో టీజీఐఐసీ

పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో దేశంలోని అనేక రాష్ట్రాలు మౌలిక సదుపాయాల సంస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. ఇదే తరహాలో రాష్ట్రంలో టీజీఐఐసీ ఏర్పాటైంది. అయితే దేశంలోని ఇతర సంస్థలతో పోల్చుకుంటే టీజీఐఐసీ వద్ద అత్యధికంగా సుమారు లక్షన్నర ఎకరాల ల్యాండ్ బ్యాంకు ఉన్నట్టు సమాచారం. ల్యాండ్ బ్యాంకు పరంగా చూస్తే తెలంగాణ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (ఎంఐడీసీ- 48,437 ఎకరాలు), తమిళనాడు (సిప్‌కాట్- 48,198 ఎకరాలు) ఉన్నాయి. వీటితో పాటు ఏపీ, గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్తా న్, మధ్యప్రదేశ్, హరియాణా రాష్ట్రాల పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థలు గణనీయంగా ల్యాండ్ బ్యాంక్‌లను కలిగి ఉన్నాయి.

మేడ్చల్ -సిద్దిపేట జోన్‌లో ఏకంగా 42,431 ఎకరాలు: టీజీఐఐసీ పరిధిలో సైబరాబాద్, మేడ్చల్-సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, పటాన్‌చెరు, శంషాబాద్, యాదాద్రి, ఖమ్మం, వరంగల్.. ఇలా 9 పారిశ్రామిక జోన్లు ఉన్నా యి. అయితే ఒక్క మేడ్చల్- సిద్దిపేట జోన్‌లోనే ఏకంగా 42,431 ఎకరాలు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ లెక్కల ప్రకారం తెలంగాణలో 71,613 ఎకరాల్లో ఐటీ, పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిలో 53,550 ఎకరాల్లో ఐటీ, ఐటీ అనుబంధ సేవలకు చెందిన సంస్థలు ఉన్నా యి. 2,634 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ సంస్థలు, మరో 10,039 ఎకరాల్లో రక్షణ, ఏరోస్పేస్, ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్స్, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ రంగాలకు చెందిన పరిశ్రమలు ఉన్నాయి.

వివాదాల వలయంలో..: ప్రభుత్వ ఖజానాకు నిధులు సమకూర్చే క్రమంలో టీజీఐఐసీ తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోందనే అభిప్రాయం ఉంది. తాజాగా కంచ గచ్చిబౌలి భూముల వేలం సన్నాహాలు వివాదాస్పదం అయ్యాయి. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఇతర విద్యార్థి సంఘాలు, పర్యావరణ వేత్తలు, పౌరసమాజం, విపక్ష పార్టీలు పెద్దయెత్తున ఉద్యమించడానికి కారణమయ్యాయి. చివరకు వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. అలాగే పారిశ్రామిక క్లస్టర్లు, ఫార్మా విలేజీల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఫార్మాసిటీకి అవసరమైన భూముల సేకరణ సమయంలో, ఇటీవల లగచర్లలో ఫార్మా క్లస్టర్ కోసం భూ సేకరణ ప్రయత్నాల సమయంలో పెద్దయెత్తున వివాదాలు చెలరేగిన విషయం విదితమే. టీజీఐఐసీ కేవలం పారిశ్రామిక అవసరాల కోసమే కాకుండా.. భారీ ఎత్తున గృహ సముదాయాలు నిర్మించే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూములు విక్రయించడం ద్వారా కూడా ప్రభుత్వ ఖజానాకు నిధులు సమకూరుస్తోంది.

తాకట్టు రుణం ఇవ్వలేదు: ఐసీఐసీఐ

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని తనఖా పెట్టుకుని రుణం ఇవ్వడంపై ఐసీఐసీఐ బ్యాంకు కొత్త ట్విస్ట్ ఇచ్చింది. టీజీఐఐసీకి తామెలాంటి తాకట్టు రుణం ఇవ్వలేదని ఐసీఐసీఐ బ్యాంకు అధికార ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'టీజీఐఐసీ మా వద్ద ఎట్టి స్థలాన్ని మార్టిగేజ్ చేయలేదని స్పష్టంగా తెలియజేయదల్చుకున్నాము. మేము కేవలం బాండ్ల జారీ ద్వారా వచ్చే నిధుల స్వీకరణ, వడ్డీ చెల్లింపునకు సంబంధించి టీజీఐఐసీకి అకౌంటు బ్యాంకుగా మాత్రమే వ్యవహరించాము..'అని అందులో తెలిపారు.

ఏం చేద్దాం.. ఏం చెబుదాం?

'కంచ గచ్చిబౌలి'పై సుప్రీంకోర్టుకు ఇవ్వాల్సిన నివేదికపై సర్కారు కసరత్తు

సీఎస్ నేతృత్వంలో వివిధ ప్రభుత్వ శాఖల సమాలోచనలు

ప్రభుత్వ వాదనను బలపరిచే అంశాలను పొందుపరచడంపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టుకు ఇచ్చే నివేదికలో ఏయే అంశాలను పొందుపరచాలి, ఏయే విషయాలపై స్పష్టతనివ్వాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వపరంగా కసరత్తు సాగుతోంది. వివిధ శాఖలు ఈ పనిలో నిమగ్నమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలో రెవెన్యూ, పరిశ్రమలు, పంచాయతీరాజ్ గ్రామీ ణాభివృద్ధి, అటవీ, ఇతర శాఖల అధికారులు సమాలోచనలు జరుపుతున్నారు. ఈ భేటీల్లో... ఈ అంశం ఏ విధంగా వివాదంగా మారింది, దీనివెనకున్న వాస్తవాలు ఏమిటీ, గత యాభై ఏళ్లుగా ఈ భూమికి సంబంధించి చోటుచేసు కున్న పరిణామాలు, చట్టపర మైన అంశాలు, ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబ డుతూ జరుగుతున్న దుష్ప్రచారం తదితరాలపై చర్చ సాగుతున్నట్టు తెలుస్తోంది. ఈ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించేలా, సర్కార్ వైఖరిని బలపరి చేలా వివిధ శాఖల వారీగా సమాచారం, వివరా లతో నివే దిక తయారు చేయడంపై ప్రాథమికంగా దృష్టి పెట్టినట్టు సమాచారం. ప్రధానంగా ఈ 400 ఎకరాల భూమి రిజర్వ్ అటవీ ప్రాంతం కానందున అది వన్య ప్రాణులు నివసించే ప్రాంతం కాదని, దీనిని ప్రభుత్వ భూమిగానే పరిగణిస్తు న్నట్టుగా అటవీ శాఖ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. అదేవిధంగా చెట్ల నరికివేత, చదును వంటి అంశాల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని, టీజీఐ ఐసీ తగిన అనుమతులు తీసుకున్నట్టుగా వివిధ శాఖల అధికా రులు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒకటి, రెండురోజుల్లోనే అన్ని శాఖల నుంచి సేకరించిన సమాచారం, వివరాల ఆధారంగా ఓ నివేది కకు ప్రభుత్వం తుదిరూపు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

వరుస భేటీలు...

సచివాలయంలో సీఎస్ శాంతికుమారి ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశానికి పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, డైరెక్టర్ సృజన, అటవీ శాఖ తరఫున పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రి యాల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇక అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో చార్మినార్ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ప్రియాంక వర్గీస్, రంగారెడ్డి జిల్లా డీఎఫ్‌వో డి.సుధాకరరెడ్డి, చిల్కూరు రేంజ్ అధి కారులతో నిర్వహించిన సమావేశంలో ఆయా అంశాలపై డోబ్రియాల్ చర్చించారు. గత ఏడెని మిదేళ్లుగా హెచ్‌సీయూ పరిధిలో ఉన్న భూము ల్లోని జింకలపై కుక్కలు దాడి చేసిన పుడో, చంపినపుడో తమకు సమాచారం అందుతోందే తప్ప వాటిల్లో అటవీ శాఖకు ఎలాంటి పాత్ర లేదనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది.

15 అంశాలపై స్పష్టత కోరిన సుప్రీం

ఈ నెల 16న సుప్రీంకోర్టులో ఈ కేసు విచార ణకు రానుండగా...తాజాగా గురువారం కేంద్ర సాధికార కమిటీ సభ్యులు కంచ గచ్చిబౌలి భూముల్ని సందర్శించడంతో పాటు ఈ అంశంతో ముడిపడిన భాగస్వామ్య పక్షాలతో సమావే శమైన విషయం తెలిసిందే. కాగా 15 అంశాలను ప్రస్తావిస్తూ... వాటిపై స్పష్టతనివ్వాలని సుప్రీంకోర్టు నుంచి వారికి సూచన వచ్చినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల్లో...టీజీఐఐసీ ద్వారా చెట్లను నరికి, అక్కడి భూమిని చదును చేసిన పుడు తెలంగాణ వాటర్, ల్యాండ్స్ అండ్ ట్రీస్ యాక్ట్- 'వాల్టా' చట్టం కింద నియమాలు పాటించారా లేదా అని సాధికార కమిటీ ఆరా తీసినట్టు తెలిసింది. ఈ భూముల్లో ఏయేరకాల చెట్లు ఉన్నాయి, వాటిని నరికేందుకు అనుమ తులు తీసుకోవడంలో నిబంధనలను పాటించారా లేదా, ఈ ప్రాంతంలోని జలవనరుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి వన్యప్రాణులు, జంతువుల పరిరక్షణ, తదితర అంశాలపై కమిటీ సభ్యులు సందేహాలు లేవనెత్తినట్టు తెలుస్తోంది. ఆయా విషయాలపై అటవీశాఖ నుంచి స్పష్టత కోరినట్టు తెలిసింది.

చేతిలోనే చెరువు నక్ష..

అందరికీ అందుబాటులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల వివరాలు.. స్పష్టమైన శాటిలైట్ చిత్రాలు, కెడస్ట్రియల్ మ్యాపులు

ఓఆర్ఆర్ లోపల చెరువులు, కుంటలపై టెక్నాలజీతో నిఘా..

హైడ్రా–ఎన్‌ఆర్‌ఎస్‌సీ మధ్య కీలక ఒప్పందం

సాక్షి, హైదరాబాద్

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి హైడ్రా కసరత్తు చేస్తోంది. మహా నగరంలో ఎక్కడ చెరువు ఉంది? ఆ చెరువు విస్తీర్ణం ఎంత? కాలువలు, నాలాల పరిస్థితి ఏంటి? ప్రభుత్వ భూములు, పార్కుల సరిహద్దులు ఏంటి? వంటి వివరాలను కచ్చితంగా అందించడానికి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ ఎస్‌సీ) సేవలు వినియోగించుకుంటోంది. దీనికి సంబంధించిన అవగా హన ఒప్పందంపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఎన్ఆర్ ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ శుక్రవారం సంతకాలు చేశారు. ఎన్ఆర్ఎస్‌సీ కార్యాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో ఇరు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎంఓయూతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్

స్పష్టమైన సమాచారం..

- రాజధాని పరిధిలోని చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ, ప్రజావసరా లకు ఉద్దేశించిన భూముల వివరాలు హద్దులతో సహా సమగ్రంగా ప్రజలకు అందుబాటులో ఉంటే, ఆక్రమణ లకు ఆస్కారం ఉండదని హైడ్రా భావిస్తోంది. చెరు వుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల విషయంలో ఎలాంటి అపోహలకు అవకాశం లేకుండా ప్రముఖ విద్యా సంస్థల నిపుణులతో అధ్యయ నం చేయి స్తోంది. వీరికి ఎన్ఆర్ఎస్‌సీ అందించే శాటిలైట్ చిత్రాలు ఎంతగానో ఉపకరించనున్నాయి. 1970 నాటి సర్వే ఆఫ్ ఇండియా టోపో షీట్లు, కెడ స్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువులకు సంబంధించిన సమాచా రాన్ని ఈ శాటిలైన్ చిత్రాలు మరింత కచ్చిత త్వంతో తెలుపుతా యని అధికారులు చెప్తున్నారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ.. చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పర్యావరణహిత మైన నగరాన్ని రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందని ప్రశంసించారు. ఆ దిశలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఈ ఒప్పందంతో చేకూరే ప్రయోజనాలు..

- విపత్తుల నిర్వహణ, నీటి వనరుల రక్షణ కోసం జియో స్పేషియల్ డేటాతో పాటు సాంకేతిక సహకారం హైడ్రాకు అందుతుంది.
- రిమోట్ సెన్సింగ్, జీఎస్పై సాంకేతికతను వినియోగించి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ల(టీసీయూఆర్) కోసం అవసరమైన జియోస్పేషియల్ డేటాబేస్‌ను సృష్టించడానికి సాంకేతిక పరిజ్ఞానం లభిస్తుంది.
- భువాన్ పోర్టల్‌లో ఉన్న టీసీయూఆర్ పరిధిలో విపత్తు నిర్వహణ, నీటి వనరుల రక్షణకు అవసరమైన వారసత్వ సమాచారం హైడ్రాకు అందుతుంది.
- జియోస్పేషియల్ డేటా పాలసీ - 2023కు అనుగుణంగా 'భూనిధి'పోర్టల్‌లో ఉన్న రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ డేటా అందుబాటులోకి వస్తుంది. హై రిజల్యూషన్‌తో కూడిన ఉపగ్రహ డేటా, వైమానిక ఫొటోగ్రఫీ, డిజిటల్ ఎలివేషన్ మోడల్స్ మొదలైనవి సమకూరుతాయి.
- ఎన్ఆర్ఎస్‌సీకి చెందిన 'నేషనల్ డేటాబేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్'(ఎన్‌డీఈఎం) వెబ్ పోర్టల్‌ను వినియోగించుకునే అవకాశం దక్కుతుంది.
- ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతంతోపాటు జీహెచ్‌ఎంసీ చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి మార్గం సుగమం కానుంది.



అమెరికాలో 'ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్'ను సందర్శించిన మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని కాలిఫోర్నియాలో హైవేలపై లైవ్ ట్రాఫిక్ ఫీడ్‌ను ఆధునిక పరికరాలతో ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారో ఆ కంట్రోల్ సెంటర్‌ను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆధునిక సాంకేతికతపై ఆయన అక్కడి అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ నిర్వహణ కేంద్ర ఇంజనీర్లు, కన్సల్టెంట్లతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పాదచారుల భద్రతకు అత్యంత ప్రాముఖ్యం ఇస్తుందని, రాష్ట్రంలో ఉత్తమ పద్ధతులను అమలు చేయాలని ఆశిస్తున్నామని కోమటిరెడ్డి వారికి వెల్లడించారు.

విద్యుత్ సంస్కరణలపై డీఆర్సీ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగంలో సంస్కర ణల అమలు, పర్యవేక్షణ కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీ (డీఆర్సీ)ని నియమించింది. కేంద్రం ప్రవేశపెట్టిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్), ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీ యూఏ) తదితర పథకాల కార్యాచరణ ప్రణాళిక, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లకు తుదిరూపు ఇవ్వటంతో పాటు వాటి అమలును పర్యవేక్షించ టం ఈ కమిటీ బాధ్యత. శుక్రవారం డీఆర్సీని ఏర్పాటు చేస్తూ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. డీఆర్సీకి సీఎం చైర్మన్‌గా, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యులుగా, దక్షిణ, ఉత్తర డిస్కమ్‌ల సీఎండీలు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాల్లో చేరడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, మంత్రివర్గం ఆమోదం కోసం పంపించనుంది. డీపీఆర్‌లకు తుది అనుమతులు, పథకంలో మార్పులపై సూచనలు చేయనుంది.

మంత్రివర్గం ఆమోదిస్తేనే..

ఆర్డీఎస్ఎస్‌లో డిస్కంలు చేరాలంటే డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఈ పథకం నిబంధనల అమలుకు అంగీకారం తెలుపుతూ కేంద్రం, డిస్కంలు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని 27 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు మినహా మిగిలిన వినియోగదారులందరికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించాల్సి ఉంటుంది. ఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రీపెయిడ్ మీటర్లకు రూ.4 వేల కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.5 వేల కోట్ల వ్యయం కానుందని ఇప్పటికే అంచనా వేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రీపెయిడ్ మీటర్లకు రూ.2,800 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.3,500 కోట్లు ఖర్చవుతుందని లెక్క కట్టారు. డిస్కంల ఆదాయం, వ్యయాల మధ్య అంతరాన్ని ఈ పథకంలో చేరిన నాటి నుంచి ఐదేళ్లలో సున్నా స్థాయికి తీసుకురావాలి. ఇందుకోసం ఏటా విద్యుత్ చార్జీలను సవరించాల్సి ఉంటుంది. ఈ పథకంలో చేరితే రాష్ట్రంలోని రెండు డిస్కంలకు కేంద్రం నుంచి రూ.5 వేల కోట్ల సాయం అందనుంది.



మెగా జాబ్ మేళా

భారీగా వచ్చిన నిరుద్యోగులు

వచ్చింది 18 వేల మంది..

5 వేల మందికి నియామక పత్రాలు

వరంగల్ అర్బన్: వరంగల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపాన ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు భారీ సంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యారు. 65 మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు జిల్లావ్యాప్తంగా 18 వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. దీంతో ఫంక్షన్ హాల్ కిక్కిరిసిపోయి తోపులాట జరిగింది. ఈ క్రమంలో హాల్‌కు సంబంధించిన కిటికీలు ధ్వంసమయ్యాయి. నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. జాబ్ మేళాకు వచ్చిన వారిలో 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసినట్టు కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు హాజరయ్యారు.

ఇంకా వంద మీటర్లు..

అక్కడి వరకు మట్టి తొలగిస్తేనే మిగతా కార్మికుల ఆనవాళ్లు

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల వెలికితీతకు కొనసాగుతున్న తవ్వకాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న మిగతా ఆరుగురు కార్మికులను వెలికితీసేందుకు మట్టి తొలగింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. గత ఫిబ్రవరి 22న ప్రమాదం చోటు చేసుకోగా, శుక్రవారం నాటికి 49 రోజులు పూర్తయ్యింది. మొత్తం ఎనిమిది మంది మట్టి, శిథిలాల కింద కూరుకుపోగా, మార్చి 9న ఎరక్టర్ ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యం కాగా, మార్చి 25న జేపీ కంపెనీకి చెందిన ఇంజనీర్ మనోజ్‌కుమార్ మృతదేహం లభించిన విషయం తెలిసిందే. ఇంకా ఆరుగురు కార్మికులను వెలికితీసేందుకు నిత్యం మూడు షిఫ్టుల్లో 560 మంది సహాయక సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ పనులను ప్రత్యేక అధికారి శివశంకర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. దోమలపెంట వైపు నుంచి తవ్వుతున్న టన్నెల్ లోపల 13.940 కి.మీ. వద్ద సొరంగం కుప్ప కూలగా, సుమారు 250 మీటర్ల విస్తీర్ణంలో మట్టి, శిథిలాలు, బురద పేరుకుపోయింది. అడ్డుగా ఉన్న టీబీఎం భాగాలను కట్‌చేస్తూ, మట్టి, శిథిలాలను తొలగిస్తూ ఇప్పటివరకు 150 మీటర్ల వరకూ మట్టిని తొలగించి కన్వేయర్ బెల్టును పొడిగించారు. సొరంగం లోపల నాలుగు ఎస్కలేటర్ల సాయంతో మట్టిని తొలగించి కన్వేయర్ బెల్టు ద్వారా సొరంగం బయటకు తరలిస్తున్నారు. ఇంకా వంద మీటర్ల వరకూ మట్టిని పూర్తిస్థాయిలో తొలగిస్తే మిగతా కార్మికుల ఆనవాళ్లు లభించే అవకాశముంది. ఇందుకు మరో 4,5 రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.



సొరంగం లోపల కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు చేస్తున్న సహాయక సిబ్బంది

చివరి 40 మీటర్లపై ఇంకా సందిగ్ధం..

- సొరంగంలోని ఎండ్ పాయింట్ వద్ద.. ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంలో పైకప్పుగా ఉన్న సిమెంట్ సెగ్మెంట్లు కుంగిపోయి ఉండటంతోపాటు అక్కడి మట్టిని తొలగిస్తే మరింత కుంగే అవకాశం ఉందని ఎన్జీఆర్ఐ నిపుణులు అంచనా వేశారు. దీంతో చివరి 40 మీటర్ల వద్ద మట్టి, శిథిలాలు కదలకుండా సింగరేణి ఆధ్వర్యంలో ఇనుప కంచె (మెష్)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఐరన్ మెష్ వరకూ ఉన్న మట్టి, శిథిలాలను ఎస్కలేటర్లతో తొలగి స్తున్నారు. ఈ పరిధిలో కార్మికుల ఆనవాళ్లు లభించకపోతే ఇనుప కంచెను దాటి తవ్వకాలు చేపట్టాల్సి ఉంటుంది. ఎస్కలేటర్లతో పనులు పూర్తయిన తర్వాతే ప్రమాద స్థలంలో తవ్వకాలు ఏవిధంగా చేపట్టాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

సాక్షి
కరీంనగర్
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



* భక్తజన సంద్రమైన కొండగట్టు
* వైభవంగా అంజన్న చిన్న జయంతి వేడుకలు
* జై శ్రీరాం.. జై హనుమాన్ నామస్మరణలతో మార్మోగిన కొండగట్టు
* భారీగా తరలివచ్చిన దీక్షాపరులు.. భక్తులు
* పర్యవేక్షించిన కలెక్టర్, ఈవో, అధికారులు

కాషాయ'కొండ'

జగిత్యాల: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు కాషాయమయమైంది. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో అంజన్న సన్నిధి మార్మోగింది. ఆలయంలో హనుమాన్ చిన్నజయంతి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం నుంచి దీక్షాపరులు వేలాదిగా తరలివచ్చారు. సాయంత్రం వరకు సుమారు 30 వేల మంది మాల విరమణ చేయగా.. అర్ధరాత్రి వరకు సంఖ్య భారీగా పెరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్, ఇతర జిల్లాల నుంచి వేలాదిగా తరలించారు. అర్ధరాత్రి తరువాత లక్షన్నరకు పైగా భక్తుల రాకతో కొండ కిక్కిరిసిపోయింది. కోనేటిలో స్నానమాచరించిన భక్తులు, క్యూలైన్ ద్వారా వెళ్లి ఇరుముడి సమర్పించి, మాల విరమణ చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో రెండు రోజుల పాటు జరగనున్న జయంతి ఉత్సవాలకు రద్దీ కొనసాగనుంది. జయంతి సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ సత్యప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. మెడికల్‌క్యాంప్‌లో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండాలన్నారు. కోనేరును ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రఘుచందర్, పంచాయతీ అధికారి మదన్‌మోహన్ పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పూలే ఆశయాలు కొనసాగించాలి

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు కొనసాగించాలని పలువురు వక్తలు కోరారు. శుక్రవారం శాతవాహన వర్సిటీ చౌరస్తాలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ సహా పలువురు బీసీ సంఘాల నేతలు, అధికారులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, పలువురు బీసీ సంఘాల నేతలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. – కరీంనగర్

న్యూస్‌రీల్

శుక్రవారం సభలో సమస్యలు పరిష్కారం

* జిల్లా సంక్షేమ అధికారి సబిత



చిన్నారికి అన్నప్రాసనచేయిస్తున్న డీఎంహెచ్‌వో వెంకట రమణ, డీడబ్ల్యూవో సబిత

కరీంనగర్‌రూరల్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం సభ వేదికగా నిలుస్తుందని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో శుక్రవారం సభను నిర్వహించారు. మహిళలు తమ సమస్యలు తెలిపితే పరిష్కరించే అవకాశముందన్నారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు తప్పనిసరిగా సభకు హాజరు కావాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకట రమణ మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో 50 రకాల వైద్యపరీక్షలను మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అంగన్‌వాడీలోని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, డీఐవో సాజీదా, ఎంఈవో రవీందర్, వైద్యాధికారి మనోహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు నిర్మల, డీపీఏ రోమిలా,బీసీ సతీష్, సఖి సెంటర్ ఇన్‌చార్జి లక్ష్మి, చైల్డ్‌లైన్ సంపత్, ప్రధానోపాధ్యాయురాలు జలజరాణి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్‌వాడీ టీచరు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పత్తి మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తిమార్కెట్‌కు శని, ఆది, సోమవారం సెలవు ఉంటుందని ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్-2 కార్యదర్శి రాజాలు తెలిపారు. శుక్రవారం క్వింటాల్ పత్తి రూ.7,650 పలికిందని వివరించారు. తిరిగి మంగళవారం కొనుగోళ్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

నేడు మద్యం దుకాణాలు బంద్: సీపీ



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈనెల 12న మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్‌షాపులు, బార్లు, క్లబ్, మద్యం డిపోలు మూసివేస్తున్నట్లు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా మూసివేస్తున్నట్లు ప్ర కటించారు.ఆదేశాలను ఎవరైన ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ 2025–26 నూతన కార్యవర్గానికి శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా లింగంపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా చందా రమేశ్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు ప్రకటించారు. సంయుక్త కార్యదర్శిగా సిరికొండ శ్రీధర్‌రావు, ట్రెజరర్‌గా సంపత్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా గుగులోతు బలరాం, లైబ్రరీ సెక్రటరీగా తుమ్మ ప్రభాకర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వెన్న ఆనందం, సందూరి భూమిరెడ్డి, గుంటి మధు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కోల ప్రభాకర్, కొలిపాక ప్రియాంక, సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీచేసిన వారిలో అరుణ్ కుమార్‌కు 222 ఓట్లు రాగా, చంద్రపాటి కిరణ్ కుమార్‌కు 221 వచ్చాయి. దీంతో కిరణ్‌కుమార్ రీకౌంటింగ్ చేయాలని కోరడంతో ఓట్లు మళ్లీ లెక్కిస్తున్నారు. ఫలితం వచ్చేవరకు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఎన్నికల్లో మొత్తం 859 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మళ్లీ నిద్రలేచిన భూ మాఫియా!

* సిటీలో అన్ని రకాల ఇండ్లు కూల్చబడును!
* రివాజుగా మారుతున్న నిర్మాణాల కూల్చివేత
* కోర్టులు, పోలీసులను లెక్క చేయని నిందితులు
* పాత సీపీ ఉన్నంత కాలం చప్పుడు లేని భూపంచాయితీలు
* ఆయా కేసుల్లో వివాదాలు మళ్లీ తెరపైకి

సాక్షి ఫోకస్ సాక్షి



వల్లంపహాడ్‌లో ఇంటి కూల్చివేత(ఫైల్)



తీగలగుట్టపల్లిలో ఇల్లు కూల్చిన బుల్డోజర్(ఫైల్)



సీతారాంపూర్‌లో కూల్చిన ఇల్లు(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్.. స్మార్ట్ సిటీగా రాష్ట్రంలో మంచిపేరు సంపాదించింది. అలాగే, ఐటీలో ద్వితీయ శ్రేణి నగరంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది. రోజురోజుకూ నలుచెరుగులా విస్తరిస్తోంది. త్వరలో రింగ్‌రోడ్డు కూడా రాబోతోంది. ఇదంతా నాణేనికి ఒకేవైపు.. నగరంతోపాటు భూవివాదాలు కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వివాదాలు పోలీసుస్టేషన్‌కి వెళ్లడం లేదా బాధితులు జిల్లా కోర్టులు, హైకోర్టును ఆశ్రయించడం ఒక పద్ధతి. కానీ, వివాదాలు తలెత్తిన వెంటనే.. బలమున్నవారు ఆ ఇంటిని లేదా నిర్మాణాన్ని కూల్చివేయడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో 2022లో మొదలైన ఈ ఆచారం మధ్యలో సీపీ మహంతి కాలంలో సుప్తావస్థకు చేరింది. భూవివాదాలపై ఆయన ఉక్కుపాదం మోపిన తీరుకు అంతా సర్దుకుంది. కానీ, ఇపుడు తిరిగి భూ వివాదాలు నిద్రలేస్తుండడం బాధితుల్లో కలవరపాటుకు కారణమవుతోంది.

గతంలోనూ సంచలన ఘటనలు..

2022లో కరీంనగర్ సీతారాంపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడు ఇళ్లను కూల్చిన ఘటన కలకలంరేపింది. ఘటనాస్థలాన్ని అప్పటి సీపీ, కలెక్టర్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. వివాదం చెలరేగితే పంతం నెగ్గించుకునేందుకు ఇళ్లను బుల్డోజర్లు వేసుకుని వెళ్లి మరీ.. అర్ధరాత్రి నేలమట్టం చేసిన తీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి అదేదుర్ఘటన మిగిలిన వారికీ మార్గదర్శంగా మారడం దురదృష్టకరం. తర్వాత తీగలగుట్టపల్లిలో ఓ వైద్యుడి ఇంటి స్థలం విషయంలో వివాదం చెలరేగింది. రాత్రిపూట బుల్డోజర్‌తో వచ్చి.. కూల్చివేయడం కలకలంరేపింది. ఆ తర్వాత కూడా అదేప్రాంతంలో కడుతున్న ఇంటిని సుత్తెలతో మోది ధ్వంసం చేశారు. అనంతరకాలంలో సీపీ మహంతి రావడంతో పరిస్థితులు మారిపోయాయి. భూవివాదాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించి, పలువురిని అరెస్టు చేయడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. కానీ, ఇటీవల మహంతి ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిపోవడంతో భూవివాదాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. ఆయన హయాంలో కేసులు నమోదు అయినా ఘటనల్లో బాధితులు, నిందితుల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంటోంది.

తాజాగా మరో ఇల్లు..

వల్లంపహాడ్‌లో తాజాగా కొందరు రాత్రిపూట వచ్చి ఓ నిర్మాణాన్ని ధ్వంసం చేయడానికి యత్నించారు. వారిచర్యతో నిర్మాణం చాలావరకు దెబ్బతింది. ఈ పరిణామంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ వివాదంపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయని, కోర్టులోనూ వివాదం కొనసాగుతోందని బాధితుడు సాంబమూర్తి 'సాక్షి'కి తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తన భూమిలోకి వచ్చి.. తన ఇంటిని ధ్వంసం చేయడం ఏమిటని వాపోయారు. భూవివాదాలపై పోలీసుల విచారణ, కోర్టులో కేసులు నడుస్తుండగా.. ఇలా స్వయంగా వచ్చి ఎవరికివారు నిర్మాణాలు కూల్చడంపై నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్ 25 ఏళ్ల సభ విజయవంతం చేయాలి

* కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్
* మానేరు రివర్ ఫ్రంట్‌కు నిధులివ్వాలి
* కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చిత్రంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తదితరులు

కరీంనగర్‌కల్చరల్: బీఆర్ఎస్ స్థాపించి 25 ఏళ్లను పురస్కరించుకొని ఈనెల 27న ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రతిమ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 25 ఏళ్ల పార్టీ వైభవాన్ని, కోట్లాది మంది ప్రజల ఆదరాభిమానాలను స్మరించుకుంటూ ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఎల్కతుర్తిలో సభ కోసం రైతులు 1,200 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారని అన్నారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిపై కనీస శ్రద్ధ చూపడం లేదన్నారు. ఆర్టీసీ నుంచి పెద్దఎత్తున బస్సులు బుక్ చేసి డబ్బులు చెల్లించామని వివరించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులున్నారు.

కారా? కమలమా?

* క్లియరెన్స్ వస్తే పార్టీ జంప్
* కాంగ్రెస్‌కు మాజీ కార్పొరేటర్లు గుడ్‌బై?

కరీంనగర్ కార్పొరేషన్: గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పలువురు మాజీ కార్పొరేటర్లు పక్క చూపులు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై నారాజుతో ఉన్న వీళ్లలో కొందరు పార్టీని వీడేందుకు సమాయత్తమవుతున్నారు. నగరపాలకసంస్థ ఎన్నికలకు ముందుగానే బెర్త్ ఖాయం చేసుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీల వైపు చూస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల నేతలతో టచ్‌లో ఉంటున్నారు.

కాంగ్రెస్‌పై నారాజ్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 11 మంది అప్పటి కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌కు రాజీనామాచేసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మూడు రంగుల జెండా అందుకున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీగా నగరపాలకసంస్థలో ఆధిపత్యం తమదే అనుకున్న సదరు కార్పొరేటర్ల భ్రమలు కొద్దిరోజుల్లోనే తొలగిపోయాయి. పాలకవర్గం ముగిసి ప్రత్యేకాధికారి పాలనలోనూ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదు. పార్టీ నాయకత్వం తమను పట్టించుకున్నట్లుగా కనిపించలేదు. పైగా కరీంనగర్ పార్టీలో ఉన్న వర్గపోరు మాజీ కార్పొరేటర్లను మరింత ఇబ్బందికి గురిచేసింది. తాము అనుకున్నది జరగకపోవడం, పార్టీ పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడం, భవిష్యత్‌పై బెంగ.. తదితర కారణాలతో పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. 11 మందిలో కనీసం సగం మంది కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌ను వీడడం ఖాయమని, బీజేపీలోకి వెళ్లాలని తమ డివిజన్ వాసులు ఒత్తిడి తెస్తున్నారని ఓ మాజీ కార్పొరేటర్ 'సాక్షి' కి వెల్లడించారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

క్లియరెన్స్ వస్తే...

కాంగ్రెస్‌ను వీడేందుకు సిద్ధమైన మాజీ కార్పొరేటర్లు బీఆర్ఎస్, బీజేపీలో ఏదో ఒక పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కొంతమంది బీఆర్ఎస్, మరికొంత మంది బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. మొత్తంగా కార్పొరేషన్ ఎన్నికల్లో తమకు టికెట్‌లపై భరోసా ఇచ్చే పార్టీలోకి చేరేందుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ఈ మేరకు మాజీ కార్పొరేటర్లు ప్రతిపాదనలు పెట్టగా, ఇప్పట్లో ఎన్నికలు లేవు కదా వచ్చాక చూద్దామని వాయిదా వేసినట్లు విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా ఒకప్పటి సహచర కార్పొరేటర్ అయిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వైపు మరికొంతమంది మొగ్గు చూపుతున్నారు. పాత పరిచయాలతో తమకు ప్రాధాన్యం ఉంటుందని, నగరంలో బీజేపీ పుంజుకునే అవకాశం ఉంటుందనే ఆలోచనతో కాషాయ నేతలతోనూ టచ్‌లో ఉన్నారు. నగర రాజకీయాల్లో ఆరితేరిన ఈ ఇద్దరు నేతల్లో ఎవరు క్లియరెన్స్ ఇస్తే ఆ పార్టీలో చేరేందుకు మాజీ కార్పొరేటర్లు రంగం సిద్ధం చేసుకొంటున్నారు.



అశ్వవాహనంపై సీతారామచంద్రస్వామి

స్వామివారి ఊరేగింపు

ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు అశ్వవాహనంపై ఊరేగారు. శేషం వంశీధరచార్యులు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సన్నాయిడోలు వాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులను పూలతో అలంకరించగా...స్వామివారు మాడవీధుల గుండా ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్, కదారి కుమారస్వామి, ధర్మకర్తలు మల్లేశ్, గోపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. – ఇల్లందకుంట



ఆ ఉపాధ్యాయుడు మాకొద్దు

ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

విద్యార్థులు, మధ్యాహ్నభోజన సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఆ ఉపాధ్యాయుడు మాకొద్దంటూ స్టూడెంట్స్, తల్లిదండ్రులు, గ్రామస్తులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. గన్నేరువరం మండలం మైలారం గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పకుండా నిద్రపోతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే పిల్లలను చితకబాదుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఉపాధ్యాయుడి వివరణ కోరగా పరిసరాల పరిశుభ్రత ఉండడంలేదని, మోను ప్రకారం మాధ్యాహ్న భోజనం అందడంలేదన్నారు. టీచర్లు సమయపాలన పాటించడం లేదని.. దీనిని ప్రశ్నించినందుకే విధులకు ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు. ఆరోపణలు నిజం కాదన్నారు.– గన్నేరువరం



ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ రద్దు చేయాలె

నిరసన వ్యక్తం చేస్తున్న రైటర్లు

భూముల రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్ చేశారు. గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యవస్థను డిజిటలైజేషన్ చేయడంతో వేలాది మంది డాక్యుమెంటు రైటర్లు జీవనోపాధి కోల్పోతామన్నారు. ధరణి సమస్యలే ఇప్పటికి పరిష్కారం కాలేదన్నారు. నిరసనలో డాక్యుమెంట్ రైటర్లు తోట చంద్రయ్య, గంట కిషన్, రమేష్, సూర్యప్రతాప్, కమలాకర్ ,ప్రతాప్, అనిల్, అచ్యుత్, శ్రీనివాస్, మహేశ్, హరీశ్, యోనా, రాజశేఖర్, రఘు, తిరుపతి, గగన్ తదితరులు పాల్గొన్నారు. – గంగాధర



మా పొట్ట కొట్టొద్దు

అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మొబైల్ చిరు వ్యాపారులు

రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన హోల్‌సేల్ వ్యాపారులు మా పొట్టకొడుతున్నారని కరీంనగర్‌కు చెందిన మొబైల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల వ్యాపారులు మొబైల్ వస్తువులు, జీరో రసీదులు ఇస్తూ స్థానిక వ్యాపారులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిరసనలో సీపీఎం నగర కార్యదర్శి సత్యం, కరీంనగర్ సెల్యూలర్–టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అజ్మత్ అలీ, శ్రీనివాస్, సెల్యూలర్ రిటైల్ అండ్ టెక్నిషియన్ అసోసియేషన్ సభ్యులు చిరంజీవి చారి, సతీశ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, అక్బర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. – విద్యానగర్(కరీంనగర్)

క్లుప్తంగా

ఏసీబీకి చిక్కిన ట్రెజరీ ఉద్యోగి

- రూ.7వేలు తీసుకుంటూ పట్టుపడిన సీనియర్ అకౌంటెంట్ రఘు


ఏసీబీకి చిక్కిన సీనియర్ అకౌంటెంట్ అరిగె రఘుకుమార్

జగిత్యాల: కలెక్టరేట్ సముదాయంలోని ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడులు జరిగాయి. రూ.7వేల లంచం తీసుకుంటూ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ అరిగె రఘుకుమార్ పట్టుపడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాల ప్రకారం.. ఓ ప్రభుత్వశాఖలో పనిచేసే ఉద్యోగి లోను కోసం కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీంలో దరఖాస్తు చేసుకున్నాడు. రూ.1.04 లక్షలు మంజూరు కాగా.. చెల్లించడం సైతం జరిగింది. అయితే ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న అరిగె రఘుకుమార్ ఆ వ్యక్తికి తరుచూ ఫోన్ చేసి రూ.7 వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం 11గంటలకు డబ్బులు ఇస్తానని రఘుతో చెప్పాడు. ఉదయం 10 గంటల సమయంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో బృందం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. సదరు ఉద్యోగి నుంచి రఘుకుమార్ తన కార్యాలయంలో రూ.7వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కరీంనగర్ తరలించారు.

యువకుడిపై పోక్సో కేసు

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడు నవదీప్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన దంపతులు తమ చిన్నారిని ఇంటి వద్ద వదిలి పనులకు వెళ్లారు. ఒంటరిగా ఉన్న బాలికకు మాయమాటలు చెప్పిన యువకుడు.. అత్యాచారానికి యత్నించగా భయపడి ఇంటికి పరుగులు తీసింది. తల్లిదండ్రులు వచ్చాక విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై గ్రామంలో శుక్రవారం విచారణ జరిపారు. నిందితుడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, పోక్సో కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రూ.13.67కోట్లకు తలనీలాల టెండర్

- రూ.5.34 కోట్లకు తగ్గిన రాజన్న ఆదాయం
- గత టెండర్ రూ.19.01 కోట్లు
- కమిషనర్‌కు నివేదిక సమర్పించిన ఆలయ అధికారులు
- టెండర్‌లో 33వ నిబంధనతో కాంట్రాక్టర్‌కు మేలు



వేములవాడ: రాజన్నకు భక్తులు సమర్పించుకునే తలనీలాలు సేకరించుకునేందుకు రెండేళ్ల కాలపరిమితితో శుక్రవారం నాలుగోసారి టెండర్ నిర్వహించినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇద్దరు, బహిరంగ వేలం పాటలో ఇద్దరు పాల్గొన్నారు. ఇందులో బహిరంగ వేలంపాటకు హాజరైన కళావతి ఎంటర్‌ప్రైజేస్, నాగకుమారి ఎంటర్‌ప్రైజేస్ పాట పాడలేకపోయారు. తమిళనాడుకు చెందిన దొరై ఎంటర్‌ప్రైజేస్, కేఎం ఎంటర్‌ప్రైజేస్‌లు ఆన్‌లైన్‌లో వేలంలో పాల్గొన్నారు. ఇందులో రూ.13.67 కోట్లకు దొరై ఎంటర్‌ప్రైజేస్ హెచ్చుపాటదారుడిగా నిలిచారు. దీనిపై ఆలయ అధికారులు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో సదరు టెండర్ ఫైనల్ చేస్తామని స్పష్టం చేశారు.

గతంలో కంటే తక్కువ..

ఏప్రిల్ 11తో ముగిసే కాంట్రాక్ట్ వేలం గతంలో రూ.19.01కోట్లకు నిలిచిన విషయం తెలిసిందే. ఈసారి వచ్చిన వేలంలో రూ.13.67కోట్లు హెచ్చుపాట వద్ద నిలిచిపోవడంతో రాజన్న ఆదాయానికి రూ.5.34 కోట్లు ఎసరు పడనున్నట్లు తెలుస్తోంది. అయితే గత కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించుకుండా కాలయాపన చేయడం, ఆలయ అధికారులే తలనీలాలు పోగుచేయడం కొనసాగింది. ఈ నేపథ్యంలో స్పెషల్ పర్మిషన్ ఇచ్చేసి సదరు కాంట్రాక్టర్‌కు జూన్ వరకు చెల్లింపులకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ఇక శుక్రవారం జరిగిన తలనీలాల టెండర్‌పై కమిషనర్ ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సింది. ఒకవేళ రూ.13.67కోట్లు హెచ్చుపాటను ఒప్పుకుంటే రాజన్నకు రూ.5.34కోట్ల ఆదాయం తగ్గింది.

టెండర్‌లో 33వ నిబంధన ఇదీ..

ఈసారి టెండర్ నిర్వహించే క్రమంలో 33వ నిబంధనలో భాగంగా అధికారులు కాంట్రాక్టర్‌కు పలు సూచనలిచ్చారు. ఆలయ విస్తరణ పనులు చేపట్టనున్న క్రమంలో ఎప్పుడైనా భీమేశ్వరాలయంలోకి దర్శనాలు కొనసాగించే అవకాశాలు ఉంటాయని.. ఈక్రమంలో రూ.13.67కోట్ల టెండర్ ప్రకారం ఏరోజు వరకు రాజన్న గుడి వద్ద తలనీలాల సేకరించారో అదే రోజు వరకు లెక్కలేసుకునే సౌలభ్యం కల్పించారు. ఒకవేళ భీమేశ్వరాలయంలో కల్యాణకట్ట ఏర్పాటు చేసి అవకాశం కల్పిస్తే సదరు కాంట్రాక్టర్‌కు ఇష్టమైతే ఉండొచ్చు లేదా తప్పుకోవచ్చనే నిబంధన పెట్టారు. దీంతో తలనీలాల టెండర్‌కు ఆదాయం తగ్గినట్లు కనిపిస్తోంది. ఈ సౌలభ్యాన్ని కాంట్రాక్టర్ తెలివిగా వినియోగించుకుని రాజన్న ఆదాయానికి గండికొట్టే ప్రమాదం లేకపోలేదని స్థానిక నాయీబ్రాహ్మణులు చర్చించుకుంటున్నారు.

నేరెళ్ల ఘటనపై ఎస్సీ కమిషన్‌ను తప్పుపడతారా?

- తక్షణమే దుష్ప్రచారం నిలిపేయండి
- లేనిపక్షంలో చర్యలు తప్పవు
- జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక



సిరిసిల్ల/కరీంనగర్‌టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో 2017లో జరిగిన ఘటనపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామచందర్ స్పందించారు. నేరెళ్ల ఘటనపై కొందరు సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్‌ను బద్‌నాం చేస్తున్నట్లు తెలుసుకున్న కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. దళితుల పక్షాన పనిచేసే ఎస్సీ కమిషన్‌ను దుష్ప్రచారం చేయడాన్ని నిలిపివేయాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరెళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ చేపట్టిన విచారణతోపాటు ప్రభుత్వానికి పంపిన మధ్యంతర నివేదికను విడుదల చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై చర్యలు తీసుకునేలా నివేదిక రూపొందించిన విషయాన్ని గుర్తుచేశారు. నేరెళ్ల గ్రామంలో విచారణ చేపట్టడంతోపాటు కరీంనగర్ జైలుకు వెళ్లి బాధితులను కలిసి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి కలెక్టర్, పోలీసు అధికారుల స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేసినట్లు స్పష్టం చేశారు. 2017 ఆగస్టు 7న అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మధ్యంతర నివేదికలోని ఐదు ప్రధాన అంశాలను సైతం బహిర్గతం చేశారు. ఈ ఘటనపై హైలెవల్ కమిటీ ఏర్పాటు చేయాలని, అప్పటి ఎస్పీని బదిలీ చేయాలని, సంబంధిత డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలను విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలని, బాధితులకు పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, ఒక్కో బాధితుడికి రూ.5లక్షల పరిహారం అందించాలని నివేదికలో స్పష్టం చేసినట్లు రామచందర్ వివరించారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధ్యతాయుతంగా పనిచేస్తుంటే.. తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

‘సుస్థిరం’.. గండ్రపల్లి గ్రామం


గండ్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం


2023-24లో పని చేసిన కార్యదర్శి ఝాన్సిని అభినందించిన జిల్లా పంచాయతీ అధికారులు(ఫైల్)

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సద్వినియోగం
- అత్యుత్తమ ప్రతిభతో 80.19శాతం మార్కులు
- కేంద్ర, రాష్ట్ర బృందాల సందర్శన, నివేదికలు

జమ్మికుంట: రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనలో జిల్లాలోని జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామపంచాయతీ పని తీరు సుస్థిరంగా నిలిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బృందాలు సందర్శించి నివేదికలు అందజేశాయి. ఫలితంగా సుస్థిర గ్రామ అభివృద్ధి లక్ష్య సాధనలో అత్యంత ప్రతిభ కనబరిచిన గండ్రపల్లి జిల్లాలో రెండవదిగా నిలిచింది. రాష్ట్రంలో 11వ స్థానంలో 80.19 శాతం మార్కులు దక్కించుకుంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ గణాంకాల్లో రాష్ట్రంలోని 25 పంచాయతీల్లో ప్రత్యేక స్థానం సాధించింది.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు

పేదరికం లేని వ్యవస్థ నిర్మాణం, ఆహార భద్రత, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, ఆర్థిక అభివృద్ధి, అసమానతలు తగ్గించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కృషి చేశారు. 2022-23, 2023-24 సంవత్సరంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి ఝాన్సి జిల్లా అధికారుల అభినందనలు, శుభాకాంక్షలు పొందారు.

నిధుల సద్వినియోగం

గండ్రపల్లిలో 2022-23, 2023-24 సంవత్సరంలో సుస్థిరమైన అభివృద్ధికి గ్రామ పంచాయతీ అధికారి, సర్పంచ్, పాలక వర్గంతోపాటు గ్రామస్తుల సహకారం ఎంతో కీలకంగా పని చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరేలా కృషి చేశారు.

గండ్రపల్లి వివరాలు..	
గ్రామ జనాభా	1,566
గృహాలు	476
పురుషులు	796
మహిళలు	770
తాగునీటి కనెక్షన్లు	469
రేషన్‌కార్డులు	476
పెన్షన్‌దారులు	219
ఉపాధి జాబ్‌కార్డులు	501
ఎస్‌హెచ్‌జీ గృహాలు	26
బ్యాంక్ లోన్ తీసుకున్న సంఘాలు	14
గ్యాస్ కనెక్షన్లు	459

లక్ష్యం దిశగా కృషి



ప్రభుత్వ నిధులు, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహాయ సహకారాలతో వంద శాతం సుస్థిర అభివృద్ధి లక్ష్యం దిశగా కృషి చేస్తూ ముందుకు సాగుతాం.

– వెంగల రాములు, పంచాయతీ కార్యదర్శి, గండ్రపల్లి

నిధులు సద్వినియోగం



ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేశాం. రానున్న రోజుల్లో వందశాతం మెరుగైన అభివృద్ధికి సహకారం అందిస్తాం.

– బల్మూరి పద్మసమ్మారావు, మాజీ సర్పంచ్, గండ్రపల్లి

మహనీయులను స్మరించుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: మహత్ములను నిత్యం స్మరించుకుంటూ వారి సూచించిన బాటలో నడవాలని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గీతాభవన్ వద్ద మహాత్మా జ్యోతిబాపూలే పార్కు నుంచి యూనివర్సిటీ వరకు నిర్వహించిన ర్యాలీని శుక్రవారం ప్రారంభించారు. మహనీయుల త్యాగాలను గుర్తుచేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ పూలే, అంబేడ్కర్ గొప్ప దార్శనికులన్నారు. ర్యాలీలో విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు, జాతీయ సేవా పథకం వలంటీర్లు, ఆల్ఫోర్స్, వాగేశ్వరీ, ఎస్సారార్, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, సోషల్ వెల్ఫేర్, శ్రీ చైతన్య వివేకానంద, అక్షయ కళాశాల నుంచి అధ్యాపకులు ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఓఎస్‌డీ టు వీసీ హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జయంతి, డా. పద్మావతి, శ్రీవాణి, రంగప్రసాద్, అబ్రరూల్ బాఖీ వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


అజయ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్‌కు చెందిన పల్లికొండ అజయ్(18) శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అజయ్ తన స్నేహితుడితో కలిసి కథలాపూర్ గ్రామం నుంచి గుండు పెరమాండ్ల ఆలయం వైపు బైక్‌పై వెళ్తున్నారు. గ్రామశివారులో రోడ్డు పక్కన బైక్‌తోపాటు పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రిలో చేర్పించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అజయ్ బైక్‌ను ఏదైనా వాహనం ఢీకొట్టడంతో ప్రమాదానికి గురయ్యారా? లేక అదుపు తప్పి పడిపోయారా అనే విషయాలపై పోలీసులు, గ్రామస్తులు ఆరా తీస్తున్నారు. సీసీ పుటేజీలను పరిశీలించి కారణాలు తెలుసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

భ్రూణహత్యలో నలుగురిపై కేసు

చందుర్తి(వేములవాడ): భ్రూణహత్యల ఘటనలో ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం, ఆర్‌ఎంపీ,సదరు దంపతులపై శుక్రవారం కేసు నమోదైంది. డీఎంహెచ్‌వో రజిత తెలిపిన వివరాలు.. చందుర్తి మండలంలో విధులు నిర్వర్తిస్తున్న రేగుల రాజు భార్య నవ్యకు అబార్షన్ చేయించారు. ఇందుకు సహకరించిన మూడపల్లికి చెందిన ఆర్‌ఎంపీ అల్లె రాజు, అబార్షన్ చేసిన వేములవాడకు చెందిన నందిని ఆస్పత్రి యాజమాన్యంపై డీఎంహెచ్‌వో వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాతృమూర్తి మనోవేదన

కట్టుకున్న భర్త మాటలు నమ్మి ఆ ఇల్లాలు ఐదు నెలల గర్భాన్ని తీయించుకుంది. భార్య కడుపులో పెరుగుతున్న శిశువుకు అవయవాలు పూర్తిగా రాలేదని, అంగవైకల్యంతో జన్మింప అవకాశం ఉందని నమ్మించిన భర్త ఆమెను అబార్షన్‌కు ఒప్పించాడు. భర్త మాటలు నమ్మి అబార్షన్ చేయించుకుంది. ఇప్పుడు ఆ మాతృమూర్తికి గర్భశోకంతోపాటు కేసు నమోదుకావడంతో ఆ తల్లి మనోవేదనకు అంతులేకుండా పోయింది.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అదనపు వరకట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల మొదటి అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి కె.సృజన శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన అడిగే మాధవికి చిన్నబోనాలకు చెందిన పడిగే తిరుపతితో 2007లో వివాహమైంది. ఆ సమయంలోనే రూ.4లక్షలు నగదు, ఐదు తులాల బంగారం, 30 తులాల వెండి, ఇతర సామగ్రి వరకట్నంగా ముట్టజెప్పారు. తర్వాత కొద్ది రోజులకు అదనపు వరకట్నం కోసం తిరుపతితోపాటు అత్తమామలు వేధించారు. వేధింపులు భరించలేక తల్లి గారింటికి రాగా.. భర్త తిరుపతి మరొకరిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో మాధవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి.. నిందితుడు తిరుపతికి ఏడాది జైలు, రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వివరించారు.

ముగ్గురు కి‘లేడీ’ల అరెస్ట్

- 30 తులాల వెండి స్వాధీనం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని పైడబజార్ సింధూర జ్యూయలరీ దుకాణంలో పట్టగొలుసులు కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు యజమాని శ్రీనివాస్ దృష్టిని ఏమార్చి మూడు జతల వెండి పట్టగొలుసులను ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ కేసులో ముగ్గురు మహిళలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గతనెల 23న పట్టగొలుసులు కావాలని ముగ్గురు మహిళలు వచ్చి పథకం ప్రకారం మూడు జతల పట్టగొలుసులను అపహరించి వెళ్లిపోయారు. ఆ తర్వాత పట్టగొలుసులు మాయమైనట్లు గుర్తించిన కట్ట శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దొంగలను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ముగ్గురు మహిళలే నిందితులని గుర్తించి శుక్రవారం పట్టుకున్నారు. ఇందులో మొగుళ్లపల్లి మండలం ఇస్పెట్ గ్రామానికి చెందిన శనిగరపు పూలమ్మ, గుడిపాక రాధ, అన్నపూర్ణను అరెస్టు చేసినట్లు ఎస్సై వివరించారు. వారి నుంచి 30 తులాల వెండి (3జతల పట్టగొలుసులు) రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్యనేతల సమావేశం


పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న గంగుల కమలాకర్, వినోద్ తదితరులు

కొత్తపల్లి(కరీంనగర్): చింతకుంటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు. చింతకుంటలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తదితరులతో కలిసి సందర్శించారు. పార్టీ సమావేశానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.సింగిల్ విండో చైర్మన్ పిట్టల వేంకటేశ్వర్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్నద్ధం.. సందిగ్ధం

- గ్రామాల్లో సమ్మర్ క్యాంపులకు సై
- క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహణకు శ్రీకారం
- పట్టణాల్లో నగరపాలక, మున్సిపల్ ఆధ్వర్యంలో సందిగ్ధం

క్రీడాశాఖ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఇలా..	
జిల్లా	చివరి తేదీ
రాజన్న సిరిసిల్ల	ఈ నెల 18
జగిత్యాల	ఈ నెల 19
కరీంనగర్	ఈ నెల 20
పెద్దపల్లి	ఈ నెల 22



కరీంనగర్ స్పోర్ట్స్: పాఠశాల విద్యా సంవత్సరం ముగుస్తోంది. త్వరలో సెలవులు ప్రకటించనున్నారు. వేసవి సెలవుల్లో తల్లిదండ్రులతో పాటు పిల్లలు సైతం ఏదేని క్రీడలో తర్ఫీదు పొందాలని ఆసక్తి చూపుతుంటారు. ఇలాంటి వారికి సమ్మర్ క్యాంపులు ఉపయుక్తంగా ఉంటున్నాయి. 2025 ఏడాదిలో సమ్మర్ క్యాంపు నిర్వహణకు ఉమ్మడి జిల్లా క్రీడాశాఖ శ్రీకారం చుట్టింది. అయితే కరీంనగర్, రామగుండం నగరపాలకతో పాటు జగిత్యాల, సిరిసిల్ల మున్సిపాలిటీల్లో ఆ ఊసే లేకపోవడం గమనార్హం.

మే 1 నుంచి క్రీడాశాఖల ఆధ్వర్యంలో..

జిల్లా యువజన, క్రీడాశాఖల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఉత్తర్వులు జారీ చేసింది. మే 1 నుంచి 31వరకు వేసవి శిబిరాలు నిర్వహించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లోని పాపులారిటీ ఉన్న క్రీడాంశాల్లో ఎంపిక చేసిన 10 గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణనివ్వాలని సూచించింది. పీఈటీలకు నెల రోజుల శిక్షణ కాలానికి గౌరవ వేతనం కింద రూ.4వేలు ఇవ్వనున్నారు.

పట్టణాల్లో ఊసేలేదు!

క్రీడాశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండగా.. అర్బన్ ప్రాంతాల్లో ఊసే లేకుండా పోయింది. వారం రోజుల్లో పాఠశాల విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ, రామగుండం నగర పాలక సంస్థ, సిరిసిల్లలో ఎలాంటి సన్నాహాలు ప్రారంభించడం లేదు. జగిత్యాలలో ఈసారైనా సమ్మర్ క్యాంపు నిర్వహించాలని పలువురు తల్లిదండ్రులు, క్రీడా విశ్లేషకులు కోరుతున్నారు. ఆయా బల్దియాల్లో పాలకవర్గం పదవీకాలం ముగియగా.. ప్రత్యేకాధికారులు ఈ విషయమై చొరవ తీసుకోవాలని సూచిస్తున్నారు.

గడువు పెంచుతాం

గ్రామీణ ప్రాంతాల్లో 10 వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం. ఆసక్తి గల కోచ్‌ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. జగిత్యాలలో గడువును 18వ వరకు పొడిగించాం. శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు భవిష్యత్‌లో క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు.

– రవి కుమార్, సురేశ్, డీవైఎస్‌వోలు జగిత్యాల, పెద్దపల్లి

జగిత్యాలలో ప్రారంభించాలి

ఉమ్మడి జిల్లాలో క్రీడారంగంలో జగిత్యాలది అరుదైన ఘనత. పక్క జిల్లా కేంద్రాల్లో కొన్నేళ్లుగా మున్సిపల్, నగర పాలక సంస్థల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. జగిత్యాలలో నేటికీ నోచుకోకపోవడం శోచనీయం. క్రీడారంగానికి సంబంధించి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించాలి.

– వేణు, పీడీ, జగిత్యాల


కోతిరాంపూర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న గంగుల కమలాకర్, వినోద్‌కుమార్, సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు


డీసీసీ కార్యాలయంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఆర్టీసీ బస్టాండ్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆర్‌ఎం, ఆర్టీసీ అధికారులు

మహాత్మా జ్యోతిబాపూలేకు నివాళి

మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను శుక్రవారం కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంఘ కార్యాలయాల్లో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కోతిరాంపూర్‌లోని జ్యోతిబాపూలే విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సామాజిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం ఉద్యమిస్తామని తెలిపారు.

– కరీంనగర్/కరీంనగర్‌కార్పొరేషన్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి


విద్యుత్ భవన్‌లో..


నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో..




జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ, సీపీఎం, బీసీ సంక్షేమ సంఘం నాయకులు



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు, డీవైఎఫ్ఐ నాయకులు




చెన్నకేశవస్వామికి గరుడ సేవ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శ్రీభూనీళా చెన్నకేశవ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారికి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. ఈనెల 8న వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన భూనీళా చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారు అలకపాన్పు కోసం నర్సింహ స్వామి ఆలయానికి పల్లకిలో ఊరేగింపుగా తరలివెళ్లగా డప్పుచప్పుళ్లతో గ్రామస్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై అనుసరించారు. అనంతరం భక్తులు స్వామి వారికి కట్నకానుకలు సమర్పించడంతో అలకవీడి పల్లకిపై ఊరేగింపుగా చెన్నకేశవస్వామి ఆలయానికి తిరిగి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కూర నరేశ్ రెడ్డి, దబ్బెట రమణారెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, కూర రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాల విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్

కరీంనగర్‌సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయ పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాలను శుక్రవారం ఉప కులపతి ఉమేశ్‌కుమార్ విడుదల చేశారు. నాలుగు ఫ్యాకల్టీ విభాగాల్లో ఫలితాలు విడుదల చేసినట్లు తెలిపారు. పరిశోధనలో కూడా విశ్వవిద్యాలయం మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవికుమార్ జాస్తి, పరీక్షల నియంత్రణ అధికారి సురేశ్‌కుమార్, సోషల్ సైన్స్ డీన్ సుజాత, ఓఎస్డీ టు వీసీ హరికాంత్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి అబ్రారూల్ బఖీ, సైన్స్, కామర్స్, ఆర్ట్స్ విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎంవోయూ

శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ఇండియా లిమిటెడ్(ఈపీఐ) సంస్థతో శుక్రవారం మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్(ఎంవోయూ) కుదుర్చుకున్నారు. వర్సిటీ వీసీ ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ రవికుమార్ జాస్తి, ఓఎస్డీ డాక్టర్ డి.హరికాంత్ ఈపీఐ ప్రతినిధి నారాయణ నాయక్, ఏజీఎం, డీజీఎం పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగరంలో కాంగ్రెస్ పాదయాత్ర



కరీంనగర్‌కార్పొరేషన్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా శుక్రవారం నగరంలోని 33, 34, 35, 36, 52, 53, 54 డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, పిట్టల శ్రీనివాస్, సరిళ్ల ప్రసాద్, నాయకులు ఎండీ.తాజ్, శ్రవణ్, నేహాల్, పొన్నం శ్రీనివాస్, వాడె వెంకటరెడ్డి, శ్రీనివాస్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్



కరీంనగర్‌టౌన్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని 18వ డివిజన్ రేకుర్తి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, నాయకులు గంట నరసింహారెడ్డి, మామిడి రమేశ్, నాంపల్లి శంకర్, ప్రతాపరెడ్డి, విష్ణు ప్రసాద్‌రావు, నరేశ్, ప్రకాశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ద్వారా మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ వాహనాన్ని ప్రారంభిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వీఎస్‌ఆర్ ఫౌండేషన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని రామాలయంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ వాహనాన్ని అల్ఫోర్స్ చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కొండగట్టుకు వెళ్లే హనుమాన్ దీక్షాపరులకు ఈ వాహనం ద్వారా మజ్జిగ అందజేయడం జరుగుతుందన్నారు. వీఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు, హనుమాన్ దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సేవలు పూర్తిస్థాయిలో అందాలి


మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

కరీంనగర్ కార్పొరేషన్: కమాండ్ కంట్రోల్ పరిధిలోని అన్ని ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సిస్టం ఏజెన్సీ, ఆర్మీ కన్సల్టెన్సీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన అన్ని సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ, ఆర్‌వీ కన్సల్టెన్సీ అధికారులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' సేవలు వినియోగించుకోవాలి


శుక్రవారం సభలో ఆరోగ్యమహిళ, ఐసీపీఎస్ సేవలు అందిస్తున్న అధికారులు, వైద్యులు

కరీంనగర్‌టౌన్: మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్య మహిళ, ఐసీపీఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. శుక్రవారం సభలో భాగంగా జ్యోతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యమహిళ, ఐసీపీఎస్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తీవ్రమైన సమస్యలు ఉన్న వారికి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి రెఫర్ చేశారు. టీనేజీ పిల్లల సమస్యలు, పిల్లల ఎదుగుదలకు కావాల్సిన పోషకాహారం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న, కవితాదేవి, శ్రీలత, కాత్యాయని, సురేందర్, శ్రీదేవి, ప్రశాంత్, ఉమాదేవి, రమాదేవి, సుజాత, జ్యోత్స్న పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

కొత్తపల్లి: చింతకుంటలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభకు పిల్లలు, గర్భవతులు, బాలింతలు హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అరుణ, పల్లె దవఖాన వైద్యురాలు నవ్య, హెచ్‌ఎస్ సులోచన, ప్రధానోపాధ్యాయులు గౌస్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ సత్తిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు సరిత, జమున, సునీత, కనకతార, ఇందిరా, ఆయాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా దారి మళ్లింపు

కరీంనగర్‌క్రైం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నగరంలో నిర్వహించే వీర హనుమాన్ విజయయాత్రకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలో భాగంగా దారి మళ్లింపు చర్యలు చేపట్టనున్నామని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గాంధీ రోడ్డు, వైశ్య భవన్, రాజీవ్ చౌక్, సర్కిల్ కమాన్ రోడ్, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా బస్టాండ్, తెలంగాణ చౌక్, ఐబీ చౌరస్తా, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ విగ్రహం నుంచి తిరిగి వైశ్యభవన్ వద్ద శోభాయాత్ర ముగియనున్నది. యాత్ర జరిగే సమయంలో ఆయా మార్గాల్లో ఎటువంటి వాహనాలను అనుమతించబోమని టౌన్ ఏసీపీ తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్ వైపు నుంచి నగరంలోకి వచ్చే బస్సులు సిరిసిల్ల బైపాస్ నుంచి కట్టరాంపూర్ మీదుగా, అంబేద్కర్ స్టేడియం, కలెక్టరేట్ రోడ్, ప్రతిమ మల్టీప్లెక్స్ నుంచి బస్టాండ్‌కి బస్సులను, ఇదే మార్గంలో వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలను మైసూర్ బేకరీ నుంచి గణేశ్‌నగర్ మీదుగా అంబేద్కర్ స్టేడియం, కలెక్టరేట్ రోడ్, ప్రతిమ మల్టీప్లెక్స్ నుంచి నగరంలోకి అనుమతించనున్నామని పేర్కొన్నారు.

అంబలి వితరణ కేంద్రం ప్రారంభం


అంబలి వితరణ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని కమాన్‌చౌరస్తాలో శుక్రవారం కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబలి వితరణ కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలం ముగిసే వరకు రోజూ 500 మంది వరకు ఉదయం 9 గంటలకు అంబలి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్నా కృష్ణ, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చకిలం స్వప్న, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్, ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తణుకు సాయి, 48వ డివిజన్ కార్పొరేటర్‌అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి అంజన్ కుమార్ శుక్రవారం అందజేశారు. అలాగే నగరంలోని 26వ డివిజన్‌లో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి బాబు పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

రూ.3.80 లక్షలకు కొత్తపల్లి వారసంత

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ వారసంత బహిరంగ వేలంలో రూ.3.80 లక్షలు పలికింది. శుక్రవారం ఆర్‌వో భూమానందరం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో నలుగురు కాంట్రాక్టర్లు పాల్గొనగా ఎండీ సాజిద్ రూ.3.80 లక్షలకు కొత్తపల్లి వారసంతను దక్కించుకున్నారు. 1 ఏప్రిల్ 2025 నుంచి 31 మార్చి 2026 వరకు మార్కెట్ ఫీజు వసూలు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఆర్‌ఐ శ్రీనివాస్, వార్డు అధికారులు బచ్చు శరత్‌కుమార్, సాయికిశోర్ పాల్గొన్నారు.

సమాచారం

రేపు లైవ్ మెలోడిస్ నైట్ విత్ స్టార్ వాయిసెస్ కార్యక్రమం

కరీంనగర్‌కల్చరల్: ప్రవీణ్ సల్వాజీ మ్యూజికల్ గ్రూప్, మెలోడి లవర్స్ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కళాభారతిలో ఈద్ మిలాప్ సెలబ్రేషన్ పేరిట లైవ్ మెలోడిస్ నైట్ విత్ స్టార్ వాయిసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సల్వాజీ ప్రవీణ్, మహ్మద్ ముప్తి నొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి కళాకారులు రానున్నారని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ కళాకారుడు మోహనస్వామికి లైఫ్‌ఎం అచీవ్‌మెంట్ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

13న గౌరి కాపరుల సంఘం ఆవిర్భావ సభ

కరీంనగర్‌రూరల్: యాదాద్రిలో ఈనెల 13న గొర్రె కాపరుల సంక్షేమ సంఘం 4వ ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కాల్వ మల్లేశం యాదవ్ తెలిపారు. శుక్రవారం బొమ్మకల్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సభలో సహకార సంఘాల నిర్వహణ, సంక్షేమంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కాల్వ అశోక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ముకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంతోష్


సంతోష్‌కు నియామకపత్రం అందజేస్తున్న హరిశంకర్

కరీంనగర్‌టౌన్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన దామరకొండ సంతోష్‌ను నియమించారు. ఈమేరకు శుక్రవారం మంకమ్మతోటలోని మీకోసం కార్యాలయంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు ఆకుల రమేశ్, సత్తినేని శ్రీనివాస్, వాసాల హరీశ్, తోట కోటేష్, ముప్పిడి సునీల్, బొల్లం లింగమూర్తి, ఆవుల శ్రీనివాస్, గంప వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూమి విషయంలో మోసగించిన వ్యక్తికి జైలు

కరీంనగర్‌క్రైం: భూమి అమ్ముతానని నమ్మించి కొంత డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన నేరంలో నిందితుడు మేకల బాపుకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.హేమలత శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం .. రేకుర్తి సూర్యనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు మేకల బాపు కరీంనగర్ మండలం చేగుర్తిలో తన భూమి మూడు ఎకరాల 14 గుంటలు అమ్ముతానని బొమ్మకల్‌కు చెందిన జక్కుల రేణుకతో రూ.10 లక్షలకు 2014 ఏప్రిల్ 15న విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నాడు. రేణుక వద్ద రెండు దఫాలుగా రూ.7 లక్షలు తీసుకున్నాడు. మిగతా డబ్బులు రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాలని తెలిపి రిజిస్ట్రేషన్ చేయకుండా ముఖం చాటేశాడు. మోసాన్ని గ్రహించిన రేణుక మేకల బాపుపై కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది. కోర్టు ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు 2017 ఫిబ్రవరి 25న అతడిపై చీటింగ్ కేసు నమోదు చేయగా అప్పటి ఎస్సై ఎల్.శ్రీను దర్యాప్తు జరిపారు. కేసులో సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్ విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్: ఇటీవల వెలువడిన ఐఎన్‌టీఎస్ ఫలితాల్లో వావిలాలపల్లిలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చినట్లు పాఠశాల ఏజీఎం ముద్రకోల రాజు తెలిపారు. రిత్విక్ వర్ధన్, విశ్వతేజ, అక్షిత, శివన్స్, సాయి క్రిష్, భవిష్య, సత్యతేజలు పలు పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందుకున్నారని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమల్, కోఆర్డినేటర్ ప్రవీణ్, మమత, డీన్ శ్రీధర్, ఇన్‌చార్జిలు శిరీష, శ్రీజ, క్యాంపస్ ఇన్‌చార్జి సందీప్, ఒలింపియాడ్ ఇన్‌చార్జెస్ వెంకటేష్, రమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సీసీ స్టోర్స్ పర్సన్ ఇన్‌చార్జి నియామకం

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని వినియోగదారుల సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ పీవీ శివనాగేందర్ రెడ్డిని శుక్రవారం నియమిస్తూ జిల్లా సహకార అధికారి ఎస్.రామానుజచార్య ఉత్తర్వులు వెలువరించారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆ సంఘం మాజీ అధ్యక్షుడు ఎండీ ఫక్రుద్దీన్ ఆశ్రయించారు. ఆ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని నిలిపివేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ప్రభుత్వ అధికారిని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించాలన్న న్యాయస్థానం ఆదేశాల మేరకు కొత్తపల్లి వినియోగదారుల సహకార సంఘంకు పర్సన్ ఇన్‌చార్జిని నియమించారు.

ఇంటర్ బోర్డు అనుమతి తీసుకోవాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు ప్రచారం చేసుకోవాలంటే ఇంటర్ బోర్డు అనుమతి తీసుకోవాలని జిల్లా ఇంటర్ బోర్డు అధికారి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. అకాడమీలు, కోచింగ్ సెంటర్‌లకు గుర్తింపు ఇచ్చే అధికారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌కు లేదని కేవలం ప్రైవేటు జూనియర్ కళాశాలలకు మాత్రమే గుర్తింపు ఇచ్చే అధికారం ఉందని అన్నారు. పలు అకాడమీలు, కోచింగ్ సెంటర్‌లు, డిఫెన్స్ సెంటర్‌లు ఇంటర్ బోర్డు పరిధిలోకి రావన్నారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించకూడదని, ముందస్తుగా అడ్మిషన్స్ కూడా తీసుకోరాదని పేర్కొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం


రిశ్విత్ పటేల్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం ఆనందం

కొత్తపల్లి: మ్యాథ్స్ ఒలింపియాడ్ టాలెంట్ పరీక్షలో కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.రిశ్విత్ పటేల్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం తుమ్మ ఆనందం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ విద్యార్థిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరీంనగర్‌రూరల్: మద్యం మత్తులో గడ్డిమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి శ్యాం గతనెల 27న మద్యం మత్తులో గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల అనంతరం తిరిగి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి సోదరుడు అఖిలేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కిమ్స్‌లో 'అలోహోమోరా' ఫ్రెషర్స్ వేడుకలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న సాకేత్ రామారావు

కరీంనగర్: నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం అలోహోమోరా పేరిట ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించారు. కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రతీ అడుగు లక్ష్యంగా మార్చటం వల్ల ప్రతీ లక్ష్యాన్ని అడుగుగా మార్చి విజయం సాధించవచ్చునని అన్నారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, అధ్యాపకులు నరేశ్, చంద్రమౌళి, సంపత్‌కుమార్, సతీశ్, మహేశ్వరి, హారిక, తదితరులు పాల్గొన్నారు.

- దరఖాస్తులపై పంచాయతీ కార్యదర్శుల విచారణ
- మొబైల్ యాప్‌లో సాంకేతిక సమస్య
- తహసీల్దార్ ప్రత్యేక సమావేశం

కొత్త రేషన్‌కార్డుల సర్వేకు బ్రేక్


పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ రాజు

కరీంనగర్‌రూరల్: కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వేకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు సర్వే చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో రెండు రోజుల నుంచి పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. అయితే మొబైల్ యాప్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో సర్వే ముందుకు సాగడం లేదు. దీంతో శుక్రవారం కరీంనగర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో తహసీల్దార్ రాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దరఖాస్తులను సర్వే చేసే విధానం, మొబైల్‌యాప్‌లో వివరాలు నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. యాప్‌లో కొన్ని గ్రామాల రేషన్‌షాప్‌ల నంబర్లు కనిపించడం లేదని, ఇతర సాంకేతిక సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుక రాగా సివిల్ సప్లయి అధికారులు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండురోజుల్లో కార్యదర్శులు తిరిగి సర్వే చేపడుతారని వివరించారు.

మీ సేవా కేంద్రాల్లో 2,969 దరఖాస్తులు

కొత్త కార్డులు, పేర్ల చేర్పుల కోసం నాలుగేళ్ల నుంచి వేలాది మంది ఎదురు చూస్తున్నారు. గతంలో మీ సేవా కేంద్రాల ద్వారా చేసిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం ఫిబ్రవరిలో మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించగా మొత్తం 2,969 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 320 కొత్త రేషన్‌కార్డులు, 2,649 దరఖాస్తులు కుటుంబసభ్యుల పేర్ల నమోదు చేసుకున్నారు. రేషన్‌కార్డుల్లో కొత్త సభ్యుల పేర్ల నమోదును అధికారులు పూర్తి చేశారు.

ప్రజాపాలనలో 3వేల దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో మొత్తం 3,090 మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 1,983 కొత్త కార్డుల కోసం కాగా మిగతా 1,107 రేషన్‌కార్డుల్లో కొత్తగా కుటుంబసభ్యుల పేర్లు నమోదు కోసం ఉన్నాయి. ఆఫ్‌లైన్‌లో చేసిన దరఖాస్తులన్నింటినీ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఎక్సెల్‌షీట్‌లో పొందుపర్చి ఓ నంబర్ ఇచ్చి ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెండు రోజుల నుంచి పంచాయతీకార్యదర్శులు, రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను సర్వే చేసి అర్హులను గుర్తించి సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సమాచారాన్ని సేకరిస్తున్నారు. మీ సేవా కేంద్రాలు, ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను కార్యదర్శులు, ఆర్‌ఐలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేస్తున్నారని డిప్యూటీ తహసీల్దార్ వైష్ణవి తెలిపారు. ఈ నెల 20వరకు దరఖాస్తుల విచారణ పూర్తి చేసి అర్హుల జాబితాను ఖరారు చేస్తామని వివరించారు.

కౌంట్ డౌన్

ఐకానిక్ మహిళల అంతరిక్ష యాత్ర

ఐకానిక్ మహిళల అంతరిక్ష ప్రయాణానికి ఏరో స్పేస్ కంపెనీ 'బ్లూ ఆరిజన్' కౌంట్ డౌన్ ప్రారంభించింది. ఆరుగురు సభ్యుల బృందంలో వివిధ రంగాలకు చెందిన ఐకానిక్ మహిళలు ఉన్నారు. ఈ చారిత్రక ఘట్టం ఏప్రిల్ 14న ఆవిష్కృతం కానుంది. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవడం, అంతరిక్ష పరిశోధనల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని చాటి చెప్పడమే లక్ష్యంగా చేపట్టిన మిషన్ ఇది...



ఆరుగురు ఐకానిక్ మహిళలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే న్యూ షెపర్డ్ స్పేస్ క్రాఫ్ట్ పైలట్ లేకుండానే పనిచేస్తుంది. సబ్ ఆర్బిటల్ ప్రయాణానికి ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. సుమారు 11 నిమిషాల పాటు పయనించి భూమికి 62 మైళ్ల ఎత్తులో ఉన్న కార్మాన్ రేఖను దాటుతుంది. దీన్ని అంతరిక్షానికి ప్రవేశ ద్వారంగా భావిస్తారు.

ఈ ప్రయాణంలో ప్రయాణికులు గాలిలో తేలిపోతున్నట్టుగా అనుభూతిని పొందుతారు. క్యాప్సూల్‌కు సంబంధించిన పెద్ద కిటికీల ద్వారా భూమి విహంగ వీక్షణను ఆస్వాదిస్తారు.

'న్యూ షెపర్డ్ స్పేస్ క్రాఫ్ట్'ను చిన్న చిన్న గగన యాత్రల కోసం రూపొందించారు. ఇది బిఇ-3 పిఎమ్ ఇంజిన్‌తో పని చేస్తుంది. ఈ ఎన్.ఎస్.-31 మిషన్ టెక్నాలజీ ఫీట్ మాత్రమే కాదు ఒక చారిత్రాత్మక ఘట్టం కూడా.

'నా భయాన్ని పోగొట్టుకోవడానికి ధ్యానం చేస్తున్నాను' అంటోంది గేల్ కింగ్.

'కాస్త భయంగా ఉంది. అయినా చాలా ఉత్సాహంగా ఉంది' అంటోంది లారెన్ సాంచెజ్.

ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా ఆరుగురు ఐకానిక్ మహిళల అంతరిక్షయాత్ర హాట్ టాపిక్‌గా మారింది.

అయేషా బోవ్
నాసా మాజీ రాకెట్ శాస్త్రవేత్త అయిన అయేషా బోవ్ మిచిగన్ యూనివర్శిటీ నుండి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, స్పేస్ సిస్టమ్స్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేసే 'స్టెమ్ బోర్డ్' అనే ఇంజినీరింగ్ కంపెనీకి అయేషా బోవ్ సీఈవో.

అమంద గుయెన్
హార్వర్డ్ సెంటర్ ఫర్ ఆస్ట్రోఫిజిక్స్, ఎంఐటీ, నాసా, ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఆస్ట్రోనాటికల్ సైన్సెస్‌లో పనిచేసింది అమంద గుయెన్. లైంగిక బాధితులకు అండగా నిలబడి పోరాడిన గుయెన్ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయింది. టైమ్ మ్యాగజైన్ 'ఉమన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్‌కు ఎంపికైంది. తొలి వియత్నామీస్, ఆగ్నేయాసియా మహిళా వ్యోమగామిగా ఈ అంతరిక్ష యాత్రతో గుయెన్ చరిత్ర సృష్టించనుంది. 'సేవింగ్ ఫైవ్: ఎ మెమోరియల్ ఆఫ్ హోప్' అనే పుస్తకాన్ని గత నెలలో విడుదల చేసింది.

లారెన్ సాంచెజ్
లారెన్ సాంచెజ్ రచయిత్రి, పాత్రికేయురాలు. ఎన్నో వార్తా సంస్థలలో యాంకర్‌గా పనిచేసింది. లారెన్ హెలికాప్టర్ పైలట్ కూడా. 'బ్లాక్ ఆప్స్ ఏవియేషన్' సంస్థను స్థాపించింది. ఇది మహిళా యాజమాన్యంలో నిర్వహితమవుతున్న తొలి ఏరియల్ ఫిల్మ్ అండ్ ప్రొడక్షన్ కంపెనీ. 'ది ఫ్లై హూ ఫ్లై టు స్పేస్' లాంటి ఎన్నో పిల్లల పుస్తకాలు రాసింది.

గేల్ కింగ్
మేరీల్యాండ్ యూనివర్శిటీ నుండి సైకాలజీలో పట్టా పొందిన గేల్ కింగ్‌కు రేడియో, టెలివిజన్, ప్రింట్ మీడియాలలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. 'గేల్ కింగ్ ఇన్ ది హౌజ్' అనే రేడియో షోని హోస్ట్ చేసింది. ఉత్తమ రేడియో టాక్ షో కోసం ఇచ్చే 'అమెరికన్ ఉమెన్ ఇన్ రేడియో అండ్ టెలివిజన్ గ్రేసీ అవార్డ్'ను సొంతం చేసుకుంది. టైమ్ మ్యాగజైన్ 'అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితా-2019'లో చోటు సాధించింది.

కేటీ పెర్రీ
ఆల్ టైమ్ బెస్ట్ సెల్లింగ్ మ్యూజిక్ ఆర్టిస్ట్‌లలో పాప్ స్టార్ కేటీ పెర్రీ ఒకరు. 2010లో విడుదలైన ఆమె మొదటి ఆల్బమ్ రికార్డ్‌లు బ్రేక్ చేసింది. 13 గ్రామీ అవార్డ్‌లకు కేటీ నామినేట్ అయింది. బిల్‌బోర్డ్ 'విమెన్ ఆఫ్ ది ఇయర్-2012' అవార్డ్ అందుకుంది. 'ఫైర్ వర్క్ ఫౌండేషన్' మొదలుపెట్టి యునిసెఫ్ గుడ్ విల్ అంబాసిడర్‌గా సేవలు అందిస్తోంది.

కెరియానే ఫ్లిన్
కెరియానే ఫ్లిన్ నిర్మాత. డాక్యుమెంటరీలు, చిత్రాలు తీసింది. హాలీవుడ్‌లో ఆమె తీసిన దిస్ చేంజెస్ ఎవ్రీ థింగ్ (2018), లిల్లీ (2024) చిత్రాలకు మంచి గుర్తింపు వచ్చింది. ఎన్నో స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఫ్లిన్‌కు అంతరిక్ష ప్రయాణాలపై ఆసక్తి. 'నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను' అంటోంది తన అంతరిక్ష ప్రయాణం గురించి.

ఇల్లు అండగా ఉండాలి

మెనోపాజ్ అర్థం చేసుకుందాం

నిర్వహణ: సరస్వతి రమ

ఏడాది వరకు నెలసరి రాకపోతే అప్పుడు దాన్ని మెనోపాజ్‌గా పరిగణిస్తారు. సాధారణంగా 45 నుంచి 52 ఏళ్ల మధ్య మెనోపాజ్ వస్తుంది. తొలి లక్షణంగా నెలసరి క్రమం తప్పుతుంది. అంటే రెండు నెలలకు ఒకసారి లేదా నాలుగు నెలలకు ఒకసారి వస్తూంటుంది. తర్వాత ఒంట్లో వేడి ఆవిర్లు, నిద్రలేమి, గుండె దడ, అలజడి, ఆందోళన, మూడ్ స్వింగ్స్, ఏకాగ్రత లోపించడం, జీవనాసక్తి తగ్గడం, బరువు పెరగడం, ఒంటరితనం వంటివీ ఉంటాయి. మూడు, నాలుగేళ్ల వరకు కొనసాగే ఈ దశను ప్రీమెనోపాజల్ స్టేజ్ అంటారు. అయితే ఆ ఫేజ్‌లో ఉన్న అందరికీ ఆ లక్షణాలు ఉండకపోవచ్చు. కొందరు ఏ లక్షణమూ లేక సాఫీగా ఆ దశను దాటేయవచ్చు. లక్షణాలు ఉంటే జీవనశైలిలో మార్పులు, యోగా, ఎక్సర్‌సైజ్‌తో మేనేజ్ చేయవచ్చు. ఒకవేళ సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ముఖ్యమైన విషయం.. మెనోపాజ్ అని నిర్ధారణ అయ్యాక స్పాటింగ్ కానీ, బ్లీడింగ్ కానీ కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే గైనకాలజిస్ట్‌ను కలవాలి.

మెనోపాజ్ తర్వాత..
స్త్రీ మేనికి మెరుపు, నిగారింపునిచ్చేవి ఫీమేల్ హార్మోన్సే. మెనోపాజ్ తర్వాత వాటి ఉత్పత్తి లేక గ్లో కూడా తగ్గిపోతుంది. చర్మం సాగి, ముడతలు పడుతుంటుంది. వెజైనా పొడిబారిపోతుంది. లైంగికాసక్తి తగ్గిపోతుంది. బ్లోటింగ్ ఉంటుంది. ఎముకల సాంద్రత తగ్గుతుంది. గుండె సంబంధిత సమస్యలూ మొదలయ్యే చాన్స్ ఉంటుంది. అయితే వీటన్నిటికీ భయపడాల్సిన పనిలేదు. క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం చేయాలి. డాక్టర్ సూచనల మేరకు కాల్షియం సప్లిమెంట్స్ తీసుకోవాలి. వెజైనల్ డ్రైనెస్ సమస్య కోసం ప్లాంట్ బేస్డ్ ఈస్ట్రోజన్ మెడిసిన్స్ తీసుకోవచ్చు లేదా జెల్లీని ఉపయోగించొచ్చు. ఆహారంలోనూ జాగ్రత్తలు పాటించాలి. మసాలా, వేపుళ్లకు దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారపదార్థాలను తీసుకుంటే మంచిది. హెల్త్ చెకప్స్ మరచిపోవద్దు.


డాక్టర్ కామేశ్వరి

మెనోపాజ్ అనేది సవాళ్లతో కూడిన మార్పు! 'శాస్త్రీయ అవగాహన ఉంటే సమర్థవంతంగా ఆ సవాళ్లను ఎదుర్కోవచ్చు.. ఆ మార్పును ఆస్వాదించొచ్చు' అని చెబుతున్నారు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్‌లు డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ ఆలియా రెడ్డి!


డాక్టర్ ఆలియా రెడ్డి

❖ ❖ ❖

మామోగ్రఫీ, పాప్‌స్మియర్ పరీక్షలు తప్పనిసరి. ఇంకో విషయం.. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ వచ్చింది. కాబట్టి.. పెద్దమనిషి అయిన అమ్మాయిల నుంచి 45 ఏళ్ల మహిళల వరకు ఈ వాక్సిన్‌ను తీసుకోవచ్చు. లైంగిక జీవితం మొదలుకాకముందే ఈ వాక్సిన్ తీసుకుంటే మంచిది.

❖ ❖ ❖

మెనోపాజ్ మూడు రకాలుగా వస్తుంది. ఒకటి.. సహజంగా వయసుతో వచ్చేది. రెండు.. వయసుతో సంబంధం లేకుండా జీవనశైలిలో మార్పులు, పొల్యూషన్, పెస్టిసైడ్స్ ఫుడ్ లాంటి వాటితో 40 ఏళ్లలోపే వచ్చే అర్లీ మెనోపాజ్. మూడవది.. శస్త్రచికిత్స ద్వారా గర్భసంచి, అండాశయాలను తొలగించడం వల్ల, క్యాన్సర్‌కు వాడే కొన్నిరకాల మందులు, రేడియేషన్ వల్ల కృత్రిమంగా వచ్చే మెనోపాజ్.

❖ ❖ ❖

మెనోపాజ్ లక్షణాల్లో ఒకటైన హాట్ ఫ్లషస్‌ను యూరప్, ఉత్తర అమెరికా దేశాలలో 60-90 శాతం మంది స్త్రీలు ఎదుర్కొంటున్నారని, వారితో పోలిస్తే ఆసియా ఖండంలో 10-20 శాతం మంది మహిళలు మాత్రమే ఈ సమస్యతో సతమతమవుతున్నారని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అందుకు ఆసియా ఖండంలోని ఆహారపు అలవాట్లు అంటే వారు తీసుకునే ఆహారంలోని ప్లాంట్ బేస్డ్ ఈస్ట్రోజన్స్ కారణం కావచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఆ దేశాల్లో మెనోపాజ్ సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న వారు కౌన్సెలింగ్, జీవనశైలిలో మార్పులతో ఆ దశను సమర్థంగా ఎదుర్కొంటున్నారట. ధూమపానం, పొగాకు, ఊబకాయం, స్పైసీ ఫుడ్, పొగలుగక్కే ఆహారం తినడం, కాఫీ, టీలు ఎక్కువగా తాగడం, మద్యం, థైరాయిడ్ గ్రంథి లోపాలు, డయాబెటిస్, మానసిక ఒత్తిడి వంటివన్నీ హాట్‌ఫ్లషస్‌కి ప్రేరకాలు (ట్రిగర్) గా పనిచేస్తాయి. అయితే జీవనశైలిలో మార్పులు, వైద్య సలహా సూచనలతో ఆ సమస్యను అధిగమించవచ్చు. అంతేకాదు నువ్వులు, గడ్డి నువ్వులు, అవిసె గింజలు, సోయా బీన్స్, ముల్లంగి, నట్స్, క్యాబేజీ, కాలిఫ్లవర్ వంటివాటితోనూ మెనోపాజ్ సమస్యలను తగ్గించుకోవచ్చు.



శిల్పా శెట్టి మొదలు ట్వింకిల్ ఖన్నా, శ్వేతా బచ్చన్ (జయ బాధురి, అమితాబ్ బచ్చన్‌ల కూతురు), టెలివిజన్ హోస్ట్ మినీ మాథూర్ లాంటి వాళ్లందరూ హాట్ ఫ్లషస్, మూడ్ స్వింగ్స్, బరువు పెరగడం వంటి సమస్యలను ఎదుర్కొన్నవారే. ఆ లక్షణాల గురించి అవగాహనలేక చాలా ఇబ్బందులు పడ్డారట. వాళ్ల మూడ్ స్వింగ్స్‌ని చూసి కుటుంబ సభ్యులు నివ్వెరపోయేవారని, తామెందుకలా ప్రవర్తిస్తున్నామో అర్థంకాక .. ఆ పరిస్థితిని ఎలా మేనేజ్ చేయాలో తెలియక ఆందోళన చెందారని చెప్పారు. ఆ బాలీవుడ్ సెలెబ్స్ అందరూ ఇప్పుడు మెనోపాజ్ అవేర్‌నెస్ ప్రచారకర్తలుగా మారారు. మెనోపాజ్ దశ, లక్షణాల మీద విస్తృతంగా చర్చిస్తూ మహిళల్లో అవగాహన తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

❖ ❖ ❖

శాస్త్రీయ అవగాహన పెంచుకుంటూ..
ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన విషయం ఒక్కటే.. మెనోపాజ్ అన్నది స్త్రీ జీవితంలో ఒక సహజమైన ప్రక్రియ. దాన్నో జబ్బుగా పరిగణించకుండా శాస్త్రీయ అవగాహనను పెంచుకుంటూ కుటుంబం ఆమెకు అండగా నిలబడాలి. జీవిత భాగస్వామి ఆమెకు ఓ ఫ్రెండ్‌గా మారాలి. పిల్లలు అమ్మ మానసిక పరిస్థితిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. ఆమెకు అనుకూలంగా మెలగాలి. ఇలాంటి వాతావరణం ఉంటే.. అది ఆమెకు హార్మోన్స్ కన్నా ప్రభావంతంగా పనిచేస్తుంది. మెనోపాజ్ మీద సమాజంలోనూ అవగాహన పెరగాలంటే ఆరోగ్యశిబిరాల్లో దాని మీద చర్చించాలి. మీడియా కథనాల ద్వారా ప్రచారం జరగాలి. అంతేకాదు మహిళ ఆరోగ్యాన్ని పాఠ్యాంశాల్లోనూ భాగం చేయాలి.

– శిరీష చల్లపల్లి

వంటిల్లు

ముంజెల మాధుర్యం



వేసవిలో మాత్రమే దొరికే తాటి ముంజెలంటే చాలామందికి భలే ఇష్టముంటుంది. అయితే అంత మధురమైన ముంజెలను మరింత మధురంగా చేసుకోవడం ఎలా? ఈజీగా, టేస్టీగా ఇలా ట్రై చేస్తే సరి పిల్లలేంటి... పెద్దలు కూడా ఇష్టంగా లాగించేస్తారు.

తాటి ముంజెల హల్వా



ముందుగా చిన్నమంట మీద కళాయిలో 2 కప్పుల చిక్కటి పాలు మరిగించి, అందులో దోరగా వేయించిన ఒక కప్పు గోధుమ పిండి వేసుకుంటూ గరిటెతో ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. అనంతరం దానిలో రెండు కప్పుల మెత్తటి ముంజెల గుజ్జు వేసుకుని దగ్గరపడే వరకూ తిప్పాలి. అభిరుచిని బట్టి కొద్దిగా ఫుడ్ కలర్, రెండు టేబుల్ స్పూన్ల నెయ్యితో పాటు ఏలకుల పొడి, వేయించిన బాదం, జీడిపప్పు వంటివి కలిపి దగ్గరపడ్డాక ఒక పాత్రలోకి తీసుకోవాలి. ఆ మిశ్రమం బాగా చల్లారాక ముక్కలుగా కట్ చేసుకుని ఆరగించొచ్చు.

తాటి ముంజెల జ్యూస్



ముంజెకాయల గుజ్జులో కొద్దిగా నీళ్లు, తేనె వేసి బాగా మిక్సీ పట్టుకోవాలి. వడకట్టి చల్లగా తాగాలి. ఏలకుల పొడి వేసుకుంటే ఫ్లేవర్ మరింత బాగుంటుంది.

తాటి ముంజెల ఐస్ క్రీమ్

రెండు కప్పు ముంజెల గుజ్జు, అర కప్పు కాచిన చిక్కటి పాలు, అర కప్పు పాల పొడి, రెండు టేబుల్ స్పూన్ల ఫ్రెష్ క్రీమ్ లేదా విప్పింగ్ క్రీమ్, సరిపడా పంచదార కలిపి బాగా గిలకొట్టాలి. లేదా మిక్సీ పట్టాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని డీప్ ఫ్రీజర్‌లో పెట్టి, గడ్డ కట్టాక తింటే సూపర్ ఉంటుంది.



వీధి నుంచి ఇంటికి



వీధి బాలలు

మన ఉరుకుల పరుగుల జీవనంలో ఒక్క కుదుపుతో ఆపే రెడ్ సిగ్నల్‌లా బాల్యం కూడలిలో భిక్షం ఎత్తుతూ కనిపిస్తుంది. జాతరలా తోసుకువెళుతున్న సమూహంలో నిలువెల్లా రంగు పూసుకుని చేతి కర్రతో గాంధీ తాతలా బాల్యం నిగ్గదీస్తుంది. చిన్న బొజ్జను నింపుకోలేని చిట్టి చేతులతో జీవితంతో పోరాడలేక దొంగ అవుతుంది, దోపిడీకి గురవుతుంది. బాలనేరస్తులుగా ముద్ర వేయించుకొని భవిష్యత్తును బందిఖానాలా మార్చుకుంటుంది.

దేశవ్యాప్తంగా నాలుగు లక్షల మంది వీధి బాలలు ఉన్నట్టు యునిసెఫ్ అంచనా. హైదరాబాద్‌లో 28,000కు పైగా వీధి బాలలు ఉన్నట్టు అంచనా. పాట్నా పట్టణంలో వీధి బాలల సంఖ్య ఎక్కువ.

వీధి బాల్యం ఎందుకు పెరుగుతోందంటే..
గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు బతుకు దెరువు కోసం వలస వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. పనులు దొరక్క, నిలువనీడ లేక, కనీస అవసరాలు తీరక తల్లిదండ్రులు గొడవలు పడటం, విడిపోవడం, కుటుంబాలు విచ్ఛిన్నమవడంతో దిక్కుతోచని స్థితిలో పిల్లలు రోడ్ల మీదకు వస్తున్నారు. మన దేశంలో గుర్తించినవే కాదు గుర్తింపునకు నోచుకోని స్లమ్స్ చాలా ఉన్నాయి. వీటిల్లో నివాసం, ఆహార భద్రత లేమి, చదువునూ దూరం చేస్తుంది. ఇప్పటికే వీధి బాలల్లో 82 శాతం మంది చదువును ఆపేశారని నివేదికలు చూపుతున్నాయి. వీరంతా జీవనోపాధి కోసం చిత్తు కాగితాలు ఏరుకోవడం, కూలి పనులు, భిక్షాటన, షూ పాలిష్, పూలు అమ్మడం.. వంటి వాటిని ఎంచుకుంటుంటే కొంతమంది దొంగతనం, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటింగ్, మాదక ద్రవ్యాల వ్యాపారం.. మొదలైన చట్ట వ్యతిరేక పనుల్లో పాల్గొంటున్నారు. హెచ్ఐవి/ఎయిడ్స్ బారిన పడటం, ఆడపిల్లలు చిన్నవయసులోనే గర్భం దాల్చడం, గర్భస్రావాలు.. వంటి సమస్యలనూ ఎదుర్కొంటున్నారు.

సమాజంలో వీధి బాలల పట్ల ఉన్న వ్యతిరేకతను దూరం చేయడానికి అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయడం, మహిళలకు, యువతకు జీవన నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం తప్పనిసరిగా చేయాల్సిన పనులుగా వివరించారు. ఇందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఆత్మీయ ఆహ్వానం
వీధి బాలల కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల్లో రెయిన్ బో హోమ్స్ ఒకటి. ఈ హోమ్స్ హైదరాబాద్‌లో 14 ఉంటే, దేశ వ్యాప్తంగా 50 వరకు ఉన్నాయి. ఒక్కో హోమ్‌లో 70 నుంచి 80 మంది పిల్లలు సంరక్షణను పొందుతున్నారు. రోడ్డు మీద నుంచి హోమ్‌లోకి వచ్చే పిల్లలకు సంరక్షణ పొందుతున్న పిల్లలు ఆత్మీయ ఆహ్వానం పలుకుతారు. 'తమ కుటుంబంలో చేరిన కొత్త వారిని తోబుట్టువుల్లా దగ్గరకు తీసుకుంటారు' అని తెలిపారు నిర్వాహకులు.

మూలాన్ని సమీక్షించాలి...
సుమతి చదువుకోలేదు. గ్రామీణ నేపథ్యం. తన ఈడు వయసున్న అతన్ని ప్రేమించి, కుటుంబాన్ని వదిలేసి అతనితో పాటు పట్టణం వచ్చేసింది. కొంతకాలం బాగానే ఉన్నా చెడు అలవాట్లకు బానిసైన అతను ఆమెను, పుట్టిన బిడ్డనూ వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. దీంతో సుమతిది మానసిక కుంగుబాటు. ఎలా బతకాలో తెలియని నిస్సహాయ స్థితి. బిడ్డను కాపాడుకోవడానికి ఎక్కడెక్కడో తిరిగి, సెక్స్‌వర్కర్‌గా మారింది. 'ఇలాంటి వారిని గుర్తించి తల్లికి, బిడ్డకు సంరక్షణను అందించే బాధ్యతను తీసుకున్నామని తెలిపారు రెయిన్ బో హోమ్స్ డైరెక్టర్ అనూరాధ. ఇలాంటి వేదనాభరితమైన జీవన కథనాలెన్నో సమాజంలో ఉన్నాయని, స్ట్రీట్ చిల్డ్రన్స్ సంరక్షణ విధానాల గురించి అనూరాధ వివరించారు.

చిన్న భరోసా!



దేశవ్యాప్తంగా వివిధ సమస్యలను ఎదుర్కొంటున్న 18 లక్షల మంది పిల్లలను గుర్తించాం. 6 నుంచి 18 ఏళ్ల వరకు ఉన్న వీధి బాలలను సంరక్షించి ఆ తర్వాత వదిలేయకుండా 23 ఏళ్ల వరకు స్కిల్స్ అందించి, భవిష్యత్తు బాగుండేలా చూస్తున్నాం. కొన్ని వేల మంది పిల్లలు చదువుకొని, వివిధ నైపుణ్యాలు పెంచుకొని తమ జీవితం తాము ఆనందం గడుపుతున్నారు. నర్సులుగా, వివిధ రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నవారూ, ఉన్నవారు,, పెళ్లి చేసుకొని తమ పిల్లలకు మంచి భవిష్యత్తును అందిస్తున్న వారున్నారు. మా చేయూతతో తమ బాల్యంలోని చేదును దూరం చేసుకొని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

– అనూరాధ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రెయిన్ బో హోమ్స్

● సంభాషణ

కఠినమే కాదు ఫన్ కూడా అవసరమే!



రుబీనా ఏడాదిన్నర వయసున్న తన ఇద్దరు కూతుళ్ల పెంపకానికి సంబంధించి ఫరాఖాన్ నుంచి సలహాలు తీసుకుంది. ఫరాఖాన్ పిల్లల పెంపకం గురించి చెబుతూ 'నేను చాలా స్ట్రిక్ట్ తల్లిని, నా కొడుకు విషయంలో మరీ ఎక్కువ. వారు ఏం చేస్తున్నారు, ఎక్కడకు వెళుతున్నారు.. అనేది నాకు చెప్పకుండా ఉండరు. ప్రతీ సాయంత్రం నేనూ, నా ముగ్గురు పిల్లలూ ఒక చోట చేరుతాం. చాలా కబుర్లు చెప్పుకుంటాం. వారి రోజువారి జీవితంలో ఏం జరుగుతుందో రకరకాల మార్గాల ద్వారా తెలుసుకుంటూ ఉంటాను. నేను స్ట్రిక్ట్ మాత్రమే కాదు కూల్, ఫన్ తల్లిని కూడా' అని నవ్వుతూ చెప్పింది ఫరాఖాన్.

ఈ దర్శకురాలి మాటలకు మద్దతుగా ఆదిత్య బిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎంపవర్‌లోని మనస్తత్వవేత్త ముస్కాన్ మార్వా స్పందిస్తూ 'క్రమశిక్షణతోపాటు పాటు పిల్లలు స్వతంత్రంగా ఎదగడానికి, నేర్చుకోవడానికి సరైన మార్గదర్శకత్వం, ప్రేమ, అందుకు తగ్గ సమతుల్యత' ముఖ్యమని వివరించారు.

తల్లిదండ్రులు ఎదుర్కొనే అత్యంత సవాల్‌తో కూడిన పనులలో ఒకటి కఠినంగా ఉండటం. అయితే ఇందులో నిబంధనలు స్పష్టంగా ఉండాలి. పిల్లలు వారి రోజువారి దినచర్య నుంచి ప్రయోజనం పొందాలి. ఇది వారికి భద్రతను కూడా ఇస్తుంది. తల్లిదండ్రులు నియమాలను స్థిరంగా అమలు చేసినప్పుడు, స్పష్టమైన మార్గదర్శకాలను అందించినప్పుడు పిల్లల్లో నైపుణ్యాలు, బాధ్యత కూడా పెరుగుతాయి. ఈ విధానంలో సరైన మద్దతు ఉండటం అవసరం.

సినీ దర్శకురాలు, కొరియోగ్రాఫర్, నటి ఫరా ఖాన్ 'ఫుడ్ విత్ ఫరా' పేరుతో యూ ట్యూబ్ ఛానల్‌లో పేరొందారు. తన యూ ట్యూబ్ ఛానల్‌లో వంటలు చేస్తూ సెలబ్రిటీలతో సంభాషిస్తూ ఉంటారు. షో కి వచ్చే అతిథులలో నటి రుబీనా దిలైక్‌తో మాట్లాడుతూ ఆపిల్‌తో చీజ్, పనీర్ మసాలా వండింది. ఆ సంభాషణల్లో తమ పిల్లల పెంపకం గురించి ఇద్దరూ ప్రస్తావించారు.



కఠినం వర్సెస్ అతి...

● హద్దులను నిర్ణయించడం తప్పనిసరి. అయితే అధిక నియంత్రణ కూడా ఉంటుంది. ఇది అణచివేస్తున్నట్టుగా ఉండి తప్పుగా అర్థం చేసుకునే భావనలకు దారి తీస్తుంది.

● తల్లిదండ్రుల అతి క్రమశిక్షణ పిల్లల్లో ఆందోళన, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవడానికి కారణం అవుతుంది.

● కఠినం- అతి రెండూ వేరు వేరుగా చూడాలి. తల్లిదండ్రులు క్రమశిక్షణ పేరుతో కఠినంగా వ్యవహరించడంలో అతిని ప్రదర్శిస్తే పిల్లలు భావోద్వేగ పరంగా పెద్దలకు దూరం కావచ్చు. ముఖ్యంగా కౌమార దశలో ఉన్నవారు తమ స్వాతంత్ర్యాన్ని గట్టిగా చెప్పుకోవాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఇది వారి మానసిక వికాసానికి అడ్డంకి కావచ్చు.

క్రమశిక్షణ.. బ్యాలెన్స్...

సైకాలజిస్ట్ ముస్కాన్ మార్వా పిల్లల విషయంలో కఠినత్వాన్ని బ్యాలెన్స్ చేస్తూ ఎలా చూపాలో వివరించారు..

● హద్దులను సెట్ చేయాలంటే వయసుకు తగ్గ నిబంధనలు ఉండాలి. అవి సహేతుకంగా ఉండేలా, స్థిరంగా అమలు అయ్యేలా చూడాలి.

● బహిరంగ సంభాషణను పెంపొందించాలి. అంటే, పిల్లలు పెద్దల తీర్పుకు భయపడకుండా వారి ఆలోచనలు, భావాలను పంచుకోవడానికి తగిన వాతావరణాన్ని సృష్టించాలి.

● స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించాలి. సమస్యలు ఎలా వస్తాయో చెబుతూనే పిల్లలు వారి వయసుకు తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశాలనూ కల్పించాలి.

● ప్రయత్నాలను ప్రశంసించాలి. వారి పురోగతికి ఏమేం ప్రయత్నాలు చేయవచ్చో వివరించాలి. వారిలో మనో వికాస వృద్ధి కలిగేందుకు దోహదపడే అంశాలను వెలికి తీయాలి.

● వారి చర్యలను ఓ కంట కనిపెడుతూ వారిని నియంత్రించడంతోపాటు వారికి పూర్తి మద్దతునివ్వాలి. తగిన మానసిక బలాన్ని అందించాలి.

● పిల్లల వృద్ధిలో దశల వారీగా కొన్ని అంచనాలు ఉంటాయి. ఒక్కోసారి అనుకున్న అంచనాలకు చేరుకోలేకపోవచ్చు. ఇలాంటప్పుడు వారి వయసు, పరిపక్వత స్థాయికి అనుగుణంగా పెద్దల విధానాలు ఉండాలి.

తాము గీసిన గీత పిల్లలు దాటకూడదు అనే ధోరణి సరైనది కాదు. వారితో కఠినంగా ఉండాల్సిన సందర్భాలు, ప్రేమ, సంతోషం పంచాల్సిన సమయాలు .. రెండూ ఉంటాయి. వాటిని అమలు పరిచి, ఎదుగుదలకు సరైన మార్గదర్శకులుగా ఉండాలి.

ఆకాశంలో విరిసే హరివిల్లు మనం తినే పళ్లెంలో విరిస్తే ఎలా ఉంటుంది? అలా మన పళ్లెంలో హరివిల్లు విరియడమే రెయిన్ బో డైట్! రెయిన్ బోలో ఎన్ని రంగులు ఉంటాయో మన ప్లేట్‌లో కూడా అన్ని రంగుల ఆహారపదార్థాలు ఉండేలా చూసుకోవడమే రెయిన్ బో డైట్. రెయిన్‌బో డైట్‌లో చేర్చిన ఆహారాలు .. వాటి ప్రయోజనాలు ఏంటో తెలుసుకుందాం.

ప్లేటులో రెయిన్ బో

ఇంద్ర ధనుస్సులో ఏడు రంగులుంటాయని తెలుసు కదా... అలా ఏడు రంగులుండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఢోకా ఉండదు.



తెలుపు ఆహారం...

బంగాళదుంప, వెల్లుల్లి, ఉల్లిపాయలు, అల్లం, పుట్టగొడుగులు, క్యాలీఫ్లవర్, అరటిపండ్లు వంటి ఆహారాలు కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు శరీరాన్ని డామినేట్ చేయడానికి అనుమతించవు. వాటిలో ఎక్కువ ఫైబర్.. పొటాషియం ఉంటుంది.



ఎరుపు రంగు ఆహారం...

ఎరుపు రంగులో ఉండే కూరగాయలు .. పండ్లు హృదయానికి మేలు చేస్తాయి.. రెడ్ బెల్ పెప్పర్స్, దానిమ్మ, టమోటా, పుచ్చ, యాపిల్ వంటి వాటిలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది క్యాన్సర్.. తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచుతుంది. దీంతోపాటు వాటిలోని ఆంథోసైనిన్ సమ్మేళనం కండరాలను బలంగా ఉంచుతుంది.



పసుపు ఆహారం...

బొప్పాయి, పైనాపిల్, నిమ్మ, మామిడి, మొక్కజొన్న వంటి పండ్లు.. కూరగాయలలో లభించే బ్రోమెలైన్.. పాపైన్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. పసుపు ఆహారాలలో ఉండే లుటీన్ జియాక్సంతిన్ పిగ్మెంట్లు, వయస్సు సంబంధిత వ్యాధులకు వ్యతిరేకంగా ప్రభావవంతంగా ఉంటాయి.



నారింజ ఆహారం...

నారింజ రంగు పండ్లు.. కూరగాయలలో కెరోటిన్ ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నారింజ, గుమ్మడికాయలు, క్యారెట్లు.. పీచెస్ వంటివి కూడా జుట్టు.. చర్మానికి ప్రయోజనకరంగా ఉంటాయి.



ఆకుపచ్చ ఆహారం...

ఆకుపచ్చ కూరగాయలు ..పండ్లు మనకు ఎంతో మేలు చేస్తాయని ఎప్పటి నుంచే వైద్యులు చెబుతున్నమాటే. అవి చాలా యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి మధుమేహం.. గుండె జబ్బులతో పోరాడతాయి. ఇందులో ఫోలేట్.. ఐరన్ పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, మీరు మీ ఆహారంలో బచ్చలికూర, మెంతులు, క్యాబేజీ, బీన్స్, బఠానీలు, గుమ్మడికాయ, దోసకాయ, ద్రాక్ష.. పుదీనాను చేర్చుకోవాలి.



నీలం లేదా ఊదా రంగు ఆహారం...

బెర్రీలు, ఎర్రటి కూరగాయలు, నల్ల ద్రాక్ష, వంకాయ, వంటివి మెదడు సామర్థ్యానికి ఊతమిస్తాయి. వీటిలో ఉండే ఆంథోసైనిన్.. రెస్వెట్రాల్ ఎలిమెంట్స్ శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే, ఇవి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి.. శరీరంలో మంటను తగ్గిస్తాయి.

● యోగా

సమ్మర్‌లో చల్లగా!

యోగసాధన వల్ల మనసు, శరీరం శక్తిమంతం కావడమే కాదు, శరీరానికి చల్లదనం కూడా అందుతుంది. శరీరానికి అవసరమయ్యే భంగిమల ద్వారా వంగడం, స్ట్రెచ్ చేయడం వంటి వాటికి కొన్ని ఆసనాలు అంతర్గత వేడిని పెంచుతాయి. ముందుకు, సైడ్‌కు వంగడం, పడుకునే భంగిమలు శీతలీకరణ ప్రతిస్పందనను కలిగిస్తాయి.

అంతర్గత చల్లదనాన్ని అందించేవాటిలో...

● బాలాసన, ప్రసరిత పదోత్తనాసన, పరిఘాసన, అర్ధమత్స్యేంద్రాసన, జాను శీర్షాసన, బద్ధ కోణాసన, సుప్త మత్స్యేంద్రాసన, శవాసన ... బాగా పనిచేస్తాయి. ● ముందు నిశ్చల స్థితిలో కూర్చోవాలి. కదలికలను నెమ్మదిగా చేస్తూ, దీర్ఘ శ్వాసలు తీసుకుంటూ వదులుతూ ఉండాలి. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గడంతో పాటు శక్తి సమతుల్యం అవుతుంది. తల తిరగడం తగ్గుతుంది. నాడీ వ్యవస్థ మెరుగవుతుంది.

● శవాసన చేయడానికి... మ్యాట్‌పైన వెల్లకిలా పడుకొని, కాళ్లు, చేతులు విశ్రాంతిగా ఉంచాలి.



ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండటానికి మెడ కిందుగా, మోకాళ్ల కిందుగా రోల్ చేసిన మెత్తటి క్లాత్‌ను ఉంచవచ్చు.

ప్రయోజనాలు...

నాడీ వ్యవస్థపైన ఒత్తిడి తగ్గుతుంది. శరీరం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటుంది. ఆలోచనలు, అనుభూతులను లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఏకాగ్రత, మానసిక స్పష్టత మెరుగుపడుతుంది. అలసట తగ్గుతుంది, భావోద్వేగాలు, ఆత్మవిశ్వాసం, కరుణ పెరుగుతుంది, సంబంధాలను మెరుగుపరుస్తుంది. అందువల్ల శరీరం వేడెక్కినట్లు అనిపించినప్పుడు ఈ ఆసనాలను సాధన చేయడం మంచిది.

● మీకు తెలుసా?

మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో పోషకాలతో పాటు విటమిన్లది కూడా ప్రముఖ స్థానమే. కొన్ని విటమిన్లు మన శరీరానికి తప్పనిసరి. అందులో ముఖ్యంగా డి విటమిన్ ఇమ్యూనిటీని పెంచడానికి. ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. అయితే అధికంగా తీసుకోవడం వల్ల వ్యాధుల తీవ్రత పెరుగుతుంది.

● విటమిన్ ఏ క్యాప్సిల్స్ అధికంగా తీసుకోవడం ద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. గుండె సంబంధ వ్యాధులు పెరుగుతాయి. ● ఎముకల పెరుగుదలకు విటమిన్ డి అవసరం. అలాగని డి విటమిన్ ఎక్కువగా తీసుకుంటే ఎముకలు దెబ్బతింటాయి. శరీరంలో డి విటమిన్ పెరగడం వల్ల ఎముకలు బలహీనపడతాయి. ● జీర్ణ సమస్యలు ఏర్పడతాయి. ముఖ్యంగా మలబద్ధకం లేదా విరేచనాలు, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలు వంటివి ఏర్పడతాయి.

● అధికంగా డి విటమిన్ క్యాప్సిల్స్ వాడడం ద్వారా పెద్ద పరిమాణంలో మూత్రపిండాలకు హాని కలుగుతుంది మూత్రపిండాల వ్యాధి ఉన్నవారు వీటిని తగ్గిస్తే మంచిది.



సాక్షి సినిమా



ప్రముఖ నిర్మాత, తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ 'దిల్' రాజు, నిర్మాత హర్షిత్ రెడ్డి హైదరాబాద్‌లో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. డిప్యూటీ కాన్సుల్ జనరల్ స్టీవెన్ కానోలీ, వైస్ కాన్సుల్ హారియట్ వైట్, స్టెఫీ చెరియన్ ఈ బృందంలో ఉన్నారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య, ముఖ్యంగా సినిమా, సాంస్కృతిక రంగాల్లో సంబంధాలను ఎలా మరింత పటిష్ఠం చేసుకోవాలి, సినిమా సహ నిర్మాణాలు, నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల మారకము వంటి పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఇరు దేశాల మధ్య ముఖ్యంగా హైదరాబాద్ నగరం పైనా, తెలుగు సినిమాపైనా ఆస్ట్రేలియా ప్రతినిధులు ఎంతో ఆసక్తి, ఉత్సాహం చూపించినట్లుగా తెలిసింది. ఈ చర్చల ద్వారా ఇరు దేశాల సృజనాత్మక రంగాల మధ్య బంధం మరింత బలపడుతుందని, ఆస్ట్రేలియాలో తెలుగు సినిమాకు మరిన్ని మంచి అవకాశాలు వస్తాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

ఆస్కార్ అవార్డ్స్‌లో కొత్త విభాగం

● నూరవ అవార్డు వేడుక నుంచి 'స్టంట్ డిజైన్'కి అవార్డు



● 'ఆర్ఆర్ఆర్'లోని ఓ దృశ్యం

● ఆస్కార్ కమిటీ సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్టర్




''సినిమాల్లో మేజిక్ చేసేవాటిలో స్టంట్స్‌ది కీలక భాగం. ఇప్పుడు ఆస్కార్స్‌లో కూడా భాగం అయ్యాయి. కొత్తగా స్టంట్ విభాగాన్ని చేర్చి, ఇక ప్రతి ఏడాదీ అవార్డు ఇవ్వనున్నాం. 2027లో విడుదలైన సినిమాలకు 2028లో జరిగే నూరవ ఆస్కార్ అవార్డ్స్ వేడుకలో ఈ విభాగంలో అవార్డు అందించనున్నాం'' అని ఆస్కార్ అవార్డు కమిటీ సోషల్ మీడియా ద్వారా పేర్కొంది. ''సినిమా తొలినాళ్ల నుంచి స్టంట్ డిజైన్ అనేది ఫిల్మ్ మేకింగ్‌లో అంతర్భాగంగా ఉంది. సాంకేతిక, సృజనాత్మకత కలిగిన కళాకారుల పనిని గౌరవించడం మాకు గర్వకారణం'' అని అకాడమీ కమిటీ సీఈవో బిల్ క్రామెర్, అకాడమీ అధ్యక్షురాలు జానెట్ యాంగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా కొత్తగా చేర్చిన ఈ స్టంట్ విభాగాన్ని ప్రకటించి, ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హాలీవుడ్ చిత్రాలు 'ఎవ్రీథింగ్ ఎవ్రీ వేర్, ఆల్ ఎట్ వన్స్, మిషన్ ఇంపాజిబుల్' పోస్టర్స్‌తో పాటు తెలుగు చిత్రం 'ఆర్ఆర్ఆర్' పోస్టర్ కూడా ఉండటం భారతీయ సినిమాకి గర్వకారణం అనే చెప్పాలి. రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు పాటు...' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో కొత్త విభాగం 'స్టంట్ డిజైన్'ని చేర్చడం పట్ల రాజమౌళి 'ఎక్స్' వేదికగా ఈ విధంగా స్పందించారు.

వందేళ్ల నిరీక్షణ ఫలించింది - రాజమౌళి

''వందేళ్ల నిరీక్షణ ఫలించింది. 2027లో విడుదలయ్యే చిత్రాలకు కొత్తగా ఆస్కార్ స్టంట్ డిజైన్ విభాగం చేర్చడం ఆనందంగా ఉంది. ఈ విభాగంలో గుర్తింపును సాధ్యం చేసినందుకు డేవిడ్ లీచ్, క్రిస్ ఓ'హారా మరియు స్టంట్ కమ్యూనిటీకి, స్టంట్ వర్క్ శక్తిని గౌరవించనున్నందుకు బిల్ క్రామెర్, జానెట్ యాంగ్‌లకు ధన్యవాదాలు. ఈ కొత్త విభాగం ప్రకటించిన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'ఆర్ఆర్ఆర్' మూవీ యాక్షన్ విజువల్ మెరవడం చాలా సంతోషంగా ఉంది'' అని రాజమౌళి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం మహేశ్‌బాబు హీరోగా అంతర్జాతీయ స్థాయిలో భారీ బడ్జెట్‌తో ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు రాజమౌళి. ఈ చిత్రం 2027 మార్చి 25న రిలీజ్ కానుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ విషయం పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

దశాబ్దాల కల నెరవేరెగా... స్టంట్ విభాగంలో ఆస్కార్ అవార్డును ప్రదానం చేయాలనే విషయంపై దశాబ్దాలుగా కొందరు ఆస్కార్ అవార్డు నిర్వాహకులతో సమావేశమయ్యారు కానీ ప్రయోజనం లేకుండాపోయింది. అయితే స్టంట్ మేన్‌గా కెరీర్ ఆరంభించి, స్టంట్ కో-ఆర్డినేటర్‌గానూ చేసి, ఆ తర్వాత 'జాన్ విక్ (ఓ దర్శకుడిగా), డెడ్ పూల్ 2, బుల్లెట్ ట్రెన్, ది ఫాల్ గై' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన డేవిడ్ లీచ్ ఈ మధ్య కొందరితో కలిసి 'స్టంట్ డిజైన్' విభాగాన్ని చేర్చాలని కోరుతూ, గట్టిగా నినాదాలు చేశారు. దానికి తగ్గ ఫలితం దక్కింది. ఆ విధంగా స్టంట్ విభాగానికి ఆస్కార్ అవార్డ్స్‌లో గుర్తింపుని కోరిన కొందరి దశాబ్దాల కల నెరవేరినట్లు అయింది. ఇక గతంలో స్టంట్ విభాగంలో అవార్డు లేని సమయంలో 1967లో స్టంట్ డైరెక్టర్ యాకిమా కానట్ట్ గౌరవ ఆస్కార్ అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత 2013లో స్టంట్ డైరెక్టర్ హాల్ నీధమ్‌కి కూడా ప్రత్యేక ఆస్కార్ ప్రదానం చేసి, గౌరవించింది ఆస్కార్ అవార్డు కమిటీ. ఇక 2028లో జరగనున్న నూరవ ఆస్కార్ అవార్డుతో ఆరంభించి, ప్రతి ఏటా 'స్టంట్ డిజైన్' విభాగంలో అవార్డుని ప్రదానం చేయనున్నారు.


మేలోనే...



● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయిక. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. కాగా ఈ మూవీ విడుదలపై పలు వార్తలు హల్‌చల్ చేస్తుండటంతో యూనిట్ స్పందించింది. మే 9వ తేదీనే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''హరి హర వీరమల్లు'లో చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ సరికొత్తగా కనిపించనున్నారు'' అని యూనిట్ పేర్కొంది.

ఎండల్లో చెప్పులు లేకుండా తమన్నా నటించారు - డి. మధు



''ఓదెల 2' చిత్రకథ వినగానే తమన్నా ఎగ్జైట్ అయ్యారు. తొలిసారి ఆమె నాగసాధువు పాత్ర చేశారు. అద్భుతంగా నటించడంతో పాటు ఆ పాత్ర కోసం ఎంతో కష్ట పడ్డారామె. ఏప్రిల్, మే నెలల్లో ఎండల్లోనూ చెప్పులు లేకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. సరైన టైమ్‌లో సరైన కథ తమన్నా దగ్గరకెళ్లిందని నమ్ముతున్నాను'' అని నిర్మాత డి. మధు అన్నారు. తమన్నా లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఓదెల 2'. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న తెలుగు, హిందీలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా డి. మధు విలేకరులతో మాట్లాడుతూ- ''ఓదెల రైల్వే స్టేషన్' మూవీ నాకు బాగా నచ్చింది. అనుకోకుండా ఓ రోజు సంపత్ నందిగారు 'ఓదెల 2' కథని నాకు చెప్పడం... చాలా నచ్చడంతో ఈ ప్రాజెక్టు మొదలైంది. 'ఓదెల 2' కథ లాజికల్‌గా ఉంటుంది. అశోక్ తేజ చక్కగా తీశారు. ఇందులో ఉన్న థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేస్తాయి. అజినీష్ లోక్‌నాథ్ మ్యూజిక్, నేపథ్య సంగీతం చాలా బాగుంటాయి. సౌందర్ రాజన్‌గారు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. వశిష్ఠ, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, హెబ్బా పటేల్ పాత్రలన్నీ కూడా చాలా బాగుంటాయి. ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలని, అలాగే మంచి సక్సెస్ అందుకోవాలనే ప్యాషన్‌తో బడ్జెట్ గురించి ఆలోచించకుండా 'ఓదెల 2'ని గ్రాండ్‌గా తీశాం. ఇక భావోద్వేగాలున్న చిత్రాలతో పాటు లేడీ ఓరియంటెడ్ కథలంటే నాకు ఇష్టం'' అన్నారు.

నా దృష్టిలో సంపూర్ణేష్ స్టార్ - సాయి రాజేశ్



● సంపూర్ణేష్, సాయి రాజేశ్, సంజోష్

''సంపూర్ణేష్ బాబుతో నేను సినిమా తీసి ('హృదయ కాలేయం') 13 ఏళ్లయింది. ఆ మూవీ సూపర్ హిట్ తర్వాత ఆర్థికంగా నన్ను ఆదుకున్నాడు. పెద్ద మొత్తంలో అడ్వాన్స్ కట్టి తను నాకు ఓ కారు, ఇల్లు ఇప్పించాడు. తన సంపాదనలో అందరికీ సహాయం చేస్తుంటాడు. నా దృష్టిలో తను స్టార్. 'సోదరా' సంపూ కెరీర్‌లో మంచి విజయం సాధించాలి'' అని డైరెక్టర్ సాయి రాజేశ్ అన్నారు. సంపూర్ణేష్ బాబు, సంజోష్ హీరోలుగా, ప్రాచీ బంసాల్, ఆర్తీ గుప్తా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోదరా'. మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో చంద్ర చగ్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ- ''సోదరా' లాంటి చిన్న సినిమాలను ప్రోత్సాహించాలనే బాధ్యతతో ఈ చిత్రాన్ని థియేటర్‌లో ఒక షో సొంతంగా బుక్ చేసి, అందరికీ చూపిస్తాను'' అన్నారు. ''సోదరా'లో నా పాత్ర అందరి హృదయాలను హత్తుకుంటుంది'' అని బాబూ మోహన్ చెప్పారు. ''అప్‌డేట్ అయిన తమ్ముడు, అమాయకుడైన అన్నకు మధ్య జరిగే స్వచ్ఛమైన కథ 'సోదరా'' అన్నారు సంపూర్ణేష్ బాబు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ప్రేమతో ఓ పనివాడు...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం మిస్టర్ హౌస్ కీపింగ్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సౌత్ సినిమాలకు ఓ రకమైన నేటివిటీ ఉంటుంది. ఆ చిత్రాలు భారతదేశంలోని ఏ భాషలో అనువాదమైనా ప్రేక్షకులు మన కథలు అనుకొని ఆదరిస్తారు. చిన్న లైన్ తీసుకుని ఆ లైన్‌కు రసవత్తరమైన స్క్రీన్‌ప్లే జోడించి, ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు సౌత్ దర్శకులు. అందులో తమిళ దర్శకులు కూడా ఉన్నారు. ఆ కోవలోనే తమిళ దర్శకుడైన అరుణ్ రవిచంద్రన్ ఓ రొటీన్ లవ్ స్టోరీలా తలపించే చిన్న లైన్ తీసుకుని, దానికి బ్యాక్‌గ్రౌండ్‌లో చక్కటి మెసేజ్‌ని ఇస్తూ, అద్భుతమైన కామెడీ అనే మసాలాని జోడించి 'మిస్టర్ హౌస్ కీపింగ్' అనే మెగా థాళి లాంటి సినిమా భోజనాన్ని ప్రేక్షకుడి ముందు వడ్డించారు. ఇంకేముందీ... ప్రేక్షకులు లొట్టలేసుకొని మరీ ఆస్వాదిస్తున్నారు ఈ సినిమాని. మరి... అంతలా ఏముంది ఈ సినిమాలో ఓసారి చూద్దాం. హానెస్ట్ రాజ్ కాలేజ్ రోజుల నుంచి ఇసాయ్‌తో ప్రేమలో ఉంటాడు. కానీ ఇసాయ్ మాత్రం రాజ్‌ను ప్రేమించదు... సరి కదా హానెస్ట్ రాజ్ చేసే పనులతో విసిగి వేసారి పోయి ఉంటుంది. హానెస్ట్ రాజ్ మరీ బద్ధకస్తుడు. ఎంతలా అంటే తిన్నాక హోటల్‌లో సర్వ్ చేసినట్లు ఇంట్లో కూడా చేతులు కడుక్కోవడానికి ఫింగర్ బౌల్‌ని కోరుకుంటాడు. హానెస్ట్ రాజ్ అమ్మకు కొడుకు అంటే బాగా గారాబం. తండ్రి మాత్రం రోజూ రాజ్ మీద చిటపటలాడుతుంటాడు. ఓ రోజు అనుకోకుండా తన తండ్రి ఫోన్ ద్వారా ఓ బ్లాక్ మెయిలింగ్ గ్యాంగ్‌కి కనెక్ట్ అవుతాడు రాజ్. వాళ్లకి 5000 రూపాయలు ఇవ్వవలసి వస్తే తెలియకుండానే హౌస్ కీపింగ్ టీమ్‌లో చేరతాడు. అనుకోకుండా హానెస్ట్ రాజ్ తాను కాలేజీలో ప్రేమించిన ఇసాయ్ వాళ్లింటికే హౌస్ కీపింగ్‌కి వెళతాడు. ఇసాయ్ ఇల్లు అని రాజ్‌కి తెలిసి నాలుక్కరుచుకుని ఇసాయ్‌ని బ్రతిమలాడి పనికి కుదురుతాడు. ఇసాయ్‌కి తన కొలీగ్ హరీష్ నచ్చి, పెళ్లి కుదుర్చుకుంటుంది. కానీ ఇసాయ్ ఇంట్లో పని చేస్తున్న రాజ్ మాత్రం ఇసాయ్ తనను ప్రేమిస్తుందని అనుకుంటాడు. మరి... పనివాడిగా వచ్చిన రాజ్... ఇసాయ్ మనసు గెలుచుకుంటాడా? హరీష్‌తో పెళ్లి కుదిరిన ఇసాయ్... రాజ్ ప్రేమను అంగీకరిస్తుందా? అన్నది ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న 'మిస్టర్ హౌస్ కీపింగ్'లో చూడాల్సిందే. నేటి తరం చూడాల్సిన సినిమా ఇది. అలాగే లివింగ్ టు గెదర్ అనే ట్రెండ్‌ను విడమర్చి సినిమా భాషలో అర్థం చెప్పిన దర్శకుడికి హ్యాట్సాఫ్. ఉద్యోగస్తులు తమ తల్లి, తండ్రులతో కలిసి చూసి, చాలా తెలుసుకోవాల్సిన సినిమా ఇది. వాచ్ దిస్ విత్ యువర్ ఫ్యామిలీ.

– హరికృష్ణ ఇంటూరు



స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▲	1,310	75,157
నిఫ్టీ ▲	429	22,829

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్‌	16,725	▲ 429
డోజోన్స్‌	40,336	▲ 338
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,105	▼ 22
డాక్స్‌	20,374	▼ 189
షాంఘై	3,238	▲ 15
నికాయ్‌	33,586	▲ 1,023

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	93,353
బంగారం (99.5 స్వచ్ఛత)	92,979
వెండి (కిలో)	92,929

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	84.21	87.89
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	110.43	115.19
€	యూరో	ఎస్‌బీఐ	95.56	99.93
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	49.00	71.00
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	51.40	56.22
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	62.90	67.53
SAR	సౌదీ రియాల్‌	[illegible]	22.04	23.58
UAE D	యూఏఈ దిర్హామ్‌	[illegible]	22.54	24.32
¥	చైనా యువాన్‌	[illegible]	10.91	12.74

పసిడి.. ఆల్‌టైమ్‌ హై

- ఒకేరోజు రూ.6,250 పెరుగుదల
- రూ.96,450కు చేరిక
- అంతర్జాతీయంగానూ కొత్త గరిష్టం
- ట్రంప్‌ టారిఫ్‌ వార్‌ ఎఫెక్ట్‌



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరిణామాలతో బంగారం భారీగా పెరిగింది. 10 గ్రాములకు (99.9 స్వచ్ఛత) ఒకే రోజు రూ.6,250 ఎగసి ఢిల్లీ మార్కెట్లో ఆల్‌టైమ్‌ గరిష్టం రూ.96,450 స్థాయికి చేరింది. స్థానిక జ్యుయలర్లు, రిటైలర్ల నుంచి అధిక డిమాండ్‌ కనిపించినట్టు ఆల్‌ ఇండియా సరాఫా అసోసియేషన్‌ ప్రకటించింది. యూఎస్‌–చైనా మధ్య వాణిజ్య యుద్ధానికి తెరలేవడంతో సురక్షిత సాధనంగా పరిగణించే బంగారానికి అంతర్జాతీయంగా డిమాండ్‌ పెరిగిందని.. దీంతో జీవిత కాల గరిష్టానికి చేరినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. 99.5 స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.6,250 లాభపడి రూ.96,000 స్థాయి వద్ద క్లోజయ్యింది. వెండి ధర కిలోకి రూ.2,300 పెరగడంతో రూ.95,500 స్థాయికి చేరుకుంది. సురక్షిత సాధనమైన బంగారంలోకి పెట్టుబడులు రావడంతో ర్యాలీకి దారితీసినట్టు కోటక్‌ సెక్యూరిటీస్‌ కమోడిటీ రీసెర్చ్‌ ఏవీపీ కేనత్‌ చాయ్లా తెలిపారు. చైనా–అమెరికా మధ్య ప్రతీకార సుంకాలతో అంతర్జాతీయ మందగమనం ఏర్పడి, డాలర్‌ 100 మార్క్‌ దిగువకు చేరుకోవచ్చన్న ఆందోళనలు నెలకొన్నట్టు చెప్పారు. ఇది కూడా బంగారం ధరలకు మద్దతుగా నిలిచినట్టు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ఔన్స్‌కు 80 డాలర్లు పైగా లాభపడి 3263 డాలర్లకు చేరుకుంది. ఇది సరికొత్త ఆల్‌టైమ్‌ గరిష్ట స్థాయి.


త్వరలో రూ. లక్ష మార్క్‌..!

బంగారం త్వరలోనే 10 గ్రాములకు రూ.లక్ష మార్క్‌ను చేరుకునే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థలు యూబీఎస్, మోర్గాన్‌ స్టాన్లీ 2025లో బంగారం ఔన్స్‌కు 3,500 డాలర్ల మార్క్‌ను చేరుకోవచ్చని అంచనా వేశాయి. అంటే ఇక్కడి నుంచి బంగారం మరో 250 డాలర్లు ర్యాలీ చేసే అవకాశం ఉంది. ఈ ప్రకారం దేశీ మార్కెట్లో బంగారం రూ.1.04 లక్షలకు చేరుకోవచ్చు. 'టారిఫ్‌లపై అనిశ్చితి, బలహీన వృద్ధి, అధిక ద్రవ్యోల్బణం, భౌగోళిక ఉద్రిక్తతలతో బంగారంలో పెట్టుబడులు మరింత ఆశావహంగా కనిపిస్తున్నాయి' అని యూబీఎస్‌ వ్యూహకర్త జానీ టెవెస్‌ పేర్కొన్నారు.

టారిఫ్‌ పాజ్‌.. మార్కెట్‌ జోష్‌

సెన్సెక్స్‌ 1,310 పాయింట్లు ప్లస్‌

- 429 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- రూ.7.85 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: భారత్‌తో సహా 75 దేశాలపై ట్రంప్‌ సుంకాలను మూడు నెలలు వాయిదా వేయడంతో దేశీయ స్టాక్‌ సూచీలు రెండు శాతం మేర ర్యాలీ చేశాయి. ద్రవ్యోల్బణ ఆందోళనలు పరిమితం చేస్తూ క్రూడాయిల్‌ ధరలు దిగిరావడం, అమెరికా కరెన్సీ డాలర్‌ క్షీణత అంశాలు ఇన్వెస్టర్లకు విశ్వాసాన్నిచ్చాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్‌ 1,310 పాయింట్లు పెరిగి 75వేల స్థాయిపైన 75,157 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 429 పాయింట్లు బలపడి 22,829 వద్ద నిలిచింది. సూచీల లాభాల నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్‌ఈలోని లిస్టెడ్‌ కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ శుక్రవారం ఒక్కరోజే రూ.7.85 లక్షల కోట్లు పెరిగి రూ.401.67 లక్షల కోట్లు(4.66 ట్రిలియన్‌ డాలర్లు)కు చేరింది.

రోజంతా లాభాలు: సెన్సెక్స్‌ 988 పాయింట్ల లాభంతో 74,835 వద్ద, నిఫ్టీ 296 పాయింట్లు పెరిగి 22,695 వద్ద మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా భారీ లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 1,620 పాయింట్లు ఎగసి 75,467 వద్ద, నిఫ్టీ 525 పాయింట్లు బలపడి 22,924 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి.

రంగాల వారీగా ఇండెక్సులు: డాలర్‌ బలహీనతతో ఎగుమతులపై లాభాలు ఆర్జించే మెటల్, ఫార్మా షేర్లకు భారీ డిమాండ్‌ లభించింది. బీఎస్‌ఈలో మెటల్‌ ఇండెక్స్‌ 4.29%, కమోడిటీస్‌ 3.50%, కన్జూమర్‌ డ్యూరబుల్స్, యుటిలిటీస్‌ సూచీలు 3% ర్యాలీ చేశాయి. విద్యుత్, ఇంధన, ఇండస్ట్రియల్స్, కన్జూమర్‌ డిస్క్రెషనరీ, హెల్త్‌కేర్‌ సూచీలు రెండుశాతం పెరిగాయి. వొలటాలిటీ ఇండెక్స్‌(వీఐఎక్స్‌) 6% క్షీణించి 20.11 స్థాయికి దిగివచ్చింది. బీఎస్‌ఈ స్మాల్‌ క్యాప్‌ ఇండెక్స్‌ 3%, మిడ్‌ క్యాప్‌ సూచీ రెండు శాతం లాభపడ్డాయి.

రెండు షేర్లకే నష్టాలు: సెన్సెక్స్‌లో 30 షేర్లలో ఏషియన్‌ పెయింట్స్‌ (0.64%), టీసీఎస్‌(0.43%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 28 షేర్లు 5% వరకు ర్యాలీ చేశాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ 2.33%, రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ 3%, ఐసీఐసీఐ బ్యాంకు 1%, ఎయిర్‌టెల్‌ 2.50%, కోటక్‌ మహీంద్రా బ్యాంకు, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్‌ 3% రాణించి ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్‌ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 807 పాయింట్లు కావడం విశేషం.

- నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఐటీ దిగ్గజం టీసీఎస్‌ షేరు డీలాపడింది. బీఎస్‌ఈలో అరశాతం పతనమై రూ.3232 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 1% పైగా నష్టపోయి రూ.3205 వద్ద కనిష్టాన్ని తాకింది.


రూపాయి వరుస నష్టాలకు చెక్‌



అమెరికా డాలర్‌ అనూహ్య క్షీణత, దేశీయ ఈక్విటీ మార్కెట్‌ బలమైన ర్యాలీతో డాలర్‌ మారకంలో రూపాయి విలువ 58 పైసలు బలపడి 86.10 వద్ద స్థిరపడింది. దీంతో దేశీయ కరెన్సీ నాలుగు రోజుల వరుస నష్టాలకు ముగింపు పడినట్లైంది. ఉదయం ఫారెక్స్‌ మార్కెట్లో 86 వద్ద మొదలైంది. రోజంతా లాభాల్లో ట్రేడై ఇంట్రాడే గరిష్టం వద్ద స్థిరపడింది. ''ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్‌ ఇండెక్స్‌ 4 ఏళ్లలో తొలిసారి 100 స్థాయికి దిగిరావడంతో పాటు క్రూడాయిల్‌ ధర తగ్గడం కూడా కలిసొచ్చాయి. వచ్చే వారంలో దేశీయ కరెన్సీ 85.75–86.25 శ్రేణిలో ట్రేడవ్వొచ్చు'' అని ఫిన్‌రెక్స్‌ ట్రెజరీ అడ్వైజర్స్‌ ఎండీ అనిల్‌ కుమార్‌ బన్సాలీ తెలిపారు.

తయారీ, మైనింగ్‌.. ప్చ్‌

- ఫిబ్రవరిలో ఐఐపీ వృద్ధి 2.9 శాతానికి పరిమితం
- 6 నెలల కనిష్టానికి డౌన్‌



న్యూఢిల్లీ: తయారీ, మైనింగ్, విద్యుదుత్పత్తి రంగాల పేలవ పనితీరు కారణంగా ఫిబ్రవరిలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి నెమ్మదించింది. ఆరు నెలల కనిష్టమైన 2.9 శాతానికి పరిమితమైంది. చివరిసారిగా గతేడాది ఆగస్టు తర్వాత ఇదే కనిష్ట స్థాయి. అప్పట్లో వృద్ధి సున్నాగా నమోదైంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) విడుదల చేసిన డేటాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మరోవైపు, జనవరి పారిశ్రామికోత్పత్తి వృద్ధి గణాంకాలను 5 శాతం నుంచి (ప్రొవిజనల్‌) 5.2 శాతానికి సవరించారు. ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో మైనింగ్‌ వృద్ధి మందగించనున్నప్పటికీ, తయారీ, విద్యుదుత్పత్తి మెరుగుపడొచ్చని రేటింగ్‌ ఏజెన్సీ ఇక్రా చీఫ్‌ ఎకానమిస్ట్‌ అదితి నాయర్‌ తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో తయారీ వృద్ధి 4.9 శాతంగా ఉండగా తాజాగా 2.9 శాతానికి పరిమితమైంది. మైనింగ్‌ ఉత్పత్తి 8.1 శాతం నుంచి 1.6 శాతానికి తగ్గింది. విద్యుదుత్పత్తి 7.6 శాతం నుంచి 3.6 శాతానికి దిగి వచ్చింది. 2025 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌–ఫిబ్రవరి మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 6 శాతం నుంచి 4.1 శాతానికి నెమ్మదించింది.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..

ఈక్విటీ పెట్టుబడులు.. 11 నెలల కనిష్టానికి	ఓలా ఎలక్ట్రిక్‌ తొలి 'రోడ్‌స్టర్‌ ఎక్స్‌' బైక్‌

ఆస్ట్రియా కంపెనీలకు ఆహ్వానం

భారత్‌లో పెట్టుబడులకు పలు అవకాశాలు • ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ భారత్‌లో ఇన్వెస్ట్‌ చేయమంటూ ఆస్ట్రియన్‌ కంపెనీలకు తాజాగా ఆహ్వానం పలికారు. నూతన, వర్ధమాన రంగాలలో ఇందుకు పలు అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఏర్పాటైన ఇండియా– ఆస్ట్రియా బిజినెస్‌ రౌండ్‌టేబుల్‌ సందర్భంగా భారత్‌లో పెట్టుబడి అవకాశాలను వినియోగించుకోవలసిందిగా సూచించారు. ఆర్థిక పురోభివృద్ధి, సులభతర బిజినెస్‌ నిర్వహణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో దేశం వేగంగా ముందుకెళుతున్నట్లు తెలియజేశారు. వర్ధమాన రంగాలలో పలు అవకాశాలు పుడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్‌ హైడ్రోజెన్, ఎలక్ట్రిక్‌ వాహనాలు, డిజిటల్‌ పబ్లిక్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్‌లను ప్రస్తావించారు. ఆసియా, దక్షిణ ప్రపంచానికి భారత్‌ అద్భుతమైన గేట్‌వేగా అభివర్ణించారు. ఇండియా– ఆస్ట్రియా ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్యం మరింత బలపడుతుందని, అత్యధిక అవకాశాలున్నాయని వ్యాఖ్యానించారు. భారత్‌లో విస్తరించిన తయారీ, సామర్థ్యాలను ప్రస్తావిస్తూ ఆస్ట్రియన్‌ కంపెనీలు కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. తద్వారా దేశీయంగా లభించే అత్యున్నత ఐటీ, డిజిటల్‌ నైపుణ్యాలను వినియోగించుకోవచ్చని చెప్పారు.

సాక్షి పాత్రికేయులపై కేసులు ఎత్తివేయాలి

టీడబ్ల్యూజేఎఫ్‌ డిమాండ్‌

చార్మినార్‌ (హైదరాబాద్‌): సాక్షి దినపత్రిక సంపాదకుడు ధనంజయరెడ్డితో సహా ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్‌ జర్నలిస్ట్స్‌ ఫెడరేషన్‌ (టీడబ్ల్యూజేఎఫ్‌) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్‌ తదితరులు ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. నిజాన్ని నిర్భయంగా పాఠకులకు అందించిన 'సాక్షి' దినపత్రికపై కేసు నమోదు చేయడం ఏపీ ప్రభుత్వానికి తగదని పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాల్సిన ఏపీ ప్రభుత్వం.. ఎడిటర్‌తో పాటు విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. 'సాక్షి' జర్నలిస్టులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు.

దుర్మార్గం.. అక్రమం

కూటమి ప్రభుత్వంపై జర్నలిస్టుల మండిపాటు



విశాఖపట్నంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

సాక్షి, నెట్‌వర్క్‌ : 'ఒక సంఘటనను యథాతథంగా వాస్తవాలతో ప్రచురించడం తప్పా? నిజాలు రాస్తే గొంతు నొక్కేస్తారా? హత్యను హత్య అని చెప్పినందుకు 'సాక్షి' ఎడిటర్‌ ఆర్‌.ధనంజయరెడ్డి, మరో ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా కేసు పెట్టించడం దుర్మార్గం. ఇది ముమ్మాటికీ స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. ఏపీ, తెలంగాణ ఎడిషన్లలో ఒక వార్త ఒకేలా లేదని చెబుతూ కేసు పెట్టడం హాస్యాస్పదం. ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా కేసు పెట్టడం అంటే ముమ్మాటికీ కక్ష సాధింపే. తక్షణమే ఆ కేసును ఎత్తివేయాలి' అని రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నేతలు, జర్నలిస్టులు శుక్రవారం డిమాండ్‌ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లో, ఇతర పట్టణాల్లో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

పత్రికా స్వేచ్ఛపై కాల 'కూట' విషం

సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై తప్పుడు కేసు దుర్మార్గం

ఏపీ పోలీసుల చర్యలపై ప్రెస్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియాకు ఫిర్యాదు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి

సాక్షి, అమరావతి : అబద్ధపు పునాదులతో మోసాల గోడలు కట్టి.. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అసలు రంగు బయట పడటానికి ఎంతో కాలం పట్టలేదు. ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన పాలకులు సోషల్‌ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి అరెస్టులు చేయించం తప్ప ప్రజలకు చేసిన మంచి ఒక్కటీ లేదు. రాజకీయ కక్షలతో అమాయకులను, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను నిర్దాక్షిణ్యంగా హత్యలు చేయడం మినహా ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి అంటూ ఏదీ లేదు. ఇలాంటి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను, అన్యాయాలను 'సాక్షి' వెలుగులోకి తెస్తోంది. అధికారం అడ్డం పెట్టుకుని సాగిస్తున్న అరాచకాలపై అక్షర కొరడా ఝుళిపిస్తోంది. పాలనలో వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ, అవినీతి బాగోతాలను బయట పెడుతూ, ప్రజలకు వాస్తవాలను తెలియజెబుతుంటే తట్టుకోలేకపోతోంది కూటమి ప్రభుత్వం. సాక్షితో నేరుగా సమరం సాగించేంత నిజాయితీ తమ వద్ద లేదని గ్రహించి దొంగ దెబ్బ తీసేందుకు యత్నిస్తోంది. ఇందులో భాగంగా 'సాక్షి' తెలంగాణ, ఆంధ్రలో వచ్చిన ఒక వార్తను పట్టుకుని.. రెండు వార్తలూ ఒకేలా లేవంటూ.. ఇది భారీ తప్పిదమన్నట్లు తప్పుడు కేసు పెట్టించింది. ఏకంగా పత్రిక ఎడిటర్‌ ఆర్‌.ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు పాత్రికేయులపై అనేక సెక్షన్లతో ఎఫ్‌ఐఆర్‌ సైతం నమోదు చేయించింది. ఈ దుర్మార్గ చర్యను రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన మేధావులు, ప్రజలు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పాత్రికేయులు రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు, ప్రదర్శనలతో రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై నిరసన తెలిపారు. సాక్షి ఎడిటర్, ఆరుగురు పాత్రికేయులపై పెట్టిన తప్పుడు కేసును తక్షణమే ఉప సంహరించాలని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఎక్కడికక్కడ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఏపీ పోలీసుల చర్యలపై ప్రెస్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియాకు ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రుల నిర్మాణంలో వేగం పెంచండి

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న మూడు టిమ్స్‌తోపాటు వరంగల్‌ హెల్త్‌సిటీ, వైద్య కళాశాలల భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం మొదలయ్యేలోగా ఈ పనులన్నీ కొలిక్కి రావాలని స్పష్టం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని రాజీవ్‌ ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ కార్యాలయంలో ఆయా ఆస్పత్రుల నిర్మాణ పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనాల నిర్మాణం పూర్తయిన వెంటనే ఆస్పత్రుల్లో వైద్య సేవలు ప్రారంభించేందుకు ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉండాలని సూచించారు. అల్వాల్‌ సూపర్‌ స్పెషాలిటీ హాస్పిటల్‌ను న్యూరో సైన్సెస్, సనత్‌నగర్‌ను కార్డియాక్‌ సైన్సెస్, కొత్తపేటను గ్యాస్ట్రో సైన్సెస్‌ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఉస్మానియా వైద్య విద్యార్థులకు పట్టాల ప్రదానం



ఉస్మానియా మెడికల్‌ కాలేజీ, ఆస్పత్రి కోట్లాది మంది రోగులకు ఆశాదీపంగా నిలుస్తున్నా యని మంత్రి రాజనర్సింహ అన్నారు. శుక్రవారం రాత్రి ఉస్మానియా మెడికల్‌ కాలేజీ 174వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన.. విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవాభావంతో వైద్య వృత్తిని కొనసాగించాలని సూచించారు.

పంట ఇంటికి వచ్చే వరకు రైతుకు టెన్షనే

- శాసన మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- అగ్రి, హార్టికల్చర్‌ సొసైటీ ఆధ్వర్యంలో రైతు మహోత్సవం –2025 ప్రారంభం
- 14 వరకు కొనసాగనున్న 'రైతు మహోత్సవం'
- ప్రభుత్వం కొత్తగా విత్తన చట్టం తీసుకురాబోతోంది: రైతు కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డి



రైతు మహోత్సవంలో ఆయిల్‌పామ్‌ గెలలను పరిశీలిస్తున్న శాసనమండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రైతు కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్‌/గన్‌ఫౌండ్రీ: వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని శాసన మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌ రెడ్డి అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌లో అగ్రి, హార్టికల్చర్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రైతు మహోత్సవం –2025'ని శుక్రవారం ఆయన రైతు కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ వ్యవసాయం అంటేనే కష్టాలతో కూడుకున్నదని, వ్యవసాయ పనుల్లో యంత్రాలను ఉపయోగించడం ద్వారా శ్రమను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయని, పండిన పంట ఇంటికి వచ్చే వరకూ రైతుకు ఆందోళనేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను చదువుకునే రోజుల నుంచి వ్యవసాయం చేస్తున్నా. రాజకీయాల్లో ఉన్నప్పటికీ వారానికి రెండు రోజులైనా వ్యవసాయానికి సమయం కేటాయిస్తా. అప్పుడే నాకు ఆనందంగా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. విదేశాలనుంచి పెద్దఎత్తున పామాయిల్‌ను దిగుమతి చేస్తున్నామని, ఈ దిగుమతులను తగ్గించడానికి ఆయిల్‌పామ్‌ సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. రైతు కమిషన్‌ చైర్మన్‌ కోదండరెడ్డి మాట్లాడుతూ.. సమష్టి వ్యవసాయం తోనే రైతుకు లాభం చేకూరుతుందని అన్నారు. ప్రస్తుతం రైతు ఒంటరి అయ్యాడని, కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోందని విచారం వ్యక్తం చేశారు. రైతు కమిషన్‌ రైతులకోసం అనేక కార్యక్రమాలు చేస్తోందని, అందులో భాగంగానే ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంచేందుకు రంగారెడ్డి జిల్లాలో మూడు గ్రామాలను పైలట్‌ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని చెప్పారు. విత్తనాన్ని తయారు చేసుకునే బాధ్యత రైతుదేనని, అయితే ఇప్పుడు విత్తనం బహుళజాతి కంపెనీల చేతుల్లోకి పోయిందని, విత్తన కంపెనీలే రైతులను శాసిస్తున్నాయని అన్నారు. పండించిన పంటపై రైతుకు హక్కు లేకుండా పోతోందని, మార్కెట్‌లో దళారుల దందా కూడా పెరిగిపోయిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా విత్తన చట్టం కూడా తీసుకురాబోతున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రైతు ఉత్పత్తులు, పరికరాలు, సీడ్, ఫెర్టిలైజర్‌ స్టాల్స్‌ని ఏర్పాటు చేశారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 14వ తేదీ వరకు రైతు మహోత్సవం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కమిషన్‌ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, భవానీరెడ్డి, సునీల్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలు తెలుసుకున్నాం



మేం ప్రకృతి వ్యవసాయం చేస్తాం. ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ సంబంధిత స్టాల్స్‌ ప్రతినిధులను కలసి మేం పండించిన పంటలు, మార్కెటింగ్‌ సమాచారాన్ని తెలుసుకున్నాం. చెట్టు కొమ్మల కటింగ్‌ పరికరాల నుంచి, వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం వరకు చాలా అంశాలు ఇక్కడ ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఆధునిక విధానాలను తెలుసుకున్నాం. కొత్త విషయాలు తెలుసుకున్నామని సంతోషంగా ఉంది.

– గోరిక, నాగేశ్, మల్లేశ్‌. సందర్శకులు, జోగుళాంబ గద్వాల జిల్లా

డిమాండ్‌ ఉన్న పంటలతో మేలు

మామిడి, ఇతర రకాలకు సీజన్‌లో మంచి ధర లభించడం కష్టంగా మారింది. రైతులు ప్రత్యామ్నాయాలవైపు ఆలోచించాలి. మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్న అవకాడో, ఇతర పండ్ల తోటల పెంపకంపై దృష్టిసారించాలి. తెలుగు రాష్ట్రాల వాతావరణానికి అనువైన తోటలు మంచి ఫలితాలు ఇస్తాయి.

– ఎం.బాలనాగిరెడ్డి, ప్లాంట్‌ నర్సరీ, గుంటూరు

30 ఏళ్లకు కూతురు చెంతకు తల్లి

- 6 నెలల కిందట ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టు వసంత
- కూతురు భవానీకి ఆమెను అప్పగించిన కాంకేర్‌ పోలీసులు



కూతురు భవానీకి తల్లి వసంతను అప్పగిస్తున్న ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం కాంకేర్‌ జిల్లా ఎస్పీ కల్యాణ్‌

కోరుట్ల: మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో గడిపి, సుమారు ముప్పై ఏళ్ల తరువాత ఆ తల్లి.. శుక్రవారం కూతురు చెంతకు చేరింది. కోరుట్లకు చెందిన పసుల రాంరెడ్డి 1981 నుంచి సుమారు ఇరవై ఏళ్ల పాటు మావోయిస్టు ఉద్యమంలో పని చేశారు. ఆయన ఉత్తర తెలంగాణ స్పెషల్‌ జోనల్‌ కమిటీ కార్యదర్శిగా ఉన్న సమయంలో 2001లో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం మద్దిమల్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. రాంరెడ్డి భార్య వసంత కూడా మావోయిస్టు పార్టీలో ఉన్నారు. భర్త చనిపోయిన తరువాత ఆమె పాతికేళ్ల పాటు ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని బస్తర్‌ డివిజన్‌ కార్యదర్శిగా పనిచేశారు. ఆరు నెలల క్రితం అనారోగ్య కారణాలతో ఛత్తీస్‌గఢ్‌ పోలీసుల ఎదుట లొంగిపోయారు. అయితే వసంతను ఎవరికి అప్పగించాలన్న సమస్య తలెత్తడంతో రెండు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు, తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తెలంగాణ ఇంటెలిజెన్స్‌ పోలీసులు పసుల రాంరెడ్డి బంధువులను విచారించగా.. రాంరెడ్డి–వసంతలకు 30 ఏళ్ల క్రితం ఓ కూతురు పుట్టిందని.. ఆమెను గుట్టుచప్పుడు కాకుండా ముంబైలోని బంధువుల వద్ద ఉంచారని తెలుసుకున్నారు. ప్రస్తుతం వసంత కూతురు భవానీ, వరంగల్‌లో ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారని తెలుసుకుని ఆమెకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో భవానీ శుక్రవారం తన బంధువులతో కలసి కాంకేర్‌ జిల్లా ఎస్పీ కల్యాణ్‌ను కలసి ఆయన సమక్షంలో తల్లి వసంతను అక్కున చేర్చుకున్నారు. అనంతరం స్వగ్రామానికి తీసుకువచ్చారు.



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ ఓటమి

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ పోరాటం ముగిసింది. మొనాకోలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-షెల్టన్ ద్వయం 2-6, 6-4, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో మాన్యుయెల్ గినార్డ్ (ఫ్రాన్స్)-రొమైన్ అర్నియోడో (మొనాకో) జంట చేతిలో ఓడిపోయింది. బోపన్న-షెల్టన్ జోడీకి 47,810 యూరోల (రూ. 46 లక్షల 58 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



ఫైనల్లో పంకజ్ అద్వానీ

వరల్డ్ మ్యాచ్‌ప్లే బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఐర్లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పంకజ్ సెమీఫైనల్లో భారత్‌కే చెందిన శ్రీకృష్ణ సూరిపై 7-5 (100-0, 100-0, 100-6, 47-100, 100-4, 64-100, 81-100, 100-11, 12-100, 8-100, 100-7, 100-0) ఫ్రేమ్‌ల తేడాతో గెలిచాడు. బిలియర్డ్స్, స్నూకర్ క్రీడాంశాల్లో వివిధ విభాగాల్లో కలిపి 28 సార్లు విశ్వవిజేతగా నిలిచిన పంకజ్ టైటిల్ పోరులో ఇంగ్లండ్‌కు చెందిన డేవిడ్ కాసియర్‌తో తలపడతాడు.



నిరాశలో చెన్నై జట్టు కెప్టెన్ ధోని

చెపాక్‌లో చెన్నై చిత్తుగా...

సూపర్ కింగ్స్ భారీ ఓటమి ● 8 వికెట్లతో కోల్‌కతా ఘన విజయం

ఐపీఎల్ చరిత్రలో తొలిసారి వరుసగా ఐదో పరాజయం... మొదటిసారి సొంతగడ్డ చెపాక్ మైదానంలో వరుసగా మూడో ఓటమి... ధోని కెప్టెన్సీ పునరాగమనంలో సీఎస్‌కే మరింత పేలవ ప్రదర్శన కనబర్చింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) పదునైన బౌలింగ్ ముందు చేతులెత్తేసిన సీఎస్‌కే భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఫటాఫట్‌గా 61 బంతుల్లోనే లక్ష్యాన్ని అందుకున్న కోల్‌కతా రన్‌రేట్‌ను ఒక్కసారిగా పెంచుకొని దూసుకుపోయింది.

చెన్నై: ఐపీఎల్ 18వ సీజన్‌లో ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ వరుస వైఫల్యాలు కొనసాగుతున్నాయి. సొంత మైదానంలో బ్యాటింగ్ వైఫల్యంతో జట్టు మరో ఓటమిని మూటగట్టుకుంది. శుక్రవారం జరిగిన ఈ పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ 8 వికెట్ల తేడాతో చెన్నైపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులే చేయగలిగింది. శివమ్ దూబే (29 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, విజయ్‌శంకర్ (21 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించాడు. అనంతరం కోల్‌కతా 10.1 ఓవర్లలో 2 వికెట్లకు 107 పరుగులు సాధించి గెలిచింది. సునీల్ నరైన్ (18 బంతుల్లో 44; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) శుభారంభంతో మరో 59 బంతులు మిగిలి ఉండగానే విజయం జట్టు సొంతమైంది.

పేలవ బ్యాటింగ్...

ఓపెనర్లు కాన్వే (12), రచిన్ (4) ఒకే స్కోరు వద్ద వెనుదిరగ్గా... రెండు సార్లు అదృష్టం కలిసొచ్చిన విజయ్ శంకర్ కొన్ని పరుగులు రాబట్టాడు. 0, 20 పరుగుల వద్ద అతను ఇచ్చిన సునాయాస క్యాచ్‌లను నరైన్, వెంకటేశ్ అయ్యర్ వదిలేశారు. రాహుల్ త్రిపాఠి (16) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఆ తర్వాత చెన్నై 9 పరుగుల తేడాతో అశ్విన్ (1), జడేజా (0), దీపక్ హుడా (0), ధోని (1) వికెట్లను కోల్పోయింది. 71/6 వద్ద బ్యాటింగ్ కుప్పకూలే పరిస్థితి ఉండటంతో చెన్నై 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బ్యాటర్ హుడాను తీసుకు రాగా, అతనూ డకౌటయ్యాడు. వరుసగా 63 బంతుల పాటు జట్టు ఫోర్ కొట్టలేకపోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా...మరో ఎండ్‌లో నిలబడిన దూబే తన 20వ బంతికి గానీ తొలి ఫోర్ కొట్టలేకపోయాడు. చివరి ఓవర్లో అతను మరో రెండు ఫోర్లు కొట్టడంతో ఎట్టకేలకు స్కోరు 100 పరుగులు దాటింది.

చకచకా లక్ష్యం వైపు...

ఛేదనలో కోల్‌కతాకు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. క్వింటన్ డికాక్ (16 బంతుల్లో 23; 3 సిక్స్‌లు), నరైన్ ధాటిగా ఆడుతూ 26 బంతుల్లోనే 46 పరుగులు జోడించారు. ఖలీల్ ఓవర్లో డికాక్ 2 సిక్స్‌లు బాదగా, అశ్విన్ ఓవర్లో నరైన్ ఫోర్, సిక్స్ కొట్టాడు. ఖలీల్ తర్వాత ఓవర్లో కేకేఆర్ 2 సిక్స్‌లు, ఫోర్‌తో 18 పరుగులు రాబట్టడంతో పవర్‌ప్లే



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సునీల్ నరైన్

ముగిసేసరికి స్కోరు 71 పరుగులకు చేరింది. ఆపై అశ్విన్ ఓవర్లో నరైన్ మరో 2 సిక్స్‌లు బాదాడు. విజయానికి 19 పరుగుల దూరంలో నూర్ అహ్మద్ అతడిని అవుట్ చేసినా... అజింక్య రహానే (17 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), రింకూ సింగ్ (12 బంతుల్లో 15 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) కలిసి పని పూర్తి చేశారు.

ధోని అవుటా...నాటౌటా!

ఎప్పటిలాగే అభిమానులు ఎదురు చూసేలా చేసీ చేసీ చివరకు 9వ స్థానంలో ధోని బ్యాటింగ్‌కు దిగాడు. నాలుగు బంతులు మాత్రమే ఎదుర్కొన్న అతను నరైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. అంపైర్ అవుట్‌గా ప్రకటించగా ఈ నిర్ణయంపై ధోని 'రివ్యూ' కోరాడు. బంతి బ్యాట్‌ను దాటుతున్న సమయంలో 'స్నికో'లో కాస్త కదలిక కనిపించినా... టీవీ అంపైర్ వినోద్‌శేషన్ దీనిని లెక్కలోకి తీసుకోకుండా అవుట్‌గా ఖాయం చేశాడు. దీనిపై ఫోర్త్ అంపైర్ తన్మయ్ శ్రీవాత్సవను కలిసి చెన్నై కోచ్ ఫ్లెమింగ్ తన అసంతృప్తిని ప్రదర్శించడం కనిపించింది.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ (సి) రహానే (బి) హర్షిత్ 4; కాన్వే (ఎల్బీ) (బి) అలీ 12; త్రిపాఠి (బి) నరైన్ 16; విజయ్ శంకర్ (సి) అలీ (బి) వరుణ్ 29; శివమ్ దూబే (నాటౌట్) 31; అశ్విన్ (సి) అరోరా (బి) హర్షిత్ 1; జడేజా (సి) డికాక్ (బి) నరైన్ 0; హుడా (సి) అరోరా (బి) వరుణ్ 0; ధోని (ఎల్బీ) (బి) నరైన్ 1; నూర్ (సి) వరుణ్ (బి) అరోరా 1; అన్షుల్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 9 వికెట్లకు) 103. **వికెట్ల పతనం:** 1-16, 2-16, 3-59, 4-65, 5-70, 6-71, 7-72, 8-75, 9-79. **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-31-1, మొయిన్ అలీ 4-1-20-1, హర్షిత్ రాణా 4-0-16-2, వరుణ్ చక్రవర్తి 4-0-22-2, సునీల్ నరైన్ 4-0-13-3.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (బి) అన్షుల్ 23; నరైన్ (బి) నూర్ 44; రహానే (నాటౌట్) 20; రింకూ సింగ్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (10.1 ఓవర్లలో 2 వికెట్లకు) 107. **వికెట్ల పతనం:** 1-46, 2-85. **బౌలింగ్:** ఖలీల్ 3-0-40-0, అన్షుల్ 2-0-19-1, అశ్విన్ 3-0-30-0, నూర్ 2-0-8-1, జడేజా 0.1-0-9-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	5	4	1	8	1.413
ఢిల్లీ	4	4	0	8	1.278
కోల్‌కతా	6	3	3	6	0.803
బెంగళూరు	5	3	2	6	0.539
పంజాబ్	4	3	1	6	0.289
లక్నో	5	3	2	6	0.078
రాజస్తాన్	5	2	3	4	-0.733
ముంబై	5	1	4	2	-0.010
చెన్నై	6	1	5	2	-1.554
హైదరాబాద్	5	1	4	2	-1.629

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో X గుజరాత్
వేదిక: లక్నో
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

హైదరాబాద్ X పంజాబ్
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'మిక్స్‌డ్' ఫైనల్లో జ్యోతి సురేఖ జోడీ



సెంట్రల్ ఫ్లోరిడా: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్‌లో భారత్‌కు మూడో పతకం ఖరారైంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ (భారత్) జోడీ 159-155 పాయింట్ల తేడాతో తోజా ఎలిసన్-టిమ్ జెవ్‌స్నిక్ (స్లోవేనియా) జంటపై గెలిచింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ 156-154తో టాంజా జెలింతిన్-మథియాస్ ఫులెర్టన్ (డెన్మార్క్)లపై, తొలి రౌండ్‌లో 156-149తో ఆంద్రియా మునోజ్-అల్వారో సాంచెజ్ (స్పెయిన్)లపై విజయం సాధించారు. నేడు జరిగే ఫైనల్లో హువాంగ్ ఐజు-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-రిషభ్ తలపడతారు. కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం నెగ్గగా... రికర్వ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది.

భారత్‌కు మూడో విజయం



రష్మిక

పుణే: బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత జట్టు ఖాతాలో మూడో విజయం చేరింది. చైనీస్ తైపీతో శుక్రవారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-1తో గెలిచింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఈ టోర్నీలో వరుసగా నాలుగో విజయం సాధించడం విశేషం. తొలి సింగిల్స్‌లో గుజరాత్ ప్లేయర్ వైదేహి చౌదరీ 6-2, 5-7, 6-4తో ఫాంగ్ అన్ లిన్‌పై నెగ్గి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో శ్రీవల్లి రష్మిక 6-2, 7-6 (7/3)తో ప్రపంచ 207వ ర్యాంకర్ జోనా గార్లాండ్‌ను ఓడించడంతో భారత్ 2-0తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో అంకిత రైనా-ప్రార్థన తొంబారే ద్వయం 2-6, 6-4, 6-10తో యి సెన్ చో-ఫాంగ్ సెయిన్ వు జోడీ చేతిలో ఓడిపోయింది. నేడు దక్షిణ కొరియాతో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ దశకు అర్హత సాధిస్తుంది.

సరిగ్గానే దిద్దుతున్నారా?

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు.

'కీ' పాయింట్లకే పరిమితమై...

పోటీ పరీక్షల్లో లక్షల మంది భవిష్యత్తును నిర్ణయించేది మూల్యాంకనమే. ఇంతటి కీలకమైన మూల్యాంకనాన్ని సరిగ్గా నిర్వహించే అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ లేరనే వాదన బలంగా వినిపిస్తోంది. అందుబాటులో ఉన్నవారితోనే మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జవాబు పత్రాలు దిద్దేవారికి అధికారులు నాలుగైదు 'కీ'పాయింట్లు ఇస్తారు. అయితే, అభ్యర్థి అంతకంటే మంచి పాయింట్లతో సమాధానం రాసినా, ఫ్యాకల్టీ ఆ కీ పాయింట్ల అన్వేషణకే పరిమితమై తగిన మార్కులు ఇవ్వడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు వేర్వేరు సబ్జెక్టులు ఉండే పేపర్‌ను ఒక్కరితోనే మూల్యాంకనం చేయిస్తున్నారు. ఇది కూడా ఫలితాలపై ప్రభావం చూపుతోంది అని నిపుణులు చెబుతున్నారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్ పోస్టులు రెండు రాష్ట్రాల్లో భారీగా ఖాళీగా ఉండటమే సమస్యకు మూలకారణమని అభ్యర్థులు అంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే సమస్య నెలకొందని చెబుతున్నారు.

ఇవీ కొన్ని సమస్యలు..

- గ్రూప్-1 మెయిన్స్‌లో ఉండే పాలిటీ, గవర్నెన్స్, సొసైటీ పేపర్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. పాలిటీ వరకు మాత్రమే అకడమిక్స్‌లో ఉంటుంది. మూల్యాంకనం చేసే అధ్యాపకులకు ఇండియన్ సొసైటీ, గవర్నెన్స్ గురించి అంతగా అవగాహన ఉండదు. దీంతో వారు కీ షీట్‌పైనే ఆధారపడి మూల్యాంకనం చేస్తున్నారు.
- సైన్స్ అండ్ టెక్నాలజీ పేపర్‌లో బయాలజీ, ఫిజిక్స్, సమకాలీన సాంకేతిక రంగానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. కానీ, డిగ్రీ స్థాయిలో కోర్ సైన్స్ సబ్జెక్టులే ఉంటాయి. కరెంట్ టాపిక్స్ ఉండవు. దీంతో ఎవాల్యుయేటర్స్ కరెంట్ టాపిక్స్‌పై అవగాహన లేకుండానే మూల్యాంకనం చేస్తున్నారు.
- జనరల్ ఎస్సే పేపర్‌లో హిస్టరీ, కల్చర్, ఎకనమీ, పాలిటీ, కరెంట్ టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటిని మూల్యాంకనం చేయాలంటే ఒక్కో ప్రశ్నకు ఒక్కో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను నియమించాలి. కానీ.. అలా జరగ్లేదని అభ్యర్థులు అంటున్నారు.
- వేర్వేరు సబ్జెక్టులు కలిపి ఉండే పేపర్ల విషయంలో సెక్షన్ వారీగా వేర్వేరు సబ్జెక్టు నిపుణులతో మూల్యాంకనం చేయిస్తేనే అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని చెబుతున్నారు.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టులు 75 శాతం ఖాళీగా ఉన్నాయి. ఏపీలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 4,330 ఉంటే.. 1,048 మంది మాత్రమే ఉన్నారు. వీరిలోనూ గత నెలలో దాదాపు 150 మంది పదవీ విరమణ చేశారని సమాచారం. తెలంగాణలో 2,825 పోస్టులకుగాను 873 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి.
- డిగ్రీ లెక్చరర్ పోస్టులు కూడా దాదాపు 40 శాతం మేరకు ఖాళీగా ఉన్నాయి. ఫ్యాకల్టీ కొరతతో బోధన ప్రమాణాలు తగ్గడమే కాకుండా.. పరీక్షల నిర్వహణలో ప్రొఫెసర్ల భాగస్వామ్యం లేక లోపాలు చోటుచేసుకుంటున్నాయి.

అనువాదం కూడా సమస్యే

పోటీ పరీక్షల విషయంలో ప్రశ్నల అనువాదం కూడా ప్రధాన సమస్యగా మారుతోంది. ప్రశ్నపత్రాన్ని ముందుగా ఇంగ్లిష్‌లో రూపొందించి తెలుగులోకి అనువాదం చేస్తున్నారు. ఇందుకోసం అఫీషియల్ ట్రాన్స్‌లేటర్స్‌ను నియమిస్తున్నారు. వారు ప్రశ్న భావాన్ని అర్థం చేసుకోకుండా మక్కీకి మక్కీ (ట్రూ ట్రాన్స్‌లేషన్) అనువాదం చేస్తున్నారు. దీనివల్ల తెలుగు మీడియం అభ్యర్థులు నష్టపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు.. సివిల్ డిసోబీడియన్స్ మూవ్‌మెంట్‌ను (శాసన ఉల్లంఘన ఉద్యమం) పౌర అవిధేయత ఉద్యమం అని అనువాదం చేస్తుండటంతో అదేమిటో తెలుగు మీడియం అభ్యర్థులకు అర్థమే కావటంలేదు. ప్రశ్నపత్రం అనువాద ప్రక్రియలో ఆయా సబ్జెక్టులకు సంబంధించి కనీసం ఏడెనిమిది మందిని భాగస్వాములను చేస్తే సమస్య పరిష్కారమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

సమయాభావం

పోటీ పరీక్షల్లో ఎదురవుతున్న మరో సమస్య సమయాభావం. అభ్యర్థులకు మొత్తం ప్రశ్నపత్రాన్ని చదివేందుకు కూడా కొన్ని సందర్భాల్లో సమయం సరిపోవడం లేదు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 150 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానం ఇవ్వాలి. ప్రశ్నపత్రం రూపొందించిన వారికి సైతం 150 ప్రశ్నలను 150 నిమిషాల్లో చదవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అభ్యర్థులు కనీసం 30 నుంచి 40 ప్రశ్నలు చదవకుండానే సమాధానాలు గుర్తించాల్సి వస్తోంది. యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లోని సీశాట్‌లో 80 ప్రశ్నలకు 120 నిమిషాల సమయం ఇస్తారు.

మెయిన్స్‌ను కూడా ఆబ్జెక్టివ్ చేయాలా?

గ్రూప్-1 మెయిన్స్ ప్రశ్న పత్రం రూపకల్పన, మూల్యాంకన సమస్యల నేపథ్యంలో మెయిన్స్‌ను కూడా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే విషయంలో సంబంధిత సబ్జెక్టులో పూర్తి పరిజ్ఞానం ఉన్న అభ్యర్థికి మాత్రమే సాధ్యమయ్యే రీతిలో ప్రశ్నపత్రం రూపొందించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

మూడో వ్యక్తితో మూల్యాంకనం చేయించాలి

గ్రూప్-1లో కచ్చితంగా ఇద్దరు నిపుణులతో మూల్యాంకనం చేయించాలి. మొదటి, రెండో మూల్యాంకనాల్లో మార్కుల మధ్య 5 శాతం వ్యత్యాసం ఉంటే మూడో వ్యక్తితో మూల్యాంకనం చేయించాలి. అప్పుడు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీలో ఇదే విధానం అమలవుతోంది. రెండు, మూడు సబ్జెక్టుల సమ్మిళితంగా ఉన్న పేపర్ల విషయంలో.. సెక్షన్ వారీగా సంబంధిత సబ్జెక్టు నిపుణులతో మూల్యాంకనం చేయించాలి. తెలుగు మీడియం అభ్యర్థులకు అర్థమయ్యే రీతిలో ప్రశ్నపత్రం అనువాదం ఉండాలి.

– ప్రొఫెసర్. వై.వెంకటరామిరెడ్డి, యూపీఎస్సీ మాజీ సభ్యుడు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్

టీఎస్‌ఆర్డీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనాథ్

ఎంజీఎం: తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌ఆర్డీఏ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ శ్రీనాథ్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని సీనియర్ రెసిడెంట్ వైద్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీఎస్ ఆర్‌డీఏ)ను ఇటీవల కొత్తగా నియమితులైన సీనియర్ రెసిడెంట్లతో పునరుద్ధరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలల్లో నియామకాలు పూర్తయ్యాక.. అసోసియేషన్‌ను మళ్లీ క్రియాశీలకంగా రూపొందించారు. ఈమేరకు అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా కరిష్మ (గాంధీ వైద్య కళాశాల), ఉపాధ్యక్షులుగా అఖిల్ (గాంధీ వైద్య కళాశాల), మోతె ప్రణయ్ (రిమ్స్ ఆదిలాబాద్), అరుణ్‌కుమార్ (జీఎంసీ ఖమ్మం), పవన్ కల్యాణ్ (జీఎంసీ నిజామాబాద్), అధికార ప్రతినిధిగా కౌశిక్ (జీఎంసీ మహబూబ్‌నగర్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. సీనియర్ రెసిడెంట్ల సమస్యల్ని ప్రభుత్వాధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అవసరమైతే కార్యాచరణ చేపడతామని హామీ ఇచ్చారు.

లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా వెటర్నరీ అసిస్టెంట్లు

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి తెలంగాణ నాన్-గెజిటెడ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సురేశ్, పి.అభిషేక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 374 వెటర్నరీ అసిస్టెంట్లకు లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారన్నారు.



పైప్‌లైన్‌కు మరమ్మతు.. నీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

అశ్వారావుపేట రూరల్: నెల రోజులుగా తాగునీటి కోసం అల్లాడుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త కన్నాయిగూడెం, గోగులపూడి గిరిజనుల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. పైప్‌లైన్ పగలడంతో నీటి సరఫరా నిలిచిపోగా, పక్కనే ఏపీలోని జీలుగుమిల్లి మండలం రామచంద్రాపురానికి వెళ్లి ట్యాంకర్ ద్వారా నీరు తెచ్చుకుంటున్న వైనంపై 'సాక్షి' ప్రధాన సంచికలో శుక్రవారం 'దాహం తీరాలంటే.. రాష్ట్రం దాటాలి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో సోయం ప్రసాద్.. సిబ్బందిని ట్యాంక్ వద్దకు పంపించారు. పంచాయతీ కార్యదర్శి శోభన్‌బాబు పర్యవేక్షణలో ప్రధాన పైపులైన్‌కు మరమ్మతు చేయించి శుక్రవారం సాయంత్రానికల్లా రెండు గ్రామాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టెంట్‌సిటీ నిర్మాణాలు చేపట్టాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

కాళేశ్వరం: 'సరస్వతీ పుష్కరాలకు టెంట్‌సిటీ నిర్మాణాలు కష్టమే'అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ స్పందించారు. నిర్మాణాలు చేపట్టాలని టూరిజంశాఖ ఎండీ.ప్రకాశ్‌కు ఆదేశాలు జారీ చేశారు. భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఉన్నతాధికారులతో కలిసి సరస్వతీ పుష్కరాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వారంలోగా షార్ట్ టెండర్ పిలిచి పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. భక్తులకు టెంట్‌సిటీ గదులు, ఇతర నిర్మాణాలు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు.

మనువాడిన మామిడి చెట్లు

సారంగాపూర్: సాగు చేస్తున్న మామిడితోటలో కాపుకొచ్చిన చెట్లకు రైతు దంపతులు పెళ్లి చేశారు. వ్యవసాయంతో తమకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అనిల, అజయ్ దంపతులు ఎనిమిది ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల తరువాత మొదటి కాత (పంట) వచ్చింది, దీంతో కాత కాసిన రెండు చెట్లకు పెళ్లి చేయాలని నిశ్చయించి బంధువులను సైతం ఆహ్వానించారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకుడు వొద్దిపర్తి మధుకుమారాచార్యులు ఆధ్వర్యంలో మామిడి చెట్లకు నూతన వస్త్రాలు ధరింపజేసి, జీలకర్ర, బెల్లం ఉంచి మాంగళ్యధారణ గావించారు. కార్యక్రమానికి గ్రామంలోని పలువురు రైతులు హాజరుకాగా.. మామిడితోటలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఆడెపు రమ్య, మహేశ్, సత్తెన్న, మమత దంపతులు పెళ్లి పెద్దలుగా హాజరయ్యారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



పచ్చని పైరు.. పరుగుల రైలు
పట్టాలకు రెండువైపులా పచ్చగా పెరిగిన వరి పైరు.. ఆ మధ్య వేగంగా దూసుకెళ్తున్న పొడవైన రైలు.. ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్న ఈ దృశ్యం పెద్దపల్లి శివారులో కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

నిర్ల'క్షయ'ం!

దేశవ్యాప్తంగా చాపకింద నీరులా క్షయ

- మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్
- ఏటా ఆరు లక్షలకు పైగా బాధితులు
- లక్షద్వీప్, అండమాన్‌లలో అతి తక్కువ కేసులు
- ఆంధ్రలో 85 వేలు.. తెలంగాణలో 75 వేల కేసుల నమోదు
- ఐదేళ్లలో టీబీ నిర్మూలనకు రూ.10,032.75 కోట్ల ఖర్చు
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ నివేదికతో ఆందోళన
- సీసీఎంబీలో నేడు ముగియనున్న 'రిపోర్టు' సదస్సు..

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'క్షయవ్యాధితో దేశవ్యాప్తంగా 2023లో మూడు లక్షల మంది మృతి చెందారు. ప్రపంచంలోనే అత్యధిక కేసులు భారత్‌లో నమోదవుతున్నాయి. క్షయ వ్యాధిని ముందే గుర్తిస్తే మరణాలను నివారించవచ్చు. సవాల్‌గా మారిన క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పని చేయాలి'...

(హైదరాబాద్ సీసీఎంబీలో జరుగుతున్న రీజినల్ ప్రాస్పెక్టివ్ అబ్జర్వేషనల్ రీసెర్చ్ ఫర్ టీబీ (రిపోర్టు) ఇండియా 14వ సదస్సులో పరిశోధకుల సూచనలివి.)



❖ ఈ ఫొటోలోని వ్యక్తి పేరు ఎట్టి కృష్ణారావు. ములుగు జిల్లా వాజేడు మండలం నాగారం గ్రామం. టీబీ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు.. కాగా పెద్ద కొడుకు పెళ్లి చేసుకొని వేరుగా ఉంటున్నాడు. కూతురికి, మరో కొడుక్కి పెళ్లి కావలసి ఉంది. ఉన్న అరెకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ, కూలి పనులకు వెళ్లి భార్య సత్యమ్మ, కొడుకు, కూతురితో కలిసి కుటుంబాన్ని పోషిస్తోంది.

● ట్యూబర్ క్యులోసిస్ (క్షయ వ్యాధి) మళ్లీ విస్తరిస్తోంది. కనీస జాగ్రత్తలు తీసుకోని అనేక మందిని కబళిస్తోంది. దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న ఈ వ్యాధి ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం .. 2023-24లో దాదాపు 24.25 లక్షల మంది కొత్తగా టీబీ బారిన పడగా, 2024-25లో ఆ సంఖ్య 25,34,112కు చేరింది. ఈ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా చూస్తే టీబీ కేసుల్లో భారత్‌లోనే 26% ఉన్నాయని ఆ శాఖ అంచనా వేసింది. కాగా దేశ వ్యాప్తంగా ట్యూబర్ క్యులోసిస్ (టీబీ) నిర్మూలనకు.. ప్రభుత్వం ఏటా సగటున సుమారు రూ. 2వేల కోట్ల చొప్పున.. ఐదేళ్లలో రూ.10,032.75 కోట్లు ఖర్చు చేసింది. అయినప్పటికీ చాపకింద నీరులా టీబీ వ్యాధి విస్తరిస్తూనే ఉంది.

మొదటిస్థానంలో ఉత్తరప్రదేశ్

క్షయ వ్యాధి (టీబీ) దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విస్తరిస్తోంది. 2023-24లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో

దేశవ్యాప్తంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) ద్వారా అయిదేళ్లుగా కేంద్ర నిధుల కేటాయింపు, వ్యయ వివరాలు

ఆర్థిక సంవత్సరం	నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)	ఖర్చులు (రూ.కోట్లలో)
2020-21	3109.93	3097.98
2021-22	3409.94	2086.82
2022-23	1666.33	910.83
2023-24	1888.82	1179.68
2024-25	2090.53	2757.44
	12165.55	10032.75

6,13,851 మందికి టీబీ వ్యాధి సోకగా 5,66,490 మందికి విజయవంతంగా చికిత్స చేశారు. 2024-25కు వచ్చేసరికి ఆ సంఖ్య 6,70,590లకు చేరింది. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 2,05,909 కేసుల నుంచి 2,14,670 కేసులతో నిలిచింది. బిహార్‌లో 2023-24లో 1,84,706 మందికి టీబీ సోకగా, 1,55,580 మందికి వైద్యసేవల ద్వారా నయం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2024-25లో ఆ రాష్ట్రంలో టీబీ సోకిన వారి సంఖ్య 2,03,853లుగా సర్వేలో తేలింది. గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ లోనూ వ్యాధి తీవ్రత ఉంది. లక్షద్వీప్‌లో అతితక్కువగా 2023-24లో 13,2024-25లో 14 కేసులు నమోదవగా.. లద్దాఖ్‌లో 328 నుంచి 318 కేసులకు తగ్గగా, అండమాన్ నికోబార్‌లో 488 కేసుల నుంచి 533కు పెరిగాయి. డయ్యూ డామన్‌లో 822 కేసుల నుంచి 790కు తగ్గగా, గోవాలో 1,823 కేసుల నుంచి 1,973కు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2023-24లో 86,033 కేసులు నమోదు కాగా, ఆ ఏడాది 82,225 కేసులకు విజయవంతంగా చికిత్స చేయగా.. 2024-25లో 81,804 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో 72,100లో 66,459 మందికి చికిత్స చేయగా, కొత్తగా 74,711 మంది టీబీ నిర్ధారణయింది. మొత్తంగా దేశవ్యాప్తంగా 2023-24లో 24,25,550 కేసులను గుర్తించి చికిత్స అందించి 21,60,483 మందికి నయం చేయగా, 2024-25లో నిర్వహించిన సర్వే, పరీక్షల్లో 25,34,112 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారించి.. వైద్య సేవలు అందిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ నివేదికలో వెల్లడించింది.

క్షయవ్యాధి విస్తరిస్తుందిలా..

క్షయ.. మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా సంభవించే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేయడంతో పాటు ఇతర అవయవాలకు కూడా సోకుతుంది. టీబీ గాలి ద్వారా వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాపిస్తుంది. ఊపిరితిత్తుల టీబీ ఉన్నవారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదా ఉమ్మి వేసినప్పుడు, అవి టీబీ క్రిములను గాలిలోకి పంపుతాయి. అయితే ఈ వ్యాధి సోకితే సాధారణ లక్షణాలలో బరువు తగ్గడం, రెండోది దీర్ఘకాలిక దగ్గు, అలసటలు ఉంటాయి. ఛాతీ ఎక్స్-రే, ఇతర పరీక్షల ద్వారా టీబీని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గుర్తిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో టీబీ వ్యాధి వ్యాప్తిపై ఇంటింటి సర్వే నిర్వహించి స్పుటమ్ (కఫం) సేకరించి పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్‌గా గుర్తించిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు మందులు, నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నారు. కాగా 2025 నాటికి క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతుండగా, టీబీ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



హనుమకొండ జిల్లాలో టీబీ పరీక్షల వివరాలను ఇళ్లపై రాస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

తండ్రి మరణంతో ఇబ్బందులు



టీబీ వ్యాధి నిర్ధారణయ్యాక.. వైద్య పరీక్షలు చేసుకుని మందులు వాడినా.. మా తండ్రి ఎట్టి కృష్ణారావు నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. నాతో పాటు అమ్మ, అన్న, చెల్లి ఉన్నారు. పెద్దదిక్కుగా ఉన్న మా నాన్న మృతితో ఇబ్బందుల్లో పడ్డాం. అరెకరం భూమితో పాటు కూలి చేసుకుంటూ అమ్మ, మేము బతుకుతున్నాం. ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- ఎట్టి బాలకృష్ణ, (టీబీ మృతుడు కృష్ణారావు కుమారుడు), నాగారం, ములుగు జిల్లా

విరివిగా కఫం పరీక్షలు.. చికిత్స



ప్రభుత్వ ఆదేశాల మేరకు.. ఏటా టీబీ సోకిన వారిని గుర్తించేందుకు స్పుటమ్ (కఫం) పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈసారి 6,315 పరీక్షలు నిర్వహించి.. 402 మందిని జిల్లాలో గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్య శిబిరాల్లో రోగులను గుర్తించి టీబీ నివారణ చికిత్స అందిస్తున్నాం. నిక్షయ్ పోషణ్ కింద చికిత్స పూర్తయ్యే వరకు నెలకు రూ.1,000 వారి ఖాతాలో జమ చేస్తున్నాం.

- ఎ.అప్పయ్య, డీఎంహెచ్‌వో, హనుమకొండ జిల్లా

రాష్ట్రాల వారీగా టీబీ రోగుల నిర్ధారణ, చికిత్స వివరాలు

	2023-24లో		2024-25లో
రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతం	టీబీ రోగుల నిర్ధారణ	టీబీ రోగులకు చికిత్స	టీబీ రోగుల నిర్ధారణ
అండమాన్ అండ్ నికోబార్	488	369	533
ఆంధ్రప్రదేశ్	86033	82215	81,804
అరుణాచల్‌ప్రదేశ్	2606	1948	2939
అస్సాం	50180	44878	49389
బిహార్	184706	1,55,580	203853
చండీగఢ్	3912	3050	4108
ఛత్తీస్‌గఢ్	37473	33401	38957
దాదర్ అండ్ నాగర్ హవేలీ అండ్ డామన్ అండ్ దయ్యూ	822	725	790
ఢిల్లీ	82426	64098	90281
గోవా	1823	1376	1973
గుజరాత్	133898	122604	129465
హరియాణా	75745	66862	83673
హిమాచల్‌ప్రదేశ్	15399	13577	15621
జమ్మూ కశ్మీర్	11382	9808	11964
జార్ఖండ్	60592	54623	63913
కర్ణాటక	74493	65094	74135
కేరళ	20558	17117	20214
లద్దాఖ్	328	257	318
లక్షద్వీప్	13	12	14
మధ్యప్రదేశ్	178884	156839	177525
మహారాష్ట్ర	205909	182758	214670
మణిపూర్	2522	1813	2561
మేఘాలయ	4493	3840	4318
మిజోరాం	2115	1541	2163
నాగాలాండ్	4192	3278	4009
ఒడిశా	60766	56259	59483
పుదుచ్చేరి	1507	1156	1355
పంజాబ్	56264	46305	60456
రాజస్తాన్	159302	141911	168059
సిక్కిం	1189	973	1169
తమిళనాడు	92945	82468	91318
తెలంగాణ	72100	66459	74711
త్రిపుర	3425	2758	3422
ఉత్తరప్రదేశ్	613851	566490	670590
ఉత్తరాఖండ్	25674	23113	28382
పశ్చిమ బెంగాల్	97535	84928	97332
	24,25,550	21,60,483	2534112



టీబీ రోగులకు మందులు ఇచ్చి జాగ్రత్తలు చెబుతున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది


వివక్షపై పోరాడిన పూలే: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన భారత సామాజిక విప్లవకారుడు మహాత్మా పూలే అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. మహాత్మా పూలే జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. సబ్బండ కులాల అభ్యున్నతి కోసం, నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పూలే ఆశయాలను అమలు చేసిందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తిని కొనసాగించడం ద్వారా మాత్రమే సామాజిక ప్రగతి సాధ్యమని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

ఇంటిపోరు, హైకమాండ్ పోరు తట్టుకోలేకే కులగణన

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిపోరు, హైకమాండ్ పోరు తట్టుకోలేక విధిలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో కులగణన చేపట్టారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ, ఓబీసీ రిజర్వేషన్ల పేరుతో రాహుల్‌గాంధీ కులగణన అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా లక్ష్మణ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతం రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ 'కులగణన అనేది దేశవ్యాప్తంగా రోల్ మోడల్‌గా, దేశానికే రోడ్ మ్యాప్‌గా మారుతుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. తీరా కులగణన లెక్కలు చూసిన తర్వాత ముస్లింల ప్రాపకం కోసమే కులగణనను చేపట్టినట్లుగా కనపడుతోంది. ఇదేనా దేశానికి రోల్ మోడల్? ఇది బీసీల హక్కులను కాలరాసే కుట్ర' అని మండిపడ్డారు.

పేద విద్యార్థులకు 25% ఉచిత సీట్లిస్తారా లేదా?

- ప్రైవేటు స్కూళ్లలో విద్యా హక్కుచట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- 2025-26లో అమలుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్ల కేటాయింపు అమలు కోసం ఏం చర్యలు చేపట్టారో పూర్తి వివరాలతో ఈ నెల 21లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రానున్న విద్యాసంవత్సరం 2025-26 నుంచైనా ఈ చట్టాన్ని వర్తింపజేస్తారా లేదా అని ప్రశ్నించింది. 2024 అక్టోబర్ 19న ప్రభుత్వం జారీ చేసిన మెమో ప్రకారం ఉచిత సీట్లు ఇస్తారా లేదో చెప్పాలని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. దేశంలో 2009లో అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12 (1)సీ ప్రకారం ప్రీ ప్రైమరీతోపాటు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి. అయితే రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయట్లేదంటూ న్యాయవాది యోగేశ్ 2020లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో 2024లో రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ పిల్ మరోసారి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ఎస్.రాహుల్‌రెడ్డి, కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బి. నరసింహశర్మ విచారణకు హాజరయ్యారు. అమికస్ క్యూరీగా సీనియర్ అడ్వొకేట్ సునీల్ బి.గను వ్యవహరించారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గతేడాది రూపొందించిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను అమికస్ క్యూరీ కోర్టుకు సమర్పించారు. సర్కార్ జారీ చేసిన మెమో అమలుపై ఆయన అనుమానం వ్యక్తం చేయగా ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(సీ)ని అమలు చేయాలని సర్కార్ నిర్ణయించడాన్ని పరిగణనలోకి తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

13 నుంచి 25 వరకు బీజేపీ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 25 వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 13న రాష్ట్రంలోని ప్రతి బూత్, గ్రామ, మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రపరిచి దీపాలంకరణ చేయనున్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ముఖ్యనేతలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్యకర్తలు తమ తమ జిల్లా కేంద్రాల్లో జయంత్యుత్సవాల్లో పాల్గొంటారు. 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా అన్నిచోట్లా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, స్థానిక పురప్రముఖులు, దళిత, బహుజన నేతలు, ఉద్యమకారులతో కలిసి భారత రాజ్యాంగ పీఠికను చదివి వినిపించనున్నారు. ఈనెల 15-25 తేదీల మధ్య ప్రతి జిల్లా కేంద్రంలో మేధావులు, కవులు, కళాకారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, సంఘ సంస్కర్తలు, కార్మిక సంఘాల నేతలతో కలిసి సదస్సులు నిర్వహించనున్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, ఓబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు.

గెవరా బొగ్గుగనిని సందర్శించిన కిషన్‌రెడ్డి

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ పర్యటనలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా రెండో అతిపెద్ద బొగ్గు గని గెవరాను కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి సందర్శించారు. శుక్రవారం సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎస్‌ఈసీఎల్) ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన పలు కార్యక్రమాల పనితీరును ఆయన సమీక్షించారు. ఎస్‌ఈసీఎల్ ఆధ్వర్యంలో 'ధడ్‌కన్' కార్యక్రమంలో భాగంగా నయా రాయ్‌పూర్‌లో శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో గుండె సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆపరేషన్లు పూర్తయిన చిన్నారులను కేంద్రమంత్రి పరామర్శించారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో కలిసి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర ఉన్నతాధికారులు, కోలిండియా చైర్మన్, ఎస్‌ఈసీఎల్ సీఎండీ, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఛత్తీస్‌గఢ్‌కు ఉన్న సామర్థ్యాలను వివరిస్తూ.. దీన్ని సద్వినియోగం చేసుకోవడంలో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తన రెండ్రోజుల ఛత్తీస్‌గఢ్ పర్యటన విజయవంతమైందని తెలిపారు.

నవంబర్ 15 నాటికి రాంజీగోండ్ మ్యూజియం పనులు పూర్తవ్వాలి

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాజధాని నడిబొడ్డున నిర్మిస్తున్న రాంజీగోండ్ ట్రైబల్ మ్యూజియం నిర్మాణ పనులు నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ.. రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. నవంబర్ 15న జన్‌జాతి గౌరవ్ దివస్ సందర్భంగా ఆ రోజున మ్యూజియంను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించింది. ఇటీవల కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులకు కేంద్ర ప్రభుత్వం పలు సూచనలిచ్చింది. ఈ మ్యూజియం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.11 కోట్లు విడుదల చేసింది. అబిడ్స్‌లో దాదాపు 3,600 గజాల్లో మూడు అంతస్తుల్లో ఈ మ్యూజియంను నిర్మిస్తున్నారు.

మీనాక్షిపై చేసిన వ్యాఖ్యలను ఏలేటి ఉపసంహరించుకోవాలి

పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ రాచమళ్ల సిద్ధేశ్వర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీసీసీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ రాచమళ్ల సిద్ధేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సచివాలయం నిషిద్ధ స్థలమా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఇన్‌చార్జ్ హోదాలో పార్టీ పనితీరును సమీక్షించడం ఆమె బాధ్యత అని, అది రాజ్యాంగ విరుద్ధం కాదని, అన్ని జాతీయ పార్టీల్లో సర్వ సాధారణమని చెప్పారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై పార్టీ ప్రతినిధి హోదాలో ఆమె మంత్రుల కమిటీని కలిసి ఏం జరిగిందో తెలుసుకున్నారని, తన అభిప్రాయాన్ని చెప్పారని వివరించారు. విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చిన మీనాక్షి హెచ్‌సీయూ మాత్రమే కాదని, దేశంలోని మెజారిటీ వర్సిటీలను సందర్శించారని తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి గుర్రపు పందాలు



శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం రాష్ట్ర స్థాయి గుర్రాల పరుగు పందేలు నిర్వహించారు. రాష్ట్రం నలు మూలల నుంచి 35 గుర్రాలు ఈ పందేల్లో పాల్గొన్నాయి. పరుగు పందాల్లో విశేషంగా పరుగు పెట్టిన 10 గుర్రాల యజమానులకు, బెస్ట్ రైడర్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు వేలాదిగా జనం తరలివచ్చారు.

– పిఠాపురం

సుందర నగరం



కడలి, కొండల మధ్య ఒద్దికగా ఒదిగిపోయిన సుందర నగరం విశాఖ. సాయం సమయాన తూర్పు కనుమల మాటున కనుమరుగవుతున్న సూర్యుడు బంగారు కాంతులు వెదజల్లుతుంటే. కడలి కెరటాలు శ్వేతవర్ణంలో నురగలు కక్కుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరంలో ఇసుక దొంగలు



సాగర తీరంలో ఇసుక దోపిడీ మళ్లీ మొదలైంది. విశాఖ నగరంలోని తిమ్మాపురం వద్ద అర్ధరాత్రి సమయాల్లో భారీగా సముద్రపు ఇసుకను తరలిస్తున్నారు. దీంతో తీరంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఇసుకదోపిడీని అధికారులు కట్టడి చేయకపోవడంతో భవిష్యత్తులో పెనుముప్పు తప్పదని మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

తక్షణం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం డిమాండ్

సాక్షి, అమరావతి/మంగళగిరి: ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని పాఠశాల విద్యాభవన్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మాట్లాడుతూ.. డీఎస్సీ నోటిఫికేషన్‌పై అభ్యర్థులను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ నియామకాలు చేపడతామని కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడమే కాకుండా సీఎం చంద్రబాబు తొలి సంతకం పెట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇది దగా డీఎస్సీ అని దుయ్యబట్టారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం 6,100 డీఎస్సీ పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తే వాటిని రద్దు చేసి మెగా డీఎస్సీ అంటూ దగా చేశారని దుయ్యబట్టారు.

బలహీనపడిన అల్పపీడనం

- అక్కడక్కడా తేలికపాటి వర్షాలు
- రెండు రోజుల్లో పెరగనున్న ఎండ తీవ్రత

సాక్షి, అమరావతి: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం అదే ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడ్డాయి. మరోవైపు వచ్చే రెండు రోజుల్లో కోస్తా జిల్లాలు, యానాంలో సాధారణం కంటే 2–4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో సాధారణం కంటే 2–3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. శనివారం కృష్ణా జిల్లా గన్నవరం, కంకిపాడు, పెదపారుపూడి, ఉంగుటూరు, ఉయ్యూరు మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తాయని, 61 మండలాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం వైఎస్సార్ జిల్లా అట్లూరులో అత్యధికంగా 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 25 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

'ప్రాపర్టీ టాక్స్‌లో పంచాయతీలకు 50% వాటా'

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా సత్యవేడు, వరదాయపాలెం మండలాల పరిధిలో శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) ఆధ్వర్యంలో ప్రాపర్టీ టాక్స్ రూపంలో వసూలు చేసే ఆదాయాన్ని 50–50 శాతం నిష్పత్తిన శ్రీసిటీ ఐలా, స్థానిక గ్రామ పంచాయతీలకు పంచాలని నిర్ణయిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం.. ఆ ఆదాయాన్ని శ్రీసిటీ ఐలా 65 శాతం, సంబంధిత గ్రామ పంచాయతీలు 35 శాతం చొప్పున పంచుకుంటున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. అయితే.. ఆయా గ్రామ పంచాయతీలు ఆర్థికంగా స్వయంసమృద్ధి చెందాలన్న ఉద్దేశంతో పంచాయతీల వాటా 50 శాతానికి పెంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


కేజీహెచ్‌లో బాలల హక్కుల కమిషన్‌కు అవమానం

మహారాణిపేట(విశాఖ): విశాఖలోని కేజీహెచ్‌లో బాలల హక్కుల కమిషన్‌కు అవమానం జరిగింది. గత పర్యటనలో ఆస్పత్రిలో జనన, మరణ ధ్రువీకరణ కేంద్రం ఏర్పాటు చేయాలని బాలల హక్కుల కమిషన్ ప్రతిపాదించింది. అయితే కమిషన్‌కు సమాచారం ఇవ్వకుండా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా శుక్రవారం జనన, మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. తమకు సమాచారం ఇవ్వకపోవడంపై కమిషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేజీహెచ్ అధికారుల తీరుపై ప్రభుత్వానికి, నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాజ్యాంగ బద్ధమైన కమిషన్ పట్ల కేజీహెచ్ అధికారుల నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు.

కార్పొరేటు తగ్గదండీ

విద్యార్థి భవిష్యత్తుకు ఇంటర్ విద్య ఎంతో కీలకం. తమ పిల్లలు ఇందులో మంచి మార్కులు సాధిస్తే వారి భవితకు ఢోకా ఉండదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఉంటున్నారు. దీన్నే కార్పొరేట్ యాజమాన్యాలు చక్కగా క్యాష్ చేసుకుంటున్నాయి. ప్రథమ సంవత్సర అడ్మిషన్లు సోమవారం ప్రారంభం కావడంతో కోర్సులు, ఫీజులపై కళాశాలల ప్రతినిధులను సంప్రదిస్తుండగా, వారు చెప్పే రేట్లు విని గుడ్లు తేలేయడం పేరెంట్స్ వంతవుతోంది.

- ఇంటర్‌లో కోర్సును బట్టి ఫీజులు
- అడ్మిషన్ కావాలంటే 50 శాతాన్ని చెల్లించాల్సిందే
- కొత్త పేర్లు పెట్టి నయా దోపిడీ
- పుస్తకాలకు అదనంగా వసూళ్లు
- ఎటూ తేల్చుకోలేకపోతున్న తల్లిదండ్రులు



నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభయ్యాయో లేదో ఫీజుల దోపిడీకి కార్పొరేట్ యాజమాన్యాలు తెరలేపాయి. వాస్తవానికి ఇందులో ఎంపీసీ, బైపీసీ కోర్సులంటే యమ క్రేజ్. వీటికి రకరకాల పేర్లు తగిలించి ప్రత్యేక ఫీజులు వసూలు చేస్తున్నారు. డే స్కాలర్‌కు రూ.90 వేల నుంచి రూ.1.65 లక్షల వరకు.. అదే హాస్టల్ వసతి కూడా కలిపితే రూ.రెండు లక్షల నుంచి రూ.3.75 లక్షల వరకు వసూలు చేస్తున్నారంటే వీరి ధనదాహం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వీరికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ, సామాన్య, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేస్తోందనే ఆరోపణలూ లేకపోలేదు.

నియంత్రణ.. డొల్ల

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 136 కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ఏటా 23 వేల మందికిపైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు సోమవారం.. ద్వితీయ సంవత్సర తరగతులు ఈ నెల ఒకటిన షురూ అయ్యాయి. ఈ నెల 23 వరకు బ్రిడ్జి కోర్సులనే నిర్వహించాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. 24 నుంచి జూన్ ఒకటి వరకు వేసవి సెలవులు.. మరుసటి రోజున కళాశాలలను పునఃప్రారంభించాలని ఆదేశించారు. అడ్మిషన్ల సమయంలో తాత్కాలిక ఫీజులనే వసూలు చేయాలనే ఆదేశాలు ఉన్నా, నియంత్రణ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. సిలబస్‌ను ఇప్పటి నుంచే ప్రారంభిస్తున్నామనీ చెప్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో తల్లిదండ్రులున్నారు.

సగం చెల్లిస్తేనే ఖరారు

కోర్సు, బ్రాంచీలను బట్టి ఫీజులను నిర్ణయించారు. ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో ర్యాంకులంటూ రకరకాల కోర్సులను ప్రవేశపెట్టారు. ఎంపీసీలో స్టార్ సూపర్ చైనా, సీఓ సూపర్ చైనా, ఎస్ 120, సీఓ స్పార్క్, స్పార్క్, నీట్ తదితర పేర్లను ఖరారు చేసి ఫీజులను నిర్ధారించారు. అడ్మిషన్ సమయంలో మొత్తం ఫీజులో 50 శాతాన్ని చెల్లిస్తేనే ఖరారవుతుందని యాజమాన్యాలు చెప్తున్నాయి. వేసవి సెలవులయ్యాక ఇప్పటి ఫీజు ఉండదని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ఫీజులో రూ.10 వేల నుంచి రూ.15 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు.

పుస్తకాలకు రూ.10 వేలు - రూ.12 వేలు

ఫీజులిలా (రూపాయల్లో)

కోర్సు	డే స్కాలర్	హాస్టల్
ఎంపీసీ	90 వేలు - 1.65 లక్షలు	1.95 లక్షలు - 3.75 లక్షలు
బైపీసీ	లక్ష - 1.6 లక్షలు	రెండు లక్షలు - రూ.3.5 లక్షలు

ల్యాబ్, రికార్డుల కోసం రూ.మూడు వేలు - రూ.ఐదు వేలు

పట్టించుకోని అధికారులు..

ఇంటర్ బోర్డు అధికారులు సైతం కార్పొరేట్ యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధిక ఫీజులను వసూలు చేస్తున్నా, వీటి వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించకపోయినా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రికి సంబంధించిన విద్యాసంస్థలే అధికంగా ఉండటంతో అటు వైపు అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. మరోవైపు ఆయా కళాశాలలు నిర్వహిస్తున్న హాస్టళ్లకు ఎలాంటి అనుమతులూ ఉండవు. ఎంఈడీ చేసిన అధ్యాపకులు ఉండాల్సి ఉన్నా, డిగ్రీ, పీజీ వారితోనే బోధన చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. అంతంతమాత్రంగా మారిన వసతులతో పాటు భోజనం నాసిరకంగా ఉంటోందని విద్యార్థులే చెప్తున్నారు. ఇప్పటికైనా వీరి దోపిడీని అరికట్టేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



కార్పొరేట్ యాజమాన్యాల ఫీజు దోపిడీని అరికట్టాలి. లక్షల్లో వసూలు చేస్తున్నా, బోధన, వసతులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు.

– ఆదిత్యసాయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి



పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలి. ధరల పట్టికను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాల్సి ఉన్నా, ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

– లీలామోహన్, రాష్ట్ర కార్యదర్శి, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ

నామినల్ ఫీజులనే వసూలు చేయాలి



నామినల్ ఫీజులనే వసూలు చేయాలని యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్‌కు జూమ్ మీటింగ్ ద్వారా ఆదేశాలు జారీ చేశాం. రెగ్యులర్ తరగతులను జూన్ రెండు నుంచి నిర్వహించాలి. ఫీజుల వసూళ్లపై ఫిర్యాదులొస్తే చర్యలు చేపడతాం.

– ఆదూరు శ్రీనివాసులు, ఆర్ఐఓ

జేఈఈ మెయిన్ విద్యార్థులకు న్యాయం చేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న నారాయణ

నర్సీపట్నం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటన సందర్భంగా పరీక్షలు రాయకుండా నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. పోలీసుల అత్యుత్సాహంతోనే జేఈఈ మెయిన్ విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేకపోయారని విమర్శించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అంటే ప్రధాని నరేంద్ర మోదీకి చాలా ఇష్టం కనుక, పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని 30 మంది విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థుల కన్నీళ్లకు ఆయనే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్థిక నేరస్తులను టెర్రరిస్టుల కంటే ప్రమాదకరమైన వారిగా గుర్తించి దేశానికి రప్పించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక నేరగాళ్లు కాజేసిన రూ.16 లక్షల కోట్లను కక్కించాలన్నారు. డిప్యూటీ సీఎం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఆయన పర్యటనతో గిరిజనులకు మేలు చేకూరాలన్నారు.

నాయకులు తమ కులం కోసమే పనిచేస్తున్నారు

మాజీ డీజీపీ, పూర్ణ చంద్రరావు



సీతమ్మధార: ఉత్తరాంధ్రలో రాజకీయ నాయకులే ప్రజలకు పెద్ద సమస్యగా మారారని, వారు తమ కులాలకే నాయకులుగా పనిచేసే పరిస్థితి నెలకొందని మాజీ డీజీపీ పూర్ణ చంద్రరావు ఆక్షేపించారు. బీఎస్పీ, బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అత్యధిక శాతం బీసీలు ఉన్నారని, అయినా కమ్మ నాయకుల మాటే ఉత్తరాంధ్రలో చెల్లుతుందని ఆరోపించారు. షేక్‌లకు అమ్మాయిలను అమ్ముతున్నట్లు అదానీకి విశాఖ స్టీల్ ప్లాంటును అమ్ముతున్నారని కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కమ్మరాజు ఎంపీ భరత్ దీని గురించి ఏమీ పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ కాబట్టే ఆయన మాట చెల్లుబాటు కావడం లేదన్నారు. కమ్మ, రెడ్డిల ఉత్తరాంధ్ర అయిపోయిందని, కమ్మ వ్యక్తి శ్రీకాకుళంలో ఎమ్మెల్యే ఎట్లా అయ్యాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో 35 మంది కమ్మ ఎమ్మెల్యేలు, 32 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉన్నట్లు పేర్కొన్నారు.



ఏలూరులో ముస్లింల భారీ ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా ఏలూరులో ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో ముస్లింలు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఏలూరు పాత బస్టాండ్‌లోని కర్బలా మైదానం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు కొనసాగింది. ప్లకార్డులు పట్టుకుని, నినాదాలతో నగరాన్ని మార్మోగించారు.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,462 మంది స్వామివారిని దర్శించుకోగా 22,998 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.94 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేటినుంచి రాట్నాలమ్మ తిరునాళ్ల

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో ఉన్న రాట్నాలమ్మ వారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా ఎంతో అట్టహాసంగా నిర్వహించే ఈ తిరునాళ్లకు జిల్లా నుంచే కాక రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఏప్రిల్ 12 నుంచి 16 వరకు ఈ తిరునాళ్ల ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఈఓ ఎన్.సతీష్, చైర్మన్ మన్నే శ్రీనివాసరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ సెట్టింగ్‌లు ఆకర్షిస్తున్నాయి. శనివారం నుంచి మూడు రోజుల పాటు రాత్రి సమయాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చక్రస్నానం

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం, త్రిశూల స్నానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో నక్షత్ర వనం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం జరుగుతుందన్నారు. స్వామివారి చక్రస్నానం కారణంగా చండీహోమం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు 27 మంది జంటలతో స్వామివారికి తీపి కావిళ్లు అందజేయనున్నారని తెలిపారు.

విద్యా సమాచారం

ఎస్వీయూలో ముగిసిన సదస్సు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో సాంప్రదాయ ఔషధం:: ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం అనే అంశంపై మూడురోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ పారంపర్య, ఆయుర్వేద వైద్యం భవిష్యత్తు తరాలకు అందించాల్సి అవసరముందన్నారు. ఇండియన్ హెరిటేజ్‌కు ఆయుర్వేదం, పారంపర్య వైద్యం అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ఆచార్య కామాక్షి, ఎస్వీయూ బయో కెమిస్ట్రీ పూర్వ విద్యార్థి డాక్టర్ కామేశ్వరరావు బద్రి, అధ్యాపకులు నాగలక్ష్మి, దేవమ్మ, విజయ, వేణు, అంకన్న పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఏడు పరిశోధనలకు ఆమోదం



తిరుపతి సిటీ: అంతర్జాతీయ విద్యా పరిశోధన నిధి ద్వారా ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉష) పథకం కింద ఏడు అంతర్జాతీయ విద్యా పరిశోధన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఇందులో ప్రధానంగా యూఎస్‌ఏ జెనోమిక్స్ బయోటెక్ ఇంక్ వర్సిటీ, మలేషియాలోని టెరెంగాను, యూనివర్సిటీ అటున్ హుస్సేన్ ఓన్, అలాగే యూఎస్‌లోని టెక్సాస్ ఫోర్ట్ వర్త్ వర్సిటీ, కెనడాలోని యార్క్ విశ్వవిద్యాలయం, నేపాల్‌లోని ఖాట్మండు విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో బయోటెక్నాలజీ, అప్లైడ్ మైక్రోబయాలజీ, హోమ్ సైన్స్, ఫార్మసీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, లా విభాగాల్లో పరిశోధన ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. ఈ నిధులను మ్యాచింగ్ గ్రాంట్ కింద అధ్యాపకులకు అందిస్తారని చెప్పారు.

మహిళా వర్సిటీలో సెమినార్ పోటీ

తిరుపతి సిటీ : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో ×మహిళా సాధికారతలో అంబేడ్కర్ సాహసిక పాత్ర అనే అంశంపై శుక్రవారం సెమినార్ పోటీ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జ్యోత్స్న కల్పన పాల్గొన్నారు.

12,500 ఏళ్ల నాటి తోడేళ్లు... మళ్లీ పుట్టాయి



• లేటెస్ట్ న్యూస్



సుమారు 12,500 ఏళ్ల నాటి జీవులు మళ్లీ ఇప్పుడు భూమ్మీద పుడితే ఎలా ఉంటుంది? మన మధ్య సంచరిస్తే ఎలా అనిపిస్తుంది? అచ్చంగా ఇలాంటి ఆలోచనే వచ్చింది శాస్త్రవేత్తలకి. ఇందుకోసం జెనెటిక్ ఇంజినీరింగ్ సాయం తీసుకున్నారు. ఫలితంగా మూడు డైర్ తోడేలు పిల్లలు జన్మించాయి. ఏమిటి వీటి ప్రత్యేకత? వీటి చరిత్ర ఏమిటి?


డైర్ తోడేళ్లు కొన్ని వేల ఏళ్ల క్రితం భూమ్మీద జీవించాయి. ఆ తర్వాత అంతరించిపోయాయి. 1858లో అమెరికాలో వీటి అవశేషాలు దొరికాయి. వాటిని బట్టి ఇవి ఎక్కువగా అమెరికాలోని పచ్చిక బయళ్లు, పర్వత ప్రాంతాల్లో జీవించినట్లు గుర్తించారు. వీటిని మళ్లీ పుట్టించాలన్న ఆలోచనతో శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాలు ఫలించాయి. గతేడాది అక్టోబర్ 1న పుట్టిన తోడేలు పిల్లలకు రోములస్, రెమస్, ఖలీసి అని పేర్లు పెట్టారు. వాటిని ఇన్నాళ్లపాటు కంటికి రెప్పలా చూసుకుంటూ పెంచారు. అవి పుట్టి 6 నెలలు అవ్వడంతో ఇటీవల వాటి చిత్రాలు విడుదల చేశారు. వాటి బరువు 36 కిలోలకు పైగా ఉండగా, అవి ఇప్పటికే 4 అడుగుల ఎత్తు ఉన్నాయని అంటున్నారు.

అంతరించిపోయిన జీవులను తిరిగి పుట్టించేందుకు జరిపిన పరిశోధనల్లో ఇది కీలకమైన ఘట్టమని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రస్తుతం ఉత్తర అమెరికాలోని జోన్ ఆల్ఫా అనే హై సెక్యూరిటీ ఎకోలాజికల్ క్షేత్రంలో ఆ తోడేళ్లు భద్రంగా ఉన్నాయని వివరిస్తున్నారు. తోడేళ్లు ఆరోగ్యంగా ఉన్నాయని, ఈ ప్రయోగాలు మరింత విజయవంతమైతే, మరిన్ని జీవులను తిరిగి భూమ్మీదకు తేవచ్చని అంటున్నారు.



కశ్మీర్ తులిప్ గార్డెన్

కశ్మీర్ చాలా వాటికి వెళ్లాలి. హిమాలయాల కోసం, మంచులోయల కోసం, సరస్సుల కోసం... ఈ సీజన్ మాత్రం తులిప్ పూలను చూడటానికి వెళ్లాలి. ఆసియాలోనే అతిపెద్దదైన తులిప్ గార్డెన్ శ్రీనగర్‌లో ఉంది. ప్రతి ఏటా మార్చి చివరిలో పూసే తులిప్‌లను చూడటానికి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తారు. ఈ సంవత్సరం ఏప్రిల్ మొదటివారంలో పూలు పూశాయి. 74 రకాల తులిప్‌లు ఇక్కడ ఉన్నాయి. మొత్తం 1,75,000 వేల పూలు ఈ సీజన్‌లో కన్నుల పండుగ చేస్తున్నాయి. తులిప్ పూలకు 15 డిగ్రీల సెల్సియస్ నుంచి 25 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రత ఉండాలి. ప్రతి ఏటా నెదర్లాండ్స్ నుంచి రకరకాల తులిప్‌లను తెచ్చి ఇక్కడ పెంచుతారు. కేవలం 20 రోజుల పాటే ఈ పూలు ఉంటాయి. తర్వాత వాడిపోతాయి. ఈలోపు 4 లక్షల మంది పర్యాటకులు వీటిని చూడటానికి వస్తారు. వారిలో మీరుంటే ఇంకా బాగుంటుంది.





• ఎక్స్‌ట్రీమ్ టాలెంట్

మిస్టర్ బీస్ట్.. ఇతను చాలా రిచ్ గురూ!





జేమ్స్ స్టీఫెన్ జిమ్మీ డొనాల్డ్‌సన్ అంటే ఎవరికీ తెలియదు. 'మిస్టర్ బీస్ట్' అనండి... వెంటనే గుర్తుపట్టేస్తారు. ప్రఖ్యాత యూట్యూబర్. ప్రపంచవ్యాప్తంగా 383 మిలియన్ల సబ్‌స్క్రైబర్లను కలిగిన యూట్యూబ్ ఛానెల్ "MrBeast'ని అతనే నిర్వహిస్తున్నాడు. యూట్యూబ్ ద్వారా అత్యధిక ఆదాయం పొందుతున్న బీస్ట్ ప్రపంచంలోని అనేకమంది ధనవంతులను మించిపోతున్నాడు. అతని గురించి మరిన్ని విశేషాలు తెలుసుకుందామా?

మిస్టర్ బీస్ట్ పుట్టింది 1998 మే 7న. అమెరికాలోని కాన్సస్‌లో పుట్టి, ఉత్తర కరోలినాలోని గ్రీన్‌విల్లేలో పెరిగాడు. 2012 నుంచి యూట్యూబ్‌లో వీడియోలు చేయడం మొదలుపెట్టాడు. ఐదేళ్ల తర్వాత, 2017లో అతను చేసిన 'కౌంటింగ్ టు 1,00,000' వీడియో కొన్ని రోజుల్లోనే 10 వేల దాకా వ్యూస్ సాధించి, అతని ఛానెల్‌కి ప్రాచుర్యం తీసుకొచ్చింది. అలా మెల్లగా అతని వీడియోలకు వీక్షకులు పెరిగారు. విచిత్రమైన విన్యాసాలు, కొత్త కొత్త ప్రయోగాలు వంటివి మిస్టర్ బీస్ట్ ఛానెల్లో ప్రధానంగా కనిపిస్తాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, మిస్టర్ బీస్ట్ 2023–2024లో సంపాదించిన మొత్తం 85 మిలియన్ డాలర్లు(సుమారు రూ.732 కోట్లు). ఇంత ఆదాయం కలిగిన మరొక యూట్యూబర్ ప్రపంచంలో మరెవరూ లేరు. యూట్యూబ్ వీడియోల ద్వారా అతను నెలకు సుమారు 50 మిలియన్ డాలర్లు (సుమారు రూ.430 కోట్లు) సంపాదిస్తున్నాడని అంచనా. ఛానెల్ ద్వారా వచ్చిన ఆదాయంతో ఆయన మరికొన్ని వ్యాపారాలను ప్రారంభించారు. వాటి ద్వారా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. అన్నీ కలిపి అతణ్ని అత్యంత ధనవంతుణ్ని చేశాయి.

• యంగ్ ఇన్వెంటర్

14 ఏళ్ల బాలుడు... 'గుండె'ను కాపాడుతున్నాడు





పిల్లలూ... హార్ట్ ఎటాక్ అనేది పెద్దలకు వచ్చే ఆరోగ్య ప్రమాదం. హార్ట్ ఎటాక్ వచ్చే ముందు శరీరం కొన్ని సిగ్నల్స్ ఇస్తుంది. వాటిని గ్రహిస్తే హార్ట్ ఎటాక్‌ను ఆపొచ్చు. అయితే ఈ సిగ్నల్స్‌ను కొంతమంది గ్రహించలేరు. కొందరు అంచనా వేసినా, వేగంగా స్పందించలేరు. అలాంటి వారి కోసం 14 ఏళ్ల బాలుడు ఓ అద్భుతమైన ఆవిష్కరణ చేశాడు. అతనే సిద్ధార్థ్ నంద్యాల. సిద్ధార్థ్ ప్రస్తుతం డల్లాస్‌లో ఉంటున్నాడు. 'సర్కాడియన్ ఏఐ' (Circadian AI) పేరుతో ఇటీవల ఓ యాప్‌ను తయారుచేశాడు. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారంగా గుండె కదలికల్ని గమనించి, ఏడు సెకండ్లలోనే సమాచారం అందించడం ఈ యాప్ ప్రత్యేకత. గుండె కొట్టుకోవడంలో ఏదైనా అపసవ్యతలు ఉన్నా, గుండెపోటు ముప్పు ఉన్నా వెంటనే హెచ్చరిస్తుంది. ఈ యాప్ కనిపెట్టాలన్న ఆలోచన ఎలా వచ్చిందని సిద్ధార్థ్‌ని అడిగితే, 'మీ గుండె మీతో మాట్లాడుతూ తన పరిస్థితిని మీకు వివరిస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనతోనే ఈ ఆవిష్కరణ రూపుదిద్దుకుంది' అంటున్నాడు. ప్రపంచంలో 31 శాతం అనారోగ్య మరణాలు గుండె జబ్బుల కారణంగానే జరుగుతున్నాయని, గుండె స్థితిగతులను ముందుగా అంచనా వేస్తే ఆ మరణాలను అరికట్టవచ్చని వివరిస్తున్నాడు. ఈ యాప్‌ను ఏడు సెకండ్ల పాటు గుండె దగ్గర ఉంచితే, 40 రకాల జబ్బులను గుర్తించగలుగుతుందని అంటున్నాడు. సిద్ధార్థ్ తయారు చేసిన ఈ యాప్‌ని అమెరికాలోని సుమారు 15 వేల మంది రోగుల మీద ప్రయోగించారు. మనదేశంలో 700 మంది రోగులను ఈ యాప్‌తో పరీక్షించారు. సుమారు 96 శాతం ఫలితాలు నిక్కచ్చిగా రావడంతో ఈ యాప్‌ను అందరూ ఆమోదించారు. అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బైడెన్ తదితరులు సిద్ధార్థ్‌ని ప్రశంసించారు. సిద్ధార్థ్ ప్రపంచంలోనే అతి చిన్నవయసు కలిగిన ఏఐ–సర్టిఫైడ్ నిపుణుడు. STEM IT (స్టెమ్ ఐటీ) పేరుతో ఓ ఎడ్యుకేషన్ స్టార్టప్‌ని ప్రారంభించాడు. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం తనకు స్ఫూర్తి అని, ఆవిష్కరణలే ప్రగతికి బాటలు వేస్తాయని తాను నమ్ముతానని వివరిస్తున్నాడు సిద్ధార్థ్.

• పాడుదాం గేయం

మంచి అలవాట్లు



పొద్దున్న లేచి సూర్యుణ్ని చూడాలి
పళ్లను తోమి.. స్నానం చేసి
వడివడిగా బడికి చేరాలి
అదే మంచి అలవాట్ల చెలిమి

అందరూ కలిసి ప్రార్థన చేయాలి
తరగతిలో అల్లరి చేయక ఉండాలి
గురువుల పాఠం శ్రద్ధగా వినాలి
అదే మంచి అలవాట్ల చెలిమి

నేస్తులతో స్నేహంగా మెలగాలి
గొడవలకు దూరంగా జరగాలి
పెద్దలను ఎంచి గౌరవించాలి
అదే మంచి అలవాట్ల చెలిమి

అబద్ధాలను వద్దని విడనాడాలి
సత్యాలను ఎల్లప్పుడు పలకాలి
అందరిలో గొప్ప పేరు పొందాలి
అదే మంచి అలవాట్ల చెలిమి

• మహనీయులు

'మాల్గుడి'ని సృష్టించిన మహా రచయిత ఆర్.కె.నారాయణ్

పిల్లలూ! మీ అందరికీ కథలంటే చాలా ఇష్టం కదా! ఎవరైనా కథలు చదువుతూ ఉంటే శ్రద్ధగా వింటారు కదా! మీలాంటి వారికోసం ఒక కొత్త ఊరిని సృష్టించి, ఆ ఊరిలో జరిగే కథల్ని రాసిన రచయిత ఉన్నారు. ఆయనే ఆర్.కె.నారాయణ్. ఆయన గురించి తెలుసుకుందాం.


ఆర్.కె.నారాయణ్ 1906 అక్టోబర్ 10న అప్పటి మద్రాసులో జన్మించారు. ఆయన తండ్రి స్కూల్ హెడ్‌మాస్టర్‌గా పని చేసేవారు. ఆయనకు తరచూ బదిలీలు అవుతుండటం వల్ల నారా



యణ్ ఎక్కువగా తన అమ్మమ్మ దగ్గరే పెరిగాడు. అమ్మమ్మ అతణ్ని ముద్దుగా 'కుంజప్ప' అని పిలిచేది. అమ్మమ్మ దగ్గరే నారాయణ్ లెక్కలు, సంగీతం, పురాణాలు, సంస్కృతం నేర్చుకున్నాడు.

చిన్నతనం నుంచే సాహిత్యంపై అభిమానం కలిగిన నారాయణ్ ఛార్లెస్ డికెన్స్, వుడ్‌హౌజ్, థామస్ హార్డీ వంటి వారి రచనలు చదివేవాడు. తండ్రికి మైసూరు బదిలీ కావడంతో నారాయణ్ అక్కడికి వెళ్లారు. అక్కడ మహారాజా స్కూల్‌లో చేరిన ఆయన పుస్తకాలు చదవడంతోపాటు సొంతంగా కథలు రాయడం మొదలుపెట్టారు. ఒక దశలో సాహిత్యానికే ఎక్కువ సమయం కేటాయించడంతో యూనివర్సిటీ ప్రవేశ పరీక్షల్లో ఫెయిలయ్యాడు. ఏడాది పాటు వేచి చూసి, ఆ తర్వాత మళ్లీ పరీక్ష రాసి మహారాజా కాలేజీలో చేరారు. నాలుగేళ్లలో డిగ్రీ పూర్తి చేశారు.

ఆ తర్వాత పైచదువులు చదవమని అందరూ ప్రోత్సహించినా నారాయణ్ మాత్రం వాటి వైపు వెళ్లలేదు. రచయితగా మారి, పుస్తకాలు రాయడమే తన జీవితాశయం అని నిశ్చయించుకున్నారు. 1930లో 24 ఏళ్ల వయసులో నారాయణ్ తన తొలి నవల 'స్వామి అండ్ హిజ్ ఫ్రెండ్స్' రాశారు. అందులోనే తొలిసారి ఆయన 'మాల్గుడి' అనే ఊరిని సృష్టించారు. 1937లో రెండో నవల 'ది బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్' రాశారు. ఇందులో తన కాలేజీలో జరిగిన అనుభవాలను పొందుపరిచారు. 1938లో మూడో నవల 'ది



డార్క్ రూమ్' అనే నవల రాశారు. స్త్రీలపై పురుషులు జరుపుతున్న అకత్యాలను అందులో వివరించారు.

1942లో తొలిసారి 'మాల్గుడి డేస్' పేరుతో కథల పుస్తకం రాశారు. 'మాల్గుడి డేస్' కథలు దూరదర్శన్‌లో ప్రసారమై దేశవ్యాప్తంగా పేరు పొందాయి. 'మాల్గుడి' అనే ఊరు నిజంగా లేకపోయినా, ఆ ఊరి పేరు చెప్పగానే నారాయణ్ గుర్తొచ్చేంతగా ఆ కథలు ప్రఖ్యాతి పొందాయి. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1960లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1964లో పద్మభూషణ్, 2000లో పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. ప్రపంచంలో ప్రఖ్యాతి పొందిన నోబెల్ సాహిత్య పురస్కారానికి సైతం ఆయన రచనలు నామినేట్ అయ్యాయి. 2001 మే 13న ఆర్.కె.నారాయణ్ మరణించారు.

• మన సినిమా

యూనికార్న్ సీజన్ 3 రిటర్న్స్

హేయ్ కిడ్స్.. హాలిడేస్ మొదలయ్యాయా... ఈ సెలవుల్లో మనకు ఒక అద్భుతమైన యానిమేటెడ్ ఫాంటసీ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజయింది. అదే యూనికార్న్ అకాడెమీ సీజన్3. యూనికార్న్ సిరీస్ చూసేవాళ్ళకి ఇది మహా ఇష్టం. ఇప్పుడు కొత్తగాచూడాలి అని అనుకునేవాళ్ళని ఇదో గొప్ప థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మీరు మామూలుగా చదువుకోవాలంటే స్కూలు, కాలేజీ లేదా యూనివర్సిటీకి వెళతారు. అక్కడ రకరకాల కోర్సులు ఉంటాయి. కాని యూనికార్న్ అకాడెమి పిల్లలకు మ్యాజిక్ నేర్పించే అకాడెమీ అన్నమాట. యూనికార్న్ అంటే కొమ్ముల గుర్రం అని అర్థం.



ఇదో కెనెడియన్ యానిమేటెడ్ టెలివిజన్ సిరీస్. 2023 నుండి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఇప్పుడు వచ్చింది థర్డ్ సీజన్. దీంట్లో 20 ఎపిసోడ్స్ దాకా ఉన్నాయి. ఈ సీజన్‌లో సారా తన ఫ్రెండ్స్‌తో కలిసి యూనికార్న్ అకాడెమీలోకి ఎంటర్ అవుతుంది. అకాడెమీలో ట్రైన్ అయి తాను అనుకున్నది సాధించాలన్న గోల్‌తో ఉంటుంది. అలాగే తన జర్నీలో ఓ ఈవిల్ ఫోర్స్‌ని కూడా ఫేస్ చేస్తుంది. దాంతో పాటు సారా తన గుర్రంతో చేసే ఫీట్స్, మ్యాజిక్స్ కలర్‌ఫుల్‌గా ఉంటాయి. సో కిడ్స్... నెట్‌ఫ్లిక్స్‌కి ట్యూన్ చేసి యునికార్న్ అకాడమికి వెళ్ళండి. ఎంజాయ్.

• బాలల కథ

కోతి పనులు



అనగనగా ఓ ఊరి వక్కనే అడవి. ఆ అడవి నిండా చాలా కోతులు ఉన్నాయి. వాటిలో కొన్ని మంచివి. కొన్ని అల్లరి చేసేవి. ముసలి కోతులు వాటికి ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా మారలేదు.

ఒకసారి ఆ ఊరిలో షావుకారు ఇంట్లో పెళ్లి జరిగింది. ఘనంగా విందు ఇచ్చారు. ఈ విషయం అడవిలోని కోతులకు తెలిసింది. పెళ్లిలో వడ్డించే వంటల రుచి గుర్తొచ్చి నోరూరింది. అయితే ఒకేసారి గుంపంతా వెళ్తే కొట్టి తరిమేస్తారని ముసలి కోతులు భావించాయి. విందు పూర్తయ్యాక పెట్టిన పదార్థాలు ఉంటే వాటిని మాత్రమే తినాలని తీర్మానం చేసుకున్నాయి.

పెళ్లి అనంతరం ఎంగిలి ఆకుల్ని షావుకారి ఇంటి వెనుక వేశారు. కోతులన్నీ అక్కడికి వెళ్లి తమకు నచ్చిన పదార్థాలను ఏరుకుని తృప్తిగా తింటున్నాయి. ఇంతలో ఓ తుంటరి కోతి చేతికి బెండకాయ ముక్క దొరికింది. దాన్ని తినకుండా పైకి ఎగరేసింది. అది ఎగిరినంత దూరం చూస్తూ చప్పట్లు కొట్టింది. దాన్ని చూసి పక్కనే ఉన్న మరో అల్లరి కోతి కూడా తన చేతికి దొరికిన వంకాయ ముక్కను పైకి ఎగరేసి చప్పట్లు కొట్టింది.

వీళ్లిద్దర్నీ చూసిన మరికొన్ని కోతులు సైతం అదే పని చేశాయి. తినే ఆహారంతో అలా ఆటలు ఆడకూడదని ముసలి కోతులు వారించాయి. అయినా వినకుండా ఒకదానితో మరొకటి పోటీ పడి మరీ చేతికి దొరికిన ఆహార పదార్థాలను ఎగరేశాయి. నాది ఎక్కువ పైకి వెళ్లిదంటే నాదే ఎక్కువ పైకి వెళ్లిందని వాదులాడుకోవడం మొదలుపెట్టాయి. ఆహార పదార్థాలన్నింటినీ తొక్కి, నానా రభస చేస్తూ అరవడం మొదలుపెట్టాయి. ఈ గోలంతా షావుకారు ఇంట్లో ఉన్న వాళ్లు గమనించారు. వెంటనే పనివాళ్లు కర్రలు తీసుకొని వచ్చి కోతుల్ని ఎడాపెడా వాయించారు. దెబ్బలు తగిలిన కోతులు కుయ్యో మొర్రో అంటూ పరుగులు పెట్టాయి. అటు ఆహారం పోయి, ఇటు దెబ్బలు తినాల్సి రావడంతో ముసలి కోతులు ఈ అల్లరి కోతుల్ని చీవాట్లు పెట్టాయి.

నీతి: పెద్దల మాట వినాలి. అల్లరి చేయకూడదు.

బిజినెస్ రీల్

తెలంగాణ మార్కెట్లోకి ఒబెన్ ఎలక్ట్రిక్



హైదరాబాద్: ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్ తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ తెలంగాణ మార్కెట్లోకి ప్రవేశించింది. హైదరాబాద్‌లో రెండు, వరంగల్‌లో ఒకటి చొప్పున మొత్తం 3 షోరూమ్‌లను ప్రారంభించింది. వీటిలో సర్వీస్ సెంటర్లు కూడా ఉంటాయి. ఒక్కో కొత్త షోరూమ్‌లో రోర్ ఈజెడ్ వాహనాన్ని కొనుగోలు చేసిన తొలి 30 కస్టమర్లకు కాంప్లిమెంటరీగా బంగారు నాణెం అందిస్తున్నట్లు సీఈవో మధుమిత అగ్రవాల్ తెలిపారు. దీని ధర రూ. 89,999గా ఉంటుంది. ఒకసారి చార్జ్ చేస్తే 175 కి.మీ. రేంజి ఇస్తుంది. 2026 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 50 నగరాల్లో 100 పైచిలుకు షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 35 షోరూమ్‌లు ఉన్నాయి.

ష్నైడర్ ఎలక్ట్రిక్‌తో ఫ్రెయర్ ఎనర్జీ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రూఫ్‌టాప్ సోలార్ కంపెనీ ఫ్రెయర్ ఎనర్జీ సర్వీసెస్ తాజాగా ష్నైడర్ ఎలక్ట్రిక్‌తో చేతులు కలిపింది. ఫ్రెయర్ ఎనర్జీ సోలార్ ఉత్పత్తులకు ష్నైడర్ ఎలక్ట్రిక్‌కి చెందిన వైజర్ స్మార్ట్ హోమ్ సిస్టంను అనుసంధానించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. విద్యుదుత్పత్తి, విద్యుత్ వినియోగానికి సంబంధించిన వివరాలను గృహ యజమానులు రియల్ టైమ్‌లో తెలుసుకునేందుకు ఇది తోడ్పడుతుంది. దీనితో పర్యావరణహిత టెక్నాలజీల ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని ఫ్రెయర్ ఎనర్జీ సహ-వ్యవస్థాపకుడు సౌరభ్ మర్దా తెలిపారు.

పోకో నుంచి సీ71 బడ్జెట్ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ బ్రాండ్ పోకో తాజాగా బడ్జెట్ సెగ్మెంట్లో సీ71 స్మార్ట్ ఫోన్‌ను ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 6,499 నుంచి ఉంటుంది. కాగా, ఎయిర్‌టెల్ యూజర్లకు ప్రత్యేకంగా రూ. 5,999గా అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. ఇందులో 6.88 అంగుళాల హెచ్‌డీప్లస్ ప్యానెల్, ఆక్టాకోర్ ప్రాసెసర్, 32 ఎంపీ డ్యుయల్ రియర్ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 5200 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆండ్రాయిడ్ 15 వంటి ఫీచర్లు ఉన్నాయి.

రెజీలియెంట్ పేమెంట్స్‌కు పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్స్



న్యూఢిల్లీ: భారత్‌పే గ్రూప్ సంస్థ రెజీలియెంట్ పేమెంట్స్ సంస్థకు ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సు లభించింది. రిజర్వ్ బ్యాంక్ ఈ మేరకు తుది అనుమతులు ఇచ్చినట్లు సంస్థ వివరించింది. ప్రస్తుతం దేశీయంగా ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు (ట్రిలియన్ లోన్స్ సంస్థ), స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో వాటాలు (యూనిటీ ఎస్ఎఫ్‌బీ) ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సు గల ఏకైక ఫిన్‌టెక్ కంపెనీ తమదేనని రెజీలియెంట్ పేమెంట్స్ పేర్కొంది. తమ ఆన్‌లైన్ వ్యాపారాన్ని 'భారత్‌పే ఎక్స్' పేరిట నిర్వహించనున్నట్లు సంస్థ సీఈవో సందీప్ ఇందుర్కర్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-4-2025

విశాఖ	435-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,309
ఎన్ఎస్ఈ	94,850
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,76,656
ఎఫ్ఐఐ	- 2,519
డీఐఐ	+ 3,759

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.00 రాత్రి 11.30కు	$ 60.07 క్రితం ముగింపు
బ్రెంట్	63.89 రాత్రి 11.30కు	$ 63.33 క్రితం ముగింపు

ఈక్విటీ పెట్టుబడులు..

11 నెలల కనిష్టానికి



- మార్చిలో ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.25వేల కోట్లు
- నాలుగు నెలల కనిష్టానికి సిప్ పెట్టుబడులు
- ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై అస్థిరతల ప్రభావం
- మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కొనసాగిన ఆదరణ

న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి పెట్టుబడుల రాక మార్చి నెలలో రూ.25,082 కోట్లకు తగ్గింది. నెలవారీ ఈక్విటీ పెట్టుబడుల్లో ఇది 11 నెలల కనిష్టం (2024 ఏప్రిల్ తర్వాత) కావడం గమనార్హం. ఫిబ్రవరిలో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన నికర పెట్టుబడులు29,303 కోట్లుగా ఉన్నాయి. అటు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో వచ్చే పెట్టుబడులు సైతం నాలుగు నెలల కనిష్టానికి తగ్గి రూ.25,925 కోట్లుగా నమోదయ్యాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి కొనసాగింది. ఈ మేరకు మార్చి నెల గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక క్రమంగా తగ్గుతోంది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తంమీద ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.4.17 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2023-24లో వచ్చిన రూ.1.84 లక్షల కోట్లతో పోలిస్తే గణనీయంగా పెరిగాయి.

51 లక్షల సిప్ ఖాతాలు బంద్

మార్చి నెలలో సిప్ పెట్టుబడుల నిలిపివేత మరింత పెరిగింది. 51 లక్షల సిప్ ఖాతాల నుంచి పెట్టుబడులు ఆగిపోయాయి. అదే సమయంలో కొత్తగా 40 లక్షల సిప్ ఖాతాలను ఇన్వెస్టర్లు ప్రారంభించారు. నికరంగా చూస్తే 11 లక్షల మేర సిప్ ఖాతాలు తగ్గినట్టు తెలుస్తోంది. ఫిబ్రవరిలో సిప్ నిలిపివేత నిష్పత్తి 122 శాతంగా ఉంటే, మార్చి నెలకు 127.5 శాతానికి పెరిగింది.

సిప్ ఫర్వాలేదు..

సిప్ పెట్టుబడులు మార్చిలో రూ.25,925 కోట్లుగా నమోదయ్యాయి. ఫిబ్రవరిలో రూ.25,999 కోట్లు, జనవరిలో రూ.26,400 కోట్లు, 2024 డిసెంబర్‌లో రూ.26,459 కోట్ల చొప్పున సిప్ ద్వారా ఫండ్స్‌లోకి పెట్టుబడులు వచ్చాయి. 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరంలో నెలవారీ సగటు సిప్ పెట్టుబడులు రూ.24,113 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.16,602 కోట్ల చొప్పున ఉంది.

- మార్చిలో అత్యధికంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి రూ. 5,165 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- ముఖ్యంగా సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్ విషయంలో ఇన్వెస్టర్ల ధోరణిలో పూర్తి మార్పు కనిపించింది. ఫిబ్రవరిలో ఈ విభాగం ఇన్వెస్టర్ల నుంచి రూ.5,711 కోట్లను ఆకర్షించగా.. మార్చిలో రూ.735 కోట్లకు పెట్టుబడులు తగ్గిపోయాయి.
- మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల జోరు కొనసాగింది. మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,439 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్ రూ.4,092 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు రూ.2,479 కోట్లకు తగ్గాయి. ఫిబ్రవరిలో ఈ విభాగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.2,866 కోట్లుగా ఉన్నాయి.
- మార్చి నెలలో డెట్ ఫండ్స్ నుంచి ఇన్వెస్టర్లు రూ.2.02 లక్షల కోట్లను ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరిలో ఉపసంహరణ రూ.6,525 కోట్లుగానే ఉంది.
- లిక్విడ్ ఫండ్స్ నుంచి రూ.1.33 లక్షల కోట్లు బయటకు వెళ్లిపోయాయి. ఆ తర్వాత ఓవర్‌నైట్ ఫండ్స్ నుంచి రూ.30,015 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్ నుంచి రూ.21,301 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు.
- గోల్డ్ ఈటీఎఫ్‌లలో రూ.77 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. ఫిబ్రవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్టర్లు రూ.1,980 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం.
- మొత్తం మీద మార్చి నెలలో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ (అన్ని విభాగాలూ కలసి) రూ.1.64 లక్షల కోట్ల పెట్టుబడులను కోల్పోయింది.

ప్రతికూలతల వల్లే..

సెక్టోరల్, థీమ్యాటిక్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక గణనీయంగా తగ్గడం మొత్తం మీద ఈక్విటీ పెట్టుబడులను తగ్గించేసినట్టు మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ మేనేజర్ నేహాల్ మెష్రామ్ తెలిపారు. ''ఇన్వెస్టర్లు అనిశ్చితులను ఇష్టపడరు. తరచూ వస్తున్న ప్రతికూల వార్తలతో ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణి అనుసరించారు''అని యూనియన్ ఏఎంసీ సీఈవో మధునాయర్ పేర్కొన్నారు.

ఈ ఏడాది వృద్ధి 6.1 శాతమే

గత అంచనాల తగ్గింపు

- అమెరికా ప్రతీకార సుంకాల రిస్క్
- అంతర్జాతీయ సంస్థ మూడీస్ అనలైటిక్స్



న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత జీడీపీ వృద్ధి అంచనాలను ప్రముఖ అంతర్జాతీయ సంస్థ మూడీస్ అనలైటిక్స్ 0.3 శాతం తగ్గించింది. 2025లో జీడీపీ 6.4 శాతం వృద్ధి చెందుతుందంటూ ఈ ఏడాది మార్చిలో వేసిన అంచనాను 6.1 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. అమెరికా ప్రతీకార సుంకాల వల్ల పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని అంచనాలను సవరించింది. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో అమెరికాను ఒకటిగా పేర్కొంటూ.. భారత ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్‌లు వాణిజ్యానికి అవరోధాలు కల్పిస్తాయని తెలిపింది. రత్నాభరణాలు, వైద్య పరికరాలు, టెక్స్‌టైల్స్ పరిశ్రమలపై ఎక్కువ ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. ఎగుమతులు భారత జీడీపీలో అతి స్వల్ప వాటాను కలిగి ఉన్నందున.. మొత్తం మీద భారత వృద్ధి రేటు వెలుపలి రిస్క్‌లకు పెద్దగా ప్రభావితం కాబోదని. స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్నందున ఆర్‌బీఐ రెపో రేటును మరో పావు శాతం మేర తగ్గించొచ్చని.. ఈ ఏడాది చివరికి ఇది 5.75 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. దీనికితోడు బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను మినహాయింపులు దేశీ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తాయని.. దీంతో మొత్తం మీద వృద్ధిపై సుంకాల ప్రతికూల ప్రభావం తక్కువకు పరిమితం అవుతుందని మూడీస్ అనలైటిక్స్ అంచనా వేసింది.

అనిశ్చితులు కొనసాగుతాయి..

చైనా మినహా భారత్ సహా ఇతర దేశాలపై ప్రతీకార సుంకాల అమలును 90 రోజుల పాటు అమెరికా వాయిదా వేయడం గమనార్హం. అయినప్పటికీ అనిశ్చితి కొనసాగుతుందని, ఈక్విటీల్లో ఆటుపోట్లు కొనసాగొచ్చని మూడీస్ అనలైటిక్స్ తెలిపింది. ''పెరుగుతున్న అనిశ్చితిని తక్కువగా అంచనా వేయరాదు. గృహ, వ్యాపార సెంటిమెంట్ తగ్గిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మానిటరీ పాలసీ సులభతరం వల్ల ఒనగూరే ప్రయోజనాల ఫలితం తగ్గొచ్చు. అనిశ్చితుల్లో మరింత ఖర్చుకు గృహస్థులు వెనుకాడొచ్చు. వ్యాపార సంస్థలు సైతం అదనపు పెట్టుబడుల విషయంలో వెనక్కి తగ్గొచ్చు''అని మూడీస్ అనలైటిక్స్ తన నివేదికలో వివరించింది. టారిఫ్‌లతో వాణిజ్య వ్యయాలు పెరిగిపోతాయని, అది అంతర్జాతీయ వృద్ధిని బలహీనపరుస్తుందని అంచనా వేసింది.

అమెరికాతో ఒప్పందంలో మన ప్రయోజనాలకే ప్రాధాన్యం

కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికాతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో (బీటీఏ) దేశ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకే అత్యంత ప్రాధాన్యం ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ స్పష్టం చేశారు. ఆ దిశగా చర్చలు సానుకూల ధోరణిలో జరుగుతున్నాయని చెప్పారు. ఈ అంశంలో తొందరపాటుతనంతో వ్యవహరించడం శ్రేయస్కరం కాదని ఆయన వివరించారు. ప్రస్తుతం 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచుకునే దిశగా ఇరు దేశాలు బీటీఏపై చర్చలు జరుపుతున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి తొలి విడత ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్ నాటికి ముగియవచ్చని అంచనాలు ఉన్నాయి. భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య ఆర్థిక బంధాలు మరింత పటిష్టమయ్యేలా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ప్రక్రియ వేగవంతమయ్యేందుకు నిర్మాణాత్మకంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు. భారత్-ఇటలీ సంబంధాలు మరింత బలపడేందుకు ఐఎంఈసీ (భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ కారిడార్) తోడ్పడగలదని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెరిగే దిశగా అవరోధాలను తొలగించడంపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉందని ఆయన చెప్పారు. ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉండే పక్షంలో 90 రోజుల్లోపే అమెరికాతో తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ తొలి 'రోడ్‌స్టర్ ఎక్స్' బైక్ విడుదల

ఈ ఏప్రిల్‌లో కస్టమర్లకు అందుబాటులోకి



న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ క్రిష్ణగిరి 'ఫ్యూచర్‌ఫ్యాక్టరీ'లో తయారుచేసిన తొలి 'రోడ్‌స్టర్ ఎక్స్ మోటార్‌సైకిల్'ను శుక్రవారం విడుదల చేసింది. ఈ ఎలక్ట్రిక్ బైక్ ఈ ఏప్రిల్‌లో కస్టమర్లకు అందుబాటులోకి రానుంది. ''విద్యుత్ వాహన విప్లవాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే నిబద్ధతకు ప్రతిరూపమే 'రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్'. మా కొత్త ఉత్పత్తి ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో కొత్త శకానికి నాందిగా నిలిస్తుంది.'' అని కంపెనీ చైర్మన్ ఎండీ భవీశ్ అగర్వాల్ తెలిపారు. ఓలా ఈ బైక్‌ను కొత్తగా అభివృద్ధి చేసిన మిడ్-డ్రైవ్ మోటార్‌తో రూపొందించింది. ఇందులో ఎంసీయూ ఇంటిగ్రేషన్ వంటి ఆధునిక టెక్నాలజీ కూడా ఉంది. ఐపీ67 సర్టిఫైడ్ బ్యాటరీలు ఉన్నాయి. ఓలా రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ 2.5 కిలోవాట్ హవర్(కేడబ్ల్యూహెచ్) 3.5 కేడబ్ల్యూహెచ్, 4.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఆప్షన్‌లో లభిస్తుంది. వీటి ధరలు వరుసగా రూ.84,999, రూ.94,999, రూ.1,04,999గా ఉన్నాయి. కాగా, ఎక్స్‌ప్లస్ సిరిస్‌లో 4.5కేడబ్ల్యూహెచ్ బైక్ ధర రూ.1,14,999 లక్షలు ఉండగా, 9.1కేడబ్ల్యూహెచ్ బైక్ ధర రూ.1,84,999గా ఉంది.

వొడాఫోన్ ఐడియా రుణాలు అప్

2024 డిసెంబర్‌కల్లా రూ. 2.17 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్‌ఐడియా రుణ భారం 2024 డిసెంబర్‌కల్లా 7 శాతం పెరిగి రూ. 2.17 లక్షల కోట్లకు చేరింది. చట్టబద్ధ లయబిలిటీల కారణంగా గత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికాని(అక్టోబర్-డిసెంబర్)కల్లా రుణ భారం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. 2023 డిసెంబర్ త్రైమాసికంలో రూ. 2,03,400 కోట్లుగా నమోదైనట్లు ఇన్వెస్టర్లకు తెలియజేసింది. తాజా రుణ భారంలో ప్రధానంగా రూ. 2,14,700 కోట్లు ప్రభుత్వానికి చెల్లించవలసిన బకాయిలుకాగా.. రూ. 2,300 కోట్లు బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థల రుణాలుగా పేర్కొంది. గత రెండేళ్లలో బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థల రుణాలు రూ. 10,700 కోట్లమేర తగ్గినట్లు వెల్లడించింది. కాగా.. ఇటీవల ప్రభుత్వం గత టెలికం ప్యాకేజీలో భాగంగా రూ. 36,950 కోట్ల బకాయిలను ఈక్విటీగా మార్పు చేసుకునేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో వొడాఫోన్‌ఐడియాలో ప్రభుత్వ వాటా 22.6 శాతం నుంచి 48.99 శాతానికి బలపడనుంది. ఇవి 2025-26, 2027-28లో చెల్లించవలసిన స్పెక్ట్రమ్ బకాయిలుకాగా.. ప్రభుత్వ నిర్ణయానికంటే ముందున్న రుణ భార పరిస్థితిని వొడాఫోన్‌ఐడియా వాటాదారులకు వెల్లడించింది.

తాజాగా వాటా పెంపు

మంగళవారం(8న) కంపెనీ ప్రభుత్వానికి ఈక్విటీ షేర్ల కేటాయింపును పూర్తి చేయడంతో రుణ భారం తగ్గడంతోపాటు.. వొడాఫోన్‌ఐడియాలో ప్రభుత్వ వాటా 48.99 శాతాన్ని తాకింది. కంపెనీలో ప్రస్తుతం ప్రమోటర్లుగా వొడాఫోన్ గ్రూప్ 16.07 శాతం, ఆదిత్య బిర్లా గ్రూప్ 9.5 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. గతంలో ప్రభుత్వం రూ. 16,130 కోట్ల రుణాలను ఈక్విటీగా మార్పిడి చేసుకోవడంతో వొడాఫోన్‌ఐడియాలో 22 శాతానికిపైగా వాటా పొందిన విషయం విదితమే.

జోరుగా గ్యాస్ వినియోగం

- 2030 నాటికి 60 శాతం అప్
- పీఎన్‌జీఆర్‌బీ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: వాహనాలు, గృహాలు, పరిశ్రమల అవసరాల కోసం సహజ వాయువును విరివిగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో 2030 నాటికి గ్యాస్ వినియోగం 60 శాతం పెరగనుంది. 2023-24లో రోజుకు 188 మిలియన్ ఘనపు మీటర్లుగా (ఎంసీఎండీ) ఉన్న వినియోగం, 2030 నాటికి 297 ఎంసీఎండీకి చేరనుంది. వివిధ పరిస్థితుల్లో గ్యాస్ వినియోగ ధోరణులను విశ్లేషిస్తూ చమురు నియంత్రణ సంస్థ పీఎన్‌జీఆర్‌బీ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఒక మోస్తరు వృద్ధి, సానుకూల పరిణామాలతో కూడుకున్న 'గుడ్ టు గో' పరిస్థితుల్లో గ్యాస్ వినియోగం 2030 నాటికి 297 ఎంసీఎండీకీ, 2040 నాటికి 496 ఎంసీఎండీకి కూడా పెరిగే అవకాశం ఉంది. ఇక వృద్ధి వేగవంతమై, పాలసీలు సానుకూలంగా అమలవుతూ, భారీగా పెట్టుబడులు వచ్చే 'గుడ్ టు బెస్ట్' పరిస్థితుల్లో 2030 నాటికి 365 ఎంసీఎండీకి, 2040 నాటికి 630 ఎంసీఎండీకి వినియోగం పెరగవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ కొత్తగా ఏర్పడే డిమాండ్‌లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) సంస్థల వాటా గణనీయంగా ఉండనుంది. 'గ్యాస్ వినియోగ వృద్ధికి సీజీడీ రంగం కీలక చోదకంగా నిలుస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో 37 ఎంసీఎండీ స్థాయి నుంచి 2030 నాటికి 2.5-3.5 రెట్లు, 2040 నాటికి 6-7 రెట్ల వరకు ఇది పెరిగే అవకాశం ఉంది' అని నివేదిక పేర్కొంది. పీఎన్‌జీఆర్‌బీ ఇటీవల 307 భౌగోళిక ప్రాంతాల్లో సిటీ గ్యాస్ లైసెన్సులు ఇచ్చింది. నివేదికలోని మరిన్ని విశేషాలు..

- రిఫైనరీ, పెట్రోకెమికల్స్ కార్యకలాపాలు జోరందుకోవడం కూడా సహజ వాయువు వినియోగానికి దోహదపడనుంది. 2030 నాటికి పెరిగే అదనపు వినియోగంలో ఈ విభాగం వాటా 21 ఎంసీఎండీగా, 2040 నాటికి మరో 10 ఎంసీఎండీగా ఉండనుంది.
- విద్యుదుత్పత్తి, ఎరువుల రంగంలో గ్యాస్ వినియోగం ఒక మోస్తరుగా పెరగనుంది.
- డిమాండ్ పెరిగే కొద్దీ ద్రవీకృత సహజ వాయువు దిగుమతులు కూడా పెరగనున్నాయి. సుదూర ప్రాంతాలకు రవాణాకు సంబంధించి డీజిల్ స్థానాన్ని ఎల్ఎన్‌జీ భర్తీ చేసే అవకాశం ఉంది. 2030 తర్వాత, చైనా తరహాలో డీజిల్‌పై ఆధారపడటం తగ్గి ఎల్ఎన్‌జీ వినియోగం పెరగవచ్చు. డిమాండ్ దన్ను, దేశీయంగా ఉత్పత్తి నెమ్మదించే పరిస్థితుల కారణంగా అప్పటికి ఎల్ఎన్‌జీ దిగుమతులు రెట్టింపు కావచ్చు. 2030-2040 నాటికి గ్యాస్ వినియోగం అనేక రెట్లు పెరగనుండటంతో, డిమాండ్-సరఫరా మధ్య వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు ఎల్ఎన్‌జీపై ఆధారపడటమూ భారీగా పెరగనుంది. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ లభ్యత మెరుగ్గా ఉండటం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉంది.
- 2030, 2040 నాటికి భారత్ నిర్దేశించుకున్న సహజ వాయువు లక్ష్యాలను సాధించాలంటే మౌలిక సదుపాయాల విస్తరణ, ఎల్ఎన్‌జీ ధరలు.. విధానాలు సానుకూలంగా ఉండాలి. అయితే, భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, పాలసీపరంగా అనిశ్చితి మొదలైన అంశాల కారణంగా గ్యాస్ ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశాలూ ఉన్నాయి. 2015-16 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో సహజ వాయువు వినియోగం 45 శాతం వృద్ధి చెంది 131 ఎంసీఎండీ నుంచి 188 ఎంసీఎండీకి పెరిగింది.

ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ల ఆదాయాలు రయ్..

- 2025-26లో 18-20 శాతం వృద్ధి అంచనా
- టారిఫ్‌ల పెంపు ఊతం
- ఇక్రా నివేదిక



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీ విమానాశ్రయాల ఆపరేటర్ల ఆదాయాలు 18-20 శాతం మేర వృద్ధి చెందనున్నాయి. ప్యాసింజర్ల ట్రాఫిక్ పెరుగుతుండటం, టారిఫ్‌ల పెంపుతో పాటు ఏరోనాటికల్‌యేతర ఆదాయాలు మెరుగుపడుతుండటం తదితర అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం, గత ఆర్థిక సంవత్సరం నమోదైన 10 శాతం వృద్ధిని బట్టి చూస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్ల ట్రాఫిక్ (దేశీ, విదేశీ రూట్లలో ప్రయాణించేవారు కలిపి) సుమారు 7-9 శాతం పెరిగి 44-45 కోట్లకు చేరనుంది. గత ఆర్థిక సంవత్సరం ఈ సంఖ్య 41.2-41.5 కోట్ల స్థాయిలో నమోదైంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్వహణలో ఉన్నవి, అలాగే పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్ కింద నిర్వహించే ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు సహా వివిధ విమానాశ్రయాల శాంపిల్ సెట్ ఆధారంగా ఇక్రా ఈ నివేదికను రూపొందించింది. కొత్తగా భోగాపురం (ఆంధ్రప్రదేశ్), పరందూర్ (చెన్నై), నవీ ముంబై, జేవర్ (నోయిడా) వంటి విమానాశ్రయాలు వస్తుండటంతో రాబోయే 4-5 ఏళ్లలో రూ. 1 లక్ష కోట్ల పైచిలుకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

ఇంటర్నేషనల్ ట్రాఫిక్ దన్ను..

'కొత్త ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడటం, అంతర్జాతీయంగా టూరిజం పుంజుకోవడంలాంటి అంశాల దన్నుతో దేశీ రూట్లలో ప్రయాణించే ప్యాసింజర్ల రద్దీని మించి ఇంటర్నేషనల్ ట్రాఫిక్ ఉంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చు. అంతర్జాతీయ ట్రాఫిక్ 7-11 శాతం, దేశీ ట్రాఫిక్ 6-8 శాతం పెరగొచ్చు' అని ఇక్రా సెక్టార్ హెడ్ (కార్పొరేట్ రేటింగ్స్) జి. వినయ్ కుమార్ తెలిపారు. దేశీ ట్రాఫిక్‌తో పోలిస్తే అంతర్జాతీయ ప్రయాణాలకు సంబంధించిన ట్రాఫిక్ మరింత లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇది పెరగడమనేది ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు సానుకూలాంశమని వివరించారు.

ఎవరిదో కిరీటం?

హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ షో



- ఐర్లాండ్‌పై వెస్టిండీస్ విజయం
- మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ

లాహోర్: హేలీ మాథ్యూస్ మరోసారి ఆల్‌రౌండర్ ప్రదర్శనతో అదరగొట్టడంతో... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో వెస్టిండీస్ తొలి విజయం నమోదు చేసుకుంది. మొదటి మ్యాచ్‌లో స్కాట్లాండ్ చేతిలో ఓడిన వెస్టిండీస్ జట్టు... రెండో మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో విండీస్ 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 33 ఓవర్లకు కుదించగా... మొదట బ్యాటింగ్ చేసిన కరీబియన్ జట్టు 6 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హేలీ మాథ్యూస్ (18 బంతుల్లో 23; 5 ఫోర్లు) జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా... చినెల్లి హెన్రీ (36 బంతుల్లో 46; 2 ఫోర్లు, 1 సిక్స్), స్టెఫానీ టేలర్ (56 బంతుల్లో 46; 5 ఫోర్లు), జైదా జేమ్స్ (36) రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో జేన్ మాగుర్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో ఐర్లాండ్ మహిళల జట్టు 32.2 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అమీ హంటర్ (46 బంతుల్లో 48; 8 ఫోర్లు) ధాటిగా ఆడగా... మిగిలిన వాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. గత మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో వీరోచిత శతకంతో పాటు... బౌలింగ్‌లో 4 వికెట్లతో విజృంభించినా... జట్టును గెలిపించుకోలేకపోయిన హేలీ మాథ్యూస్... తాజా పోరులోనూ 4 వికెట్లతో సత్తా చాటింది. మైదానంలో పాదరసంలా కదులుతూ మూడు క్యాచ్‌లు సైతం అందుకుంది. ఇతర విండీస్ బౌలర్లలో ఆలియా, కరిష్మా చెరో 2 వికెట్లు తీశారు. తదుపరి మ్యాచ్‌లో సోమవారం ఆతిథ్య పాకిస్తాన్‌తో వెస్టిండీస్ తలపడుతుంది.

లవ్లీనా ఇక 70 కేజీల విభాగంలో!

లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ నుంచి 75 కేజీల కేటగిరీ తొలగింపు



న్యూఢిల్లీ: భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ తిరిగి 70 కేజీల విభాగానికి మారనుంది. 2020 టోక్యో ఒలింపిక్స్ మహిళల 69 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలిచిన లవ్లీనా ప్రస్తుతం 75 కేజీల విభాగంలో పోటీపడుతోంది. అయితే... 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ మహిళల బాక్సింగ్‌లో 75 కేజీల వెయిట్ కేటగిరీని తొలగిస్తున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) వెల్లడించింది. ఈ నేపథ్యంలో విశ్వక్రీడల్లో పాల్గొనాలంటే లవ్లీనా 70 కేజీల లేదా 80 కేజీల విభాగంలో బరిలోకి దిగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో లవ్లీనా మాట్లాడుతూ... 'ఈ వార్త నన్ను షాక్‌కు గురిచేసింది. ఇక 70 కేజీల విభాగానికి మారడమే మేలు. ఎందుకంటే 80 కేజీలకు పెరగడం అనేది చాలా కష్టంతో కూడుకున్నది' అని లవ్లీనా పేర్కొంది. ఆమె వ్యక్తిగత కోచ్ ప్రణామిక బోరా కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చింది. 'ఈ వార్త ఆశ్చర్యానికి గురిచేసింది. అందుబాటులో ఉన్న రెండు కేటగిరీల్లో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోవాల్సిందే. అయితే అంతకుముందు వైద్యుల సూచనలు ముఖ్యం. ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటాం' అని ప్రణామిక వ్యాఖ్యానించింది. ప్రస్తుతం లవ్లీనా బరువు 74 కేజీలు కాగా... నాలుగు కేజీలు తగ్గడం వల్ల ఆమె పంచ్ పవర్ కూడా తగ్గే ప్రమాదముంది. లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ పోటీలు నిర్వహించకూడదని గతంలో నిర్ణయించగా... తాజాగా తిరిగి వాటిని పొందుపరిచారు. పురుషులు, మహిళల విభాగాల్లో 7 కేటగిరీల్లో బౌట్‌లు నిర్వహించనున్నారు. విశ్వక్రీడల మహిళల బాక్సింగ్‌లో 51 కేజీలు, 54 కేజీలు, 57 కేజీలు, 60 కేజీలు 65 కేజీలు, 70 కేజీలు, +80 కేజీలు విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. 2020 టోక్యో ఒలింపిక్స్ 69 కేజీల కేటగిరీలో పతకం నెగ్గిన లవ్లీనా... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఆ విభాగం లేకపోవడంతో 75 కేజీల కేటగిరీకి మారింది. 2022 ఆసియా చాంపియన్‌షిప్స్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకాలు గెలిచిన లవ్లీనా... 2022 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో రజత పతకం నెగ్గింది. పారిస్ ఒలింపిక్స్ 50 కేజీల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ఇకపై 51 కేజీల విభాగంలో పోటీ పడాల్సి ఉంటుంది.


సుభాశీష్ గుర్‌ప్రీత్‌సింగ్

నేడు ఇండియన్ సూపర్ లీగ్ 11వ సీజన్ ఫైనల్

- రెండో టైటిల్ కోసం మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌తో బెంగళూరు ఎఫ్‌సీ ఢీ
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: 13 జట్లు... 162 మ్యాచ్‌లు... 210 రోజులు... 465 గోల్స్‌తో సుదీర్ఘంగా సాగిన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 11వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. గత సీజన్ రన్నరప్ మోహన్ బగాన్ సూపర్ జెయింట్, బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) మధ్య నేడు ఫైనల్ జరగనుంది. వరుసగా మూడోసారి ఫైనల్ చేరుకున్న మోహన్ బగాన్ జట్టు... సొంతగడ్డపై జరగనున్న తుదిపోరులో గెలిచి రెండోసారి చాంపియన్‌గా నిలవాలని భావిస్తుంటే... ఇప్పటి వరకు నాలుగుసార్లు ఫైనల్‌కు చేరిన బెంగళూరు ఎఫ్‌సీ కూడా రెండోసారి టైటిల్ చేజిక్కించుకోవాలని చూస్తోంది. 2022-23 సీజన్‌లో చాంపియన్‌గా నిలిచిన మోహన్ బగాన్ జట్టు... 2023-24 సీజన్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. తాజా సీజన్ లీగ్ దశలో అదిరిపోయే ఆటతీరు కనబర్చిన మోహన్ బగాన్... ఇప్పటికే లీగ్ షీల్డ్ విన్నర్‌గా నిలిచింది. 2024-25 లీగ్ దశలో 24 మ్యాచ్‌లాడిన మోహన్ బగాన్ జట్టు 17 విజయాలు, 2 పరాజయాలు, 5 'డ్రా'లతో 56 పాయింట్లు ఖాతాలో వేసుకొని 'టేబుల్ టాపర్'గా నిలిచింది. నాకౌట్ మ్యాచ్‌లతో కలుపుకొని 26 మ్యాచ్‌ల్లో మోహన్ బగాన్ 50 గోల్స్ చేసింది. అంటే సరాసరిగా ఈ సీజన్‌లో మ్యాచ్‌కు రెండు గోల్స్ చొప్పున కొట్టింది. ఇక బెంగళూరు జట్టు గ్రూప్ దశలో 24 మ్యాచ్‌ల్లో 11 విజయాలు, 8 పరాజయాలు, 5 'డ్రా'లతో 38 పాయింట్లు సాధించి ముందంజ వేసింది. నాకౌట్ మ్యాచ్‌లతో కలుపుకొని బెంగళూరు 27 మ్యాచ్‌ల్లో 48 గోల్స్ చేసింది.

సమఉజ్జీల సమరం...

దూకుడుకు మారుపేరైన ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు ఖాయమే కాగా... ఈ సీజన్‌లో మోహన్ బగాన్ ప్రత్యర్థులపై సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. బగాన్ జట్టు ప్రత్యర్థులకు 18 గోల్స్ మాత్రమే ఇచ్చుకోగా... బెంగళూరు జట్టు 33 గోల్స్ సమర్పించుకుంది. ఈ గణాంకాలు చాలు మోహన్ బగాన్ జట్టుపై గోల్ కొట్టడం ఎంత కష్టమో చెప్పేందుకు. ఇప్పటి వరకు నాలుగుసార్లు ఐఎస్ఎల్ ఫైనల్‌కు చేరిన బెంగళూరు జట్టు... 2018-19 సీజన్‌లో చాంపియన్‌గా అవతరించింది. 2017-18, 2022-23 సీజన్‌లలో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2022-23 సీజన్‌లో మోహన్ బగాన్, బెంగళూరు జట్ల మధ్య హోరాహోరీగా సాగిన ఫైనల్ నిర్ణీత సమయంలో 2-2 గోల్స్‌తో 'డ్రా' కాగా... షూటౌట్‌లో మోహన్ బగాన్ జట్టు 4-3 గోల్స్ తేడాతో బెంగళూరుపై విజయం సాధించింది. ఇప్పుడా పరాజయానికి బదులు తీర్చుకునేందుకు బెంగళూరుకు చక్కటి అవకాశం ఉంది. భారత స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రీ బెంగళూరు జట్టుకు సారథ్యం వహిస్తుండగా... సుభాశీష్ బోస్ కెప్టెన్సీలో మోహన్ బగాన్ బరిలోకి దిగుతోంది. 'ఫైనల్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. సీజన్ చాలా బాగా సాగింది. తుదిపోరులోనూ అదే జోరు కొనసాగిస్తూ రెండోసారి ట్రోఫీ గెలుచుకోవాలని భావిస్తున్నాం. కోల్‌కతా నగరం మాకు రెండో ఇల్లు లాంటిది. జట్టు ప్రదర్శన బాగుంది. సొంత అభిమానుల సమక్షంలో మ్యాచ్ ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమే. వారి అంచనాలను అందుకునేందుకు ప్రయత్నిస్తాం' అని మోహన్ బగాన్ సారథి సుభాశీష్ బోస్ అన్నాడు. ఆడిన ఎనిమిది సీజన్‌లలో బెంగళూరు జట్టు నాలుగోసారి ఫైనల్‌కు చేరగా... ఐఎస్ఎల్ చరిత్రలో వరుసగా మూడోసారి ఫైనల్ చేరిన తొలి జట్టుగా మోహన్ బగాన్ నిలిచింది. మోహన్ బగాన్ తరఫున అల్బెర్టో రోడ్రిగ్స్, లిస్టన్ కొలాకో, అనిరుధ్ థాపా, సుభాశీష్ కీలకం కానుండగా... బెంగళూరు జట్టు గోల్‌కీపర్ గుర్‌ప్రీత్‌సింగ్ సంధు, చింగ్‌లెన్‌సనా సింగ్, అల్బెర్టో నొగురె, ఎడ్గర్ మెండెజ్‌పై భారీ ఆశలు పెట్టుకుంది.

ఐఎస్ఎల్ మాజీ విజేతలు

సీజన్	చాంపియన్
2014	అట్లెటికో డి కోల్‌కతా
2015	చెన్నైయిన్ ఎఫ్‌సీ
2016	అట్లెటికో డి కోల్‌కతా
2017-2018	చెన్నైయిన్ ఎఫ్‌సీ
2018-2019	బెంగళూరు ఎఫ్‌సీ
2019-2020	అట్లెటికో డి కోల్‌కతా
2020-2021	ముంబై సిటీ ఎఫ్‌సీ
2021-2022	హైదరాబాద్ ఎఫ్‌సీ
2022-2023	ఏటీకే మోహన్ బగాన్
2023-2024	ముంబై సిటీ ఎఫ్‌సీ



'ఒత్తిడి లేకుండా ఆడటమే లక్ష్యం'

- 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌పై గురి
- యువ షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ వ్యాఖ్య


న్యూఢిల్లీ: భారత రైఫిల్ షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ 18 ఏళ్ల వయసులోనే ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. ఆ తర్వాత పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు 'కోటా'ను అందించిన షూటర్లలో అతనూ ఒకడు. అయితే దురదృష్టవశాత్తూ ఒలింపిక్ క్వాలిఫికేషన్ ట్రయల్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో సందీప్ సింగ్ చేతిలో ఓడి పారిస్ ఒలింపిక్స్‌కు దూరమయ్యాడు. ఇది అతనిపై మానసికంగా తీవ్ర ప్రభావం చూపించింది. దాని నుంచి కోలుకోవడానికి అతనికి కొంత సమయం పట్టింది. 'ఆ సమయంలో నేను చాలా బాధపడిన మాట వాస్తవం. కొద్దిరోజుల పాటు అదే వేదనలో ఉండిపోయాను. నాకంటే ఎక్కువగా నా ఆటను దగ్గరి నుంచి చూసిన సహాయక సిబ్బంది, తల్లిదండ్రులు బాధపడ్డారు. అయితే కొద్ది రోజుల తర్వాత నేను సాధారణ స్థితికి వచ్చాను. ఒలింపిక్ సెలక్షన్ ట్రయల్స్ ద్వారా మాత్రమే భారత జట్టును ఎంపిక చేస్తారనేది వాస్తవమని అర్థమైంది. సెలక్టర్లను ఒప్పించేందుకు నా ప్రయత్నం నేను చేశాను కానీ నిబంధనలు ఉన్నాయి. ఏం చేస్తాం' అని రుద్రాంక్ష్ వ్యాఖ్యానించాడు. ఒలింపిక్స్ ముగిసిన తర్వాత అతను మళ్లీ తన ఆటపై దృష్టి పెట్టాడు. గురువారం బ్యూనస్ ఎయిర్స్‌లో ముగిసిన సీజన్ తొలి వరల్డ్ కప్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకంతోపాటు మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆర్య బోర్సేతో కలిసి రజతం గెలుచుకున్నాడు. మానసికంగా దృఢంగా మారేందుకు సైకాలజిస్ట్‌ల సహాయం కూడా తీసుకుంటున్నాడు. 'టోర్నమెంట్‌లు జరిగే సమయంలో ఎలాంటి ఒత్తిడి దరి చేరనీయకుండా ప్రశాంతంగా ఉండే ప్రయత్నం చేస్తున్నాను. అలాంటి స్థితిలో నిలకడగా రాణిస్తూ నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నా. ప్రతీ రెండు నెలలకు ఒకసారి మనల్ని మనం నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. 0.1 పాయింట్ తేడాతో వెనుకబడిపోవచ్చు. ఎప్పటికప్పుడు ఆటను మెరుగుపర్చుకుంటూనే ఉండాలి. కాబట్టి సాంకేతికంగానే కాకుండా మానసికంగా కూడా మెరుగ్గా ఉండటంపై దృష్టి పెట్టాలి. లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్స్ ముందున్నాయి. నాపై నాకు చాలా నమ్మకం ఉంది. నేను ఎంచుకున్న దారిలో నిలకడ కొనసాగిస్తే మంచి ఫలితం లభిస్తుందని ఆశిస్తున్నా' అని రుద్రాంక్ష్ వివరించాడు.

పాకిస్తాన్ గెలుపు జోరు

- స్కాట్లాండ్‌పై 6 వికెట్లతో విజయం
- మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ


ఆలియా రియాజ్

లాహోర్: స్వదేశంలో జరుగుతున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ జోరు కొనసాగిస్తోంది. తొలి పోరులో ఐర్లాండ్‌ను చిత్తు చేసిన పాకిస్తాన్ జట్టు... రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 32 ఓవర్లకు కుదించగా... మొదట బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 9 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. కెప్టెన్ సారా బ్రైస్ (96 బంతుల్లో 91; 10 ఫోర్లు, 1 సిక్స్) సూపర్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా... లిస్టర్ (31) రాణించింది. పాకిస్తాన్ బౌలర్లలో కెప్టెన్ ఫాతిమా సనా 4, సాదియా ఇక్బాల్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ మహిళల జట్టు 30.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. మునీబా అలీ (72 బంతుల్లో 71; 9 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆలియా రియాజ్ (70 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో క్లో అబెల్ 2 వికెట్లు పడగొట్టింది. ఈ టోర్నీ తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ ఏడాది ఆఖర్లో భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధిస్తాయి. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన పాకిస్తాన్ 4 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో ఉండగా... బంగ్లాదేశ్, స్కాట్లాండ్, వెస్టిండీస్ ఒక్కో విజయంతో రెండేసి పాయింట్లు సాధించాయి.


కమిన్స్


పంజాబ్ జట్టు

సన్‌రైజర్స్‌కో విజయం కావాలి!

తీవ్ర ఒత్తిడిలో హైదరాబాద్ టీమ్
- సొంత మైదానంలో గెలుపుపై గురి
- నేడు పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్

సాక్షి, హైదరాబాద్: ఒకటి కాదు రెండు కాదు వరుసగా నాలుగు మ్యాచ్‌లలో పరాజయం... భారీ అంచనాలు పెట్టుకున్న టాప్-3 వరుసగా విఫలం ...టోర్నీలో అన్ని జట్లకంటే చెత్త ఎకానమీ (10.73) నమోదు చేసిన బౌలర్లు... బౌలింగ్ సగటు కూడా అన్నింటికంటే ఎక్కువ (41.47)... బ్యాటర్ల నుంచి పరుగులు రావడం లేదు... బౌలర్ల ప్రదర్శన పేలవం ... ఇలా అన్నీ సమస్యలే! ఇలాంటి స్థితిలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానంలో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమైంది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో నేడు జరిగే సమరంలో పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ తలపడుతుంది. ఆడిన నాలుగు మ్యాచ్‌లో మూడు విజయాలతో ఫామ్‌లో ఉన్న పంజాబ్‌ను రైజర్స్ ఏమాత్రం నిలువరిస్తుందనేది చూడాలి. మ్యాచ్ ముందు రోజు నగరంలో కాస్త చల్లటి వాతావరణం ఉన్నా... శనివారం రోజు వర్షసూచన లేదు.

వరుస వైఫల్యాలు...

హైదరాబాద్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో రాజస్తాన్‌పై 286 పరుగుల స్కోరుతో సీజన్‌ను సన్‌రైజర్స్ ఘనంగా ప్రారంభించింది. కానీ ఆ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. తర్వాతి నాలుగు మ్యాచ్‌లలో జట్టు వరుసగా 190, 163, 120, 152 పరుగులు చేసింది. అయితే ఇవేవీ విజయానికి సరిపోలేదు. తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ సెంచరీని మినహాయిస్తే ఓవరాల్‌గా ఈ నాలుగు మ్యాచ్‌లలో కలిపి రైజర్స్ నుంచి 2 అర్ధసెంచరీలు నమోదయ్యాయి. క్లాసెన్ గరిష్ఠంగా 152 పరుగులే చేయగా... హెడ్ 148, అభిషేక్ 51 పరుగులు సాధించడం బ్యాటింగ్ పరిస్థితిని చూపిస్తోంది. నితీశ్ రెడ్డి ఏమాత్రం ప్రభావం చూపించలేకపోతున్నాడు. స్కోర్లు మాత్రమే కాదు, జట్టు ఆటగాళ్లలో ఒక రకమైన నిరాసక్తత కనిపిస్తోంది. మైదానంలో చురుకుదనం లోపించగా... గత ఏడాది తరహాలో పరుగులు సాధించాలనే తపన, కసి బ్యాటర్లలో కనిపించడం లేదు. వరుస ఓటముల ప్రభావం కూడా ఆటగాళ్లపై పడింది. అయితే దీని నుంచి కోలుకొని మళ్లీ చెలరేగేందుకు ఈ మ్యాచ్‌కు మించి మంచి అవకాశం లభించదు. కెప్టెన్ కమిన్స్ వికెట్లు తీయకపోవడంతో పాటు ఏకంగా 11.16 ఎకానమీతో పరుగులు ఇస్తున్నాడు. షమీలాంటి ప్రధాన పేసర్ కూడా 9.29 ఎకానమీతో పరుగులు ఇవ్వడం చూస్తే బౌలింగ్ ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతోంది. ఈసారి ఓడితే మాత్రం కోలుకొని ప్లే ఆఫ్స్ రేసులోకి రావడం సన్‌రైజర్స్‌కు దాదాపు అసాధ్యం కావచ్చు.

జోరు మీదున్న కింగ్స్...

శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య... పంజాబ్ గెలిచి మూడు మ్యాచ్‌లలో వీరు ముగ్గురు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'లుగా నిలిచిన ఆటగాళ్లు. అంటే జట్టు ఏ ఒక్కరి బ్యాటింగ్‌పైనే ఆధారపడటం లేదు. పరిస్థితిని బట్టి ఒక్కో ప్లేయర్ బాధ్యత తీసుకొని నడిపిస్తున్నాడు. ఈ ముగ్గురికి తోడు నేహల్ వధేరా, శశాంక్ సింగ్‌లతో జట్టు బ్యాటింగ్ పటిష్ఠంగా ఉంది. అద్భుత ఫామ్‌లో ఉన్న అయ్యర్ 200 పరుగులు స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధించాడు. స్టొయినిస్, మ్యాక్స్‌వెల్‌లాంటి ఆటగాళ్లు రాణించకపోయినా పంజాబ్ మెరుగైన స్థితిలో ఉంది. ఇదే జోరు కొనసాగిస్తే జట్టు మరో సారి భారీ స్కోరు సాధించడం ఖాయం. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, ఫెర్గూసన్ ముందుండి నడిపిస్తుండగా... యశ్ ఠాకూర్ కూడా రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు 11 ఓవర్లు వేసి ఒకే ఒక వికెట్ తీసిన చహల్ మాత్రం ఇంకా లయ అందుకోలేదు. అతనూ రాణిస్తే రైజర్స్‌ను కట్టడి చేయవచ్చు.

తుది జట్లు (అంచనా)

సన్‌రైజర్స్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, నితీశ్ రెడ్డి, క్లాసెన్, అనికేత్, కమిందు, అన్సారీ, హర్షల్, షమీ, రాహుల్ చహర్.

పంజాబ్ కింగ్స్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, వధేరా, శశాంక్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, యాన్సెన్, చహల్, అర్ష్‌దీప్, ఫెర్గూసన్, యశ్ ఠాకూర్.

ఆస్ట్రేలియాలో భారత హాకీ జట్టు పర్యటన

ఐదు మ్యాచ్‌లు ఆడనున్న టీమిండియా



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు ఈ నెలాఖరులో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఏప్రిల్ 26 నుంచి మే 4 వరకు జరగనున్న ఈ టూర్‌లో భారత మహిళల హాకీ జట్టు ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్‌లు ఆడనుందని హాకీ ఇండియా (హెచ్ఐ) గురువారం వెల్లడించింది. ఇందులో తొలి రెండు మ్యాచ్‌లు ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో కాగా... ఆ తర్వాత మూడు మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో ఆడుతుంది. ఈ నెల 26, 27న ఆస్ట్రేలియా 'ఎ'తో భారత్ మ్యాచ్‌లు ఆడనుండగా... ఆసీస్ ప్రధాన జట్టుతో మే 1, 3, 4 తేదీల్లో మ్యాచ్‌లు ఆడనుంది. పెర్త్ హాకీ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇటీవల స్వదేశంలో జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ పోటీల్లో ఫర్వాలేదనిపించిన భారత మహిళల జట్టు... జూన్‌లో యూరప్ అంచె పోటీల్లో పాల్గొననుంది. దానికి ముందు ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆస్ట్రేలియా జట్టుతో తలపడనుండటం తొమ్మిదో ర్యాంకర్ టీమిండియాకు ఉపయోగపడుతుంది. 2013 నుంచి ఆస్ట్రేలియాతో 16 మ్యాచ్‌లు ఆడిన భారత్ అందులో మూడింట గెలిచి 10 మ్యాచ్‌ల్లో ఓడింది. మరో 3 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

సాక్షి ప్లస్
శనివారం ; 12-4-2025

అధ్యక్ష బరిలో మ్యుంగ్

దక్షిణ కొరియా విపక్ష నేతకు 34 శాతం మద్దతు | జూన్ 3న ఎన్నికలు



సియోల్: దక్షిణ కొరియా అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నట్లు ప్రతిపక్ష నేత లీ జే మ్యుంగ్ ప్రకటించారు. అధ్యక్ష పదవి నుంచి యూన్ సుక్ యోల్ తొలగింపు సబబేనన్న రాజ్యాంగ న్యాయస్థానం తీర్పుతో దేశంలో ఎన్నికలు అనివార్యం కావడం తెలిసిందే. జూన్ 3న ప్రజలు కొత్త అధ్యక్షున్ని ఎన్నుకోనున్నారు. తాను బరిలోకి దిగుతున్నట్లు లీ వీడియో సందేశంలో పేర్కొన్నారు. మానవ హక్కుల న్యాయవాదిగా చేసిన ఆయన దేశ రాజకీయాల్లో అత్యంత సంచలనాత్మక నేత. 61 ఏళ్ల వయసులో ప్రధాన స్రవంతి రాజకీయాల్లోకి పునఃప్రవేశించారు. 2022 అధ్యక్ష ఎన్నికల్లోనూ లీ పోటీ చేశారు. దేశ చరిత్రలోనే అతి తక్కువ తేడాతో యూన్ చేతిలో ఓడారు. గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం విపక్ష డెమొక్రటిక్ పార్టీకి భారీ విజయం సాధించిపెట్టారు.

ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరిస్తా

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధిరేటు క్షీణించడంతో కేవలం ప్రైవేటు రంగం బలంతో ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం, అభివృద్ధి చేయడం కష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరిస్తానని లీ ప్రకటించారు. ''దేశంలో విభజనను, సామాజిక సంఘర్షణలను సైనిక చట్టం బహిర్గతం చేసింది. పేద, ధనిక అంతరం పెరగడమే దీనికి కారణం''అని లీ అన్నారు. ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు, ఆదాయ ధ్రువీకరణను సులభతరం చేయడానికి ప్రభుత్వ వ్యయాన్ని ముమ్మరం చేస్తామని హామీ ఇచ్చారు. ''గతంలో కంటే మన దగ్గర ఎక్కువే ఉన్నాయి. కానీ సంపద కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. అమెరికాతో బలమైన మైత్రిని, జపాన్ తో త్రిముఖ సహకారాన్ని కొనసాగించడం ముఖ్యం. జాతీయ ప్రయోజనాలే మా పరమావధి''అని ఉద్ఘాటించారు.

సర్వేలో ముందంజ

శాసనసభ్యుడిగా, ప్రొవిన్షియల్ గవర్నర్‌గా, మేయర్‌గా పనిచేసిన లీది నిర్మొహమాట శైలి. సంపన్నుల వ్యతిరేకిగా కొనసాగుతూ వస్తున్నారు. విపక్ష నేతగా సమర్థ పనితీరుతో ప్రజల మద్దతు పెంచుకున్నారు. 34 శాతం మంది మద్దతుతో ప్రస్తుతానికి లీ ముందంజలో ఉన్నట్లు ఏప్రిల్ 4న జరిగిన గాలప్ కొరియా సర్వే తేల్చింది. లీ బలమైన పోటీదారుగా కనిపిస్తున్నా ఆయనకు అడ్డంకులు లేకపోలేదు. లంచం ఆరోపణలు, బిలియన్ డాలర్ల రియల్ ఎస్టేట్ కుంభకోణంలో పాత్రతో సహా ఆయనపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించిన కేసులో ఆయన గతంలో దోషిగా తేలారు. ఆ తీర్పును ఎగువ కోర్టు కొట్టేసినా దానిపై ప్రాసిక్యూటర్లు మళ్లీ అప్పీల్ చేశారు. ఈ ఆరోపణలన్నీ రాజకీయపరమైనవని ఆయన అభిమానులు అంటున్నారు. 2024 జనవరిలో ఓ కార్యక్రమంలో లీపై హత్యాయత్నం కూడా జరిగింది. కత్తిపోట్లకు గురైనా ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

అభ్యర్థిని ప్రకటించని పీపీపీ

అధికార పీపుల్ పవర్ పార్టీ (పీపీపీ) ఇంకా న అభ్యర్థిని ఎంపిక చేయలేదు. యూన్ పతనం పార్టీని ఇరకాటంలో పడేసింది. పీపీపీ నుంచి సుమారు 10 మంది నామినేషన్ వేస్తారని భావిస్తున్నారు. ఇప్పటికీ పార్టీని నియంత్రిస్తున్న యూన్ విధేయులకు, సంస్కరణవాదుల మధ్య విభేదాలకు ఇది నిదర్శనమంటున్నారు. మాజీ న్యాయ మంత్రి హాన్ డాంగ్ హూన్, సియోల్ మేయర్ ఓహ్ సె హూన్, టెక్ దిగ్గజం అహ్న్ చియోల్ సో సహా పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వారిలో ఎవరూ ఇప్పటిదాకా ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టలేదు.



ఇవన్నీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోలికలతో రూపొందించిన బాతు బొమ్మలు. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో శుక్రవారం క్లిక్ మనిపించిన ఫొటో ఇది.

నల్లకోటు లేదు.. గుండీలు పెట్టుకోలేదు

- న్యాయవాదికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

అలహాబాద్: కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు ఓ న్యాయవాదికి అలహాబాద్ హైకోర్టు ఆరు నెలల జైలుశిక్ష, రూ.2,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా నెల రోజులపాటు జైలుశిక్ష అనుభవించాలని స్పష్టంచేసింది. జస్టిస్ వివేక్ చౌదరి, జస్టిస్ బి.ఆర్.సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. లక్నోలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని అశోక్ పాండేను ఆదేశించింది. శిక్షకు గురైన లాయర్ అశోక్ పాండే చేసిన నేరం ఏమిటంటే కోర్టులో విధులకు హాజరైనప్పుడు నల్లకోటు ధరించలేదు. చొక్కాకు గుండీలు సరిగ్గా పెట్టుకోలేదు. 2021 ఆగస్టులో ఓ కేసులో వాదించేందుకు అశోక్ పాండే హైకోర్టుకు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం నల్లకోటు ధరించకుండా, చొక్కాకు గుండీలు సరిగ్గా లేకుండా వచ్చిన పాండేను న్యాయమూర్తి మందలించారు. ఇలా చేయడం కోర్టు ధిక్కరణే అవుతుందని చెప్పారు. వెంటనే బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. దాంతో ఆగ్రహానికి గురైన అశోక్ పాండే న్యాయమూర్తులంతా గూండాలు అంటూ విమర్శించారు. ఈ అంశాన్ని హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. బాధ్యత కలిగిన వృత్తిలో ఉన్న అశోక్ పాండే ప్రవర్తన సక్రమంగా లేదని, అతడికి జైలుశిక్ష, జరిమానా విధించడం సబబేనని ధర్మాసనం తేల్చిచెప్పింది.

త్వరలో ఐఏఎఫ్ అమ్ముల పొదిలోకి.. లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్ 'గౌరవ్'

న్యూఢిల్లీ: వైమానిక దళం ఆయుధ శ్రేణిలోకి శక్తివంతమైన లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబు 'గౌరవ్' త్వరలోనే చేరనుంది. ఈ బాంబు ప్రయోగ పరీక్షలను భద్రతా పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తాజాగా సుఖోయ్ యుద్ధ విమానం ద్వారా విజయవంతంగా పూర్తి చేసింది. వెయ్యి కిలోల తరగతిలోని గ్లైడ్ బాంబ్ 'గౌరవ్'డీఆర్‌డీవో సొంతంగా డిజైన్ చేసి, అభివృద్ధి పరిచింది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు 100 కిలోమీటర్ల రేంజ్‌లో జరిపిన ప్రయోగ పరీక్షల్లో ఈ బాంబులు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించాయని రక్షణ శాఖ శుక్రవారం వెల్లడించింది. దీంతో, త్వరలోనే వీటిని భారత వైమానిక దళానికి అందించేందుకు మార్గం సుగమమైందని వివరించింది. గౌరవ్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన డీఆర్‌డీవో నిపుణులు, ఐఏఎఫ్ అధికారులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

ట్రంప్‌కు నేడు సాధారణ వైద్య పరీక్షలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(78) ఎట్టకేలకు సాధారణ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు వచ్చారు. వాల్టర్ రీడ్ నేషనల్ మిలటరీ మెడికల్ సెంటర్‌లో శుక్రవారం వైద్యులు శారీరక దృఢత్వ పరీక్షలు జరపనున్నారు. అమెరికా చరిత్రలోనే 78 ఏళ్ల వయస్సులో ప్రమాణం చేసిన మొట్టమొదటి అధ్యక్షుడుగా నిలిచిన ట్రంప్ ఆరోగ్యం గురించిన వివరాలు ప్రజలకు మొట్టమొదటిసారిగా తెలిసే అవకాశముంది. 'ఇంత ఆరోగ్యంగా నేను ఎప్పుడూ లేను. అయినప్పటికీ ఇది తప్పనిసరిగా చేయాల్సింది కదా!'అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో ఆయన వ్యాఖ్యానించారు. గత అధ్యక్షుడు జో బైడెన్ శారీరక, మానసిక ఆరోగ్యంపై పలుమార్లు ట్రంప్ సందేహం వ్యక్తం చేశారు. బైడెన్ కంటే మూడేళ్లు చిన్నవాడైన ట్రంప్ తన సొంత ఆరోగ్యం విషయానికి వచ్చేసరికి మాత్రం గోప్యత పాటించారు. అధ్యక్షుడయ్యాక ఆరోగ్య వివరాలను బయటకు రానీయలేదు. అమెరికాలో అధ్యక్ష పదవిలో ఉన్న వ్యక్తికి ఏడాదికోసారి సాధారణ ఆరోగ్య పరీక్షలను జరిపి, ఆ వివరాలను ప్రజలకు వెల్లడించటం తప్పనిసరి.

ఓఎంఆర్ షీట్లు విడుదల చేయాలి

- బెంగాల్‌లో ఉద్యోగాలు కోల్పోయిన టీచర్ల ర్యాలీ

కోల్‌కతా: సుప్రీంకోర్టు తీర్పుతో పశ్చిమ బెంగాల్లో ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది టీచర్లు శుక్రవారం ఆందోళన బాటపట్టారు. 2016లో తాము రాసిన ప్రవేశపరీక్ష తాలూకు ఓఎంఆర్ షీట్ల కాపీలను బయట పెట్టి అర్హులను కాపాడాలని డిమాండ్ చేశారు. సాల్ట్ లేక్ నుంచి స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్సీ) భవన్ దాకా ర్యాలీ నిర్వహించారు. తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. వివిధ ప్రజాసంఘాలు వారికి సంఘీభావం తెలిపాయి. ''గతంలో ఉపాధ్యాయులను కొట్టిన పోలీసు అధికారికి ఇప్పుడు వారిపై నమోదైన కేసుల దర్యాప్తు బాధ్యతలను అప్పగించారు. ఇలాంటి దర్యాప్తు నుంచి ఏం ఆశించగలం''అని బాధితులు ప్రశ్నించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో 25,753 మంది బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేయడం తెలిసిందే.

పరిశీలిస్తున్నాం: మంత్రి.. బాధితులతో విద్యా శాఖ మంత్రి బ్రాత్యబసు సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మొత్తం 22 లక్షల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను బయట పెట్టేందుకు ఎస్ఎస్సీ సిద్ధంగా ఉందని తెలిపారు. ''బహుశా రెండు వారాల్లో వాటిని విడుదల చేస్తాం. దీనిపై న్యాయ సలహా తీసుకుంటున్నాం''అని వివరించారు.

హడ్సన్ నదిలో కూలిన హెలికాప్టర్

న్యూయార్క్‌లో దుర్ఘటన, ఆరుగురి మృతి

న్యూయార్క్: అమెరికాలో మరోసారి హెలికాప్టర్ కుప్పకూలింది. బెల్-206 హెలికాప్టర్ గురువారం న్యూయార్క్‌లోని హడ్సన్ నదిలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. వారిలో ముగ్గురు చిన్నారులున్నారు. మృతుల్లో ఐదుగురు స్పెయిన్‌కు చెందిన పర్యాటకులు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ సీమెన్స్ స్పానిష్ విభాగాధిపతి అగస్టీన్ ఎస్కోబార్, మెర్సీ కాంప్రుబి మోంటాల్ దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి స్కైపోర్ట్ డౌన్‌టౌన్ నుంచి మధ్యాహ్నం బయలుదేరారు. టేకాఫ్ అయిన 18 నిమిషాలకే హెలికాప్టర్ కూలిపోయింది. వారితో పాటు పైలట్ కూడా మరణించారు. ప్రతికూల వాతావరణమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. హెలికాప్టర్ నుంచి నుంచి రోటార్ బ్లేడ్ విడిపోయినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. హెలికాప్టర్ గాల్లో పల్టీలు కొడుతూ ముక్కలుగా విరిగిపోవడం, నదిలో పడటం వాటిలో కనిపిస్తోంది. ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోంది. న్యూయార్క్‌లో 1980 నుంచి 30 విమాన ప్రమాదాలు జరిగాయి. హడ్సన్ నదిలో 2009లో యూఎస్ ఎయిర్‌వేస్ జెట్ విమానం సురక్షితంగా దిగింది. విమానంలోని 155 మంది ప్రాణాలతో బయటపడ్డారు. దాన్నిప్పటికీ 'హడ్సన్‌పై అద్భుతం'గా చెప్పుకుంటారు. 2009లోనే ఓ చిన్న విమానం, హెలికాప్టర్ ఢీకొని హడ్సన్ నదిలో కూలి 9 మంది మరణించారు. 2018లో చార్టర్డ్ 'ఓపెన్ డోర్'హెలికాప్టర్ ఈస్ట్ నదిలో కూలి ఐదుగురు ప్రయాణికులు మరణించారు.

బెంగాల్‌లో 'వక్ఫ్' ఉద్రిక్తతలు

కోల్‌కతా: వివాదాస్పద వక్ఫ్ చట్టానికి నిరసనగా పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శుక్రవారం కొందరు నిమ్టియా స్టేషన్‌లో నిలిపి ఉన్న రైలుపై రాళ్లతో దాడికి దిగారు. రైల్వే స్టేషన్ ఆస్తులను ధ్వంసం చేశారు. కనీసం పది మంది పోలీసులు సైతం ఈ దాడిలో గాయపడ్డారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు బీఎస్ఎఫ్‌ను రంగంలోకి దించారు. ఘటన నేపథ్యంలో రెండు రైళ్లను రద్దు చేశామని, మరో ఐదు రైళ్లను దారి మళ్లించామని అధికారులు తెలిపారు. రాళ్ల దాడిలో ప్రయాణికులు సైతం గాయపడ్డారని చెప్పారు. వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ ముర్షిదాబాద్‌లో ఆందోళనకారులు నిరసనకు దిగారు. అడ్డుకున్న పోలీసులతో తలపడ్డారు. కొన్ని వాహనాలకు నిప్పుపెట్టారు. సుటి, సంసేర్‌గంజ్, జంగీపూర్‌లలో పరిస్థితి నియంత్రణలోనే ఉందని పోలీసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌పై దాడికి దిగిన వారిని చెదరగొట్టామన్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నాయన్నారు. కోల్‌కతాలోని అలియా వర్సిటీ విద్యార్థులు వక్ఫ్ చట్టంపై నిరసన ర్యాలీ నిర్వహించారు. కాగా, ముర్షిదాబాద్, నార్త్ 24 పరగణాల జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులపై గవర్నర్ సీవీ ఆనంద బోస్ స్పందించారు. హింసకు పాల్పడే వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. పరిస్థితులపై సీఎం మమతా బెనర్జీతో ఫోన్‌లో మాట్లాడారు. హోం మంత్రి అమిత్ షాకు పరిస్థితులను వివరించారు. సీఎం మమత ఈ నెల 16న కోల్‌కతాలో ఇమామ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారని టీఎంసీ నేత కునాల్ ఘోష్ చెప్పారు. ముర్షిదాబాద్ జిల్లాలో మంగళవారం కూడా ఆందోళనల కారణంగా ఉద్రిక్తతలు తలెత్తాయి.

ఏఐసీసీ సందేశాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలి

- గుజరాత్ పార్టీ శ్రేణులకు ఖర్గే పిలుపు

న్యూఢిల్లీ: ఇటీవల అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశాలను విజయవంతంగా నిర్వహించిన గుజరాత్ విభాగాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశంసించారు. ఏఐసీసీ సందేశం రాష్ట్రంలోని గడపగడపకూ చేరవేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఖర్గే శుక్రవారం 'ఎక్స్'లో ఒక వీడియో సందేశం విడుదల చేశారు. కొన్నేళ్లుగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రతిపక్షంగానే కొనసాగుతున్నప్పటికీ ఏఐసీసీ సమావేశాలను విజయవంతంగా నిర్వహించడం విశేషమన్నారు. ఇందుకోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని ఈ నెల 8, 9వ తేదీల్లో ఏఐసీసీ, సీడబ్ల్యూసీ సమావేశాలు జరగడం తెల్సిందే. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా పార్టీ పిలుపునిచ్చింది. దేశ సమాఖ్య విధానంపై జరిగే ప్రతి దాడికి వ్యతిరేకంగా పోరాడాలని కోరింది.

ఇండో-పసిఫిక్ స్థిరత్వానికి భారత్ కీలకం

- ఇటలీ ఉపప్రధాని టజని వెల్లడి

న్యూఢిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వానికి భారత్ కీలకమైన దేశమని ఇటలీ ఉపప్రధానమంత్రి ఆంటోనియో టజని తెలిపారు. వాణిజ్య బంధం దృఢతరం కావాలంటే స్థిరత్వం ఎంతో అవసరమని చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడుల వంటి కీలక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా టజని సారథ్యంలోని బృందం శుక్రవారం భారత్‌కు చేరుకుంది. విదేశాంగ వ్యవహారాలు, అంతర్జాతీయ సహకార శాఖ మంత్రి కూడా అయిన టజని 'ఇటలీ-ఇండియా బిజినెస్, సైన్స్, టెక్నాలజీ ఫోరం'లో ప్రసంగించారు. ప్రతిపాదిత 'ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్(ఐమెక్)'తో అపార అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని విదేశాంగ మంత్రి జై శంకర్ చెప్పారు.

సీఎం మాజీ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీపై సీబీఐ దర్యాప్తు

- కేరళ హైకోర్టు ఆదేశం

కొచ్చి: ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై కేరళ సీఎం విజయన్ మాజీ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.అబ్రహంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టాలని హైకోర్టు శుక్రవారం సీబీఐని ఆదేశించింది. కొట్టాయంనకు చెందిన సామాజిక కార్యకర్త జొమొన్ పుథెన్‌పురకల్ ఇచ్చిన ఫిర్యాదుపై జస్టిస్ కె. బాబు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ ఐఏఎస్ అయిన అబ్రహం సర్వీసులో ఉన్న సమయంలో ముంబైలో మూడు కోట్ల విలువైన అపార్టుమెంట్‌ను, తిరువనంతపురంలో కోటి విలువైన మరో అపార్టుమెంట్‌ను, కొల్లంలో రూ.8 కోట్ల విలువుండే మూడంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్‌ను సంపాదించుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. అబ్రహంకు ఆదాయానికి మించిన ఆస్తులున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణైందని విచారణ సందర్భంగా న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ విషయంలో విజిలెన్స్ ఏసీబీ అందించిన నివేదిక సందేహాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో విశ్వాసం కలుగజేసేందుకు సీబీఐ దర్యాప్తు అవసరమని భావిస్తున్నట్లు జస్టిస్ బాబు వివరించారు.

ఒమన్‌లో నేడు ఇరాన్-అమెరికా అణు చర్చలు

మధ్యవర్తిత్వంతో మరోసారి కీలకంగా మారిన ఒమన్

మస్కట్: ఆకాశహర్మ్యాలు, హంగూ ఆర్భాటాలు కనిపించని ప్రశాంతమైన తీరప్రాంత మస్కట్ నగరం పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాల్లో భాగమైన కీలక చర్చలకు మరోసారి వేదికగా మారనుంది. తమ అణు కార్యక్రమంపై ఒమన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ శనివారం అమెరికాతో చర్చలు జరపనుంది. రెండు దేశాల మధ్య అణు కార్యక్రమంపై ఒప్పందం కుదిరే అవకాశాలు పెద్దగా కనిపించకున్నా ఈ చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒక అంగీకారానికి రాని పక్షంలో ఇరాన్ అణు కార్యక్రమం లక్ష్యంగా వైమానిక దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేస్తుండటం.. అణ్వాయుధాల తయారీకి అవసరమైన యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని మాత్రం ఆపేది లేదని ఇరాన్ కరాఖండిగా చెబుతుండటంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ సమయంలో రెండు దేశాలకు సన్నిహితంగా ఉండే ఒమన్ కల్పించుకోవాల్సి వచ్చింది. ట్రంప్ కూడా చర్చలకు ఒమన్ మధ్యవర్తిత్వంపై అనూహ్యంగా సానుకూలత ప్రకటించారు.

ఒమన్ వైపు మొగ్గు ఎందుకు?

ఒమన్ కీలకంగా వ్యవహరించిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'గల్ఫ్ స్టేట్ అనాలిటిక్స్'సీఈవో జార్జియో కెఫియెరో అంటున్నారు. దౌత్యపరంగా ఒమన్ పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. చారిత్రకంగా చూసినా ప్రపంచ రాజకీయాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించిన గత అనుభవం ఒమన్‌కు ఉందని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ చరిత్ర ప్రొఫెసర్ మార్క్ అంటున్నారు. ఒమన్ ప్రజల్లో అత్యధికులు ఇబాదీ ముస్లింలు. ఇది సున్నీ-షియా విభజనకు ముందు నుంచీ ఉన్న ఉదారవాద ఇస్లాం శాఖ అని వివరించారు. ఇరాన్‌తో వ్యవహరించే విషయంలో గత కొన్నేళ్లుగా అమెరికా ప్రధానంగా ఒమన్‌పైనే ఆధారపడుతోందని ఆయన అన్నారు. 2015లో ఇరాన్‌తో అణు ఒప్పందం కుదరటానికి అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామాకు రహస్య చర్చల్లో ఒమన్ ఎంతో సాయపడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే, ఆ దేశం ఎప్పుడూ వార్తల్లో ప్రధానంగా కనిపించేందుకు ప్రయత్నించలేదని, కేవలం తెరవెనుక ప్రభావవంతమైన పాత్ర పోషించిందన్నారు.

అమెరికాతో నేరుగా చర్చలు జరపం: ఇరాన్

అమెరికాతో తాము నేరుగా చర్చల్లో పాల్గొనేది లేదని ఇరాన్ అంటోంది. అణు కార్యక్రమంపై ఒప్పందం విషయంలో ముందుగా ఒమన్ విదేశాంగ మంత్రితో మాట్లాడుతామని, తమ సందేశాన్ని ఆయనే అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌కు అందజేస్తారని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ బఘ్ద్ తెలిపారు. 2015లో కుదిరిన అణు ఒప్పందం ప్రకారం ఇరాన్ 3.67 శాతం శుద్ధి చేసిన యురేనియంను కొద్ది మొత్తంలో మాత్రమే నిల్వ ఉంచుకునేందుకు అవకాశముంది. అయితే, ఆ దేశం వద్ద ప్రస్తుతం 60 శాతం వరకు శుద్ధి చేసిన యురేనియం పెద్ద మొత్తంలో నిల్వ ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో, ఇరాన్‌తో కుదిరిన ఒప్పందం నుంచి ఏకపక్షంగా బయటికి వస్తూ ట్రంప్ మొదటిసారి అధ్యక్ష పదవిలో ఉండగా ప్రకటించారు. ప్రస్తుతం అణ్వాయుధం తయారీ దిశగా సాంకేతికంగా ఇరాన్ అతి సమీపంలో ఉన్నట్లు లెక్క. ఈ నేపథ్యంలోనే ఇరాన్ అణు సదుపాయాలపై దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. ఆ దేశంపై ఒత్తిడి తెచ్చే చర్యల్లో భాగంగా హిందూ మహా సముద్రంలోని డీగో గార్సియా మిలటరీ స్థావరానికి ఆరు బీ2 బాంబర్లను తరలించారు. చమురు అన్వేషణ, అణు కార్యక్రమంపై మరిన్ని ఆంక్షలు తప్పవని కూడా ట్రంప్ అంటున్నారు. ఇలాంటి హెచ్చరికలు సుహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయని, ఐరాస అణు పరిశీలకులను దేశం నుంచి బహిష్కరించడానికి కైనా వెనుకాడబోమని ఇరాన్ అంటోంది.

హిందూమతంపై తమిళ మంత్రి అసభ్యకర వ్యాఖ్యలు

- పార్టీ పదవి నుంచి తొలగించిన డీఎంకే అధిష్టానం

చెన్నై: శైవ, వైష్ణవాలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి కె.పొన్ముడిని డీఎంకే అధిష్టానం పార్టీ పదవి నుంచి తొలగించింది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ స్పందించారు. పొన్ముడిని పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. శైవ, వైష్ణవాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే క్రమంలో మహిళలను కూడా అవమానించేలా పొన్ముడి మాట్లాడారు. సెక్స్ వర్కర్లను ఉదహరిస్తూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యల తాలూకు వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది. వాటిపై ఇంటాబయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొన్ముడి వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావని డీఎంకే ఎంపీ కనిమొళి ఖండించారు. ఆయనను మంత్రి పదవి నుంచి కూడా వెంటనే తొలగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. హిందూ ధర్మంపై దాడులు చేస్తున్న డీఎంకే వ్యవస్థ ఆసాంతం అసభ్యకరంగా తయారైందన్నారు. పొన్ముడికి వివాదాలు కొత్తేమీ కాదు. హిందీ మాట్లాడే వారినుద్దేశించి పానీపూరీ అమ్ముకుంటారంటూ గతంలోనూ ఆయన అత్యంత అభ్యంతరకరంగా మాట్లాడారు.



ప్రపంచంలోనే ఎత్తయిన బ్రిడ్జి

చైనా మరో ఘనత • ప్రయాణ సమయం గంట నుంచి ఒక్క నిమిషానికి

ప్రపంచంలోకెల్లా ఎత్తయిన హుయాజియాంగ్ గ్రాండ్ కాన్యన్ బ్రిడ్జి నిర్మాణాన్ని చైనా శరవేగంగా పూర్తి చేస్తోంది. 1.8 మైళ్ల పొడవుండే ఈ బ్రిడ్జి గుయ్‌జూ ప్రావిన్స్‌లో బెయ్‌పన్ నదిపై హుయాజియాంగ్ లోయ మీదుగా రూపుదిద్దుకుంటోంది. దీన్ని మధ్యలో ఎలాంటి సపోర్టూ లేకుండా పూర్తి సస్పెన్షన్ పద్ధతిలో నిర్మించడం విశేషం. లోయ నుంచి చూసుకుంటే ఇది ఏకంగా 625 మీటర్ల (20,50 అడుగుల) ఎత్తులో ఉంటుంది. అంటే ఈఫిల్ టవర్ కంటే 200 మీటర్లు ఎక్కువ. బరువు కూడా ఈఫిల్ కంటే మూడు రెట్లు ఎక్కువ (22 వేల టన్నులు). జూన్‌లో ప్రారంభించనున్న ఈ బ్రిడ్జితో హుయాజియాంగ్ లోయపై ప్రయాణ సమయం గంట నుంచి కేవలం ఒక నిమిషానికి దిగిరానుంది. రూ.2,200 కోట్లతో నిర్మితమైన ఈ బ్రిడ్జి చైనాలో అతి పెద్ద పర్యాటక ఆకర్షణగా కూడా మారనుంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన బంగీ జంప్ తదితరాలు అలరించనున్నాయి. ఇప్పటిదాకా ప్రపంచంలోకెల్లా ఎత్తయిన బెయ్‌పాన్‌జియాంగ్ బ్రిడ్జి (1,854 అడుగులు) కూడా గుయ్‌జూ ప్రావిన్స్‌లోనే ఉండటం విశేషం. అంతేకాదు, ప్రపంచంలోని టాప్ 100 ఎత్తయిన బ్రిడ్జిల్లో దాదాపు సగం కూడా గుయ్‌జూ ప్రావిన్స్, ఆ పరిసరాల్లోనే ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

బెస్ట్ ఎయిర్‌పోర్టు 'చాంగీ'

- రెండు, మూడు స్థానాల్లో దోహా, టోక్యో విమానాశ్రయాలు
- హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా, సౌత్ ఆసియా'అవార్డు

సింగపూర్: ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయంగా సింగపూర్‌లో చాంగీ ఎయిర్‌పోర్టు మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఎయిర్‌పోర్టుకు ఈ ఘనత దక్కడం ఇది 13వసారి కావడం విశేషం. దోహా, టోక్యో ఎయిర్‌పోర్టులు రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి. స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ అవార్డ్స్-2025ను ఈ నెల 9న ప్రకటించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు 'బెస్టు ఎయిర్‌పోర్ట్ ఇన్ ఇండియా, సౌత్ ఆసియా'అవార్డు, బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు 'బెస్ట్ రీజినల్ ఎయిర్‌పోర్టు ఇన్ ఇండియా, సౌత్ ఆసియా'అవార్డు లభించింది. గోవాలోని మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ అండర్ 5 మిలియన్ ప్యాసింజర్స్'కేటగిరీలో అవార్డు దక్కింది. అలాగే 'క్లీనెస్ట్ ఎయిర్‌పోర్ట్ ఇన్ ఇండియా, సౌత్ ఆసియా'గా నిలిచింది. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 'బెస్టు ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా, సౌత్ ఆసియా'అవార్డు సొంతం చేసుకుంది.

ప్రపంచంలోని టాప్-20 విమానాశ్రయాలు

1. సింగపూర్ చాంగీ ఎయిర్‌పోర్టు, 2. దోహా హమాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, 3. టోక్యో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, 4. ఇంచెయాన్ ఎయిర్‌పోర్టు, 5. నారిటా ఎయిర్‌పోర్టు, 6. హాంకాంగ్ ఎయిర్‌పోర్టు, 7. పారిస్ చార్లెస్ డిగాల్ ఎయిర్‌పోర్టు, 8. రోమ్ ఫుమిసినో ఎయిర్‌పోర్టు, 9. మ్యూనిక్ ఎయిర్‌పోర్టు, 10. జ్యూరిచ్ ఎయిర్‌పోర్టు, 11. దుబాయ్ ఎయిర్‌పోర్టు, 12. హెల్సింకీ-వాంటా ఎయిర్‌పోర్టు, 13. వాంకోవర్ ఎయిర్‌పోర్టు, 14. ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టు, 15. వియన్నా ఎయిర్‌పోర్టు, 16. మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టు, 17. చుబూ సెంట్రాయిర్ ఎయిర్‌పోర్టు, 18. కోపెనహగెన్ ఎయిర్‌పోర్టు, 19. ఆమ్‌స్టర్‌డ్యామ్ ఎయిర్‌పోర్టు, 20. బహ్రెయిన్ ఎయిర్‌పోర్టు.

చిన్న విమానం కూలి ముగ్గురు మృతి

ఫ్లోరిడా(యూఎస్ఏ): ఫ్లోరిడాలోని బొకారటోన్ ప్రాంతంలో చిన్న విమానం కూలిన ఘటనలో ముగ్గురు చనిపోగా ఒకరు గాయపడ్డారు. బొకా రటోన్ నుంచి టల్లాహస్సీ వైపు వెళ్తున్న మూడు సీట్ల సెస్నా రకం విమానం ఇంటర్‌స్టేట్ హైవే సమీపంలో కుప్పకూలింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి అందులోని ముగ్గురూ సజీవ దహనమయ్యారు. నేలను తాకే క్రమంలో విమానం ఓ కారును ఢీకొట్టడంతో అది రైలు పట్టాలపైకి దూసుకెళ్లింది.

కమీషన్లు అడిగితే లోకాయుక్తకు తెలపండి

- కాంట్రాక్టర్లకు కర్ణాటక డిప్యూటీ సీఎం పిలుపు

బెంగళూరు: బిల్లులు చెల్లించేందుకు కమీషన్లు కావాలని ఎవరైనా అడిగితే వెంటనే లోకాయుక్త తలుపుతట్టాలని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కాంట్రాక్టర్లను కోరారు. గత బీజేపీ ప్రభుత్వ హయాంకు మించి ప్రస్తుతం కమీషన్ల దందా నడుస్తోందని రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం ఇటీవల సంచలన ఆరోపణలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచావతారాలు, బ్రోకర్ల బెడద పెరిగిపోయిందని విమర్శించింది. ఈ నేపథ్యంలోనే శివకుమార్ కమిషన్లు అడిగితే లోకాయుక్తకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కాంట్రాక్టర్లను కోరడం గమనార్హం. అయితే, ఈ వ్యవహారంతో ఆరోపణలెదుర్కొంటున్న సీనియర్ మంత్రులు సతీశ్ జర్కిహోళి, బోస్ రాజులకు కూడా ఎలాంటి సంబంధం లేదని శివకుమార్ అన్నారు. శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు ఉండగా బిల్లుల కోసం మంత్రులను అడగటం ఎందుకని ఆయన కాంట్రాక్టర్లను ప్రశ్నించారు.

కశ్మీర్‌లో ఉగ్రవాది హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని ఛత్రు అడవుల్లో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఉగ్రవాది హతమయ్యాడు. భారత భద్రతా దళాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ మూడో రోజుకు చేరుకుంది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై నిఘా వర్గాల సమాచారం మేరకు ఏప్రిల్ 9న ఈ ఆపరేషన్ ప్రారంభించారు. జమ్మూకశ్మీర్ పోలీసుల సహకారంతో భారత సైన్యం ఛత్రు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టింది. అదే రోజు సాయంత్రం ఎదురుకాల్పులు జరిగాయి. ఇప్పటి వరకు ఒక ఉగ్రవాది హతమైనట్లు అధికారులు ధ్రువీకరించారు.

24 గంటల్లో 61 మంది మృతి

- బిహార్‌లో పిడుగులు, వడగండ్ల వాన..

పట్నా: బిహార్‌ను పిడుగుపాట్లు, వడగండ్ల వానలు వదిలేలా లేవు. గడిచిన 24 గంటల్లో 61 మంది ప్రాణాలు కోల్పోయారని శుక్రవారం ప్రభుత్వం తెలిపింది. వర్షాలు, వడగండ్ల వానలకు సంబంధించిన ఘటనల్లో 39 మంది చనిపోగా, గురువారం పిడుగులు పడి 22 మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించింది. అత్యధికంగా నలందా జిల్లాలో 23 మంది మృతి చెందారు. ఇంకా భోజ్‌పూర్‌లో ఆరుగురు, సివాన్, గయ, పట్నా, షేక్‌పురాలో నలుగురు చొప్పున, జముయిలో ముగ్గురు, జెహానాబాద్‌లో ఇద్దరు, గోపాల్‌గంజ్, ముజఫర్‌పూర్, అర్వాల్, దర్భంగ, బెగుసరాయ్, సహర్సా, కటిహార్, లఖీసరాయ్, భాగల్పూర్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున చనిపోయారని వివరించింది. పిడుగుపాట్లు, వడగండ్ల వానలతో పెద్ద సంఖ్యలో నివాసాలు దెబ్బతిన్నాయి. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున అందజేస్తామని సీఎం నితీశ్ కుమార్ ప్రకటించారు. బుధవారం కూడా రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో పిడుగులు పడి 13 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఐహోల్ శాసనాన్ని రచించింది ఎవరు?

గుప్తానంతర యుగం-2

(6వ శతాబ్దం- 8వ శతాబ్దం)

హర్షుడి అనంతరం దక్షిణ భారతదేశాన్ని పాలించిన రాజవంశాల్లో అతి ముఖ్యమైనవి బాదామీ రాజధానిగా పాలించిన చాళుక్య వంశం, (వీరినే పశ్చిమ చాళుక్యులు అని కూడా పిలుస్తారు), కంచి రాజధానిగా పాలించిన పల్లవ వంశం (వీరిని మలి పల్లవులు అని కూడా పిలుస్తారు). ఈ రెండు వంశాల్లో ఒకరు కర్ణాటకను, మరొకరు తమిళనాడును పాలిస్తూ పరస్పరం నిరంతర యుద్ధాల్లో మునిగి ఉండేవారు. అయితే, సాహిత్యం, వాస్తు, శిల్పకళా రంగాల్లో దక్షిణ భారత దేశ సంస్కృతికి ఈ వంశాలు అమూల్యమైన సేవలందించాయి.

బాదామీ చాళుక్యులు: క్రీ.శ. 6వ శతాబ్దంలో వీరు దక్కన్ ప్రాంతంలో తమ రాజ్యాన్ని స్థాపించారు. బ్రహ్మచుళుకం నుంచి జన్మించడం వల్ల తాము చాళుక్యులమని వీరు పేర్కొన్నారు. చాళుక్యుల జన్మభూమిపై పలు వివాదాస్పద సిద్ధాంతాలున్నాయి. అయితే, బిల్హణుడు అనే కవి తన విక్రమాంక దేవచరిత్ర గ్రంథంలో వీరి జన్మస్థలం అయోధ్య అని పేర్కొన్నాడు. చాళుక్యుల రాజధాని వాతాపి(బీజాపూర్ జిల్లాలోని బాదామీ నగరం). అందుకే వీరిని వాతాపి చాళుక్యులు అని కూడా పిలుస్తారు.

మొదటి పులకేశి: ఇతడు బాదామీ చాళుక్యవంశ వాస్తవ స్థాపకుడు. తన రాజ్య స్థాపనను పురస్కరించుకుని అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. మొదటి పులకేశి తర్వాత అతడి కుమారుడు కీర్తివర్మ రాజ్యానికి వచ్చాడు.

మొదటి కీర్తివర్మ: ఇతడు తన సోదరుడు మంగళేశుడితో కలిసి తన తండ్రి స్థాపించిన రాజ్యాన్ని పలు దిశల్లో విస్తరింపచేశాడు. కొంకణ్‌ను పాలించే మౌర్యులను, వైజయంతిని పాలించే కాదంబులను, మహారాష్ట్ర, మాళ్వాలను పాలించే కాలచురి రాజులను మొదటి కీర్తివర్మ ఓడించాడు.

మంగళేశ: కీర్తివర్మ కుమారుడైన పులకేశి బాలుడిగా ఉండటంతో అతడి తరఫున కీర్తివర్మ సోదరుడు మంగళేశుడు కొంతకాలం రాజ్యాన్ని పాలించాడు. కానీ అతడు పులకేశికి రాజ్యాన్ని అప్పగించకుండా తన కుమారులకు దాన్ని సంక్రమింపజేసే ప్రయత్నం చేశాడు. దీంతో పులకేశి అతణ్ని వధించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

రెండో పులకేశి: ఇతడు క్రీ.శ. 609 నుంచి 642 వరకు పరిపాలించాడు. తన పినతండ్రితో ఏర్పడిన వారసత్వ యుద్ధం నుంచి రాజ్యాన్ని రక్షించడమే కాకుండా తన దిగ్విజయ యాత్రల ద్వారా దాన్ని ఒక మహా సామ్రాజ్యంగా మార్చాడు. ఇతడి రాజ్య సరిహద్దులు నర్మద నుంచి కావేరి వరకూ విస్తరించాయి. దక్కన్‌పై జరిగిన హర్షుడి దాడిని ఇతడు విజయవంతంగా ఎదుర్కోవడమే గాక హర్షుడిని ఓడించినట్లుగా పులకేశి వారసుల శాసనాలు తెలియజేస్తున్నాయి. కోస్తాంధ్రపై దాడిచేసి రణదుర్జయుల పిష్టపుర రాజ్యాన్ని, విష్ణుకుండినుల రాజ్యాన్ని ఇతడు అంతం చేశాడు. ఆంధ్ర ప్రాంతాలకు పిష్టపురాన్ని కేంద్రంగా చేసి తన తమ్ముడు కుబ్జ విష్ణువర్ధనుడిని తన ప్రతినిధిగా నియమించాడు. అనంతర కాలంలో కుబ్జ విష్ణువర్ధనుడు తన రాజధానిని వేంగికి మార్చి స్వతంత్ర తూర్పు చాళుక్య వంశాన్ని స్థాపించా డు. రెండో పులకేశి పల్లవ రాజ్యంపై దాడిచేసి మొదటి మహేంద్రవర్మను అంతం చేశాడు. పర్షియా రాజు రెండో ఖుస్రూతో రెండో పులకేశి దౌత్య సంబంధాలు కలిగి ఉన్నాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.



అజంతాలోని చిత్రాల్లో కూడా ఈ అంశాన్ని చిత్రీకరించారు. క్రీ.శ. 642లో పల్లవరాజ్యంపై ఇతడు రెండోసారి దాడిచేశాడు. ఈ యుద్ధంలో పులకేశికి ఓటమితో పాటు ప్రాణహాని కూడా కలిగింది. పల్లవరాజు మొదటి నరసింహవర్మ ఈ దాడిని తిప్పికొట్టడమే గాక రెండో పులకేశిని తరుముతూ రాజధాని వాతాపి వరకు వచ్చి పులకేశిని వధించాడు. వాతాపి నగరాన్ని ధ్వంసం చేసి వాతాపికొండ అనే బిరుదును పొందాడు.

మొదటి విక్రమాదిత్యుడు: తన తండ్రి పులకేశి కాలంలో పల్లవులు జయించిన ప్రాంతాలన్నింటినీ తిరిగి ఆక్రమించాడు. కంచిపై దాడిచేసి పల్లవ రాజు రెండో మహేంద్రవర్మను అంతం చేశాడు.

విజయాదిత్యుడు: ఇతడు 40 ఏళ్లపాటు చాళుక్య రాజ్యాన్ని పరిపాలించాడు. తన కాలంలో రాజ్యంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాడు. ఇతడి కాలం దేవాలయాల నిర్మాణానికి పేరెన్నికగన్నది. ఇతడు సుమారు 70 దేవాలయాలను నిర్మించినట్లుగా భావిస్తారు.

రెండో విక్రమాదిత్యుడు: ఇతడు తన పూర్వీకుల సంప్రదాయమైన కంచిపై దాడులను పునరుద్ధరించాడు. ఇతడి కాలంలో మొత్తం మూడు సార్లు కంచిపై దాడి చేశాడు.

రెండో కీర్తివర్మ: బాదామీ చాళుక్య వం శంలో చివరి రాజు. క్రీ.శ. 753లో సామంత రాజై న దంతిదుర్గుడు రెండో కీర్తివర్మను తొలగించి స్వతంత్ర రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు.

సాంస్కృతిక సేవ: బాదామీ చాళుక్యులు తమ సామ్రాజ్యంలోని పలు ప్రాంతాల్లో అనేక దేవాలయాలు నిర్మించారు. వీటి నిర్మాణంలో ఓ కొత్త వాస్తు , శిల్పకళా శైలిని అభివృద్ధి చేశారు. దీన్ని 'వేసర' శిల్పకళా శైలి అని పిలుస్తారు. ఉత్తర భారతంలోని నగర, దక్షిణాదిలోని ద్రావిడ శిల్పకళా శైలుల కలయికతో దీన్ని అభివృద్ధి చేశారు. చాళుక్యులు నిర్మించిన వాస్తు కట్టడాల్లో గుహాలయాలు, రాతి కట్టడాలున్నాయి. రాజధాని నగరమైన బాదామీలో చాళుక్యులు నాలుగు గుహాలయాలను నిర్మించారు. ఇందులో ఒకటి తప్ప మిగిలినవన్నీ శైవమతానికి సంబంధించినవే. ఐహోల్ నగరంలో దాదాపు 70 దేవాలయాలను నిర్మించారు. పట్టడకల్ నగరంలోనూ వీరు పలు దేవాలయాలు నిర్మించారు. ఇంకా అలంపూర్, మహానంది మొదలైన ప్రాంతాల్లో వీరు నిర్మించిన దేవాలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి. బాదామీ చాళుక్యులు ప్రారంభించిన వేసర శైలి.. హోయసాలులు, రాష్ట్రకూటుల పాలనకాలంలో అత్యున్నత దశకు చేరింది.

మాదిరి ప్రశ్నలు

1. బాదామీ చాళుక్య రాజ్యాన్ని హుయాన్‌త్సాంగ్ ఏ సంవత్సరంలో సందర్శించాడు?
ఎ) క్రీ.శ.642 బి) క్రీ.శ.641
సి) క్రీ.శ.640 డి) క్రీ.శ.639
2. సత్యాశ్రయ అనే బిరుదున్న బాదామీ చాళుక్య రాజు?
ఎ) మొదటి పులకేశి బి) రెండో పులకేశి
సి) రెండో విక్రమాదిత్యుడు
డి) రెండో విజయాదిత్యుడు
3. హారీతిపుత్రులు అని ఏ రాజవంశాన్ని పిలుస్తారు?
ఎ) పల్లవులు బి) రాష్ట్రకూటులు
సి) చాళుక్యులు డి) వాకాటకులు
4. కాదంబుల రాజధాని?
ఎ) పట్టడకల్ బి) కల్యాణి
సి) ఐహోల్ డి) బనవాసి
5. గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత దక్కన్‌లో అంతటి విశాలమైన రాజ్యాన్ని నిర్మించిన చక్రవర్తి?
ఎ) హర్షవర్ధనుడు బి) రెండో పులకేశి
సి) సముద్రగుప్తుడు
డి) రెండో నరసింహవర్మ
6. కుబ్జ విష్ణువర్ధనుడు రెండో పులకేశి ప్రతినిధిగా ఆంధ్ర ప్రాంతాన్ని ఏ రాజధాని నుంచి పాలించాడు?
ఎ) వేంగి బి) వినుకొండ
సి) పిష్టపుర డి) విజయపురి
7. రెండో పులకేశి మొదటి మహేంద్రవర్మను ఏ యుద్ధంలో అంతం చేశాడు?
ఎ) పుల్లలూరు యుద్ధం
బి) కొప్పం యుద్ధం
సి) సంగమేశ్వర యుద్ధం
డి) మణిమంగళ యుద్ధం
8. ఏ చాళుక్యరాజు గుజరాత్‌పై జరిగిన అరబ్బుల దాడిని తిప్పికొట్టాడు?
ఎ) రెండో పులకేశి
బి) మొదటి విక్రమాదిత్యుడు
సి) రెండో విక్రమాదిత్యుడు
డి) రెండో కీర్తివర్మ
9. రెండో పులకేశి క్రీ.శ.642లో జరిగిన ఏ యుద్ధంలో మొదటి నరసింహవర్మ చేతిలో అంతమయ్యాడు?
ఎ) మణిమంగళ యుద్ధం
బి) కంచి యుద్ధం
సి) అనిల్‌వారా యుద్ధం
డి) బనవాసి యుద్ధం
10. బాదామీ చాళుక్యుల రాజ చిహ్నం?
ఎ) వరాహం బి) వృషభం
సి) సింహం డి) పులి
11. ఐహోల్ శాసనాన్ని రచించిన వారు?
ఎ) హరిసేనుడు బి) రవికీర్తి
సి) మొదటి పులకేశి డి) బాణుడు
12. కంచిలోని కైలాసనాథ ఆలయ నమూనా లో నిర్మించిన పట్టడకల్‌లోని ఆలయం?
ఎ) విరూపాక్షాలయం
బి) లింగరాజ ఆలయం
సి) దశావతారాలయం
డి) సర్వ దేవాలయం
13. ఐహోల్ ప్రశస్తిని కలిగిన దేవాలయం?
ఎ) దుర్గాలయం బి) మేగుటి జైనాలయం
సి) లాడ్‌ఖాన్ ఆలయం
డి) లోకేశ్వరాలయం
14. చాళుక్యుల కాలంలో దేవాలయాల నగరంగా ప్రసిద్ధిగాంచింది?
ఎ) ఐహోల్ బి) పట్టడకల్
సి) అలంపూర్ డి) మహానంది
15. హిందూ పాలకుల్లో అక్బర్ లాంటివాడు అని కీర్తిగాంచిన రాజు?
ఎ) రెండో పులకేశి బి) సముద్రగుప్తుడు
సి) హర్షుడు డి) అశోకుడు

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) సి; 4) డి;
5) బి; 6) సి; 7) ఎ; 8) సి;
9) ఎ; 10) ఎ; 11) బి; 12) ఎ;
13) బి; 14) ఎ; 15) సి.

చౌమొహల్లా ప్యాలెస్ నిర్మాణాన్ని పూర్తి చేసిందెవరు?



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్

1923లో హెచ్. వేక్‌ఫీల్డ్ చొరవతో జాగిర్దారీ కాలేజీని బేగంపేటలో ఏర్పాటు చేశారు. జాగిర్దారులు, ప్రభువుల పిల్లల కోసం ఈ కాలేజీని ప్రైవేట్‌గా ఏర్పాటు చేసి రెసిడెన్షియల్ విధానంలో నడిపారు. 1950లో భారత ప్రభుత్వం జాగిర్దారీ విధానాన్ని రద్దు చేసింది. 1957లో జాగిర్దారీ కాలేజీని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌గా పేరు మార్చారు. 1952లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 160 ఎకరాల్లో నిర్మించారు. ఇందులోని జాగిర్దారీ బ్లాక్, షహిన్ బ్లాక్‌లను ఇండో-పర్షియన్ శైలిలో నిర్మించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం

హైదరాబాద్ నగరానికి తూర్పున, సముద్రమట్టానికి 1725 అడుగుల ఎత్తులో 1500 ఎకరాల విస్తీర్ణంలో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో హైదరాబాద్‌ను సందర్శించిన సర్ ప్యాట్రిక్ గెడ్డెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు అడిక్‌మెట్ అనువైన ప్రాంతమని సూచించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయ నిర్మాణం కోసం హైదరాబాద్ ప్రభుత్వం నవాబ్ జైన్ యార్ జంగ్ బహదూర్‌ను నియమించింది. ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ప్రణాళికను మన్సియోర్ జెస్పర్ రూపొందించాడు. ఈ భవన తోరణాలను ఇండో-సార్సనిక్ సంప్రదాయంలో నిర్మించారు. అజంతా, ఎల్లోరాలో అలంకరించిన స్తంభాకారాలను పోలిన అష్టభుజ స్తంభాలను మొదటి అంతస్తులో నిర్మించారు. కాలేజీ ద్వారాన్ని అర్ధచంద్రాకారంలో నిర్మించారు. ఈ దర్వాజా పక్కన ఇరువైపులా రెండు భారీ స్తంభాలు నిర్మించారు. షాబాద్ నుంచి తీసుకువచ్చిన రాళ్లతో ఆర్ట్స్ కాలేజీ ఫ్లోర్‌ను నిర్మించారు. నవాబ్ జైన్ యార్ జంగ్ బహదూర్‌కు భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

జూబ్లీహాల్

1913లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ జూబ్లీహాల్‌ను ఇండో-పర్షియన్ శైలిలో బాగ్-ఇ-ఆమ్ (పబ్లిక్ గార్డెన్స్)లో నిర్మించారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజ్యానికి వచ్చి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఈ భవనంలో నిర్వహించారు. నాటి నుంచి ఈ భవనాన్ని జూబ్లీహాల్‌గా పిలుస్తున్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఉస్మాన్ అలీఖాన్ రాజచిహ్నంతో బంగారు పూత పూసిన సింహాసనం రూపొందించారు. ప్రస్తుతం ఈ సింహాసనాన్ని పురానా హవేలిలోని నిజాం మ్యూజియంలో ఉంచారు.

అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడు ఎవరు?

ఇస్రో సాధించిన విజయాలు

కాలక్రమణిక:

1962: 'ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ రీసెర్చ్ సెంటర్'ను భారత అణుశక్తి శాఖ ఏర్పాటు చేసింది.

తుంబా ఈక్వెటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్‌ను కేరళలో ప్రారంభించారు.

1963: నవంబర్ 2న మొదటి సౌండింగ్ రాకెట్‌ను లాంచ్ చేశారు.

1965: తుంబాలో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేశారు.

1968: అహ్మదాబాద్‌లో ప్రయోగాత్మక శాటిలైట్ కమ్యూనికేషన్ ఎర్త్ స్టేషన్ ఏర్పాటు చేశారు.

1969: ఆగస్టు 15న అణుశక్తి శాఖలో భాగంగా ఇస్రో ఏర్పాటు.

1971: షార్ కేంద్రం- సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను శ్రీహరికోటలో ఏర్పాటు చేశారు.

1972: అంతరిక్ష శాఖను ఏర్పాటు చేసి ఇస్రోను ఆ శాఖ పరిధిలోకి మార్చారు. బెంగళూరులో ఇస్రో శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లో స్పేస్ అప్లికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

1975: ఏప్రిల్ 19న ఆర్యభట్ట ఉపగ్రహాన్ని ప్రయోగించారు. అమెరికా ఉపగ్రహం ద్వారా శాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ ఎక్స్‌పెరిమెంట్‌ను ప్రారంభించారు.

1977: ఫ్రాంకో-జర్మనీ సింఫనీ శాటిలైట్ ద్వారా శాటిలైట్ టెలీకమ్యూనికేషన్ ఎక్స్‌పెరిమెంట్ ప్రాజెక్టు(1977-79) చేపట్టారు.

1979: భూపరిశీలన కోసం భాస్కర-I ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఎస్ఎల్‌వీ-3 ద్వారా చేపట్టిన రోహిణి ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది.

1980: రోహిణి-II ప్రయోగం విజయవంతం.

1981: అభివృద్ధిపర్చిన మొదటి ఎస్ఎల్‌వీ-3 ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. భూస్థావర సమాచార ఉపగ్రహం 'ఆపిల్'ను ప్రయోగించారు. భాస్కర-2 ఉపగ్రహాన్ని రష్యా రాకెట్ ద్వారా ప్రయోగించారు.

1982: సమాచార ప్రసారం కోసం ఉద్దేశించిన ఇన్‌శాట్-1ఎ ఉపగ్రహాన్ని అమెరికా రాకెట్ ద్వారా ప్రయోగించారు.

1983: అభివృద్ధిపర్చిన రెండో ఎస్ఎల్‌వీ-3 ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇన్‌శాట్ శ్రేణి ఉపగ్రహాలు ప్రారంభం. ఇన్‌శాట్-1బి ప్రయోగం విజయవంతమైంది.

1984: భారత మొదటి అంతరిక్ష యాత్రికుడు రాకేష్ శర్మ రష్యా స్పేస్ స్టేషన్ 'సెల్యూట్ 7'లో 8 రోజులు గడిపారు. రష్యా రాకెట్ షోయజ్-T-11 ద్వారా ఈయన అంతరిక్షంలోకి వెళ్లారు.

1987: అభివృద్ధిపర్చిన మొదటి వాహక నౌక ఏఎస్ఎల్‌వీ (ఆగ్యుమెంటెడ్ శాటిలైట్ లాంచ్ వెహికల్) ద్వారా SROSS-Iను ప్రయోగించారు. ఇది విఫలమైంది.

1988: ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం ఐఆర్ఎ-1ఎను రష్యన్ రాకెట్ ద్వారా ప్రయోగించారు. అభివృద్ధిపర్చిన ఏఎస్ఎల్‌వీ ద్వారా SROSS శాటిలైట్‌ను ప్రయోగించారు. ఇది విఫలమైంది.

1991: ఐఆర్ఎస్-1బి ప్రయోగం. రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల శ్రేణిలో ఇది రెండోది.

1992: ఏఎస్ఎల్‌వీ ప్రయోగం విజయవంతం . SROS-C ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొదటి ఉపగ్రహం ఇన్‌శాట్-2ఎను ప్రయోగించారు. ఇది రెండో తరానికి చెందింది. దీని తర్వాత 3, 4 తరాల శ్రేణులు వచ్చాయి.

1993: పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-1ఇను ప్రయోగించారు. ఇది విఫలమైంది.

1994: ఏఎస్ఎల్‌వీ ద్వారా SROSS-C2ను విజయవంతంగా ప్రయోగించారు. పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-పీ2ను కక్ష్యలో ప్రవేశపెట్టారు.

1996: పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-పీ3 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

1997: పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-1డి ప్రయోగం.

1999: పీఎస్ఎల్‌వీ ద్వారా మొదటిసారిగా విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం మొదలైంది. కొరియా, జర్మనీ ఉపగ్రహాలతోపాటు ఇస్రో అభివృద్ధిపర్చిన ఓషన్‌శాట్‌ను ప్రయోగించారు.

2001: జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ)తో జీశాట్-1 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. పీఎస్ఎల్‌వీ ద్వారా ఇస్రో ప్రయోగాత్మక ఉపగ్రహంతోపాటు బెల్జియం, జర్మనీలకు చెందిన ఉపగ్రహాలను ప్రయోగించారు.

2002: పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా కల్పన-1 శాటిలైట్‌ను ప్రయోగించారు.

2003: జీఎస్ఎల్‌వీ ద్వారా జీశాట్, పీఎస్ఎల్‌వీ ద్వారా రిసోర్స్ శాట్-1 ప్రయోగం.

2004: జీఎస్ఎల్‌వీ ద్వారా ఎడ్యుశాట్ ప్రయోగం.

2005: శ్రీహరికోటలో రెండో లాంచ్‌ప్యాడ్ ఏర్పాటు చేశారు. పీఎస్ఎల్‌వీ ద్వారా కార్టోశాట్-1, హామ్‌శాట్ ప్రయోగించారు.

2006: జీఎస్ఎల్‌వీ ద్వారా ఇన్‌శాట్-4సి ప్రయోగం. మొదటిసారిగా కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భారత రాకెట్ మోసుకెళ్లింది. కానీ ఈ మిషన్ విఫలమైంది.



2007: కార్టోశాట్-2 ఉపగ్రహాన్ని, తొలిసారిగా స్పేస్ క్యాప్సుల్ రికవరీ ఎక్స్‌పెరిమెంట్‌తో పాటు రెండు విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించారు. స్పేస్‌క్యాప్సూల్‌ను విజయవంతంగా తిరిగి పొందారు. పీఎస్ఎల్‌వీ ద్వారా ఇటలీ ఉపగ్రహం ఎజిలీని, జీఎస్ఎల్‌వీ ద్వారా ఇన్‌శాట్-4సీఆర్‌ను ప్రయోగించారు.

2008: పీఎస్ఎల్‌వీ ద్వారా ఇజ్రాయెల్ శాటి లైట్ టెక్‌శార్‌ను ప్రయోగించారు. రెండు స్వదేశీ ఉపగ్రహాలతోపాటు ఎనిమిది విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా ఒకేసారి ప్రయోగించారు. ఇది ఇస్రో చరిత్రాత్మక విజయం. పీఎస్ఎల్‌వీ ద్వారా చేపట్టిన చంద్రయాన్-1 ప్రయోగం విజయవంతమైంది.

2009: రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ (RISAT-2), అన్నా యూనివర్సిటీకి చెందిన అనుశాట్ (విశ్వవిద్యాలయాలకు చెందిన తొలి ఉపగ్రహం)ను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు. ఓషన్‌శాట్‌తోపాటు మరో 7 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

2010: జీఎస్ఎల్‌వీ ప్రయోగం రెండుసార్లు విఫలమైంది. పీఎస్ఎల్‌వీ ద్వారా కార్టోశాట్-2బి, STUDSAT, విదేశీ మినీ శాటిలైట్‌లను ప్రయోగించారు.

2011: రిసోర్స్‌శాట్-2, రెండు మినీ శాటిలైట్‌లను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు. జీశాట్-12, మేఘాట్రాఫిక్స్, మరో మూడు చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు.

2012: పీఎస్ఎల్‌వీ ద్వారా రిశాట్-1ను ప్రవేశపెట్టడంతోపాటు ఫ్రెంచి శాటిలైట్ స్పాట్-6, జపాన్ శాటిలైట్ పోయిటెర్స్‌ను ప్రయోగించారు.

2013: మనదేశంలో మొదటి రీజనల్ నావిగేషన్ శాటిలైట్‌ను పీఎస్ఎల్‌వీ-సీ22 ద్వారా ప్రయోగించారు.

మార్స్ ఆర్బిటర్ మిషన్(మామ్) స్పేస్ క్రాఫ్ట్‌ను పీఎస్ఎల్‌వీ-సీ25 ద్వారా విజయవంతంగా అంగారక గ్రహంపైకి ప్రయోగించారు.

2014: సెప్టెంబర్ 24న మామ్ అంగారక గ్రహాన్ని చేరింది. తొలి ప్రయత్నంలోనే ఈ ఘనత సాధించిన ఏకైక దేశం భారత్.

2015: మార్చి 28న పీఎస్ఎల్‌వీ-సీ27 ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1డీని ప్రయోగించారు. జూలై 10న బ్రిటన్‌కు చెందిన 5 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ-సీ28 ద్వారా ప్రయోగించారు. ఆగస్టు 27న జీఎస్ఎల్‌వీ-డీ6 ద్వారా జీశాట్-6ను ప్రయోగించారు. ఇది జీఎస్ఎల్‌వీ-డీ6 ద్వారా చేపట్టిన తొమ్మిదో ప్రయోగం. సెప్టెంబర్ 28న పీఎస్ఎల్‌వీ-సీ30 ద్వారా ఆస్ట్రోశాట్‌తోపాటు ఆరు విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించారు.

ఇస్రో విభాగాలు

ఇస్రో సంస్థ: దీని ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉంది. అంతరిక్ష విజ్ఞానం అభివృద్ధికి కావాల్సిన ప్రయోగశాలలను ఏర్పాటు చేసి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వనరులను సమకూర్చడం దీని కర్తవ్యం.

విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (VSSC): దీన్ని త్రివేండ్రంలో ఏర్పాటు చేశారు. ఉపగ్రహాల ప్రయోగానికి అవసరమైన రాకెట్‌లను రూపొందిస్తోంది. ఈ కేంద్రానికి ఐరాస గుర్తింపు ఉండటం వల్ల ఇతర దేశాల ఖగోళ శాస్త్రవేత్తలు మన దేశంతో కలిసి పనిచేస్తున్నారు. 2007లో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రం ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీలను రూపొందించింది.

ఇండియన్ శాటిలైట్ అప్లికేషన్ సెంటర్ (ISAC): బెంగళూరు సమీపంలోని పీన్యాలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉపగ్రహాలను తయారు చేస్తారు. ఈ కేంద్రం రూపొందించిన వాటిలో ఆర్యభట్ట, భాస్కర, ఆపిల్, ఇన్‌శాట్, ఐఆర్ఎస్, ఎడ్యుశాట్, కార్టోశాట్, జీశాట్ ఉపగ్రహాలు ముఖ్యమైనవి.

లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ (LPSC): రాకెట్‌లో ఉపయోగించే ఇంధనాలను తయారు చేస్తారు. బెంగళూరు, త్రివేండ్రం, మహేంద్రగిరి (తమిళనాడు)లో దీని ఉపకేంద్రాలు ఉన్నాయి.

శ్రీహరికోట హై ఆల్టిట్యూడ్ అండ్ రేంజింగ్ (SHAR): నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట సమీపంలో ఉంది. ఈ కేంద్రాన్ని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ అని కూడా అంటారు. ఒకేసారి రెండు రాకెట్‌లను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ప్రపంచ రాకెట్ ప్రయోగ కేంద్రాల్లో రెండో అత్యుత్తమైంది.

మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ (MCF): కర్ణాటకలోని హసన్‌లో ఏర్పాటు చేశారు. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలను ఎప్పటికప్పుడు నియంత్రించటానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. రెండో కేంద్రాన్ని భోపాల్‌లో ఏర్పాటు చేశారు.

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (NRSC) : ఉపగ్రహాలు పంపించే సంకేతాలు, ఫొటోలను ఈ కేంద్రం స్వీకరించి విశ్లేషిస్తుంది. దీని ఉపవిభాగాలు..

ఎ) పరిపాలన విభాగం
- బాలానగర్ (రంగారెడ్డి జిల్లా)

బి) ప్రయోగశాలలు
- పఠాన్ చెరువు (మెదక్ జిల్లా)

సి) గ్రౌండ్ రిసీవింగ్ స్టేషన్
- షాద్‌నగర్ (మహబూబ్‌నగర్ జిల్లా)

సహజ వనరులను వెలికి తీయడంలో ఎన్ఆర్ఎస్‌సీ ప్రధానపాత్ర పోషిస్తోంది.

శాటిలైట్ ట్రాకింగ్ అండ్ రేంజింగ్ సిస్టమ్ (STARS): తమిళనాడులోని కడలూరులో ఏర్పాటు చేశారు. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాల ఎత్తును, వాటి కక్ష్యను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు.

స్పేస్ అప్లికేషన్ సెంటర్ (SAC): దీన్ని అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఉపగ్రహాల నుంచి వచ్చే సంకేతాలను వ్యవసాయం, పారిశ్రామిక, సమాచార, పరిపాలన లాంటి అనేక రంగాల్లో వినియోగించడం కోసం శాస్త్రవేత్తలకు తగిన శిక్షణ ఇస్తోంది.

డెవలప్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ యూనిట్ (DECU):

అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు. దేశంలో అక్షరాస్యత పెంచడానికి కృషి చేస్తోంది. 2004లో ఎడ్యుశాట్‌ను ప్రయోగించడం ద్వారా దేశంలోని 1000 విద్యాకేంద్రాలను అనుసంధానించారు. దీనివల్ల లక్షలాది మంది ప్రజలు విద్యను అభ్యసిస్తున్నారు.

ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీ (PRL): కాస్మిక్ కిరణాల అధ్యయనానికి డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ఈ కేంద్రాన్ని అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు.

ఆంట్రిక్స్ కార్పొరేషన్: 1992లో బెంగళూరులో ఏర్పాటు చేశారు. ఇస్రో వాణిజ్య కార్యకలాపాలను ఇది నిర్వహిస్తోంది. విదేశీ ఉపగ్రహాలను వాణిజ్య స్థాయిలో మన భూభాగం నుంచి ప్రయోగిస్తున్నారు. దీనికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ఆంట్రిక్స్ పర్యవేక్షిస్తోంది.

ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (IPRC): మహేంద్రగిరిలో నెలకొల్పారు. ఇక్కడ కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో పరిశోధన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఇస్రో టెలిమెట్రి, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ISTRAC): బెంగళూరులో ఉంది. స్పేస్ క్రాఫ్ట్ కంట్రోల్, టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ సేవలు లభిస్తాయి. రాడార్‌లను అభివృద్ధి చేసి ట్రాకింగ్, వాతావరణ అనువర్తనాలను రూపొందిస్తారు.

ఇస్రో ఇనెర్షియల్ సిస్టమ్స్ యూనిట్ (IISU): తిరువనంతపురంలో ఉంది. స్పేస్ క్రాఫ్ట్‌లు, వాహక నౌకల్లో జడత్వ వ్యవస్థలను ఇక్కడ నియంత్రిస్తారు. ఈ కేంద్రం భారత అంతరిక్ష కార్యక్రమానికి అవసరమయ్యే జడత్వ వ్యవస్థల డిజైన్, నిర్మాణం, అభివృద్ధి బాధ్యతలను చూస్తోంది.

లేబొరేటరీ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్ (LEOS): బెంగళూరులోని పీన్యా పారిశ్రామికవాడలో ఏర్పాటు చేశారు. ఎలక్ట్రో ఆప్టిక్ సెన్సార్లు, కెమేరాలను తయారు చేస్తారు.

ఇండియన్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (IIST): ఇది తిరువనంతపురంలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీ. ఇందులో ఏవియోనిక్స్, ఏరోస్పేస్, ఇంజనీరింగ్, భౌతిక శాస్త్రాల్లో కోర్సులు ఉన్నాయి.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (IIRS): డెహ్రాడూన్‌లో ఏర్పాటైంది. ఇది ఇస్రో, అంతరిక్ష శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతిష్టాత్మక విద్యాకేంద్రం.

నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (NE-SAC): 2000లో ఈశాన్య ప్రాంతమైన షిల్లాంగ్‌లో నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక శాఖ, ఈశాన్య రాష్ట్రాల కౌన్సిల్ ఆధ్వర్యంలో నడుస్తోంది.

సెమికండక్టర్ లేబొరేటరీ (SCL): చండీగఢ్‌లో ఉంది. సెమికండక్టర్ టెక్నాలజీ అభివృద్ధి, పరిశోధనలు చేయడం దీని ఉద్దేశం. మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేస్తారు.

నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లేబొరేటరీ (NARL): తిరుపతి సమీపంలోని గాదంకిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

నిజాం కాలంలోనే రోడ్డు రవాణాకు బీజం!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ జాగ్రఫీ

రవాణా సౌకర్యాలు

ఒక దేశంలోని ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, జీవన స్థితిగతులు ఆ దేశంలోని రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయి. వస్తువులను, ప్రయాణికులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి చేర్చడాన్ని 'రవాణా' అంటారు. ప్రాథమిక, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధిలో రవాణా సౌకర్యాల పాత్ర అత్యంత కీలకం.

రాష్ట్రంలో 2014-15 నాటికి సేవా రంగంలో రవాణా రంగం వాటా 10.58 శాతంగా ఉంది. సేవా రంగంలో ఇది ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంది.

రాష్ట్రంలో ప్రధానంగా మూడు రకాల రవాణా సౌకర్యాలు ఉన్నాయి.

అవి:

1. రోడ్డు రవాణా 2. రైల్వే రవాణా
3. వాయు రవాణా

తెలంగాణకు సముద్ర తీర ప్రాంతం లేదు కాబట్టి రాష్ట్రంలో జల రవాణాకు తగిన ప్రాధాన్యం లేదు.

రోడ్డు రవాణా

తెలంగాణ రాష్ట్రంలో 'నిజాం స్టేట్ రైల్వే'లో భాగంగా 1932లో భారతదేశంలోనే మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏర్పాటు చేశారు. దీని పేరు 'నిజాం రాష్ట్ర రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్' (ఎన్ఎస్ఆర్-ఆర్‌టీడీ).

- రాష్ట్రంలోని మొదటి రోడ్డు రవాణా సంస్థ 27 బస్సులు, 166 మంది కార్మికులతో ప్రారంభమైంది.
- నిజాం రాజ్య ప్రధానమంత్రి సాలార్జంగ్ చొరవతో హైదరాబాద్ - షోలాపూర్ రహదారిని నిర్మించారు.
- 1932లో రహదారులను జాతీయం చేసి ప్రభుత్వమే బస్సులను నడిపింది.
- 1936 నాటికే హైదరాబాద్ నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాలకు బస్సులు నడపటం ప్రారంభమైంది.
- ఎన్ఎస్ఆర్-ఆర్‌టీడీ సంస్థను హైదరాబాద్ రాష్ట్రంలో విలీనం చేసిన తేదీ 1951 నవంబర్ 1.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1965లో 'రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ)'ను ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం రాష్ట్రంలోని రోడ్లు 'తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ' పరిధిలో ఉన్నాయి.
- రాష్ట్రంలో 80 శాతానికి పైగా సరకులు, ప్రయాణికుల రవాణా రోడ్డు మార్గాలపైనే ఆధారపడి ఉంది.
- 2015 జనవరి 30 నాటికి తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం రహదారుల పొడవు 26,837 కి.మీ.
- రాష్ట్రంలో ఒక చదరపు కి.మీ.కు రోడ్డు సాంద్రత 0.23 కి.మీ.గా ఉంది.
- తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వేయి మందికి అందుబాటులో ఉన్న రోడ్డు 0.86 కి.మీ.

రోడ్లు - రకాలు

రాష్ట్రంలోని రోడ్లను 'ఆర్ అండ్ బీ నెట్ వర్క్' కింద ఉన్న రోడ్లు, 'పంచాయతీ రాజ్' రోడ్లు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ఆర్ అండ్ బీ నెట్‌వర్క్ కింద ఉన్న రోడ్లను తిరిగి జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ప్రధాన జిల్లా రహదారులు, గ్రామీణ రోడ్లుగా విభజించవచ్చు.

రాష్ట్రంలో రహదారుల నెట్‌వర్క్:

- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల విస్తీర్ణం 2,592 కి.మీ.
- రాష్ట్ర రహదారుల పొడవు 3,152 కి.మీ.
- ప్రధాన జిల్లా రహదారుల పొడవు 12,079 కి.మీ.
- గ్రామీణ రహదారుల పొడవు 9,014 కి.మీ.
- జాతీయ రహదారులు మినహాయించి రాష్ట్ర రహదారుల మొత్తం పొడవు 24,245 కి.మీ.

జాతీయ రహదారులు

ఇవి సెంట్రల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉంటాయి.

- తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదార్లు అధికంగా (266 కి.మీ.) ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్నాయి. అతి తక్కువగా హైదరాబాద్‌లో (36 కి.మీ.) ఉన్నాయి.
- రాష్ట్రంలో జాతీయ రహదారుల సాంద్రత 100 చ.కి.మీ. ప్రాంతానికి 2.25 కి.మీ.గా ఉంది.
- దేశంలో జాతీయ రహదారుల సాంద్రత 100 చ.కి.మీ. ప్రాంతానికి 2.82 కి.మీ.
- రాష్ట్రంలో అతి పొడవైన జాతీయ రహదారి 'ఎన్‌హెచ్-44', అతి చిన్న జాతీయ రహదారి 'ఎన్‌హెచ్-61'.



- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల పొడవు 2,592 కి.మీ. ఇందులో..
  - నాలుగు లేన్ల జాతీయ రహదారుల పొడవు 964 కి.మీ.
  - రెండు లైన్ల జాతీయ రహదారుల పొడవు 1264 కి.మీ.
  - మధ్య తరహా (ఇంటర్మీడియెట్) లైన్ జాతీయ రహదారుల పొడవు 153 కి.మీ.
  - సింగిల్ లైన్ జాతీయ రహదారుల పొడవు 211 కి.మీ.

రాష్ట్రంలోని జాతీయ రహదారులు

1. **జాతీయ రహదారి నంబర్ - 44**
   ఇది వారణాసి నుంచి కన్యాకుమారి వరకు ఉంది. దీని పాత నంబర్ - 7. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి ఆదిలాబాద్, నిర్మల్, రామాయంపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో ఈ రహదారి పొడవు 519.64 కి.మీ.
2. **జాతీయ రహదారి నంబర్ - 65**
   దీని పాత నంబర్ -9. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జహీరాబాద్, హైదరాబాద్, సూర్యాపేట్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 291.74 కి.మీ.
3. **జాతీయ రహదారి నంబర్ - 63**
   దీని పాత నంబర్ -16. ఇది నిజామాబాద్ నుంచి ఆర్మూర్, జగిత్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 235.15 కి.మీ.
4. **జాతీయ రహదారి నంబర్ - 167**
   ఇది నూతన రహదారి. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జడ్చర్ల (మహబూబ్‌నగర్) మీదుగా ఎన్‌హెచ్-44ను కలుస్తుంది.
5. **జాతీయ రహదారి నంబర్ - 163**
   దీని పాత నంబర్-202. ఇది హైదరాబాద్ నుంచి జనగాం, వరంగల్, వెంకటాపురం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో దీని పొడవు 306 కి.మీ.
6. **జాతీయ రహదారి నంబర్ - 30**
   దీని పాత నంబర్- 221. ఇది ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుంచి పెనుబలి, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 100 కి.మీ.
7. **జాతీయ రహదారి నంబర్ - 61**
   దీని పాత నంబర్ - 222. ఇది రాష్ట్రంలో మహారాష్ట్ర సరిహద్దు నుంచి నర్సాపూర్ మీదుగా నిర్మల్ వరకు ఉంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 53.6 కి.మీ.
8. **జాతీయ రహదారి నంబర్ - 161**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది సంగారెడ్డి మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 140.5 కి.మీ.
9. **జాతీయ రహదారి నంబర్ - 363**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి మహాదేవ్‌పూర్, పరకాల, ఆత్మకూరు ద్వారా ఎన్‌హెచ్-163తో కలుస్తుంది.
10. **జాతీయ రహదారి నంబర్ -365**
    ఇది నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి తుంగతుర్తి, మహబూబాబాద్, నర్సంపేట మీదుగా మల్లంపల్లి వద్ద ఎన్‌హెచ్-163తో కలుస్తుంది.
11. **జాతీయ రహదారి నంబర్ - 565**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది.

- 363, 365, 565 నంబర్ జాతీయ రహదార్ల మొత్తం ఉమ్మడి పొడవు 330 కి.మీ.

12. **జాతీయ రహదారి నంబర్ - 563**
    ఇది నూతన జాతీయ రహదారి. ఎన్‌హెచ్-63పై ఉన్న మంచిర్యాల మీదుగా కరీంనగర్-వరంగల్ ద్వారా ఎన్‌హెచ్-163తో కలుస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 136 కి.మీ.
13. **జాతీయ రహదారి నంబర్ - 365ఎ**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది ఎన్‌హెచ్-65పై ఉన్న కోదాడ మీదుగా ఖమ్మం - మహబూబాబాద్ ద్వారా ఎన్‌హెచ్ -365తో కలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 75 కి.మీ.
14. **జాతీయ రహదారి నంబర్ - 765**
    ఇది నూతన జాతీయ రహదారి. హైదరాబాద్ నుంచి అమన్‌గల్, వెల్దండ, కల్వకుర్తి, వంగూర్, అచ్చంపేట మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 196 కి.మీ.

- నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో 768 కి.మీ. పొడవైన జాతీయ రహదారులను 'నేషనల్ హైవేస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' కింద నాలుగు లైన్ల రహదారులుగా అభివృద్ధి చేస్తోంది.

రాష్ట్ర రహదారులు

రాష్ట్ర రహదారులు ప్రధానంగా జిల్లాల ప్రధాన కేంద్రాలను రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేస్తాయి. రాష్ట్ర రహదారులు తెలంగాణలో 3,152 కి.మీ. వరకు విస్తరించి ఉన్నాయి.

- రాష్ట్ర రహదారులు కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా ఉన్నాయి.

జిల్లా రహదారులు

తాలూకా కేంద్రాలతో; జిల్లా కేంద్రాలతో; ప్రధాన ఉత్పత్తి ప్రాంతాలు, మార్కెట్ కేంద్రాలను రాష్ట్రీయ రహదారులతో; రైల్వేస్టేషన్‌లతో కలిపే రహదారులను 'జిల్లా రహదారులు' అంటారు.

- రాష్ట్రంలో జిల్లా రహదారులు 12,079 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి.

పంచాయతీరాజ్ రహదారులు

పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణం, నిర్వహణను రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ శాఖ గ్రామీణ ప్రాంత రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, బిల్డింగ్‌లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తుంది. 2014 ఏప్రిల్ 1 నాటికి తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 64,046 కి.మీ. పొడవైన పంచాయతీ రాజ్ రహదారులు ఉన్నాయి.

పంచాయతీ రాజ్ రోడ్లకు సంబంధించిన వివిధ రకాల రోడ్లు

- సి.సి., బి.టి. రోడ్ల పొడవు 20,282 కి.మీ.
- కంకర రోడ్ల పొడవు 14,734 కి.మీ.
- డబ్ల్యూబీఎం రోడ్ల పొడవు 14,146 కి.మీ.
- మట్టి రోడ్ల పొడవు 14,884 కి.మీ.

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)

ఇది హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉంది. ఈ రింగ్ రోడ్డు పొడవు 158 కి.మీ. దీన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించింది. ఈ రింగ్ రోడ్డుకు మరో పేరు 'నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు'.

- పంచాయతీ రాజ్ రోడ్లు అధికంగా ఉన్న జిల్లా - మహబూబ్ నగర్
- పంచాయతీ రాజ్ రోడ్లు అత్యల్పంగా ఉన్న జిల్లా రంగారెడ్డి (హైదరాబాద్ కాకుండా).
- అన్ని రకాల రోడ్లను కలిపి చూసినప్పుడు.. మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్ల విస్తీర్ణం అధికంగా, హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం రోడ్లను అధికంగా కలిగి ఉన్న జిల్లా ఏది?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) రంగారెడ్డి 4) మహబూబ్ నగర్
2. రాష్ట్ర రహదారులు అధికంగా ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) నల్లగొండ
3. తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఏది?
   1) NH - 65 2) NH - 63
   3) NH - 44 4) NH - 163
4. రాష్ట్రంలో ఒక చదరపు కి.మీ.కు ఉన్న రోడ్డు సాంద్రత ఎంత?
   1) 0.86 కి.మీ. 2) 2.82 కి.మీ.
   3) 2.25 కి.మీ. 4) 0.23 కి.మీ.
5. 16వ నంబర్ జాతీయ రహదారి కొత్త నంబర్ ఏది?
   1) 63 2) 163
   3) 61 4) 65
6. తెలంగాణలో మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1936 2) 1932
   3) 1951 4) 1956
7. నెహ్రూ రింగ్ రోడ్డు మొత్తం పొడవెంత?
   1) 168 కి.మీ. 2) 196 కి.మీ.
   3) 158 కి.మీ. 4) 3152 కి.మీ.
8. 2015 జనవరి 30 నాటికి రాష్ట్ర రహదారుల పొడవెంత?
   1) 3,512 కి.మీ. 2) 3152 కి.మీ.
   3) 2,59 కి.మీ 4) 9014 కి.మీ.

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 4;
5) 1; 6) 2; 7) 3; 8) 2.

First electronic computer in the world?

Bank Exams
COMPUTER AWARENESS

COMPUTER GENERATIONS

Generation in computer terminology is a change in technology a computer is/was being used. Initially, the generation term was used to distinguish between varying hardware technologies. But nowadays, generation includes both hardware and software, which together make up an entire computer system. There are totally five computer generations known till date.

FIRST GENERATION

- The period of first generation was 1942-1954.
- First generation of computer started with using vacuum tubes as the basic components for memory and circuitry for CPU (Central Processing Unit).
- In this generation mainly batch processing operating system were used.
- In this generation Punched cards, Paper tape, Magnetic tape Input & Output device were used.

The main features of First Generation are:

- Supported Machine language only.
- Very costly. ❖ Generate lot of heat.
- Slow Input/output device.
- Huge size. ❖ Need of A.C.
- Non portable.
- Consumed lot of electricity.

Some computers of this generation were:

- ENIAC, EDVAC, UNIVAC, IBM-701, IBM-650

SECOND GENERATION

- The period of second generation was 1952-1964.
- This generation using the transistor was cheaper, consumed less power, more compact in size, more reliable and faster than the first generation machines made of vacuum tubes.
- In this generation, magnetic cores were used as primary memory and magnetic tape and magnetic disks as secondary storage devices.
- In this generation assembly language and high level programming language were used.
- There was Batch processing and Multiprogramming Operating system used.



The main features of Second Generation are:

- Reliable as compared to First generation computers.
- Smaller size as compared to First generation computers.
- Generate less heat as compared to First generation computers.
- Consumed less electricity as compared to First generation computers.
- Faster than first generation computers.
- Still very costly. ❖ A.C. needed.

Some computers of this generation were:

- IBM 1620, IBM 7094, CDC 1604, CDC 3600, UNIVAC 1108

THIRD GENERATION

- The period of third generation was 1964-1972.
- The third generation of computer is marked by the use of Integrated Circuits (IC's).
- This development made computers smaller in size, reliable and efficient.
- In this generation Remote processing, Time-sharing, Real-time, Multi-programming Operating System were used.
- High level languages were used during this generation.

The main features of Third Generation are:

- More reliable. ❖ Smaller size.
- Generate less heat. ❖ Faster.
- Lesser maintenance. ❖ Still costly.
- A.C needed.
- Consumed lesser electricity.
- Support high level language.

Some computers of this generation were:

- IBM-360 series, Honeywell-6000 series, PDP (Personal Data Processor), IBM-370/168, TDC-316

FOURTH GENERATION

- The period of Fourth Generation was 1972-1990.
- The fourth generation is made of Very Large Scale Integrated (VLSI) circuits.
- Fourth Generation computers became more powerful, compact, reliable, and affordable. As a result, it gave rise to personal computer (PC) revolution.
- In this generation Time sharing, Real time, Networks, Distributed Operating System were used.
- All the Higher level languages like C and C++, DBASE etc. were used in this generation.

The main features of Fourth Generation are:

- VLSI technology used.
- Very cheap. ❖ Portable and reliable.
- Use of PC's. ❖ Very small size.
- Pipeline processing.
- No A.C. needed.
- Concept of internet was introduced.
- Great developments in the fields of networks.
- Computers became easily available

Some computers of this generation were:

- DEC 10, STAR 1000, PDP 11, CRAY-1(Super Computer), CRAY-X-MP (Super Computer)

FIFTH GENERATION

- The period of Fifth Generation is 1990-till date.
- In the fifth generation, the VLSI became ULSI (Ultra Large Scale Integration) technology.
- This generation is based on parallel processing hardware and AI (Artificial Intelligence) software.
- All the Higher level languages like C and C++, Java, .Net etc. are used in this generation.

The main features of Fifth Generation are:

- ULSI technology.
- Development of true artificial intelligence.
- Development of Natural language processing.
- Advancement in Parallel Processing.
- Advancement in Superconductor technology.
- More user friendly interfaces with multimedia features.
- Availability of very powerful and compact computers at cheaper rates.

MODEL QUESTIONS

1. The first microprocessor built by the Intel Corporation was called_____
   1) 8008 2) 8080 3) 4004
   4) 8800 5) None of these
2. Daisy wheel printer is a type of_______
   1) Matrix primer 2) Impact printer
   3) Laser printer 4) Manual printer
   5) None of these
3. The first electronic computer in the world was________
   1) UNIVAC 2) EDVAC
   3) ENIAC 4) All of above
   5) None of these
4. Before a disk can be used to store data it must be _____
   1) Formatted 2) Reformatted
   3) Addressed 4) Readdressed
   5) None of the above
5. _____is network operating system
   1) DOS 2) Win-95 3) Win-98
   4) WIN-2000 server 5) None
6. Orkut was officially launched ______
   1) 20-jan-2004 2)15- jan-2004
   3) 26-jan-2006 4)24-jan -2004
   5) None
7. Malicious Hacker known as______
   1) White hat hacker
   2) Hacker 3) Cracker
   4) Ethical 5) None
8. AltaVista, Google and Bing are the example of_____
   1) Search engine
   2) Brand name 3) Virus name
   4) Antivirus program 5) None
9. What is the Transmission rate of fiber optics cable?
   1) 10 mbps 2) 1000 mbps
   3) 100 mbps 4) 1000 bps
   5) None
10. ______ is a search engine introduced by MICROSOFT?
    1) Google 2) Khoj.com
    3) Bing 4) Yahoo 5) None
11. Tally is _________
    1) Open S/W 2) System S/W
    3) Application S/W
    4) Closed S/W 5) None
12. Keyboard Converts typed in character to __________code
    1) Binary 2) ASCII
    3) Decimal 4) EBCIDIC
    5) None
13. Which of the following sequence is correct?
    1) Source code -linker - object code-compiler - executable code
    2) Source code - compiler - object code - linker - executable code
    3) Object code - compiler - source code - linker - executable code
    4) Object code -linker - source code - compiler - executable code
    5) None
14. Who developed the language C#?
    1) Dennis Ritchie
    2) Brian Kernighan
    3) Anders Hejlsberg
    4) John McCarthy 5) None
15. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ____
    1) ISDN 2) Cable modem
    3) Microwave 4) DSL
    5) DSN
16. Codes consisting of lines of varying widths or lengths that are computer readable are known as____
    1) an ASCII code
    2) a magnetic tape
    3) a bar code
    4) an OCR scanner
    5) None of these
17. Time required by a sector to reach below the head is known as_____
    1) Seek time 2) Latency time
    3) Access time 4) Disk time
    5) None of these
18. IP-Address 192.5.48.3 belong to________
    1) Class A 2) Class B
    3) Class C 4) Class D
    5) None of these
19. Internet-like networks within an enterprise known as______
    1) Intranet 2) Internet
    3) Extranet 4) Network
    5) None of these
20. What is standard Layout of keyboard?
    1) QWERTY 2) DVORAK
    3) AZERTY 4) 1 and 2
    5) None
21. Most powerful computer in a typical network is________
    1) Desktop 2) Network client
    3) Network server
    4) Network 5) None
22. _______Viruses are often transmitted by a floppy disk left in the floppy drive
    1) Trojan horse 2) Boot sector
    3) Script 4) Logic bomb
    5) None of these
23. ______is a combination of black hat and white hat hacker.
    1) White hat 2) Grey hat
    3) Blue hat 4) Red hat
    5) None
24. The ability to recover and read deleted or damaged files from a criminal's computer is an example of a law enforcement specialty called_____
    1) Robotics. 2) Simulation
    3) Computer forensics.
    4) Animation. 5) None of these
25. How many types of database objects are there in MS Access?
    1) 5 2) 6 3) 7
    4) 8 5) None of these

KEY

1) 3 2) 2 3) 3 4) 1
5) 4 6) 4 7) 3 8) 1
9) 2 10) 3 11) 3 12) 2
13) 2 14) 3 15) 4 16) 3
17) 2 18) 3 19) 1 20) 1
21) 3 22) 2 23) 3 24) 3
25) 3